

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 112

శనివారం 13-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఆరోగ్యాన్నిచ్చే ఆవిరి వంటకాలు

దాదాపు పాతికేళ్ల కిందటి వరకు పీలగా ఉన్న పిల్లలకు, నీరసంగా ఉండే పెద్దలకూ బలం రావడానికి ఆవిరి కుడుముల్లాంటివి పెట్టేవాళ్లు. ఇవి తేలిగ్గా అరగడంతోపాటు వంటికి సత్తువ నిచ్చేవి. ఇది ఒకప్పటి మాట. అయితే ఆధునిక వైద్యులు, ఆహార నిపుణులు కూడా ఆవిరితో తయారు చేసుకున్న ఆహార పదార్థాలనే తినమంటున్నారు. ఎందుకో తెలుసుకుందాం.

ఆవిరితో వండిన వంటలు మన ఆరోగ్యానికెంతో మేలు చేస్తాయి. డీప్ ఫ్రైలతో పోలిస్తే ఆవిరితో వండటం వల్ల వాటిలో ఉండే పోషకాలు నశించవు. పైగా కొవ్వు తక్కువగా ఉంటుంది. కేలరీలు కూడా తక్కువగానే ఉంటాయి. ఆహారం తొందరగా జీర్ణం అవుతుంది.



పోషకాలు వృథా పోవు

ఆవిరిలో ఉడికించడం వల్ల పదార్థంలో ఉండే నియాసిన్, విటమిన్ బి, థయామిన్, విటమిన్ సి వంటివి మన శక్తిని మరింత పెంచుతాయి. ఇవి తిన్నవారికి ఖనిజాలు, పొటాషియం, ఫాస్ఫరస్, కాల్షియం, జింక్ వంటి పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.

ఆవిరితో తయారు చేసే ఆహారాలకు నూనె అవసరమే లేదు. అందుకే ఆవిరి పట్టిన ఆహారాల్లో కొవ్వు పరిమాణం తక్కువగా ఉంటుంది కాబట్టి బరువు తగ్గాలనుకునేవారికి ఇది బెస్ట్‌ఫుడ్ అని చెప్పవచ్చు.

తేలికగా జీర్ణం అవుతాయి

ఆవిరితో వండిన ఆహార పదార్థాలలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఇవి చాలా తొందరగా జీర్ణం అవుతాయి. ఈ ఆహారం బరువుతోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది. ఆవిరి పట్టిన ఆహారం మృదువుగా ఉండి, తేలిగ్గా జీర్ణం కావడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది

ఈ వంటలో నూనెను ఉపయోగించకపోవడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది.

రంగు, రుచి మారదు

ఆవిరితో వండిన కూరల రంగు అస్సలు మారదు. రుచి కూడా బాగుంటుంది.



ఇది వర్షాకాలం. బయట చిరు జల్లులు పడుతుంటే వేడిగా మిర్చి బజ్జీలో, పకోడీలో తింటూ... గరం చాయో, కాఫీనో సిప్ చేస్తూ నచ్చిన పుస్తకం చదువుకుంటూనో మెచ్చిన సంగీతం వింటూనో ఉంటే హాయిగా ఉంటుంది. అయితే వర్షాకాలం ఆనందాలకే కాదు... అంటు వ్యాధులకూ ఆలవాలం. వీటితోపాటు జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ సమస్యలు కూడా చికాకు పెడుతుంటాయి. వీటిని నివారించేందుకు కొన్ని ముందు జాగ్రత్త చర్యలు, చిట్కాలు పాటించడం శ్రేయస్కరం.

చిరుజల్లులు... సీజనల్ వ్యాధులు జాగ్రత్తలివిగో..!

వర్షాకాలంలో దోమలు, ఈగలు వంటి కీటకాల బెడద పెరుగుతుంది. ఇవి వైరల్ ఫీవర్లు, ఇన్‌ఫెక్షన్లు కలిగిస్తాయి. దానికితోడు జలుబు, దగ్గు, అసిడిటీ, ఉబ్బరం, అజీర్ణం లాంటి సమస్యలూ సర్వ సాధారణం. అందుకే ముందే జాగ్రత్త పడదాం.

జంక్ ఫుడ్‌కి దూరం

ఎంతగా నోరూరించినా సరే, ఈ సీజన్‌లో జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం మేలు. వాటికి బదులు పెరుగు లేదా మజ్జిగ వంటి ప్రోబయోటిక్స్ కలిగిన పదార్థాలను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థకు మద్దతు ఇచ్చే మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. అలాగే పచ్చి కూరలకు బదులు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి.



నో స్ట్రీట్ ఫుడ్

వర్షాకాలంలో ఆహారం కలుషితమై ఉండే అవకాశాలు ఉన్నందువల్ల స్ట్రీట్ ఫుడ్ కు దూరంగా ఉండాలి. తక్కువ మొత్తంలో తినేలా చూసుకోవాలి. అధిక మొత్తంలో ఆహారం తీసుకోవటం వల్ల జీర్ణ వ్యవస్థపై భారం పడుతుంది. చర్మ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు వేడినీటితో రోజు రెండు పూటలా స్నానం చేయాలి. ఇలా చేయటం వల్ల చర్మంపై పేరుకున్న మురికి, క్రిములు తొలగిపోతాయి. అలర్జీలు దరి చేరకుండా చూసుకోవచ్చు.

ఇంటి శుభ్రత

వర్షాకాలంలో ఇంట్లో మురికి ఎక్కువ చేరుతుంది. తేమకు పురుగులు, కీటకాలు సూక్ష్మజీవులు చేరుతుంటాయి. ఇవి వ్యాప్తి చెందకుండా ఇంటిని తరచు శుభ్రపరుస్తూ ఉండాలి.

కాచి చల్లార్చిన నీరు

వర్షాకాలంలో ఆహారం, నీటి ద్వారా ఇన్ఫెక్షన్ల వల్ల అకస్మాత్తుగా ఆస్పత్రి పాలయే అవకాశం ఉంటుంది. కాబట్టి కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవడం మంచిది.

నో సీ ఫుడ్: వర్షాకాలంలో నీరు కలుషితమై ఉంటుంది. అందువల్ల సీ ఫుడ్ తినడం మానుకోవాలి. చేపలు తినడం వల్ల కలరా, డయేరియా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల జల చరాల జోలికి పోకుండా ఉండటం శ్రేయస్కరం.

అంతేకాదు, వర్షం వల్ల వ్యాయామాలు చేసేందుకు బయటకు వెళ్ళలేని పరిస్థితి ఉంటుంది కాబట్టి జీర్ణ క్రియలు సాఫీగా ఉండాలంటే ఇంట్లోనే తేలికపాటి వ్యాయామాలు చేయటం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

తడిస్తే స్నానం తప్పనిసరి

వర్షంలో తడిస్తే స్నానం తప్పనిసరి.ఇన్ఫెక్షన్, దగ్గు, జలుబు నివారణకిది మంచి మార్గం.

నీరు తాగాలి: వర్షాకాలంలో ప్యాక్డ్ వాటర్, కియోస్కులు, ధాబాస్‌వంటి ప్రదేశాలలోని నీటికి బదులు వాటర్ ప్యూరిఫైయర్ నుంచి మాత్రమే నీరు తాగడం సురక్షితం.

హ్యాండ్ వాష్ తప్పసరి!

వాష్‌రూమ్ డోర్, ట్యాప్, ఫ్లష్ మొదలైన వాటి ద్వారా సూక్ష్మక్రిములు మన చేతుల్లోకి వస్తాయి. భోజనానికి ముందు, తరువాత తప్పనిసరిగా చేతులు కడుక్కోవడం అంటువ్యాధుల నివారణకు సాయం చేస్తుంది.

వేడి సూప్‌లే ముద్దు

వర్షాకాలంలో చికెన్ సూప్, క్యారెట్ సూప్, మష్రూమ్ సూప్ లేదా వెజిటబుల్ సూప్ వంటివి తీసుకోవడం ఎంతో మేలు. అలాగే, తులసి, పసుపు, దాల్చిన చెక్క, ఏలకులు, నిమ్మ వంటి వాటితో కాచిన కషాయం వల్ల అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.



కాకర ఆరోగ్యానికి ఆసరా



గరుకుగా ఉండే పై పొరతో ముదురాకుపచ్చ రంగులో ఉండే కాకర రుచికి ... చేదుగా ఉన్నప్పటికీ పుష్కలమైన వైద్యగుణాలను కలిగి ఉంది. ఇది జ్వరాన్ని తగ్గిస్తుంది. ఆకలిని పెంచుతుంది. కడుపునొప్పిని తగ్గిస్తుంది. నులిపురుగులను సైతం నశింపజేయగల ఔషధంగా పనిచేస్తుంది.

కాకరకాయను తినడం వల్ల రక్తప్రసరణ చక్కగా జరిగి, తద్వారా కొవ్వు కరిగి శరీరం నాజూకుగా ఉంటుంది. వారంలో ఒకసారి కాకరకాయ కూర తింటే ఆకలి పెరిగి, అజీర్ణం తగ్గుతుంది. అలవాటు తక్కువగా ఉన్నవాళ్ళు మెల్లగా కాకరకాయను కూరగా అలవాటు చేసుకుంటుంటే అందులో రుచి పెరుగుతుంది. అందులో ఉన్న ఔషధగుణాలతో ఆరోగ్యం మెరుగవుతుంది.

కాకర కాయలో బీ, సి విటమిన్లతో పాటు పొటాషియం, మెగ్నీషియం, సోడియం, ఫాస్పరస్ వంటి ధాతువులు ఉన్నాయి. మనం తినే ఆకు కూరల్లో ఉన్న క్యాల్షియం కంటే కాకరలో రెండింతలు అధికంగా క్యాల్షియం వుంటుంది. కాకరకాయ జ్యూస్‌ను రోజూ తాగితే డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. కాకరకాయ జ్యూస్‌లో ఉండే ఔషధ గుణాలు ఇన్సులిన్‌లా పనిచేస్తాయి. అందువల్ల షుగర్ స్థాయిలు అదుపులో ఉంటాయి. కాకర కంటి శుక్లం, దృష్టి లోపం వంటి సమస్యల నివారిణిగా పనిచేస్తుంది.

శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. అలెర్జీలు దరి చేరవు. వైరస్, బాక్టీరియాపై పోరాడుతుంది. మహిళలో వచ్చే గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మలబద్ధకాన్ని వదిలించుకునేందుకు రోజుకు రెండుసార్లు అరస్పూన్ తీసుకుంటే చాలు. ఒక్క కాకర కాయలో బచ్చలికూరలో ఉండే కాల్షియం, ఒక అరటిపండులో ఉండే పొటాషియం ఉంది.

ప్రారంభ దశలో ఉన్న కలరాను దూరం చేస్తుంది కాకర. కలరాతో ఏర్పడే వాంతులకు కూడా కాకర కళ్లెం వేస్తుంది. కాకర జ్యూస్‌ను క్రమం తప్పకుండా తీసుకుంటూ వస్తే కంటి సమస్యలు, దృష్టిలోపాలను దూరం చేసుకోవచ్చు. కాకర తీసుకుంటే చూపు మెరుగవుతుంది.

అలెర్జీ, చర్మ వ్యాధులు, సోరియాసిస్ వంటి వ్యాధుల్ని కూడా కాకర నయం చేస్తుంది. శ్వాస సంబంధిత సమస్యలకు సైతం కాకర దివ్యౌషధంగా పనిచేస్తుంది. కీళ్ళనొప్పులు తగ్గించే గుణం కాకర కాయకు ఉంది. బాధిస్తున్న కీలుమీద కాకరరసాన్ని రాసి నెమ్మదిగా మర్దన చేయాలి.

> ఇందులో పుష్కలంగా ఉండే విటమిన్ 'ఎ' కళ్ల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. అతిసార, నులిపురుగులు, గజ్జి, తామర వంటి చర్మవ్యాధులకు కాకర కాయలు ఔషధంగా ఉపయోగపడతాయి.

మీ పిల్లలను చురుగ్గానే ఉంచుతున్నారా?



ఆటపాటలతో గడపడం వల్ల పిల్లలు శారీరకంగానే కాదు, మానసికంగానూ చురుగ్గా ఉండగలరు. ముఖ్యంగా టీనేజ్‌లో పిల్లలు వ్యాయామం చేస్తే పెద్దయ్యాక కూడా వృత్తి, ఉద్యోగాల రీత్యా ఎటువంటి ఒత్తిళ్లకూ లోను కారు. అంతేకాదు, మిడిల్ ఏజ్‌లో గుండె జబ్బులు, వృద్ధాప్యంలో అల్జీమర్స్ రాకుండా ఉంటాయి. వ్యాయామం నేరుగా మెదడు పెరుగుదలను ప్రేరేపిస్తుంది కాబట్టి తల్లిదండ్రులు చిన్నప్పటినుంచే వ్యాయామాన్ని అలవాటు చేయాలి. ఇంట్లో తల్లితండ్రులు వ్యాయామం చేసేటప్పుడు పిల్లలను కూడా కలుపుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు... వ్యాయామం వల్ల పిల్లల్లో జ్ఞాపక శక్తి బాగా పెరిగి, చదువుతో కుస్తీ పడాల్సిన అవసరం లేకుండా పరీక్షల్లో రాణించగలుగుతారు.

వ్యాయామం ఎంతసేపు? ఎలా?

యూనివర్సిటీ ఆఫ్ బ్రిటీష్ కొలంబియాకు చెందిన కొందరు శాస్త్రవేత్తలు పిల్లలపై పరిశోధనలు నిర్వహించారు. నిత్యం వ్యాయామం చేసే పిల్లలు, వ్యాయామం చేయని పిల్లలతో పోల్చితే వారు చురుగ్గా ఉండడంతోపాటు చదువులో కూడా రాణిస్తారని తేలింది. అందువల్ల పిల్లల్ని రోజూ కనీసం 40 నిమిషాల పాటు వ్యాయామం చేసేలా ప్రోత్సహించాలి లేదా ఆటలు ఆడుకోనివ్వాలి.

సినిమా

విజిలేస్కో...


● విజయ్

విజిలేస్కో అంటున్నారు విజయ్. ఆయన హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, అజ్మల్ అమీర్, మీనాక్షీ చౌదరి, వైభవ్ కీలక పాత్రలు చేస్తున్నారు. కల్పాతి ఎస్. అఘోరమ్, కల్పాతి ఎస్. గణేశ్, కల్పాతి ఎస్. సురేష్ నిర్మిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'విజిలేస్కో...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు మేకర్స్. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటని యువన్ శంకర్ రాజా, నకాష్ అజీజ్ పాడారు. రాజు సుందరం కొరియోగ్రఫీ చేశారు. ''విజిలేస్కో...' పవర్‌ఫుల్ ఎనర్జీతో డ్యాన్స్ ఆంథమ్‌గా సాగుతుంది. ఛాంపియన్‌షిప్‌ని సెలబ్రేట్ చేసుకునే సాంగ్ ఇది. ఈ పాటలో విజయ్, ప్రభుదేవా, ప్రశాంత్, అజ్మల్ అమీర్‌ల డ్యాన్స్ అదిరిపోతుంది'' అన్నారు మేకర్స్. 'ది గోట్' చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేస్తోంది.

సర్దార్ సిద్ధం


● కార్తీ

సెట్స్‌లోకి వచ్చేందుకు సర్దార్ సిద్ధమయ్యాడు. హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'సర్దార్'. తండ్రీ కొడుకులుగా కార్తీ ద్విపాత్రాభినయం చేసిన ఈ సినిమా 2022లో విడుదలై, హిట్‌గా నిలిచింది. దీంతో 'సర్దార్' సినిమా విడుదలైన కొన్ని రోజులకే 'మిషన్ కంబోడియా' అంటూ 'సర్దార్' సీక్వెల్‌ను మేకర్స్ ప్రకటించారు. అయితే తర్వాత 'సర్దార్ 2' గురించి మరో అప్‌డేట్ లేదు. కాగా ఈ సీక్వెల్ పూజా కార్యక్రమాలు ఇటీవల జరిగాయని, ఈ నెల 15న చెన్నైలో వేసిన సెట్స్‌లో చిత్రీకరణ మొదలవుతుందని చిత్రయూనిట్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను ప్రిన్స్ పిక్చర్స్ నిర్మించనుంది. 'సర్దార్' చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించగా, సీక్వెల్‌కి యువన్ శంకర్ రాజా స్వరాలు సమకూర్చనున్నారు. ఇక ఈ సినిమాకు చెందిన ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

కాంబినేషన్ సెట్?


● వెంకటేశ్


● వేణు


హీరో వెంకటేశ్ మంచి జోరు మీద ఉన్నారు. 'ఎఫ్ 2, ఎఫ్ 3' సినిమాల తర్వాత దర్శకుడు అనిల్ రావిపూడితో వెంకటేశ్ చేస్తున్న సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రీకరణ ప్రారంభమైంది. సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయనున్నారు. అలాగే హిట్ ఫిల్మ్ 'సామజవరగమన' ఫేమ్ రైటర్ నందు రెడీ చేసిన ఓ కథలో వెంకటేశ్ హీరోగా నటిస్తారనే ప్రచారం సాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ రెండు చిత్రాలు ఇలా ఉండగానే... వెంకటేశ్ మరో కథ విన్నారట. ఇటీవల ఓ మల్టీస్టారర్ ఫిల్మ్ కథను రెడీ చేశారట వేణు ఉడుగుల. ముగ్గురు హీరోలకు స్కోప్ ఉండే ఈ సినిమాలో మెయిన్ హీరోగా వెంకటేశ్ నటించనున్నారట. ఆల్రెడీ వెంకటేశ్ కథ విన్నారని, వేణు ఉడుగులతో 'విరాటపర్వం' సినిమాను నిర్మించిన నిర్మాణ సంస్థల్లో ఒకటైన సురేష్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మించనుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఈ సంగతలా ఉంచితే... రానా–సాయి పల్లవి కాంబినేషన్‌లో వేణు ఉడుగుల దర్శకత్వంలో రూపొందిన 'విరాటపర్వం' మంచి సినిమా అనిపించుకుంది. ఈ చిత్రానికి తాజాగా ఫిల్మ్ ఫేర్ అవార్డులు దక్కాయి. ఉత్తమ నటిగా (క్రిటిక్స్) సాయి పల్లవి అవార్డు అందుకోనుండగా ఇదే సినిమాకి ఉత్తమ సహాయ నటి అవార్డుకి నందితా దాస్ ఎంపికయ్యారు.

శివన్న ఆన్ బోర్డ్



శివన్నగా కన్నడ ఇండస్ట్రీలో అభిమానాన్ని సొంతం చేసుకున్న కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ ఓ తెలుగు సినిమాలో పవర్‌ఫుల్ రోల్‌లో నటించనున్నారు. రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించనున్న చిత్రం 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో వివిధ భాషలకు చెందిన ప్రముఖ నటీనటులు కనిపించనున్నారు. శుక్రవారం (జూలై 12) శివ రాజ్‌కుమార్ పుట్టినరోజు. ఈ సందర్భంగా శివ రాజ్‌కుమార్ ఆన్ బోర్డ్ అంటూ 'పెద్ది'లో ఆయన ఓ శక్తివంతమైన పాత్ర చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''ఈ చిత్రంలో స్టార్ హీరోలైన రామ్‌చరణ్, శివ రాజ్‌కుమార్‌లను తెరపై చూసేందుకు వారి ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రత్నవేలు.

శివం భజే ఫిక్స్


● అశ్విన్

'రాజుగారి గది' ఫేమ్ అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జోడీగా నటించిన 'శివం భజే' చిత్రం విడుదల తేదీ ఖరారు అయింది. ఆగస్టు 1న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అప్సర్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్మెంట్స్‌పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించారు. మహేశ్వర్ రెడ్డి మూలి మాట్లాడుతూ– ''న్యూ ఏజ్ డివైన్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'శివం భజే'. వైవిధ్యమైన కథతో, ఉన్నత సాంకేతిక విలువలతో మా సంస్థలో నిర్మించిన తొలి చిత్రం ఇది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు చివరి దశలో ఉన్నాయి'' అన్నారు. ''టైటిల్, టీజర్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన మా 'శివం భజే' పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి'' అన్నారు అప్సర్. ''ప్రతి ఒక్కరూ తమ బెస్ట్ ఇవ్వడంతో ఈ చిత్రం మేము ఊహించినదానికంటే అద్భుతంగా వచ్చింది. ఆ శివుని అనుగ్రహంతో పాటు ప్రేక్షకుల ఆశీర్వాదాలు ఉంటాయని నమ్ముతున్నాం'' అన్నారు అశ్విన్ బాబు. అర్బాజ్ ఖాన్, మురళీ శర్మ, తనికెళ్ల భరణి, బ్రహ్మాజీ, తులసి ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మ్యూజిక్: వికాస్ బడిస, కెమెరా: దాశరథి శివేంద్ర.


మళ్లీ అలాంటి ప్రేమకథలో..?


● నయనతార

నయనతార, శింబు లీడ్ రోల్స్‌లో నటించిన 'వల్లభ' (2006) సినిమా గుర్తుండే ఉంటుంది. ఈ సినిమాలో స్టూడెంట్ వల్లభ (శింబు), ప్రొఫెసర్ స్వప్న (నయనతార) ప్రేమించుకుంటారు. ఇప్పుడు 'వల్లభ' సినిమా ప్రస్తావన ఎందుకంటే ఈ తరహాలోనే తనకంటే చిన్న వయస్కుడితో ప్రేమలో పడే కథకు నయనతార మళ్లీ పచ్చజెండా ఊపారని కోలీవుడ్‌లో వినిపిస్తోంది. నయనతార, కెవిన్ లీడ్ రోల్స్‌లో తెరకెక్కనున్న చిత్రకథాంశం ఇది అని టాక్. దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో కలిసి ఓ తమిళ సినిమాకు లిరిక్స్ అందించిన విష్ణు ఎడ్వాన్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ సినిమా చిత్రీకరణను ఈ నెల 22న ప్రారంభించాలని చిత్రయూనిట్ అనుకుంటోందట. ఈ సినిమాలో తనకంటే చిన్నవాడైన ఓ అబ్బాయిని ఇష్టపడుతుందట ఓ అమ్మాయి. ఆ అబ్బాయి కూడా ఆమెతో ప్రేమలో పడతాడట. ఆ తర్వాత ఈ ఇద్దరూ ఎలాంటి పరిణామాలను ఎదుర్కొన్నారు? అనే అంశాలను వినోదాత్మకంగా చూపించనున్నారట దర్శకుడు.

సీక్వెల్ రెడీ... నయనతార, ఆర్‌జే బాలాజీ నటించిన ఆధ్యాత్మిక చిత్రం 'ముకుత్తి అమ్మన్' (2020). ఆర్‌జే బాలాజీ, ఎన్‌జే శరవణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజ్ కాగా పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. ఇటీవల ఈ సినిమాకు సీక్వెల్ అంశం తెరపైకి వచ్చింది. 'ముకుత్తి అమ్మన్ 2'లో నయనతార ఓ లీడ్ రోల్‌లో నటించనున్నట్లుగా వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్ సంస్థ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. అయితే దర్శకుణ్ణి మాత్రం ప్రకటించలేదు.

వెంటాడే ప్రేమకథ


● సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా సుమన్ పాతూరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ పతాకాలపై ఎస్‌కేఎస్, సాయి రాజేశ్ ఈ సినిమాను నిర్మించనున్నారు. శుక్రవారం హీరో సంతోష్ శోభన్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించి, కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌పై 'కొన్ని ప్రేమ కథలు జీవితకాలం వెంటాడుతాయి..' అనే ట్యాగ్‌లైన్ ఉంది. ప్రస్తుతం ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయని, ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాకు సంగీతం: విజయ్ బుల్గానిన్.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 112
శనివారం 13-7-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'



ఆకాశ పందిరి తారలు తలంబ్రాలు

అంగరంగ వైభవంగా అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ వివాహం...

తరలివచ్చిన అతిరథులు


16 లో



జనభారతం @ 170 కోట్లు!

భారతదేశ జనాభా 2060 దశకంలో ఏకంగా 170 కోట్లకు చేరుకుంటుందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది.

- వివరాలు 6లో



బైడెన్.. మళ్లీ తడబడెన్!

అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పేరును పొరపాటున డొనాల్డ్ ట్రంప్ అంటూ దేశాధ్యక్షుడు జో బైడెన్ పలికారు.

- వివరాలు 6లో

2028లో గెలుపు మనదే!

వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో నంబర్‌వన్‌గా మారడం ఖాయం

బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ ముగింపు సమావేశంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న ధర్మేంద్ర ప్రధాన్

- 1,500 రోజుల రివర్స్ ప్లానింగ్‌తో ముందుకెళ్లండి
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయండి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ అక్రమాలను ఎండగట్టండి
- బీజేపీలో సామాన్య కార్యకర్త సీఎం కాగలడు
- తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ విరోధి
- రాజ్యాంగాన్ని పదేపదే రాహుల్ అవమానిస్తున్నారు

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణలో బీజేపీ నంబర్‌వన్ పార్టీగా మారడం ఖాయమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై నిరంతర పోరాటాల ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు నిద్ర పట్టకుండా చేసి.. ఆ పార్టీల అక్రమాలపై పోరాటాలతో బీజేపీ తప్పకుండా నంబర్‌వన్ స్థానానికి చేరుతుందని ఆయన స్పష్టం చేశారు. రానున్న 1,500 రోజుల్లో (రివర్స్ ప్లానింగ్) ప్రజా పోరాటాల ద్వారా ఇక్కడ బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఇందుకు అనుగుణంగా పార్టీ వద్ద 1,500 రోజుల ప్రణాళిక సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సామాన్య కార్యకర్త సీఎం అయ్యే అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం శంషాబాద్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గం ముగింపు సమావేశంలో ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ విరోధిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని చెప్పిన ధర్మేంద్ర.. నాడు ప్రత్యేక తెలంగాణ కోసం బీజేపీ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. అదేవిధంగా గత పదేళ్లుగా తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకారం అందిస్తూనే ఉందన్నారు.

దక్షిణాది సీట్లతోనే మూడోసారి మోదీ సర్కార్

తెలంగాణ, ఏపీ, ఒడిశా రాష్ట్రాల్లో బీజేపీ గెలిచిన సీట్లతో మరింత బలం చేకూరడంతోనే మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పడిందని ధర్మేంద్ర చెప్పారు. 'ఎనిమిది ఎంపీ స్థానాల్లో గెలిస్తేనే ప్రధాని కావాలని కొందరు కలలు కంటుంటారు. అలాంటిది తెలంగాణ నుంచి పార్టీ సొంతంగా 8 సీట్లను గెలవడం మామూలు విజయం కాదు.. ఇందుకు ఓటర్లకు కృతజ్ఞతలు. లోక్‌సభ ఎన్నికలతో

మిగతా 3వ పేజీలో ▶

రాష్ట్రం నుంచి ఢిల్లీ కాంగ్రెస్‌కు సూట్‌కేసులు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపణ
- సీఎం నుంచి ఎమ్మెల్యేల వరకు పోటీ పడి మరీ కప్పం కడుతున్నారని మండిపాటు
- పార్టీ ఫిరాయింపులతో గాంధీభవన్ గులాబీమయంగా మారిందంటూ ధ్వజం
- స్థానిక సంస్థల్లో బీజేపీకి అనూహ్య ఫలితాలు రాబోతున్నాయని జోస్యం


3 లో

'నిజాం షుగర్స్'పై ముందుకా వెనక్కా?

పునరుద్ధరణపై త్వరలో కేబినెట్‌కు కమిటీ నివేదిక సమర్పణ

తెరిచినా నడపలేమని తెగేసి చెప్పిన ప్రైవేట్ భాగస్వామి

సాక్షి, హైదరాబాద్: నిజాం డెక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్ఎల్) పునరుద్ధరణలో మళ్లీ కదలిక వచ్చింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీ త్వరలో మంత్రివర్గానికి నివేదిక సమర్పించనుంది. దీనిపై కేబినెట్ తీసుకునే నిర్ణయం ఆధారంగా ముందుకెళ్లాలని ప్రభుత్వ చక్కెర పరిశ్రమల




విభాగం భావిస్తోంది. పునరుద్ధరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపే పక్షంలో యూనిట్లు తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన కార్యాచరణ కూడా రూపొందిస్తోంది. నిజాం చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరిస్తామని ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఏడాది జనవరి 12న కమిటీ ఏర్పాటు చేసింది. పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా, వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైస్‌చైర్మన్‌గా ఏర్పాటైన కమిటీలో మరో ఎనిమిది మందిని సభ్యులుగా నియమించారు. పునరుద్ధరణకు సంబంధించిన విధివిధానాలు సూచిస్తూ

మిగతా 5వ పేజీలో ▶

సుప్రీంకోర్టు వారించినా వినరా?

కక్ష సాధింపుతో న్యాయ ధిక్కారానికి తెగించిన ఏపీ ప్రభుత్వం



- ఎమ్మెల్యే రఘురామ ఈ మెయిల్‌తో కేసు నమోదు
- ఐపీఎస్‌లు సునీల్‌కుమార్, పీఎస్ఆర్‌తోపాటు మాజీ సీఎం జగన్‌పై కేసులు
- గతంలో ఇదే అంశంపై కోర్టులను ఆశ్రయించిన రఘురామ
- ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదని తేల్చి చెప్పిన వైద్య నివేదిక
- దాంతో ఆ పిటిషన్‌ను తోసిపుచ్చిన హైకోర్టు, సుప్రీంకోర్టు
- అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను లెక్క చేయకుండా తాజాగా కేసు నమోదు.... చంద్రబాబు సర్కారు తీరుపై తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్న న్యాయ నిపుణులు

- వివరాలు 14లో

ఇదండీ జగత్



'అష్ట'కష్టాలు!

త్వరలో మరో ఎనిమిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి?

- లేదంటూనే హస్తం గూటికి చేరుతున్న ఎమ్మెల్యేలు
- గులాబీ పెద్దలు కట్టడి చేస్తున్నా ఆగని వలసలు
- త్వరలో బీఆర్ఎస్ శాసనసభాపక్షం కాంగ్రెస్‌లో విలీనమవుతుందన్న దానం
- ఇప్పటికే 8 మంది అధికారికంగా కాంగ్రెస్‌లోకి..
- మూడింట రెండొంతుల 'లెక్క' అయ్యేదాకా ఫిరాయింపులు... పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు కేసీఆర్ ప్రయత్నాలు
- ఇప్పటికే ఓసారి భేటీ.. మరోమారు వ్యక్తిగతంగా కలిసే యోచన... న్యాయ పోరాటం, క్షేత్రస్థాయిలో కేడర్ వద్దకు వెళ్లాలని నిర్ణయం



శుక్రవారం సీఎం రేవంత్‌తో ప్రకాశ్‌గౌడ్

కాంగ్రెస్‌లో చేరిన ప్రకాశ్‌గౌడ్

- సీఎం సమక్షంలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే చేరిక
- మొత్తం 8కి చేరిన వలస ఎమ్మెల్యేల సంఖ్య

- వివరాలు 2లో

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుంచి ఎమ్మెల్యేల ఫిరాయింపుల పర్వం కొనసాగుతోంది. గులాబీ ఎమ్మెల్యేలు వరుసగా అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. రాబోయే రోజుల్లో తమ పార్టీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు మరింత వేగవంతం అవుతాయని కాంగ్రెస్ శిబిరం ప్రచారం చేస్తోంది. మరోవైపు పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగినా వలసలకు అడ్డుకట్ట పడటం లేదని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. గతంలో చేసిన పనుల బిల్లుల కోసం, వ్యాపారాలపై దాడులు, కేసుల బెదిరింపులతోనే ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నారని ఆరోపిస్తున్నాయి. దీనికితోడు ఈ అసెంబ్లీ సమావేశాల్లోగా బీఆర్ఎస్ శాసనసభాపక్షం కాంగ్రెస్‌లో విలీనం అవుతుందంటూ ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు కూడా కలకలం రేపుతున్నాయి. ఈ నెల 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వలసల అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వరుసగా వలసల బాట!

గత ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున 39 మంది

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

పాస్‌పోర్ట్ కార్యాలయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం సికింద్రాబాద్‌లోని పాస్‌పోర్ట్ కార్యాలయానికి వచ్చారు. శుక్రవారం సాయంత్రం కార్యాలయానికి వచ్చిన సీఎం తన పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డికి డిప్లొమాటిక్ పాస్‌పోర్ట్‌ను అందిస్తారు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్లను ఆయన పాస్‌పోర్ట్ కార్యాలయ అధికారులకు సమర్పించారు. ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారిణి స్నేహజ జొన్నలగడ్డ సీఎంకు స్వాగతం పలికారు.

46 రైళ్లలో పెరిగిన జనరల్ బోగీలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని 46 ప్రముఖ రైళ్లలో రెండేసి చొప్పున మొత్తం 92 జనరల్ కోచ్‌లను పెంచుతున్నట్లు రైల్వేశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. త్వరలో మరో 22 రైళ్లలో జనరల్ కోచ్‌లను పెంచనున్నట్లు కూడా రైల్వేశాఖ పేర్కొంది. జనరల్ కోచ్‌లు పెరిగిన రైళ్లలో హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703/12704), తిరుపతి-కొల్లం ఎక్స్‌ప్రెస్ (17421/17422) లు ఉన్నాయి.

పీజీ పూర్వ విద్యార్థులకు వన్ టైం చాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఉస్మానియా యూనివర్సిటీ పీజీ పూర్వవిద్యార్థులకు అధికారులు సువర్ణావకాశాన్ని కల్పించారు. ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల్లో పలు పీజీ కోర్సులు చదివి ఫెయిలైన పూర్వవిద్యార్థులు తిరిగి పరీక్ష రాసేందుకు అవకాశం (వన్‌టైంచాన్స్) ఇచ్చారు. 2000-01 విద్యా సంవత్సరం నుంచి 2018-19 వరకు ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీలతో పాటు ఇతర పీజీ కోర్సుల 4 సెమిస్టర్ పరీక్షల్లో తప్పిన పూర్వవిద్యార్థులు ఆగస్టు 16 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు.

'జీహెచ్‌ఎంసీ'ని ఒకే స్టేషన్‌గా పరిగణిస్తాం

- రాష్ట్ర ఆర్థిక శాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా స్టేషన్ సీనియార్టీ అంశంపై రాష్ట్ర ఆర్థిక శాఖ స్పష్టత ఇచ్చింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలను ఒకే స్టేషన్‌గా పరిగణిస్తుండటంతోఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నాంటూ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించింది. దీనిపై స్పందించిన రాష్ట్ర ఆర్థిక శాఖ ఉద్యోగుల స్టేషన్ సీనియార్టీలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధినంతా ఒక స్టేషన్‌గా పరిగణిస్తామని తెలిపింది. రంగారెడ్డి జిల్లా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయాలు ఆయా జిల్లాల పరిధిలో ఏర్పాటు కావడంతో అంతకు ముందు గ్రేటర్‌లో ఉన్న కాలాన్ని జీహెచ్‌ఎంసీ స్టేషన్‌లో పనిచేసినట్లుగానే పరిగణించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. ఈమేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం మెమో జారీ చేశారు.

'రేపు టీజీ జెన్‌కో ఏఈ, కెమిస్ట్ పరీక్షలు'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో అసిస్టెంట్ ఇంజనీర్లు, కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి ఈనెల 14న కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ రోనాల్డ్ రాస్ ప్రకటించారు అభ్యర్థులు హాల్‌టికెట్లను సంస్థ వెబ్‌సైట్ http://www. tggenco.com నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా

- 22న విచారిస్తామన్న రౌజ్‌ఎవెన్యూ కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి సీబీఐ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంతోపాటు తన అరెస్టును సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం రౌజ్‌ఎవెన్యూ కోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరీ బవేజా ఈ నెల 22కు విచారణను వాయిదా వేశారు. కేసును మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిఉంది కాబట్టి బెయిల్ మంజూరు చేయడం సరికాదని సీబీఐ తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. అయితే, సీబీఐ చార్జిషీట్‌లో తప్పులున్నాయని కవిత తరపు న్యాయవాది వాదించారు. దీనిపై సీబీఐ న్యాయవాది స్పందిస్తూ.. తప్పులు లేవన్నారు. డిఫాల్ట్ బెయిల్, చార్జిషీట్‌లో తప్పులపై విచారణ జరిగేవరకు చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై విచారణ వాయిదా వేయాలని కవిత తరపు న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అయితే.. చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశానికి, కవిత డిఫాల్ట్ బెయిల్‌కు సంబంధం లేదని సీబీఐ తరపు న్యాయవాది వాదించారు. కాగా, '60 రోజుల తర్వాత తప్పులతో కూడిన చార్జిషీట్‌ను దాఖలు చేయడం తన క్లయింట్ డిఫాల్ట్ బెయిల్ హక్కులను కాలరాయడమే'అని కవిత తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరు పక్షాల వాదనల అనంతరం 22న కేసు విచారణ చేపడతామని న్యాయమూర్తి తెలిపారు.

ముగిసిన కాంగ్రెస్ 'పోస్టుమార్టమ్'

- గురువారం రాత్రే కేరళ వెళ్లిపోయిన కురియన్
- రకీబుల్, పర్గత్‌సింగ్‌ల ఎదుట హాజరై అభిప్రాయాలు తెలిపిన పలువురు ఎమ్మెల్యేలు, అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు
- ఈనెల 21న అధిష్టానానికి నివేదిక ఇస్తామని వెల్లడి

రెండు రోజులకు షెడ్యూల్ కుదింపు


గాంధీభవన్‌లో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో మాట్లాడుతున్న త్రిసభ్య కమిటీ సభ్యులు రకీబుల్ హసన్, పర్గత్ సింగ్.

సాక్షి, హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పనితీరు అంచనా వేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ నియమించిన త్రిసభ్యకమిటీ తొలిదఫా సమీక్షలు పూర్తయ్యాయి. వాస్తవానికి, గురు, శుక్ర, శనివారాల్లో ఈ పోస్టుమార్టమ్ జరగాల్సి ఉన్నా, అనివార్య కారణాల వల్ల రెండురోజులకే కుదించారు. కుటుంబసభ్యులు మరణించడంతో కమిటీకి నేతృత్వం వహించిన రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్మన్ పీజే.కురియన్ గురువారం రాత్రే కేరళ వెళ్లిపోయారు. దీంతో గురువారం సమీక్షల్లో పాల్గొన్న అసోం ఎమ్మెల్యే రకీబుల్ హసన్‌తోపాటు పంజాబ్ ఎమ్మెల్యే పర్గత్‌సింగ్‌లు శుక్రవారం గాంధీభవన్ వేదికగా కాంగ్రెస్‌నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. తొలిరోజు గురు వారం మొత్తం 16 మంది అభిప్రాయాలు తీసుకున్న కురియన్ కమిటీ రెండో రోజు శుక్రవారం పలువురు ఎమ్మెల్యేలు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులతో సమావేశమై వారి నుంచి లోక్‌సభ ఎన్నికల ఫీడ్‌బ్యాక్ తీసుకుంది. ఉమ్మడిజిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో సమావేశమైంది. పార్టీ ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, ఉత్తమ్‌పద్మావతిరెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీగణేశ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తదితరులు కమిటీ ఎదుట హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించారు. అయితే, ఎవరైనా తమ అభిప్రాయాలను ఫోన్‌లో అయినా తెలియజేయవచ్చంటూ కమిటీ సభ్యులు ఫోన్‌నంబర్లు ఇచ్చి వెళ్లారని, లిఖితపూర్వకంగా అయినా తమకు పంపొచ్చని నేతలకు చెప్పారని సమాచారం. శుక్రవారం కూడా కురియన్ కమిటీకి గురువారం వచ్చిన తరహాలోనే ఫీడ్‌బ్యాక్ వచ్చిందని, పోస్టుమార్టమ్‌కు హాజరైన పలువురు ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలు, వ్యక్తిగత ఆలోచనలను రకీబుల్‌హసన్, పర్గత్‌సింగ్‌లకు వివరించారు.

- కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతి రెడ్డి తన నియోజకవర్గంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్ల వివరాలను పోలింగ్ బూత్‌ల వారీగా తెచ్చి కమిటీకి సమర్పించారు. కోదాడతోపాటు మంత్రి ఉత్తమ్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నియోజకవర్గంలో భారీ మెజారిటీలు ఎలా సాధ్యమయ్యాయని కమిటీ సభ్యులు ప్రశ్నించగా, లోక్‌సభ ఎన్నికల్లో తాము శ్రమించిన తీరును పద్మావతి వివరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆమెను అభినందించారు.

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ఇప్పటివరకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని, దీనివల్ల రాష్ట్ర రాజధాని చుట్టూ అభివృద్ధి కార్యకలాపాలు వేగంగా సాగడం లేదని, జీహెచ్‌ఎంసీతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తమ జిల్లాలకు చెందిన ఎవరికైనా మంత్రిపదవి ఇవ్వాలని కోరారు. ఎవరికి ఇచ్చినా ఫర్వాలేదని, అయితే, తమ జిల్లాలకు మంత్రిపదవి ఇవ్వాలని కమిటీకి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు కూడా.
- మెదక్ జిల్లా నేతలతో జరిగిన సమావేశంలో ఓ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. మిగిలిన అన్నిచోట్ల మంచిఓట్లు వచ్చినా సదరు ఎమ్మెల్యే దూకుడు కారణంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు తగ్గాయని చెప్పారు.
- కరీంనగర్ జిల్లా నేతలతో సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఎన్నికలకు 16 రోజుల ముందే అభ్యర్థిని ప్రకటించారని, అయినా తమ శక్తివంచన లేకుండా వెల్చాల విజయం కోసం కృషి చేశామని చెప్పుకొచ్చారు. బీజేపీ నాలుగు నెలల ముందే ఎన్నికల ప్రచారం ప్రారంభించిందని, మోదీ సభలతో పాటు అయోధ్యఅక్షింతలు ఆ పార్టీకి కలసి వచ్చాయని చెప్పినట్టు సమాచారం.
- నల్లగొండజిల్లా నేతలతో జరిగిన సమావేశంలో నల్లగొండ కాంగ్రెస్ కంచుకోట అని, పార్టీకి అన్ని రకాలుగా కలసిరావడంతో మంచి మెజారిటీలు సాధ్యమయ్యాయని కమిటీకి తెలిపారు. భువనగిరిలో బీజేపీ అభ్యర్థి గెలుస్తాడనే టాక్ వచ్చినా తాను ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత దాన్ని మార్చివేశామని, మంచి మెజారిటీతో పార్టీ అభ్యర్థిని గెలిపించుకున్నామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కమిటీకి వెల్లడించారు.
- బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతిచ్చింది కాబట్టే బీజేపీకి సీట్లు పెరిగాయని నిజామాబాద్ జిల్లా నేతలు కమిటీకి స్పష్టం చేశారు. కామారెడ్డిలో బీఆర్‌ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో 60వేల ఓట్లు వస్తే, లోక్‌సభ ఎన్నికల్లో అది 20వేలకు తగ్గిపోయిందని చెప్పారు. కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితకు బెయిల్ కోసం బీఆర్‌ఎస్ నేతలు బహిరంగంగానే బీజేపీకి మద్దతు ప్రకటించారని ఈ సమావేశంలో షబ్బీర్‌అలీ కమిటీకి చెప్పినట్టు సమాచారం. అందరి అభిప్రాయాలను విన్న కమిటీ నాయకుల అభిప్రాయాలను క్రోడీకరించి ఈనెల 21న అధిష్టానానికి తమ నివేదిక ఇవ్వనుంది. ఈ విషయాన్ని కమిటీ సభ్యుడు రకీబుల్ హుస్సేన్ మీడియాకు వెల్లడించారు.


పుట్టిన రోజు సందర్భంగా మనవడు హిమాన్షుకు కేక్ తినిపిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో ఎంపీ సంతోష్, శోభమ్మ,శైలిమ

కాంగ్రెస్‌లోకి ప్రకాశ్‌గౌడ్

- సీఎం రేవంత్ సమక్షంలో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే
- మొత్తం 8కి చేరిన వలస ఎమ్మెల్యేల సంఖ్య
- నేడు లేదా త్వరలోనే మరికొందరు?

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల వలసల పర్వం కొనసాగుతోంది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఎట్టకేలకు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రకాశ్‌గౌడ్‌తో పాటు ఆయన అనుచరులైన మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డిలు కూడా పాల్గొన్నారు. ప్రకాశ్‌గౌడ్ చేరికతో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఇప్పటికే బీఆర్‌ఎస్ నుంచి కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలు చేరగా, ఇప్పుడు ప్రకాశ్‌గౌడ్ చేరారు. కాగా, జీహెచ్‌ఎంసీ పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరతారని తెలుస్తోంది. వీరిలో ఒకరిద్దరు శనివారమే చేరవచ్చని సమాచారం. లేదంటే అతి త్వరలోనే హైదరాబాద్ శివారుకు చెందిన ఆరుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరవచ్చని చర్చ జరుగుతోంది.

బీఆర్‌ఎస్‌లో మిగిలేది ఆ నలుగురే..

- త్వరలో బీఆర్‌ఎస్‌ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం
- ఎమ్మెల్యే దానం నాగేందర్



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): బీఆర్‌ఎస్‌లో ఆ నలుగురు మాత్రమే మిగులుతారని, త్వరలో బీఆర్‌ఎస్‌ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం కాబోతోందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బీఆర్‌ఎస్ నాయకత్వం విశ్వసనీయతను కోల్పోయిందని విమర్శించారు. శుక్రవారం ఆయన హిమాయత్‌నగర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని, అందుకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు వేల కోట్లు దోచుకున్నారని, త్వరలో వాటి వివరాలు బయటపెడతానని అన్నారు. బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని కేటీఆర్ కార్పొరేట్ కంపెనీలా నడిపారన్నారు. కేసీఆర్‌ను కలవాలంటే ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ దొరికేది కాదని, ఒకవేళ దొరికినా గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని చెప్పారు. ఎమ్మెల్యేలను పురుగుల్లా చూసేవారని, అందుకే విలువ లేని చోట ఉండలేక కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఎమ్మెల్యేలను కాపాడుకోడానికి ఆరు నెలల్లో అధికారంలోకి వస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారని, కవిత జైల్లో ఉంటే ఆమెను బయటకు తీసుకురాకుండా రాజకీయం చేస్తున్నారని అన్నారు.

బీఆర్‌ఎస్‌ను లేకుండా చేయలేరు

- త్యాగాల పునాదుల మీద ఏర్పడిన పార్టీని ప్రజలే కాపాడుకుంటారు: మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: త్యాగాల పునాదుల మీద పుట్టిన బీఆర్‌ఎస్ పార్టీని లేకుండా చేయ డం ఎవరి తరమూ కాదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని బీఆర్‌ఎస్ మాత్రమే కాపాడుతుందని, ఆ పార్టీని ప్రజలు కాపాడుకుంటారనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. పార్టీ నేతలు పి.శశిధర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, రవీందర్‌సింగ్, పల్లె రవికుమార్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ తెలంగాణభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్‌కు, కేసీఆర్‌కు జైకొట్టిన వారే ప్రస్తుతం విమర్శలు చేస్తూ పార్టీ ఉండదంటూ మాట్లాడటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పాటు దేశ వ్యాప్తంగా మరో 14 పార్టీలకు సీట్లు రాలేదని, ప్రధానిగా మోదీ కావాలా వద్దా అనే ప్రాతిపదికనే ఆ ఎన్నికలు జరిగాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు పార్లమెంటు ఎన్నికల తరహాలో ఉండవనే ధీమాను వ్యక్తం చేశారు. 65లక్షల మంది పార్టీ సభ్యులను కలిగిన బీఆర్‌ఎస్‌ను ఎవరూ తుడిచిపెట్టలేరన్నారు. పార్టీని వీడుతున్న ఎమ్మెల్యేలు తల్లిలాంటి బీఆర్‌ఎస్‌ను విమర్శించడం సరికాదని, ఒక్కసారి ఓటమి పొందగానే పార్టీల పని అయిపోదని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ నుంచి బయటకు వెళ్లే వారు తాలు గింజలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఎద్దేవా చేశారు. కే.కేశవరావు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తే ఆయన కూతురు హైదరాబాద్ మేయర్ పదవికి ఎందుకు రాజీనామా చేయడం లేదని డాక్టర్ ఆనంద్ ప్రశ్నించారు.

9 అంశాల ఎజెండా !

పాలనను పరుగులు పెట్టించే దిశగా 16న కీలక సమావేశం

9 అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలు, ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులతో సమీక్షించనున్న సీఎం

ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వ ప్రాథమ్యాలను వివరించే ప్రయత్నం

ఇవీ ఎజెండాలోని అంశాలు
ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం - కాలానుగుణ పరిస్థితులు, ఆరోగ్యం - సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతిభద్రతలు-రక్షణ సంబంధిత సమస్యలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం.

సాక్షి, హైదరాబాద్ : అసెంబ్లీ పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలకు ముందే సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 16న మంత్రులతో కలిసి కీలక సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్‌కమిషనర్లు, ఆయా శాఖల ముఖ్యకార్యదర్శులు పాల్గొంటారు. పాలనను పూర్తిస్థాయిలో పరుగులు పెట్టించే క్రమంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు సమాచారం. గత డిసెంబర్‌లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒకసారి కలెక్టర్లు, ఎస్పీలు, కమిషనర్లతో సమావేశం నిర్వహించినా, ఆ తర్వాత వెంటనే లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడం, కలెక్టర్లు, ఎస్పీలంతా పూర్తిగా ఎన్నికల విధుల్లోనే నిమగ్నం కావడంతో పాలనపై దృష్టి సారించలేకపోయారు. కోడ్ ముగియడం, ఈ మధ్యనే కలెక్టర్లు, కార్యదర్శులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్ల బదిలీలు చేయడం ద్వారా కొత్తగా ఆయా స్థానాల్లోకి వచ్చిన అధికారులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ ప్రాథమ్యాలపై దిశానిర్దేశం చేయడానికి ఈ సమావేశాన్ని వినియోగించుకోనున్నారు. 16న నిర్వహించే సమావేశ ఏజెండాలోని అంశాలను కూడా వారికి పంపించారు. ప్రధానంగా తొమ్మిది అంశాలను ఎజెండాలో చేర్చారు.

- రాష్ట్రప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి, అక్కడ ప్రతీ మంగళ, శుక్రవారాల్లో ప్రజల నుంచి విజ్ఞాపన పత్రాలు స్వీకరించడం, వాటిని సంబంధిత విభాగాలకు పంపించి అవి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. గడిచిన ఆరేడు నెలల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? వాటిలో ఏ విధమైన విజ్ఞాపనలు ఉన్నాయి? వచ్చిన విజ్ఞాపనల్లో ఎన్నింటికి పరిష్కరించారు? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? పెండింగ్‌లో ఉండడానికి గల కారణలేంటి? అన్న అంశాలను ఈ సమావేశంలో సమీక్షించనున్నారు.
- ఆర్థికంగా పెద్దగా భారం కాని పనులు కూడా పరిష్కరించకుండా ఉన్న పక్షంలో వాటిపై అధికారులకు నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వనున్నట్టు ఉన్నతాధికారి ఒకరు వివరించారు.
- భూముల సమస్యకు సంబంధించి ధరణిని రద్దు చేస్తామని, రైతులకు ప్రయోజనకరంగా ఉండే కొత్త వ్యవస్థ తీసుకొస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ధరణిపై ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీని ప్రభుత్వం నియమించిన సంగతి విదితమే. ఆ కమిటీ ఇప్పటికే పలుమార్లు సమావేశమై పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది. దీనిపై కలెక్టర్ల నుంచి ఫీడ్ తీసుకొని ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.
- వ్యవసాయ సీజన్ ప్రారంభమై దాదాపు నెలన్నర రోజులు అవుతున్న నేపథ్యంలో రైతులకు ఎరువులు, వర్షాభావ పరిస్థితులున్న చోట ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ఈ సమావేశంలోనే చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.
- వర్షాకాలసీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉన్నందున, ముందస్తుగా చేపట్టాల్సిన జాగ్రత్తలు గురించి ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, ఆస్పత్రుల్లో సరైన వైద్య సదుపాయం కల్పించేందుకు డాక్టర్లు, సిబ్బంది, మందులు తదితర అంశాలను చర్చించనున్నారు.
- వర్షాకాలంలో దాదాపు 20 కోట్ల మొక్కలను ఈసారి నాటాలని నిర్ణయించారు. కార్యక్రమం కొనసాగుతున్న తీరును కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించనున్నారు.
- మహిళాశక్తి క్యాంటీన్ల ఏర్పాటు, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఏ విధంగా ముందుకు వెళ్లాలని చర్చించనున్నారు.
- విద్యాసంవత్సరం ప్రారంభం, పాఠశాలల పరిస్థితి, వసతి గృహాలు, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల కొరత తదితర అంశాలను క్షుణ్ణంగా కలెక్టర్లతో సమీక్షిస్తారు.
- ఇక శాంతిభద్రతలు, రక్షణపరమైన అంశాలతోపాటు, రాష్ట్రంలో పెరిగిపోతున్న మాదక ద్రవ్యాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీస్ ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాల మాట వినిపించరాదని సీఎం ఇదివరకు ఇచ్చిన ఆదేశాలు మరోసారి ఈ సమావేశంలో పునరుద్ఘాటించనున్నారు.

'అష్ట'కష్టాలు..!

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేలు గెలుపొందారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఓటమితో ఈ సంఖ్య 38కి చేరింది. ఇక గత ఆరు నెలల్లో బీఆర్‌ఎస్ నుంచి రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు చేరిక ఖరారు కాగా... హైదరాబాద్ నగరానికి చెందిన మరో ఆరుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది.

శాసనసభాపక్షం విలీనంపై చర్చ

నిబంధనల ప్రకారం.. బీఆర్‌ఎస్ సంఖ్యాబలంలో మూడింట రెండొంతుల మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం అందులో విలీనమైనట్టు పరిగణిస్తారు. 2014-18 మధ్యలో టీడీపీ శాసనసభాపక్షం, 2018-23 మధ్యలో కాంగ్రెస్ శాసనసభాపక్షం ఇదే తరహాలో బీఆర్‌ఎస్‌లో విలీనమయ్యాయి. ఈ నిబంధన ప్రకారం బీఆర్‌ఎస్ నుంచి కనీసం 26 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే.. శాసనసభాపక్షం విలీనమైనట్టుగా పరిగణిస్తారు. ఇప్పటికే 9 మంది కాంగ్రెస్‌లో చేరడం, మరొకరు చేరికకు సిద్ధమైన నేపథ్యంలో.. ఇంకో 16 మంది బీఆర్‌ఎస్ నుంచి ఫిరాయించాల్సి ఉంటుంది. అయితే బీఆర్‌ఎస్‌కు హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలోనే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇప్పుడు ఈ ఉమ్మడి జిల్లాల నుంచే ఫిరాయింపులు ఎక్కువగా ఉంటాయనే ప్రచారం జరుగుతోంది.

కట్టడి కోసం బీఆర్‌ఎస్ ప్రయత్నాలు

బీఆర్‌ఎస్ నుంచి ఇప్పటికే తొమ్మిది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో.. మిగతా వారిని కట్టడి చేసేందుకు గులాబీ పార్టీలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. బీఆర్‌ఎస్ సర్కారులో అధికారం అనుభవించిన కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డిలతోపాటు కేసీఆర్‌కు సన్నిహితుడైన ఎం.సంజయ్ వంటి నేతలు కూడా వీడటంపై చర్చ జరుగుతోంది. దీంతో పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి.. పక్షం రోజుల క్రితం ఎర్రవల్లి నివాసంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. వారికి విందు ఇచ్చి.. పార్టీలో కొనసాగితే కలిగే ప్రయోజనాలు, భవిష్యత్తుపై భరోసా కల్పించే ప్రయత్నాలు చేశారు. ఈ సందర్భంగా కొందరు ఎమ్మెల్యేలు తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరగా.. కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. ఓ ఎమ్మెల్యే తన కారు మరమ్మతుకు అయ్యే ఖర్చులను తీసుకుని కూడా పార్టీ మారారని ప్రచారం జరుగుతోంది. మరింత మంది బీఆర్‌ఎస్‌ను వీడనున్నారన్న ప్రచారం నేపథ్యంలో.. పార్టీ ఎమ్మెల్యేలతో కేసీఆర్ మరోమారు వ్యక్తిగతంగా భేటీకానున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రలోభాలు, బెదిరింపులను ప్రస్తావిస్తూ..!!

పార్టీ మారుతున్న ఎమ్మెల్యేలు తమకు అధికార పార్టీ నుంచి వస్తున్న ఒత్తిళ్లు, బెదిరింపులను కేసీఆర్‌కు ఏకరువు పెడుతున్నారని బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. గతంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడం, కుటుంబ సభ్యుల వ్యాపారాలపై దాడులు, కేసులు పెడతామనే బెదిరింపులు వంటి కారణాలతో పార్టీ మారక తప్పడం లేదని అంటున్నారని పేర్కొంటున్నాయి. నగర శివార్లలోని ఓ ఎమ్మెల్యే కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులను వారు గుర్తు చేస్తున్నారని వివరిస్తున్నాయి.

న్యాయ పోరాటం.. ప్రజల మధ్యకు..

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం డిమాండ్ చేస్తున్న బీఆర్‌ఎస్.. అసెంబ్లీ వేదికగా కొట్లాడాలని నిర్ణయించింది. మరోవైపు రాష్ట్రపతి, గవర్నర్‌లను కలసి అసెంబ్లీ స్పీకర్, కాంగ్రెస్ వైఖరిని వివరించాలని.. అనర్హత వేటుపై స్పందించాల్సిందిగా కోరాలని భావిస్తోంది. రాష్ట్రపతి ఎదుట పార్టీ ఎమ్మెల్యేలతో పరేడ్ చేయించేందుకూ సన్నద్ధమవుతోంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించి సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు బీఆర్‌ఎస్ ఏర్పాట్లు పూర్తి చేసింది. మరోవైపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కేసీఆర్ స్వయంగా పర్యటించి.. ఆ ఎమ్మెల్యేలు, అధికార పార్టీ తీరును ఎండగట్టాలనే వ్యూహాన్ని కూడా సిద్ధం చేస్తున్నట్టు బీఆర్‌ఎస్ కీలక నేత ఒకరు వెల్లడించారు.

విస్తృత సేవలందించేలా 'హైడ్రా'

అసెంబ్లీ సమావేశాల్లోగా ముసాయిదా

- జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా కొత్త వ్యవస్థ ఏర్పాటు
- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: నగర విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలు అందించేలా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) రూపుదిద్దుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. హైడ్రా వ్యవస్థాగత నిర్మాణం, విధివిధానాలపై మరింత అధ్యయనం చేసి..కసరత్తు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. జీహెచ్‌ఎంసీతో పాటు, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డు, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుత్, పోలీస్ విభాగాలను సమన్వయం చేసుకొని మరింత సమర్థంగా హైడ్రా పనిచేసేలా ఉండాలంటూ అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఇప్పుడున్న ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని అందుకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించాలని ఆదేశించారు. కొత్త విభాగంలో ఏఏ స్థాయి అధికారులుండాలి? ఎంతమంది సిబ్బంది ఉండాలి? ఏఏ విభాగాల నుంచి వీరిని డిప్యుటేషన్ మీద తీసుకోవాలి? తదితర అంశాలపై స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. జీహెచ్‌ఎంసీతోపాటు హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) వరకు 2 వేల కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పనిచేయాల్సి ఉంటుందని, పనివిభజనకు వీలుగా సిటీలో ఇప్పుడున్న జోన్ల తరహాలో భౌగోళిక పరిధి నిర్దేశించాలని సీఎం సూచించారు. అవసరమైతే హైడ్రాకు ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోగా ముసాయిదా తయారు చేయాలని చెప్పారు. హైడ్రా ఏర్పాటు, సంబంధిత విధివిధానాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్, సీఎంఓ ముఖ్యకార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేకకార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

కీలక బాధ్యతలు

విపత్తుల నిర్వహణతోపాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయటం, ఆక్రమణలు తొలగించటం, అక్రమ నిర్మాణాలు, నిబంధనలను పాటించని ఫ్లెక్సీలు, హోర్డింగులు, ప్రకటనల తొలగింపు, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సరఫరాలో హైడ్రా కీలకంగా వ్యవహరించేలా విధులు అప్పగించాలని సీఎం చెప్పారు. హెచ్‌ఎండీఏ, వాటర్‌వర్క్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మున్సిపల్ విభాగాల మధ్య ఎప్పటికప్పుడు సమన్వయం ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న అనధికారిక హోర్డింగ్స్, ఫ్లెక్సీల తొలగింపు, అపరాధ రుసుము వసూలు బాధ్యత హైడ్రాకు బదలాయించాలన్నారు. నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో నిబంధనలు కఠినంగా ఉండేలా అధ్యయనం చేయాలని సూచించారు.

క్లుప్తంగా...

7 నెలల్లో అన్నింటా విఫలం

కాంగ్రెస్‌పై బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 7 నెలల వ్యవధిలోనే అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి రోజుకో మాట చెబుతున్నారని మండిపడ్డారు. శంషాబాద్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ విస్తృత కార్యవర్గభేటీలో ప్రవేశపెట్టిన రాజకీయ తీర్మానంలో పలు అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఎక్కడ అని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ ఎందుకు వాయిదా వేశారో సమాధానం చెప్పాలన్నారు. మాజీ సర్పంచ్‌లకు బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని, ధరణి ప్రక్షాళన ఏమైందని ఆయన నిలదీశారు.

ప్రభుత్వ సంస్థలు, హాస్టళ్లకు 'విజయ' ఉత్పత్తులు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఖమ్మం వ్యవసాయం: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సంస్థలు, హాస్టళ్లకు తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార ఫెడరేషన్ (విజయ డెయిరీ) పాల ఉత్పత్తులు సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. విజయ తెలంగాణ పాలు, పాల ఉత్పత్తులే కాక తాగునీరు(ప్యాకేజ్డ్) ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు పంపిణీ చేయాలని ప్రభుత్వ కార్యదర్శి సవ్యసాచి ఘోష్ పేరిట తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార ఫెడరేషన్ ద్వారా రైతులకు గౌరవమైన ధర చెల్లించి పాలు సేకరిస్తుండగా, ప్రభుత్వం లీటర్‌కు ప్రోత్సాహకంగా రూ.4 చొప్పున చెల్లిస్తోందని...ఆపై ఆయా ధరలకు అనుగుణంగానే తిరిగి వినియోగదారులకు పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తున్నందున ప్రభుత్వ సంస్థలకు సైతం పంపిణీ చేసేలా అనుమతించాలని డెయిరీ ఎండీ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దీంతో టెండర్ల విధానం ద్వారా ఈ నెల నుంచే కొనుగోలు, సరఫరాకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ కార్యదర్శి ఆదేశించారు.

నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగిస్తే చర్యలు

ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఫంక్షన్ హాళ్లలో జరిగే ఈవెంట్స్‌కు తెలంగాణ ఎక్సైజ్‌శాఖ నుంచి అనుమతి తీసుకున్న మద్యం కాకుండా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌పీడీఎల్) వినియోగిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు హెచ్చరించారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగంపై నిఘా పెంచాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్, ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. ఎన్‌డీపీఎల్ మద్యం వినియోగిస్తే కేసుల నమోదు తప్పదని హెచ్చరించారు.

బెయిల్ పిటిషన్ తిరస్కరణ

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులకు ఎదురుదెబ్బ

సిటీ, కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. గురువారం ఈ కేసులో వాదనలు విన్న 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. బెయిల్ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి శుక్రవారం బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ-2 ప్రణీత్‌రావు, ఏ-3 భుజంగరావు, ఏ-4 తిరుపతన్న, ఏ-5 రాధాకిషన్‌రావు పిటిషన్ కొట్టివేసింది. అయితే ఈ కేసులో ఏ-1 ప్రభాకర్‌రావు, ఏ-6 శ్రవణ్‌కుమార్ రావు ఇతరదేశాల్లో తలదాచుకున్న నేపథ్యంలో నాంపల్లి కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. దీంతో శుక్రవారం పోలీసులు కోర్టులో నోటీసులు అందజేశారు. త్వరలో వారిని కూడా పట్టుకుని రిమాండ్‌కు తరలిస్తారని తెలుస్తోంది. కాగా, ఈ కేసుకు సంబంధించిన చార్జిషీట్ పీఆర్‌సీ (ప్రైమరీ రిజిస్టర్ కేస్) నం.260 ఆఫ్ 2024గా ఉంది. ఈ కేసు మొదటి విచారణ ఈనెల 19కి వాయిదా పడింది.

రాష్ట్రం నుంచి ఢిల్లీకి సూట్‌కేసులు

- సీఎం నుంచి ఎమ్మెల్యేల వరకు పోటీ పడుతున్నారు
- పార్టీ ఫిరాయింపులతో గాంధీభవన్ గులాబీ మయంగా మారింది
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి అనూహ్య ఫలితాలు రాబోతున్నాయి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



శంషాబాద్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ రాష్ట్రకార్యవర్గ సమావేశానికి హాజరైన కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, రఘునందన్ రావు, ఈటల, డీకే అరుణ, ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'ఆరు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆర్‌జీ ట్యాక్స్, ఆర్‌ట్యాక్స్, యూకే ట్యాక్స్, బీవీ ట్యాక్స్ పేరుతో వసూళ్లకు తెగబడింది. ఢిల్లీకి మూటలు మోసే పనిలో పడింది. పదేళ్లు కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుంటే, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ దోచుకుంటోంది. పరిపాలనను పక్కనబెట్టి భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, కమీషన్లు, పర్సంటేజీల పేరుతో ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్న సొమ్మును పోటీపడి ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు ఢిల్లీకి కప్పం కట్టే పనిలో బిజీ అయిపోయారు' అని అని కేంద్ర మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శంషాబాద్‌లో శుక్రవారం బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్. కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. పదేళ్ల బీఆర్‌ఎస్ కుటుంబ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ''మంత్రులు, ఎమ్మెల్యేలు సహా బీఆర్‌ఎస్ నాయకులు అవినీతికి పాల్పడని రంగం లేదు. ల్యాండ్ మాఫియా, సాండ్ మాఫియా, గ్రానైట్ మాఫియా, లిక్కర్ మాఫియా, డ్రగ్స్ మాఫియాలో కూరుకుపోయి ప్రజాధనాన్ని, రాష్ట్ర ఖజానాను లూటీ చేశారు. పర్యవసానంగా రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఆఖరుకు ఇప్పుడే పుట్టిన బిడ్డకు సైతం నెత్తిన లక్షల రూపాయల అప్పు మూటను మోపారు. తామేమీ తక్కువ కాదన్నట్లుగా కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అక్రమ వసూళ్లకు తెగబడింది. ఢిల్లీకి మూటలు మోసే పనిలో పడింది. పేరు మారిందే కానీ పెద్దగా బీఆర్‌ఎస్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు తేడాలేదు. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను నయవంచన చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అతితక్కువ కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది.''అని విమర్శించారు.

ఫిరాయింపులే కార్యాచరణగా..

''ప్రజాపాలనపై సోయిలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఫిరాయింపులను ప్రధాన కార్యాచరణగా ముందుకెళ్తోంది. గత బీఆర్‌ఎస్ పార్టీ మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ కూడా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ, ప్రజా తీర్పునకు, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తూట్లు పొడుస్తోంది. శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు పార్టీ మారితే డిస్ క్వాలిఫై చేయాలన్న కాంగ్రెస్‌పార్టీ, తమ ఎజెండాను తుంగలో తొక్కింది. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను నిస్సిగ్గుగా కాంగ్రెస్‌లో చేర్చుకుంటుంది. గాంధీ భవన్ గులాబీ భవన్‌లా మారింది.''అని కిషన్‌రెడ్డి నిందించారు.

సెక్యూరిటీ లేకుండా రాహుల్‌కు ఓయూలో తిరిగే దమ్ముందా?: బండి సంజయ్

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా వ్యాపిస్తోందంటూ మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి సవాల్ విసురుతున్నా. తెలంగాణలో మీ కాంగ్రెస్ పార్టే అధికారంలో ఉంది కదా! సెక్యూరిటీ లేకుండా మీకు ఉస్మానియా యూనివర్శిటీలో తిరిగే దమ్ముందా? తెలంగాణలో నిరుద్యోగం అంటువ్యాధిలా ఏ స్థాయిలో విస్తరిస్తుందో వారిని కలిసి మాట్లాడితే తెలుస్తుంది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీయే అంటువ్యాధి లాంటిది. మోదీరోజ్‌గార్ మేళాతో 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. అయినా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా విస్తరిస్తోందని రాహుల్ గాంధీ చెప్పడం సిగ్గు చేటు''అని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు.

రిటైర్డ్ పోలీసు అధికారిని చైర్మన్ చేయడం వల్లనే సమస్యలు: ఎంపీ రఘునందన్

''ప్రభుత్వం ఓ రిటైర్డ్ పోలీసు అధికారిని టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించింది. ఆయన పదవీకాలం డిసెంబర్‌తో ముగియనుంది. తన హయాంలో ఉద్యోగాలు భర్తీ చేయాలన్న తప్పుడు ఆలోచనతోనే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. డీఎస్సీ కోసం మరో 45 రోజుల సమయం కేటాయించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గ్రూప్-1,2,3 ఉద్యోగ పోస్టులను పెంచకుండా నిరుద్యోగులను మోసం చేసింది. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 ఎంపిక చేయాలని ప్రతిపక్షంలో ఉండగా, ఇదే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిండు సభలో గుర్తు చేశారు''అని ఎంపీ రఘునందన్ పేర్కొన్నారు. నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనకు బీజేపీ మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలున్నా కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదనీ, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ విచారణ జరిపించాలని మాట్లాడిన రేవంత్ ఇప్పుడెందుకు నోరుమెదపడం లేదని రఘునందన్ నిలదీశారు.

కాలేజీల నుంచి ఆర్‌ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు: ఈటల

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల యాజమాన్యాల నుంచి కూడా ఆర్‌ఆర్‌ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. అందుకే విద్యార్థుల నుంచి యాజమాన్యాలు ఎక్కువ డబ్బులు తీసుకునే దుస్థితి నెలకొందన్నారు. కాంట్రాక్టర్లు, సర్పంచులు చేసిన పనులకు బిల్లులు ఇచ్చే అధికారం తమకు లేదంటూ ఆర్థిక శాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారన్నారు. శుక్రవారం శంషాబాద్‌లో బీజేపీ విస్తృత సమావేశం సందర్భంగా ఈటల మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బిల్లుకి 8 శాతం డబ్బులు ముందు చెల్లిస్తేనే బిల్లులు విడుదల చేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ డబ్బులు కూడా లంచం ఇస్తే తప్ప వచ్చేలా లేవన్నారు. ప్రతిబిల్లుకి డబ్బులు తీసుకునే నీచ సంస్కృతి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో వచ్చిందని మండిపడ్డారు. ఏడు నెలల కాలంలోనే అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన పార్టీ కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి జీవో నంబర్ 58, 59ని అమలు చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి దానిని మరచారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ పుంజుకునే అవకాశం లేదని, కాంగ్రెస్ పట్ల విశ్వాసం లేదని, ఈ నేపథ్యంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలుపొందేది బీజేపీయేనని ధీమా వ్యక్తంచేశారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన జాబితాలో 'తెలుగు రాష్ట్రాలు'

ఆరో స్థానంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
ఎస్.డి.జి.ఇండియా ఇండెక్స్ 2023-24 విడుదల చేసిన నీతి ఆయోగ్

సాక్షి, న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు మెరుగైన పనితీరును కనబర్చాయి. కొన్ని లక్ష్యాల సాధనలో మెరుగైన పనితీరు కనబరిచి ఫ్రంట్ రన్నర్ కేటగిరిలో నిలిచాయి. పేదరిక నిర్మూలన, ఆర్థికవృద్ధి వంటి 16 లక్ష్యాలను ప్రామాణికంగా తీసుకొని వివిధ రాష్ట్రాల పనితీరు, అభివృద్ధి ఆధారంగా నీతి ఆయోగ్ నివేదిక సిద్ధం చేసింది. ఈ వివరాలను 'ఎస్.డి.జి. ఇండియా ఇండెక్స్ 2023-24' పేరిట నివేదిక రూపంలో శుక్రవారం విడుదల చేసింది. వివిధ రంగాల్లో 74 పాయింట్లు సాధించి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు దేశంలో ఆరో స్థానంలో నిలిచాయి. తాజా నివేదికలో తెలంగాణ 2, ఏపీ 5 పాయింట్లు ఎక్కువగా సాధించాయి. ఈ రెండు తెలుగు రాష్ట్రా లతో పాటు గుజరాత్, జమ్ముకశ్మీర్, పుదుచ్చేరి ఆరో స్థానంలో ఉమ్మడిగా నిలిచాయి. పేదరిక నిర్మూలనలో తెలంగాణ 91, ఏపీ 86 పాయింట్లు, శుభ్రమైన నీరు, పరిశుభ్రత లక్ష్యంలో ఏపీ 91, తెలంగాణ 90 పాయింట్లు సాధించాయి. కాగా ఏపీ, తెలంగాణల్లో నిరుద్యోగం గణనీయంగా తగ్గింది. తెలంగాణలో 2020-21లో 8.80 ఉన్న నిరుద్యోగ రేటు 2023-24లో 4.60కి, ఏపీలో నిరుద్యోగ రేటు 5.70 నుంచి 4.40కి తగ్గిందని నీతిఆయోగ్ పేర్కొంది.

నిమ్స్‌కు బక్క జడ్సన్

ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్): బక్క జడ్సన్‌ను చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. నిరుద్యోగుల కోసం పదిరోజులుగా బక్క జడ్సన్ తన నివాసంలోనే ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ముందుగా నల్లకుంట ఏఎంఎస్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నిమ్స్ తరలించారు. బక్క జడ్సన్‌కు ఏమైనా జరిగితే సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని సౌతిండియా పొలిటికల్ జేఏసీచైర్మన్, ఓయూ విశ్రాంత అధ్యాపకుడు ప్రొ.గాలి వినోద్‌కుమార్ అన్నారు.

నైనీ గనులకు ఒడిశా సర్కారు ఓకే

- గనుల తవ్వకానికి సహకరిస్తాం
- ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంజీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినతికి వెంటనే స్పందన
- ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం
- త్వరలోనే బొగ్గు తవ్వకాలు ప్రారంభం
- రాయల్టీగా ఏటా ఒడిశాకు రూ.600 కోట్లు: భట్టి వెల్లడి



ఒడిశా సీఎం మోహన్ చరణ్‌కు లేఖ ఇస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్, సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఒడిశా రాష్ట్రం అంగుల్ జిల్లాలోని నైనీ బొగ్గు గనిలో బొగ్గు ఉత్పత్తికి పూర్తిగా సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాంజీ స్పష్టం చేశారు. ఆ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుకు హామీ ఇచ్చారు. దశాబ్దం కిందట ఆ బొగ్గు గనిని సింగరేణికి కేటాయించినా అక్కడ ఒక్క తట్ట బొగ్గు కూడా ఉత్పత్తి చేయ లేదు. ఇప్పుడు బొగ్గు తవ్వకాలకు అన్ని రకాల అనుమతులు వచ్చిన నేపథ్యంలో.. ఆ రాష్ట్ర ప్రభు త్వ సహకారాన్ని కోరేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సచివాలయంలో మాంజీని కలిసి విజ్ఞప్తి చేశారు. బొగ్గు గని ఆవశ్యకతను తెలంగాణ డిప్యూటీ సీఎం వివరించారు. ఈ మేరకు అన్ని వివరాలతో కూడిన లేఖను ఒడిశా సీఎంకు అందజేశారు. స్పందించిన ఒడిశా సీఎం మోహన్‌చరణ్ మాంజీ.. భూముల బదలాయింపు, విద్యుత్, రహదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తమ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఆ సమస్య పరిష్కారమైతే తవ్వకాలు: భట్టి

నైనీ బ్లాకులో గనుల తవ్వకానికి పారిశ్రామిక, పర్యావరణ అనుమతులు సైతం వచ్చాయని డిప్యూటీ సీఎం భట్టి ఈ సందర్భంగా తెలిపారు. అటవీ, ప్రైవేటు భూములను సింగరేణికి బదలాయించాల్సిన అంశం పెండింగ్‌లో ఉందని, ఈ సమస్య పరిష్కారమైన వెంటనే సింగరేణి తవ్వకాలను ప్రారంభిస్తుందని వివరించారు. నైనీ బ్లాక్‌లో తవ్వకాలు చేపట్టడం ద్వారా 1,200మందికి ఉపాధితో పాటు పన్నుల రూపంలో రూ.600 కోట్ల వరకు ఒడిశాకు రాయల్టీ రూపంలో ఆదాయం సమకూరుతుందని మాంజీ దృష్టికి తెచ్చారు. ప్రతీ ఏటా ఇక్కడ నుంచి పది మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. బొగ్గు గనుల వద్దనే 2 x800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి ఏర్పాటు చేస్తుందని భట్టి ప్రకటించారు. సమావేశంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, ఇంధన శాఖ ఓఎస్డీ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

లోకల్ టు స్టేట్..!

- 'స్థానిక' పునాదితో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం
- రాష్ట్రంలో అధికారమే ధ్యేయంగా.. బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో రూట్‌మ్యాప్‌పై చర్చ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావడంతో మొదలు పెట్టి.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమయ్యేలా స్వల్ప, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు (నెల నుంచి 1500 రోజులకు) సిద్ధం చేసుకోవాలని బీజేపీ నిర్ణయించింది. తెలంగాణలో ప్రజల నుంచి ఆదరణ పెరుగుతున్నందున ఈ సానుకూల వాతావరణాన్ని ఉపయోగించుకుని సంస్థాగతంగా బలపడాలని తీర్మానించింది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన 14% ఓటింగ్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో 35 శాతానికి పెంచుకున్నందున, 2028 శాసనసభ ఎన్నికల్లో పార్టీ అధికారానికి వచ్చేందుకు అనుకూల పరిస్థితులున్నాయని అంచనా వేసింది. ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రధాన హామీలేవీ అమలుకు నోచుకోకపోవడంతో.. రైతులు, మహిళలు, యువత, ఓబీసీలు, ఇలా అన్ని వర్గాల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరుగుతోందని అంచనా వేసింది. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా గెలవకపోవడం ద్వారా బీఆర్‌ఎస్ బలహీనపడినట్టుగా బీజేపీ భావిస్తోంది. ఈ పరిస్థితులను ఉపయోగించు కుని తెలంగాణలో నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని తీర్మానించింది.

త్వరలో చింతన్‌బైఠక్‌లు

అధికార కాంగ్రెస్‌కు బీజేపీ రాజకీయంగా ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు పార్టీ నుంచి పెద్దసంఖ్యలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను గెలిపించుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలను ప్రజాప్రతినిధులుగా గెలిపించుకునేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి నాయకులు కృషి చేయాలని నిర్ణయించింది. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతమయ్యేందుకు వెంటనే గ్రామాలకు తరలి పని ప్రారంభించాలని నిర్ణయించింది. పార్టీపరంగా వ్యూహాలను పటిష్టంగా అమలుచేసేందుకు తొందరలోనే 17 ఎంపీ నియోజకవర్గాల వారీగా లేదా 32 జిల్లాలను 4 ప్రాంతాలుగా విడదీసి 'చింతన్ బైఠక్'(మేథోమథన శిబిరాలు) నిర్వహించాలని నిర్ణయించింది. శుక్రవారం శంషాబాద్‌లోని మల్లికా గార్డెన్స్‌లో జరిగిన బీజేపీ రాష్ట విస్తృత కార్యవర్గ సమావేశంలో చేపట్టాల్సిన రూట్‌మ్యాప్‌పై చర్చ సాగింది. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పార్టీ .జెండా ఆవిష్కరించగా, ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు. పీఎం మోదీని అభినందిస్తూ ఘన విజయం అందించిన తెలంగాణ ప్రజలకి ధన్యవాదాలు తెలుపుతూ కేంద్ర హోం శాఖ సహాయ బండి సంజయ్ తీర్మానం ప్రవేశ పెట్టగా, జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ దానిని బలపరిచారు. సమావేశంలో ఎంపీలు డా.కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, ఎం.రఘునందన్‌రావు, గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు టి.రాజాసింగ్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, పైడి రాకేష్‌రెడ్డి, డా.పాల్వాయి హరీష్‌బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, రామారావు పటేల్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, బంగారు శ్రుతి, ఎస్సీమోర్చా జాతీయకార్యదర్శి ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నింటినీ వెంటనే అమలుచేయాలి

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలన్నింటినీ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ రాజకీయ తీర్మానం ఆమోదించారు. సమావేశంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఎంపీలు ఈటల, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు దానిని బలపరుస్తూ మాట్లాడారు.

రాజకీయ తీర్మానంలో ముఖ్యాంశాలు

- వెంటనే రైతు రుణమాఫీని అమలు చేయాలి.
- రైతు భరోసా కింద రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12వేలు వెంటనే విడుదల చేయాలి
- గ్రామపంచాయతీల్లో పేరుకుపోయిన బకాయిలను వెంటనే చెల్లించాలి
- గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలి
- కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి వ్యవహారంపై సీబీఐకి అప్పజెప్పాలి
- ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని కూడా సీబీఐ కి అప్పజెప్పాలి
- ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న శక్తులను గుర్తించి, శిక్షపడేలా చర్యలు తీసుకోవాలి
- విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై జ్యుడీషియల్ కమిషన్ దర్యాప్తును వేగవంతం చేయాలి
- గొర్రెల స్కాం మీద పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలి
- ల్యాండ్, శాండ్, గ్రానైట్, లిక్కర్, డ్రగ్స్ మాఫియాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి
- ధాన్యం కుంభకోణంపై విచారణ చేయాలి
- వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలి
- రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ఆయుష్మాన్ భారత్ అమలు చేయాలి
- ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి.. ధరణి ప్రక్షాళన చేపట్టాలి.

2028లో గెలుపు మనదే

▶ మొదటి పేజీ తరువాయి

బీజేపీ ఉత్తరాది పార్టీ అనే అపవాదు తొలగింది. దక్షిణ భారతంలో బీజేపీ మరింత బలపడింది. కొత్త శకం మొదలైంది. కేరళలో బీజేపీ ఖాతా తెరిచింది. తమిళనాడు లో మెరుగైన ఓటు బ్యాంక్ సాధించాం''అని ఆయన అన్నారు.

రాజ్యాంగం మార్చం.. రిజర్వేషన్లను ఎత్తివేయం

'పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి కూడా కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు దాటలేదు. 13 రాష్ట్రాల్లో అసలు కాంగ్రెస్ ఖాతానే తెరవలేదు. అయినా కాంగ్రెస్ నాయకుల తీరు మారలేదు. అహంకారంగా మాట్లాడుతున్నారు. రాజ్యాంగాన్ని పదే పదే అవమానించే కాంగ్రెస్‌నేతలు, రాహుల్‌గాంధీ ఇప్పుడు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారు.. ఎన్డీఏ అధికారంలో ఉన్నన్ని రోజులూ రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తే లేదు. రాజ్యాంగానికి ఎలాంటి హానీ జరగదని మేమంతా సామూహికంగా వాగ్దానం చేస్తున్నాం బీజేపీ అధికారంలో ఉండగా రిజర్వేషన్లకూ ఎటువంటి ధోకా లేదు'అని ధర్మేంద్ర స్పష్టం చేశారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కాంగ్రెస్ మంగళం

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం.. సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పేద బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం గతంలో కేసీఆర్ ప్రారంభించిన 'తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్'భవిష్యత్ కాంగ్రెస్ పాలనలో అగమ్యగోచరంగా మారిందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. విద్య, స్వయం ఉపాధి, వేద విద్యను ప్రోత్సహించేందుకు అమలు చేసిన పథకాలు నిలిచిపోవడంతో బ్రాహ్మణ సామాజికవర్గంలో ఆందోళన నెలకొందన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ దుస్థితిపై హరీశ్‌రావు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ బహిరంగ లేఖ రాశారు. బీఆర్‌ఎస్ పాలనలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు ఏటా క్రమం తప్పకుండా రూ.100 కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలో రూ.12 కోట్లతో పది ఎకరాల విస్తీర్ణంలో విప్రహిత బ్రాహ్మణ సదన్ నిర్మించామని వివరించారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రాహ్మణ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. బ్రాహ్మణ పరిషత్ పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు గతంలో మాదిరిగానే నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. విదేశీ విద్యా పథకానికి రూ.30 కోట్ల నిధులు తక్షణమే విడుదల చేయడంతో పాటు అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణ ఎంటర్‌ప్రెన్యుయల్ స్కీం ఆఫ్ తెలంగాణ (బెస్ట్) కింద దరఖాస్తు చేసుకుని ఎంపికైన వారికి రూ.16 కోట్లు విడుదల చేయాలని, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఉద్యోగులకు ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు, వేద పండితులకు గౌరవ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. అదేవిధంగా అర్ధాంతరంగా నిలిచిన సూర్యాపేట, ఖమ్మం, మధిర బ్రాహ్మణ సదన్ పనులను వెంటనే పూర్తి చేయాలని హరీశ్ సీఎం రేవంత్‌కు రాసిన ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

పదోన్నతులపై మంత్రి కోమటిరెడ్డి హామీ



సాక్షి, హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖలో పదోన్నతులు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఈ శాఖలో పదోన్నతుల విషయంలో కొంతకాలంగా అధికారులు, ఇతర సిబ్బందిలో అసంతృప్తి నెలకొన్న విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం మంత్రి సిబ్బందితో భేటీ అయి సమస్యలపై చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో పదోన్నతుల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, దానివల్లనే సమస్యలు తలెత్తాయని మంత్రి పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని పరిష్కరించి నిబంధనల మేరకు పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, శాఖా పరంగా నెలకొన్న ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, రోడ్ల అభివృద్ధికి సంబంధించిన పనిలో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని అవసరమైతే ఓ గంట అదనంగా వెచ్చించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అంతకుముందు ఉద్యోగ సంఘాల నాయకులు బాల ప్రసాద్, మహేందర్, శశిధర్, సీతారామయ్య, సురేందర్, మనోహర్, విజయశంకర్, బాలగంగాధర శాస్త్రి, హనుమంతరావు, సత్యనారాయణ, రామ్మోహన్ తదితరులు మంత్రికి సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ సెక్రెటరీ దాసరి హరిచందన, ఈఎన్సీ గణపతి రెడ్డి, సీఈ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను జైలుకు పంపడమే లక్ష్యం

హరీశ్ బీజేపీలోకి, జగదీశ్‌రెడ్డి జైలుకు వెళ్తారు: రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్‌ను ఓడించాలనే తన లక్ష్యం నెరవేరిందని, ఇప్పుడు ఆయన్ను జైలుకు పంపడమే తన ముందున్న లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కురియన్ కమిటీ పోస్టుమార్టంలో భాగంగా శుక్రవారం ఆయన గాంధీభవన్‌కు వచ్చి కమిటీ ముందు తన అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సమాధి అయిందన్నారు. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలందరూ కాంగ్రెస్‌పార్టీ వైపు చూస్తున్నారని తెలిపారు. హరీశ్‌రావు బీజేపీలోకి వెళ్తాడని అన్నారు. జగదీశ్ రెడ్డి వచ్చినా తాము చేర్చుకోబోమని, ఆయన జైలుకు వెళ్తారని ఎద్దేవా చేశారు. కురియన్ కమిటీకి అన్నివిషయాలు వెల్లడించానని వివరించారు.

అభివృద్ధి కోసమే మా దగ్గరకు వస్తున్నారు: షబ్బీర్ అలీ

గతంలో పార్టీ ఫిరాయింపులను మొదలు పెట్టిందే బీఆర్‌ఎస్ అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ వ్యాఖ్యానించారు. కురియన్ కమిటీకి తన అభిప్రాయాలను వెల్లడించిన అనంతరం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గత పదేళ్లలో కాంగ్రెస్‌కు చెందిన వందల సంఖ్యలో నాయకులను పార్టీలోకి చేర్చుకున్నది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. అయితే, బీఆర్‌ఎస్ నేతలు తమ పార్టీ ఎమ్మెల్యేలు అంగట్లో సరుకుల్లా కొన్నారని, ఇప్పుడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మాత్రం అభివృద్ధి కోసమే తమ పార్టీలోకి వస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్-బీజేపీల కుమ్మక్కు రాజకీయాల వల్లే కాంగ్రెస్‌కు రావాల్సిన కొన్ని సీట్లు తగ్గాయని కమిటీకి వెల్లడించామన్నారు.

యువతిపై సామూహిక లైంగికదాడి

- ఆపై చెట్టుకు కట్టేసి పరార్
- నల్లగొండ పట్టణానికి కూత వేటు దూరంలోనే ఘటన
- స్వయంగా ప్రియుడే తన స్నేహితులతో కలిసి అఘాయిత్యం
- ఫిర్యాదు రాకపోవడంతో ముందడుగు వేయని పోలీసులు

నల్లగొండ క్రైం: ఓ యువతిపై లైంగికదాడికి పాల్పడిన ముగ్గురు యువకులు.. ఆపై ఆమెను చెట్టుకు కట్టేసి పరారైన దారుణ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన నల్లగొండ పట్టణ సమీపంలోని గుండ్లపల్లి రోడ్‌లో ఇందిరమ్మ కాలనీ రాజీవ్ గృహకల్ప సమీపంలో కలకలం రేపింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఓ యువతి తన ప్రియుడితో పాటు మరో ఇద్దరు యువకులు కలిసి 4 రోజుల క్రితం రాజీవ్ గృహకల్ప సమీపంలోని చెట్ల పొదల్లోకి సాయంత్రం 6 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. ముగ్గురూ కలిసి ఆ యువతిపై లైంగిక దాడికి పాల్పడి.. ఆ తర్వాత అదే ప్రాంతంలో ఆమెను ఓ వేప చెట్టుకు కట్టేసి వెళ్లిపోయారు. రాత్రంతా ఆమె అదే చెట్టుకు కట్టేసి ఉంది. మరుసటి రోజు ఉదయం 9 గంటల సమయంలో ఓ మేకల కాపరి అటుగా వెళ్లడంతో యువతి కేకలు వేసింది. ఆ సమయంలో ఆమె ఒంటిపై దుస్తులు అసంపూర్తిగా ఉన్నాయి. తొలుత భయబడ్డ ఆ మేకల కాపరి.. తర్వాత ఆమె దగ్గరికి వెళ్లి కట్లు విప్పాడు. వెంటనే ఆమె తన బ్యాగ్‌లో ఉన్న డ్రెస్ వేసుకుని.. జరిగిన విషయాన్ని మేకల కాపరికి చెప్పి రోడ్డుపైకి వెళ్లి ఆటోలో వెళ్లిపోయింది. తర్వాత ఆ మేకల కాపరి విషయాన్ని తెలిసిన వారికి చెప్పాడు. విషయం ఆనోటా.. ఈనోటా పోలీసులకు వరకు చేరింది. దీనిపై ఫిర్యాదు రాకపోవడంతో పోలీసులు ముందడుగు వేయడం లేదు.

“ఏ విధంగానైతే సాయంకాలం కాగానే అంతదాకా ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతూండే పక్షులన్నీ తిరిగి తమ నివాస స్థానాలైన చెట్లపై వాలి, నిశ్చింతగా విశ్రాంతి తీసుకుంటాయో, అదే విధంగా పంచభూతాలు, పంచ ప్రాణాల లాంటివన్నీ ఆ పరబ్రహ్మలో సుఖపూర్వకంగా ఆశ్రయం తీసుకుంటాయి.

– ప్రశ్నోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 13 జూలై 2024

విజ్ఞత మరిచిన నాటో!

వ్యక్తిగా ఒక్కరు తీసుకునే నిర్ణయం కంటే సమష్టి నిర్ణయమే ఎప్పుడూ సరైందని పెద్దలు చెబుతారు. కానీ వాషింగ్టన్‌లో మూడు రోజులపాటు జరిగిన నాటో 75 ఏళ్ల వార్షికోత్సవాల్లో దేశాధినేతలు మాట్లాడిన తీరు చూసినా, చివరిలో ప్రకటించిన డిక్లరేషన్ గమనించినా పరిణతికన్నా పరమ మూర్ఖత్వమే కనబడుతుంది. మూడో ప్రపంచ యుద్ధం దిశగా ప్రపంచ దేశాలను కదిలించే ప్రయత్నం దర్శనమిస్తుంది. రష్యా దురాక్రమణపై పోరాడుతున్న ఉక్రెయిన్‌కు వచ్చే ఏడాదిలోగా సైనిక సాయం రూపంలో కనీసం 4,000 కోట్ల యూరోలు అందజేయాలని నాటో సంకల్పించింది. అంటే రెండున్నరేళ్లుగా వేలాదిమంది మరణాలకూ, కోట్లాది డాలర్ల ఆస్తుల విధ్వంసానికీ కారణమైన ఆ యుద్ధాన్ని మరింత ఎగదోస్తూ పోతారన్నమాట! ఇంకా విడ్డూరమేమంటే నెదర్లాండ్స్ భూభాగంలో ఎఫ్–16 యుద్ధ విమానాలను మోహరించి రష్యాపై దాడులకు ఉక్రెయిన్‌ను పురిగొల్పుతారు. అంతేకాదు... ఎన్నడూ లేనివిధంగా తొలిసారి చైనాపై నాటో నిప్పులు చెరిగింది. దురాక్రమణ యుద్ధం కొనసాగించేందుకు రష్యాకు దన్నూ, ధైర్యమూ ఇస్తున్నది చైనాయేనని డిక్లరేషన్ ఆరోపించింది. నాటో ఎప్పుడూ చైనా జోలికి పోలేదు. అయిదేళ్లుగా చైనా వ్యవహారశైలిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న మాట వాస్తవం. అది కూడా చాలా మర్యాదైన, మృదువైన పదాలతోనే! ఇప్పుడేమైంది? నాటో కొత్త రాగం వెనకున్న కారణమేమిటి?

నిజానికి నాటో సదస్సులో ఈసారి జో బైడెన్ ఆరోగ్యం, ఉక్రెయిన్ యుద్ధం, గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ ప్రస్తావనకొస్తాయని అందరూ ఆశించారు. అమెరికా అధ్యక్ష పదవి రేసులో బైడెన్ ఆరోగ్యం ప్రధాన అంశంగా మారింది. ఆయన కొనసాగితే ఓటమి ఖాయమని డెమాక్రాట్లు నిర్ణయానికొచ్చారు. సర్వేలు సైతం రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ బలపడుతున్న వైనాన్ని ఏకరువు పెడుతున్నాయి. అందుకే నాటో స్వరం మారిందని విశ్లేషకుల ఆరోపణ. ట్రంప్ వస్తే నాటో ఉనికే ప్రశ్నార్థకం కావటం ఖాయం. ఉక్రెయిన్ భవిష్యత్తు అనిశ్చితం. గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ వల్ల ఇంతవరకూ 1,86,000 మంది పౌరులు మరణించారని లాన్సెట్ నివేదిక అంచనా. ఈ నేపథ్యంలో ఆ యుద్ధాన్ని నివారించటంపై నాటో దృష్టి పెడుతుందని అందరూ అంచనా వేయగా, తీరా దాని గురి చైనా వైపు మళ్లింది! మరోపక్క భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటీ... ఘర్షణల సమయంలో ‘వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి’ ఉండదంటూ పరోక్షంగా మనల్ని హెచ్చరించారు. ‘అవసర సమయాల్లో’ భారత్, అమెరికాలు సమష్టిగా పనిచేయాల్సి వుంటుందని చెప్పారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ రష్యా పర్యటనపై లోపాయికారీగా మన అధికారుల వద్ద అమెరికా అసంతృప్తి వ్యక్తంచేసినట్టు కథనాలొచ్చాయి. గార్సెటీ దాన్నే బహిరంగంగా చెప్పారు.

రెండేళ్లక్రితం తాను చెప్పిందేమిటో అమెరికాకు గుర్తుందా? ఉక్రెయిన్‌కు చేయూతగా పోలాండ్ నుంచి మిగ్–29 యుద్ధ విమానాలను రంగంలోకి దించటానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తామని 2022 మార్చిలో అమెరికా విదేశాంగమంత్రి బ్లింకెన్ చేసిన ప్రకటనను అమెరికా రక్షణ శాఖ తప్పుబట్టింది. ఇందువల్ల రష్యా తీవ్రంగా ప్రతిస్పందించే ప్రమాదం వుంటుందని పెంటగాన్ ప్రతినిధి జాన్ కిర్బీ హెచ్చరించారు. ఆ సమయంలోనే జో బైడెన్ సైతం ఉక్రెయిన్ గగనతలంపై నాటో నో ఫ్లైజోన్ విధించాలన్న ప్రతిపాదనను కొట్టిపడేశారు. దాన్ని అమలు చేయటానికి నాటో నేరుగా యుద్ధరంగంలోకి దిగాల్సివస్తుందని చెప్పారు. మూడో ప్రపంచ యుద్ధం ప్రారంభించాలని అమెరికా భావించటం లేదని అన్నారు. ఆఖరికి నాటోలో ప్రధాన భాగస్వాములైన జర్మనీ, ఫ్రాన్స్ సైతం అదే ఉద్దేశంతో ఉన్నాయి. నిరుడు ఫిబ్రవరిలో ఒక విందు సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి జర్మనీ చాన్సలర్ ఓలోఫ్ షుల్జ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియేల్ మేక్రాన్‌లు హితవు చెప్పారు. ‘ఈ యుద్ధంలో మీరు ఓడిపోబోతున్నారు. కనుక రష్యాతో చర్చలకు సిద్ధపడి సంధి చేసుకోవటం అత్యుత్తమం’ అని సలహా ఇచ్చారు. హిట్లర్ కాలంలో జర్మనీ తమ దేశాన్ని దురాక్రమించినా ఆ తర్వాత జర్మనీ, ఫ్రాన్స్‌లు రెండూ పాత వైరాన్ని మరిచిపోయిన సంగతిని గుర్తుచేశారు. ‘నువ్వు గొప్ప యుద్ధ వీరుడివే కావొచ్చుగానీ... ఈ వైరంలో రాజనీతిజ్ఞత అవసరం. నొప్పి కలిగించినా కష్టమైన నిర్ణయం తీసుకోవటానికి సిద్ధపడాలి’ అని జెలెన్‌స్కీకి మేక్రాన్ హితబోధ చేశారు. అవన్నీ ఏమైనట్టు?

నాటో పుట్టిననాటి నుంచి దాన్ని కొనసాగించటానికి అమెరికా సాకులు వెదుకుతూనే వుంది. సోవియెట్ యూనియన్ పెను భూతమనీ, అది యూరప్‌ను కబళించబోతున్నదనీ ఊదరగొట్టి ఏర్పరిచిన నాటో ఉనికిని కాపాడేందుకు పడరాని పాట్లు పడుతోంది. 1989లో పనామా పాలకుడు నొరీగా, 1999లో సెర్బియా పాలకుడు స్లొబోదన్ మైలోసెవిక్, 2003లో ఇరాక్ అధినేత సద్దాం హుస్సేన్‌లు ప్రపంచాన్ని కబళించటానికి సిద్ధంగావున్న హిట్లర్‌లుగా చిత్రీకరించి ఆ దేశాలపై అమెరికా, నాటో దళాలు విరుచుకుపడి గుల్లచేశాయి. లక్షలాదిమంది అమాయక పౌరులు బలయ్యారు. ఇన్నాళ్లకు నాటోకు యూరప్‌లో పుతిన్ రూపంలో శత్రువు ‘తారసపడ్డాడు’. ఆ లంపటంలోకి ప్రపంచ దేశాలన్నిటినీ దించి లోకరక్షకుడిగా ఆవిర్భవించాలని అమెరికా తలపోస్తున్నట్టు కనబడుతోంది. రష్యా అణ్వాయుధాల ప్రయోగానికి దిగదని అమెరికా, నాటోలు నమ్ముతున్నట్టున్నాయి. ఇలాంటి తప్పుడు సూత్రీకరణలతో, అసంబద్ధ అంచనాలతో ప్రపంచాన్ని యుద్ధంలోకి నెడితే ఊహకందని పర్యవసానాలు ఏర్పడే ప్రమాదముంది. అగ్రరాజ్యాలు విజ్ఞతతో మెలిగి ఉక్రెయిన్, రష్యాల మధ్య సంధికి ప్రయత్నించాలి. ఆ మేరకు ప్రపంచ ప్రజానీకం ఒత్తిడి తేవాలి.

దేశాధినేతల స్నేహ రహస్యం ఏమిటి?

అభిప్రాయం



రంగనాయకమ్మ

ఇటీవలి కాలంలో రష్యా–భారత దేశాల మధ్య సరుకుల వర్తకం 65 బిలియన్ల డాలర్ల మేర జరిగిందని తేలింది. ‘వర్తకం’ అంటే తెలుసు కదా? ఈ దేశం, ఆ దేశానికీ; ఆ దేశం, ఈ దేశానికీ సరుకులు అమ్మడమూ, కొనడమూ! రెండు దేశాల మధ్యా వర్తకం అన్నప్పుడు, యంత్రాలూ, ముడి ఆయిలూ, మరీ ముఖ్యంగా మారణాయుధాలూ, ఎన్నో! ముఖ్యంగా రష్యా నించి యుద్ధ సామగ్రిని భారత ప్రభుత్వం, పెద్ద ఎత్తున కొన్నది. ఇంతకీ, ఈ దేశాధినేతలు చేసేది ఏమిటి? రెండు దేశాల పెట్టుబడిదారీ వర్గాల తరపున ప్రతినిధులుగా వ్యవహరించడమే! అంటే, సరుకుల్ని అమ్ముకోడానికీ, కొనుక్కోడానికీ, దేశాధినేతలు స్నేహాలు ప్రకటిస్తూ, ఒకరిని ఒకరు ఆకాశానికి ఎత్తేసుకుంటారు!

నిన్నగాక మొన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా వెళ్ళినప్పుడు, రష్యా ప్రెసిడెంటు పుతిన్ అన్న మాటలు ఇవి: ‘‘నా ప్రియాతి ప్రియమైన స్నేహితుణ్ణి కలిసినందుకు ఎంతో సంతోషంగా వుంది.’’

‘‘ఇచ్చానమ్మా వాయినం, పుచ్చుకున్నానమ్మా వాయినం’’ అన్నట్టు, పుతిన్ గురించి మోదీ కూడా ఏదో అనాలి కదా? ఆ మాటలు ఇవి: ‘‘నా ప్రియమిత్రుడు పుతిన్, రష్యా–భారత్‌ల మధ్య స్నేహాన్ని శిఖరాగ్రాలకు తీసికెళ్ళాడు’’అని!

ఇద్దరూ కలవగానే భారత ప్రధాని, తన ప్రత్యేకమైన అలవాటు ప్రకారం, ఆ ప్రియ మిత్రుణ్ణి ‘ఆత్మీయ ఆలింగనం’ చేసుకున్న దృశ్యాలు అందరూ చూసే వుంటారు. అంతేనా? పుతిన్, మోదీని, తన గుర్రపు శాలకి తీసికెళ్ళడం, అక్కడ వాళ్ళిద్దరూ చెరో గుర్రానికీ ఏదో తినిపిస్తూ, ముద్దు చెయ్యడం! ఇంతేనా! బుజ్జి కారులో మోదీని ఎక్కించుకుని, పుతినే ఆ బుజ్జిని స్వయంగా నడుపుతూ, తన పెద్ద ఎస్టేట్‌లో విలాసంగా తిప్పడం! ఆ ప్రియ స్నేహితులిద్దరికీ అంతా సరదాగా జరిగిపోయింది. ఈ రెండు దేశాల అగ్రనేతలూ ఎందుకు కలిశారంటారు?

ఇటీవలి కాలంలో రష్యా–భారత దేశాల మధ్య సరుకుల వర్తకం 65 బిలియన్ల డాలర్లది (సుమారు 542 లక్షల కోట్ల రూపాయలది) జరిగిందని తేలింది. ‘వర్తకం’ అంటే తెలుసు కదా? ఈ దేశం, ఆ దేశానికీ; ఆ దేశం, ఈ దేశానికీ సరుకులు అమ్మడమూ, కొనడమూ! ఈ భారీ వర్తకం వల్ల వచ్చిన మొత్తంలో, భారత దేశానికి వచ్చింది, దాదాపు 20 శాతమేనట! రష్యాకి 80 శాతం! రెండు దేశాల మధ్యా వర్తకం అన్నప్పుడు, యంత్రాలూ, ముడి ఆయిలూ, మరీ ముఖ్యంగా మారణాయుధాలూ, ఎన్నో! ముఖ్యంగా రష్యా నించి యుద్ధ సామగ్రిని భారత ప్రభుత్వం, పెద్ద ఎత్తున కొన్నది.

రెండు దేశాల అధినేతలు కలిసినప్పుడు, ఏమేమి మాట్లాడుకునేదీ, ఏ రకం ఒప్పందాలు చేసుకునేదీ, అన్నీ క్షుణ్ణంగా అంతకు ముందే, రెండు దేశాల మంత్రులూ, అధికారులూ, సిద్ధం చేసి వుంచుతారు. మోదీకి ఎర్ర తివాచీలూ, సైనిక వందనాలూ, విందు భోజనాలూ, వగైరాలు అయ్యాక, దేశాధినేతలు సరుకుల గురించి అధికారికంగా, లాంఛనంగా, కాసేపు ముచ్చటించుకుంటారు.

వర్తకంలో, ఎగుమతులుగా, దిగుమతులుగా, ఇటూ అటూ తిరిగిన ఆ సరుకుల తయారీదారులు, ఆ రెండు దేశాల కార్మికులే! కార్మికుల యజమానులు, ఆ దేశాల పెట్టుబడిదారులు! కొన్ని సరుకులు ప్రభుత్వ రంగ సంస్థలలో తయారైనవైతే, ప్రభుత్వాలు కూడా పెట్టుబడిదారులే!



‘ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ’ పురస్కారాన్ని ప్రదానం చేసిన అనంతరం, మోదీతో కరచాలనం చేస్తున్న పుతిన్

ఇంతకీ, ఈ దేశాధినేతలు చేసేది ఏమిటి? రెండు దేశాల పెట్టుబడిదారీ వర్గాల తరపున ప్రతినిధులుగా వ్యవహరించడమే! ‘కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక’ అనే 1848 నాటి రచనలో, మార్క్స్, ఎంగెల్సులు చెప్పినట్టు: ‘‘ఆధునిక రాజ్యంలో, ప్రభుత్వం (ఎగ్జిక్యూటివ్) అనేది, మొత్తం బూర్జువా వర్గపు సమష్టి వ్యవహారాలను చక్కబెట్టే కమిటీ మాత్రమే!’’ మైకెల్ పెరెంటీ అనే ఒక అమెరికన్ రాజకీయ శాస్త్రవేత్త అయితే, మార్క్స్, ఎంగెల్సులకన్నా ఒక అడుగు ముందుకు వేసి, అనేక ఆధారాలు చూపుతూ, ‘‘కొద్దిమందికే ప్రజాస్వామ్యం’’ అనే తన పుస్తకంలో, ‘ప్రెసిడెంట్’ అనే దేశాధినేత గురించి, మామూలు మాటల్లో చెప్పాలంటే, ‘సరుకులు అమ్మేవాడు’ (‘‘సేల్సుమాన్ ఆఫ్ ది సిస్టం’’) అంటాడు!

అంటే, సరుకుల్ని అమ్ముకోడానికీ, కొనుక్కోడానికీ, దేశాధినేతలు స్నేహాలు ప్రకటిస్తూ, ఒకరిని ఒకరు ఆకాశానికి ఎత్తేసుకుంటారు! తమ దేశాల్లో వున్న అత్యున్నత బిరుదుల్ని ఒకరికి ఒకరు ఇచ్చుకోవడం కూడా! అదే జరిగింది నిన్న! పాతకాలపు రష్యాలో, ‘సనాతన చర్చి’ని (‘ఆర్థొడాక్స్ చర్చ్’) స్థాపించిన మత బోధకుడైన ‘సెయింటు ఆండ్రూ’ పేరుతో వున్న ‘అత్యున్నత బిరుదు’గా ఆ దేశం కీర్తించే బిరుదుని మోదీకి, పుతిన్ ఇచ్చి సత్కరించాడు. ఈ బిరుదుని జారు చక్రవర్తి 1698లో ప్రవేశ పెట్టాడు. దీనిని 1917లో, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన విప్లవం జరిగాక, 1918లో రద్దు చేశారు. 1998లో, ‘ఎల్ట్‌సిన్’ అనే మాజీ కామ్రేడు తిరిగి దానిని ప్రవేశపెట్టాడు. ఈ కామ్రేడే 1991లో ‘సోవియట్ కమ్యూనిస్టు పార్టీ’ని రద్దు చేసినవాడు! అదే సంవత్సరం సోవియట్ యూనియన్‌ని కూడా రద్దు చేశాడు!

భారతదేశపు సనాతన మతాభిమానుల్లో అగ్రగణ్యుడైన వ్యక్తికి, ఆ దేశ సనాతన మత బోధకుడి పేరన వున్న బిరుదు దొరికింది! ఎంత సముచిత సత్కారం!

మోదీ రష్యా పర్యటనలో, కొసమెరుపు అనదగ్గ సంగతి ఒకటి వుంది. ఉక్రెయిన్ దేశ అధ్యక్షుడు జెలెనిస్కీ, మోదీ రష్యాలో పర్యటించడాన్ని ఇలా తప్పుపట్టాడు: ‘‘ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్యపు దేశాధినేత, మాస్కోలో, రక్త పిపాసిని (పుతిన్‌ని) కావలించుకోవడం నిరాశాజనకం’’ అని! ఈ జెలెనిస్కీని కూడా, ఈ మోదీయే, నిన్న పుతిన్‌ని కావిలించుకున్నట్టే, మొన్న, అంటే, ఆ మధ్య, ఇటలీలో గట్టిగా కావిలించుకున్నాడు! ఈ కావిలింతలు మోదీకి రాజకీయ వెన్నతో పెట్టిన విద్య!

ఉక్రెయిన్‌లో పిల్లల ఆసుపత్రి మీద రష్యా బాంబులు పడి, అనేక మంది చచ్చిపోయిన కొన్ని గంటల తర్వాత, మోదీ రష్యానేల మీద అడుగు పెట్టాడు. ఆ వార్త విమానం దిగుతూ విన్నాడేమో! తర్వాత, మొక్కుబడిగా పుతిన్‌తో అన్నమాటలు: ‘‘యుద్ధం పరిష్కారం కాదు. మానవుల ప్రాణాలు అమూల్యం, అమాయక పిల్లల మరణాలు చూస్తే, హృదయం ద్రవిస్తుంది!’’ అబ్బా! ఎంత సున్నిత హృదయం! ఈ మాటలు మోదీ అంటున్నప్పుడు, పుతిన్ బెల్లం కొట్టిన రాయిలాగా ముభావంగా వుండిపోయాడు! ‘ఈ రకం మొక్కుబడి మాటలు అన్ని దేశాల అధినేతలకీ మామూలేలే’ అన్నట్టు!

మరి, ఏ సమస్యకీ యుద్ధం పరిష్కారం కాదని, మోదీ భావించినప్పుడు, రష్యా నించీ, అమెరికా నించీ, ఫ్రాన్స్ నించీ, ఇజ్రాయిల్ నించీ కుప్పలు కుప్పలుగా, లక్షల కోట్ల ఖర్చుతో మారణాయుధాలు ఎందుకు కొన్నట్టు? పైగా, ఉక్రెయిన్ మీద రష్యా దాడిని ఖండిస్తూ, ఐక్య రాజ్య సమితిలో కొన్ని దేశాలు తీర్మానాలు చేసినప్పుడు, మోదీ ప్రభుత్వం ఓటింగులో పాల్గొననే లేదు! దీన్ని ఏమనాలి? ‘యుద్ధం వద్దు! అది పరిష్కారం కాదు!’ అనే నీతి వచనాలా! దురాక్రమణ యుద్ధం చేస్తున్న దేశపు ప్రభుత్వం ఇచ్చే ఆ దేశపు ‘అత్యున్నత’ బిరుదుని మోదీ, ఏ శాంతి నీతితో తీసుకున్నట్టు?

ఈ రెండు దేశాధినేతల స్నేహ రహస్యం తెలిసిందా?

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

అధోక బలహీనత



గెలవడం, ఓడటం జీవితంలో జరుగుతూనే ఉంటాయి. స్మృతి ఇరానీ, ఆ మాటకొస్తే ఏ నాయకురాలి పట్ల అయినా అగౌరవమైన, అసహ్యకరమైన వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని నేను ప్రతి ఒక్కరినీ అభ్యర్థిస్తున్నా. జనాన్ని చిన్నబుచ్చడం, అవమానించడం అనేవి మనిషి బలహీనతకు సంకేతం, బలానికి కాదు.

– రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు

మారాల్సిన వ్యూహం



జమ్ములో తరచుగా జరుగుతున్న తీవ్రవాద దాడులు ఆందోళనకరం. మన కౌంటర్–టెర్రరిజం వ్యూహాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని ఇది ఎత్తిచూపుతోంది. ఇవి గుడ్డిగా జరిగిన దాడులు కాదు. తీవ్రవాద రంగస్థలాన్ని కశ్మీర్ నుంచి జమ్ముకు మార్చడం పాకిస్తాన్ వ్యూహాత్మక నిర్ణయం. కశ్మీర్‌కు భిన్నంగా జమ్ము భౌగోళికంగా, జనాభాపరంగా ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. సంప్రదాయ వ్యూహాలు ఇక్కడ పనికిరావు.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

ప్రాచీన స్మృతి



న్యాయశాస్త్ర విద్యార్థులు మనుస్మృతిని ఎందుకు చదవకూడదు? చరిత్రలో తొట్టతొలిగా రూపొందించిన న్యాయసూత్రాల్లో అవీ ఒకటి, కాబట్టి కచ్చితంగా అధ్యయనం చేయాలి.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

కష్టమే!



పాకిస్తాన్ ప్రధానమంత్రిగా షెహబాజ్ షరీఫ్ ఈ సంవత్సరం చివరివరకు కొనసాగినా, దానికదే పెద్ద విజయం కిందే లెక్క.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

సొంత మనిషనా?



గౌతమ్ గంభీర్‌ను భారత క్రికెట్ జట్టుకు కోచ్‌గా నియమించాలన్న నిర్ణయంలో ఆయన బీజేపీ మనిషి అనేది ఎంత ప్రభావితం చేసింది, క్రికెట్‌లో ఆయన ‘సూక్ష్మబుద్ధి’ ఎంత అనే ప్రశ్నను లేవనెత్తాల్సి ఉంది. షా కోరుకున్నది ఆయన నెరవేర్చవచ్చు, కానీ ఆయన ఉత్తమ ఎంపికేనా?

– ప్రదీప్ మ్యాగజీన్, రచయిత


అలా జరిగివుంటే...



ఒకవేళ కృష్ణదేవరాయలు పోర్చుగీసు వారి నుంచి ముద్రణా పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకుని ఉండి, వేద సర్వస్వాలు, సిద్ధాంతాలను విస్తారంగా ప్రచురించడాన్ని ఊహించండి! పుస్తకాలు ఏ ఒక్క కులానికో చెందడం అనేది ఉండకపోవును. భారత్‌లో ఎంతగానో అవసరం ఉండిన ఆ సంస్కరణ కోసం ఈస్టిండియా కంపెనీ పాలన దాకా వేచివుండవలసి వచ్చింది. ప్రయత్నించివుంటే రాయలకు ప్రతిఘటన వచ్చేదా?

– జోసెఫ్ టి. నూనీ, థింకర్

కారణం ముఖ్యం



మనుస్మృతిని ఇప్పుడు ఎందుకు అధ్యయనం చేస్తున్నాం అనేది ముఖ్యం. ఒక చారిత్రక ఆసక్తితో అయితే సరే. జనాలు అరిస్టాటిల్‌ను కూడా అధ్యయనం చేస్తారు. కానీ ఆయన చాలా ఆలోచనలు ఇప్పటి కాలానికి సరిపోవు. అలాగే, మనుస్మృతిని అమలులోకి తేవడం కోసమే చదవడం అయితే సరికాదు.

– రాజీవ్ చోప్రా, ఫొటోగ్రాఫర్

నష్టపోయేది నిరుద్యోగులే!

ఉద్యోగ నియామకాలు వాయిదా వేయాలనేలా యువతను ప్రతిపక్షం రెచ్చగొట్టడం సరైన పనేనా? నీళ్లు, నిధులు, నియామకాలే ఎజెండాగా సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే... ఆ ఫలాల్ని పదేళ్ల పాటు కేవలం ఒక కుటుంబమే అనుభవించిది. అదే కుటుంబం అధికారం కోల్పోవడంతో ఫాం హౌస్ కేంద్రంగా ప్రస్తుత ప్రభుత్వాన్ని చిక్కుల్లోకి నెట్టే ప్రయత్నాలకు తెరలేపుతోంది. అందుకే యావత్ తెలంగాణ యువత, నిరుద్యోగులు చాలా జాగరూకతతో మెలగవలసిన ఆవశ్యకత ఉంది. పదేళ్ల పాటు నిరుద్యోగుల జీవితాలతో ఇష్టారీతిన ఆడుకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడో దూరంగా జరిగింది. ‘మా పరిస్థితి ఇదీ’ అని మొరపెట్టుకుందామన్నా కనీసం ఒక్క నాయకుడు కూడా అందుబాటులో లేకుండా పోయారు. దీంతో అధికార అహంకారంతో విర్రవీగినవారికి గర్వభంగాన్ని చేస్తూ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారు.

తమ ఉద్యోగాలు (పదవులు) ఊడాయన్న దుగ్ధతో ప్రజల్ని, ముఖ్యంగా నిరుద్యోగుల్ని తప్పుదారి పట్టించడానికి పన్నుతున్న పన్నాగమే పరీక్షల వాయిదా వేయాలన్న వాదన. ఉద్యోగ పరీక్షలకు సన్నద్ధం కావడానికి సమయం సరిపోదనే కారణంతో పరీక్షల వాయిదాను కోరడం సరికాదు. నిరుద్యోగులు ఎప్పుడు పరీక్షలు పెట్టినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి కదా. మనమే ఉద్యోగ నియామకాలు చేయాలంటాం. తీరా నియామకాలకు తెరలేపితే వాయిదా వేయాలంటాం. ఇది కరెక్టేనా? ఈ కోరిక ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలి అనే రాజకీయ దుగ్ధతో కూడుకున్న పన్నాగం. విజ్ఞులైన ప్రతీ ఒక్కరు ఆలోచించాల్సిన అంశం ఇది. ఇప్పటికే గత ఆరేడు నెలలుగా ఎన్నికల కోడ్ వల్ల కొత్త నోటిఫికేషన్లు ఇవ్వలేకపోయామని రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం బాధపడుతుంటే... వారి చిత్తశుద్ధిని ప్రశంసించాల్సింది పోయి, ‘బట్టకాల్చి మీదేసే’ చందంగా ప్రతిపక్ష నేతలు వ్యవహరిస్తున్న శైలితో యావత్ సమాజం ఆశ్చర్యపోతోంది.

సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు బీఆర్‌ఎస్ పార్టీ బలహీనమైన ప్రతీసారీ, వారి ఉద్యోగాలు (పదవులు) పోగొట్టుకున్న ప్రతీసారీ నిరుద్యోగులను తెర మీదికి తేవడం వారికి ‘కుత్రతో పెట్టిన విద్య’. పదేళ్ల పాటు అనుభవించిన అధికారం దూరమయ్యే సరికి తమ స్వార్థం కోసం రాష్ట్రానికి వెన్నెముక లాంటి యువతను నిర్వీర్యం చేసి అయినా సరే ఆ చలిమంటలో వాళ్లు చలి కాచుకుందాం అనుకుంటున్నారు. మన బంగారు భవిష్యత్తును కాపాడుకోవడానికి ఈ కుత్రలను చైతన్యవంతమైన తెలంగాణ బిడ్డలుగా మనందరం తిప్పికొట్టాలి.

ఇప్పటికే జాబ్ క్యాలెండర్ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తును నిర్వహిస్తున్న సంకేతాలు మనకు స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. నిరుద్యోగులకు ఇన్ని రోజులూ మూసుకుపోయిన అవకాశాల తలుపులు తెరుచుకోబోతున్నాయి. ఇప్పటికే ఏళ్ల తరబడి ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు ఉత్సాహంగా ఈ ప్రిపరేషన్‌ను కొనసాగించి సంపూర్ణ నమ్మకంతో పరీక్షలు రాయడానికి సిద్ధం కావాలి.

– బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి
టీశాట్ నెట్‌వర్క్ అధ్యక్షుడు

అనాథల డాక్టర్

భారతదేశం నుంచి వైద్యశాస్త్ర పట్టా పొందిన మూడవ మహిళ గురుబాయి కర్మార్కర్. 1862 అక్టోబర్ 10న జన్మించారు. సొంతూరు బెళ్గాం. ఆమె భర్త రెవరెండ్ సుమంత్ రావు కర్మార్కర్ ఒక థియలాజికల్ సెమినార్ కోసం అమెరికా వెళ్ళినప్పుడు గురుబాయి కూడా వెళ్లి, పెన్సిల్వేనియా ఉమెన్స్ మెడికల్ కళాశాలలో ప్రవేశం పొందారు. 1892లో ఎమ్‌డీ పట్టా పొంది భర్తతో పాటు భారతదేశానికి మరుసటి ఏడాది తిరిగి వచ్చారు. బొంబాయి ప్రెసిడెన్సీలోనే తొలి మిషనరీ సంస్థ అయిన అమెరికన్ మరాఠీ మిషన్‌లో గుడ్విల్ డిస్పెన్సరీలో చేరి సుమారు నాలుగు దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించారు.

బొంబాయి ప్రాంతంలో కులం, మతం, ధనిక, పేద అనే తేడాలు చూడకుండా గురుబాయి ఆరోగ్యాన్ని పెంచారు, పంచారు. మరీ ముఖ్యంగా మహమ్మదీయులలో చాలా కఠినంగా నియమ నిబంధనలు పాటించే బోహ్రా మహిళలు ఎంతోమంది ఈమె దగ్గర వైద్యం పొందారు. అలాగే తీవ్రమైన కరవు కాలంలో అనారోగ్యం పాలైన పిల్లలకూ, 1916లో ప్లేగు బారిన పడిన చిన్నారులకూ గురుబాయి అలుపెరగని సేవ చేశారు. ఒకవైపు వైద్య సేవలు అందిస్తూనే మరో వైపు మిషనరీ సంస్థ అయిన పెరల్ ఆర్ఫనేజ్, వారి వితంతు శరణాలయం వంటివాటికి కూడా సేవలు అందించేవారు. పేదలకు సేవలందిస్తూనే, క్రైస్తవం పట్ల సానుభూతిపరురాలుగా అభాగ్య మహిళలకు తోడ్పాటుగా ఉండేవారు. బాల్య వివాహాలు, బాలికా వితంతువులు వంటి సమస్యల పట్ల లోతుగా స్పందించడమే కాకుండా ఇతర దేశాల సదస్సుల్లో పాల్గొని భారతీయ మహిళల సామాజిక సమస్యల గురించి ప్రపంచానికి తెలియజేశారు. 1919లో న్యూయార్క్‌లో ఆరు వారాలపాటు 32 దేశాల ప్రతినిధులతో జరిగిన తొలి అంతర్జాతీయ మహిళా వైద్యుల సమావేశంలో గురుబాయి భారతదేశం తరపున పాల్గొనడం విశేషం. అప్పట్లో తీవ్ర సమస్యగా మారిన కుష్ఠు వ్యాధి నిర్మూలనకు చాలా కృషి చేసిన గురుబాయి 1917 అక్టోబర్‌లో కొలంబస్ ఓహియోలో జరిగిన క్రైస్తవ మిషనరీ సమావేశానికి వెళ్ళినప్పుడు డా॥ అర్లే ఇస్సాబెల్ మున్సాన్ హేర్‌ను ప్రేరేపించి తనతో పాటు బొంబాయి తీసుకొచ్చి, షోలాపూర్‌లో కుష్ఠు వ్యాధి నిర్మూలనకు పెద్ద ఎత్తున నడుం బిగించేలా చేశారు.

వైజ్ఞానిక వేగుచుక్కలు



గురుబాయి కర్మార్కర్

బాల బాలికలకు విద్యావసతి కల్పించిన గురుబాయి చాలా మంది అనాథలను పెంచుకున్నారు. అలాంటి పెంపుడు కుమారుడైన డా॥ విశ్వాస్ కర్మార్కర్ ఫిలడెల్ఫియాలో వైద్య సేవలు అందిస్తూ 1918లో ఫ్లూ బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఆమె పదవీ విరమణ తర్వాత సొంత ఊరు బెల్గాం వెళ్లే ముందు అమెరికన్ మరాఠీ మిషన్‌కు సుమారు 60 వేల రూపాయలు విరాళంగా ఇచ్చి లింకన్ హౌస్‌లో డా॥ గురుబాయి కర్మార్కర్ విభాగాన్ని ప్రారంభించారు. చివరికి 1932లో కనుమూశారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత అధికారి । 9440732392

విశ్వ విలాసం

ఈ విశ్వంలో ఏ ప్రాణినైనా కొంచెం శ్రద్ధగా పరిశీలిస్తే, ఆస్తికుడి బుద్ధికి అందులో ఈశ్వర విలాసమే స్ఫురిస్తుంది. ఎన్నెన్ని చర–అచర ప్రాణ జాతులు! ప్రతి జాతికీ, ప్రతి ప్రాణికీ దానికే ప్రత్యేకమయిన ఎన్నెన్ని విశేష లక్షణాలు!! అన్ని ప్రాణులకూ ఆత్మరక్షణకూ, ఆహార సంపాదనకూ, సంతానోత్పత్తికీ వాటి వాటి విశేష శక్తులూ సామర్థ్యాలూ కల్పించి చోద్యం చూసే సృష్టికర్త ఊహలూ, ప్రణాళికలూ మనుష్యమాత్రుడి బుద్ధికి అందవు. చిన్న దోమను చూడండి. పరిశోధిస్తే దాని వెనకాల ఎంత కథ! దోమలన్నీ మనుషుల రక్తాన్ని పీల్చవు. నిజానికి దోమలు చాలా వరకూ శాకాహారులు. అవి కూడా తుమ్మెదలలా పూదేనెనూ, ఆకుల రసాలనూ పీల్చి బ్రతుకుతాయట. మగదోమలు ఎప్పుడూ శాకాహారులే. ఆడదోమలు మాత్రం గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసుకొనేందుకు అవసరమయిన బలవర్ధక ఆహారం – టానిక్ – గా అప్పుడప్పుడూ రక్తాన్ని పుచ్చుకొంటాయని గూగుల్ తల్లి సమాచారం.

జ్యోతిర్మయం

అడవిలో అయితే పాములూ, పిట్టల రక్తాన్ని ఈ దోమలు పీలుస్తాయి. దళసరి చర్మం జంతువుల జోలికి పోవు. అందుకే సంజె వేళల్లో మనుషుల మీదికి దాడి చేస్తాయి. దోమ బరువెంత! దాని బలమెంత! కానీ మహా బలులైన పహిల్వానులు కూడా దాని చురుకుతనం ముందు దాసోహమై, రక్త బిందువుల కప్పం చెల్లించాల్సిందే తప్ప ధర్మ యుద్ధంలో దోమను జయించలేరు. దాని ఒడుపు ప్రకృతి సిద్ధం!

ప్రాణికి మరో ప్రాణిని ఆహారంగా విధించిన ఈ సృష్టి క్రీడలో, అన్ని ప్రాణులకూ అనుక్షణమూ శతకోటి ఉపాయాలు పొంచి ఉన్నట్టే, ఆత్మరక్షణకు అనంతకోటి అనూహ్యమైన ఉపాయాలు కూడా అందుబాటులో ఉండడం, విశ్వ విలాసం కాక మరేమిటి? సర్పం బలం సర్పానికి ప్రసాదించిన ప్రకృతి... చలి చీమల బలాన్ని చలి చీమలకూ ప్రసాదించింది!

మిడిసి పడుతున్న మనిషి జాతికి సంవత్సరంన్నర పాటు నోళ్ళు మూసి, కాళ్లు– చేతులు కట్టి, చెంపలు వేయించిన – కంటికి కనరాని చిన్ని కోవిడ్ క్రిమికి ఆ ప్రతాపమంతా ప్రకృతి కట్టబెట్టిన ప్రతిభ కాదూ?

– ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం శ్రీక్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** శు.సప్తమి ప.12.19 వరకు, తదుపరి అష్టమి; **నక్షత్రం:** హస్త ప.5.31 వరకు, తదుపరి చిత్త; **వర్జ్యం:** రా.2.19 నుండి 4.05 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.5.35 నుండి 7.19 వరకు; **అమృత ఘడియలు:** ఉ.10.52 నుండి 12.36 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు; **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు; **సూర్యోదయం:** 5.36; **సూర్యాస్తమయం:** 6.35

క్లుప్తంగా...

గోపాల్ పరిస్థితిపై 'ఆరోగ్యశ్రీ' వాకబు



గోపాల్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆరోగ్యశ్రీ ప్రతినిధి

సాక్షి ఎఫెక్ట్

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన గోపాల్ కండరాల క్షీణత వ్యాధితో రెండేళ్లుగా మంచానికే పరిమితమై నరకయాతన అనుభవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గోపాల్ దీనస్థితిపై శుక్రవారం 'సాక్షి'మెయిన్‌లో 'ఆదుకోండి లేదా డెత్ ఇంజెక్షన్‌కు అనుమతినివ్వండి'శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆరోగ్యశ్రీ సంస్థ స్పందించింది. సంస్థ సీఈఓ ఆదేశాల మేరకు గోపాల్ ఇంటికి ఆరోగ్యశ్రీ ప్రతినిధులు గోవింద్‌రెడ్డి, నరేశ్ వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆరోగ్య సర్టిఫికెట్‌లను పరిశీలించి నివేదికను రాష్ట్ర సీఈఓకు పంపించారు. కండరాల క్షీణత వ్యాధికి ఆరోగ్యశ్రీ సేవలను అందించే అవకాశం ఉందా? లేదా? అనే అంశాలను తెలుసుకున్నారు.

గురుకులం విద్యార్థులను కరిచిన ఎలుకలు

నర్సాపూర్: మెదక్ జిల్లా రామాయంపేటలో విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటన మరవక ముందే.. నర్సాపూర్‌లోని గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులను ఎలుకలు కరవడం కలకలం రేపింది. నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామ రాజు గిరిజన బాలుర గురుకులంలో 8వ తరగతి చదవుతున్న విద్యార్థులు గురువారం రాత్రి తమ గదుల్లో నిద్రిస్తుండగా ముగ్గురిని ఎలుకలు కరిచాయి. ఈ విషయం బయటకు రాకుండా గురుకుల పాఠశాల, కాలేజీ ప్రిన్సిపాల్ తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఎలుకలు కరిచిన విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని విద్యార్థులను, సిబ్బందిని ఆయన హెచ్చరించినట్లు తెలిసింది. కాగా, శుక్రవారం ఉదయం విద్యార్థులకు ఏఎన్‌ఎంతో చికిత్స చేయించారు. ఈ విషయమై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వివరణ కోరగా అలాంటిదేమి లేదని చెప్పారు.

6 బోర్లు వేసి అప్పుల పాలు

- మనస్తాపంతో యువరైతు ఆత్మహత్య



రమేశ్

చందంపేట: నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో సాగు కోసం అప్పుల పాలైన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన సపావత్ రమేశ్(30) తనకున్న ఎకరం భూమితో పాటు ఐదెకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. వర్షాలు లేనందున పత్తి మొక్కలు ఎండిపోతాయన్న ఉద్దేశంతో ఈ మధ్యనే ఆరు బోర్లు వేయించాడు. వాటిలో నీళ్లు పడకపోవడంతో తెచ్చిన అప్పు తీర్చలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురై తన పొలంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వాళ్లు అతన్ని హైదరాబాద్ ఒవైసీ ఆస్పత్రిలో చేర్పించగా...చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



శంకరయ్య

కట్టంగూర్: అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు ఏలే శంకరయ్య(47) మూడేళ్ల క్రితం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఇల్లు నిర్మించుకుని మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మగ్గాలు నేసేందుకు ముడి సరుకులు, రంగులు కొనేందుకు, తన పెద్ద కుమార్తె వివాహం కోసం సుమారు రూ.7 లక్షలు అప్పు చేశాడు. నేసిన బట్టలు ఎగుమతి లేక 4 నెలలుగా ఇంట్లోనే ఉండిపోయాయి. అప్పులు పెరిగిపోవటంతో పాటు వ్యాపారం కలిసిరాక మనస్తాపం చెందిన శంకరయ్య శుక్రవారం గ్రామశివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి వేధింపులతో బాలిక ఆత్మహత్య

సిద్దిపేటకమాన్: ప్రేమ, పెళ్లి పేరుతో ఓ యువకుడి వేధింపులు తాళలేక ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సిద్దిపేట పట్టణంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కాళ్లకుంట కాలనీలో ఉంటున్న చిగురు కావ్య (17) ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. కాగా, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి కి చెందిన తేజస్ (20) అనే యువకుడు ఏడాది నుంచి రోజు విద్యార్థినిని ప్రేమ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ పెళ్లి చేసుకోవాలని వెంటపడుతుండేవాడు. దీంతో మానసిక వేదనకు గురైన కావ్య శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తేజస్‌పైకేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మేడిగడ్డకు 'పరీక్ష' కాలం!

- బరాజ్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన జియోఫిజికల్, జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్
- వరదలతోనే నిలిచిపోయినట్టు ఓ అధికారి స్పష్టీకరణ
- ఇతర కారణాలతోనే ఆగాయని మరో అధికారి వెల్లడి
- వచ్చేవారం ఢిల్లీకి వెళ్లి ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీతో చర్చించనున్న అధికారులు
- రెండువారాల్లో పూర్తికానున్న అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్ కుంగిన ఘటనకు కారణమైన సాంకేతిక లోపాలను గుర్తించడానికి నిర్వహిస్తున్న జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు(ఇన్వెస్టిగేషన్లు) అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మేడిగడ్డ బరాజ్‌కు ఎగువ నుంచి భారీ వరద వస్తున్న నేపథ్యంలో పరీక్షలు నిలిపివేయాల్సి వచ్చిందని ఓ అధికారి 'సాక్షి'కి తెలపగా, ఇతర సమస్యలు ఉత్పన్నం కావడంతోనే పరీక్షలను ఆపామని మరో అధికారి వివరించారు. బరాజ్‌కు పరీక్షల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించడానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల బృందం వచ్చేవారం ఢిల్లీకి వెళ్లి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్‌ఏ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీతో సమావేశం కానుంది.

శాశ్వత మరమ్మతులకు ఇన్వెస్టిగేషన్లే కీలకం

గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బరాజ్‌లోని 7వ బ్లాక్ కుంగిపోయిన విషయం తెలిసిందే. బ్లాకులోని 19, 20, 21వ పియర్లతోపాటుగా 20వ పియర్‌పైన ఉన్న శ్లాబు, పారాపెట్ వాల్స్, రోడ్డు బ్రిడ్జికి తీవ్ర నష్టం వాటిల్లింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు పడి నీరు లీకైన విషయం తెలిసిందే. ఎన్డీఎస్‌ఏ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ మూడు బరాజ్‌లను పరిశీలించి గతంలో మధ్యంతర నివేదిక సమర్పించింది. మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడానికి దారితీసిన సాంకేతిక లోపాలను గుర్తించడానికి ఎలక్ట్రో రెసిస్టివిటీ టోమోగ్రఫీ(ఈఆర్టీ), గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్(జీపీఆర్) వంటి జియోఫిజికల్, జియోలాజికల్ పరీక్షలు నిర్వహించాలని సిఫారసు చేసింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పటిష్టతను పరీక్షించడానికి వాటికి సైతం ఈ పరీక్షలు జరపాలని కోరింది. వాటి ఆధారంగానే శాశ్వత మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నీటిపారుదల శాఖ పరీక్షలు పూర్తి చేసి నివేదిక సమర్పించిన తర్వాతే మూడు బరాజ్‌ల పునరుద్ధరణకు నిర్వహించాల్సిన శాశ్వత మరమ్మతులపై నిపుణుల కమిటీ తుది నివేదిక సమర్పించనుంది. మేడిగడ్డ బరాజ్‌కు పరీక్షలు మధ్యంతరంగా ఆగిపోవడంతో కమిటీ తుది నివేదిక మరింత ఆలస్యమయ్యే అవకాశముంది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు మాత్రం పరీక్షలు కొనసాగుతున్నాయని, మరో రెండు వారాల్లో వీటిని పూర్తి చేసే అవకాశముందని అధికారవర్గాలు తెలిపాయి. మేడిగడ్డ బరాజ్‌కు ఇప్పటి వరకు జరిగిన పరీక్షల్లో కొన్ని చివరి దశలో ఉండగా, మరి కొన్ని వేర్వేరు దశల్లో ఉన్నాయని, వర్షాలు పూర్తిగా నిలిచిన తర్వాతే వాటిని మళ్లీ పునరుద్ధరించడానికి ఆస్కారముంటుందని స్పష్టం చేస్తున్నాయి.

అత్యవసర మరమ్మతులు దాదాపుగా పూర్తిచేశాం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు మరింత నష్టం జరగకుండా అత్యవసర మరమ్మతులు దాదాపుగా పూర్తి చేశామని కేంద్ర ప్రభుత్వ సంస్థల నిపుణుల బృందానికి నీటిపారుదలశాఖ తెలియజేసింది. జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు ఇంకా పూర్తికావాల్సి ఉందని పేర్కొంది. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) బి.నాగేందర్‌రావు, రామగుండం సీఈ కె.సుధాకర్‌రెడ్డి శుక్రవారం జలసౌధలో ఎన్డీఎస్‌ఏతో పాటు సెంట్రల్ వాటర్ అండర్ పవర్ రిసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్ఎస్), సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రిసెర్చ్ స్టేషన్(సీఎస్ఎంఆర్ఎస్) ప్రతినిధులు అమితాబ్ మీనా, మనీష్గుప్తా, డాక్టర్ మందిరతో సమావేశమై మధ్యంతర నివేదిక అమలులో పురోగతిని వివరించారు. పరీక్షల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు.ఈ బృందం త్వరలో ఢిల్లీలో ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీతో సమావేశమై వారికి తెలియజేయనుంది. దీని ఆధారంగా తదుపరి చేపట్టాల్సిన చర్యలను ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ సిఫారసు చేస్తుంది.

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

పెద్దేముల్: మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో ఈ ఘటన జరిగింది. కందనెల్లితండా ప్రాథమిక పాఠశాలలో 33 మంది విద్యార్థులు ఉండగా శుక్రవారం 31 మంది వచ్చారు. మధ్యాహ్న భోజనంలో నిర్వాహకులు వీరికి పులిహోర వడ్డించారు. అన్నం తింటుండగానే ఓ అంగన్‌వాడీ చిన్నారి వాంతులు చేసుకుంది. ఆ తర్వాత స్కూల్ విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరు వాంతులు చేసుకున్నారు. దీంతో 18 మందిని తాండూరులోని ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. నిలకడగా ఉన్న 13 మందిని సాయంత్రం ఇళ్లకు పంపించారు. ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రియురాలిని వేరు చేశారన్న అక్కసుతోనే..

- ఆమె తల్లిదండ్రులను హతమార్చిన ప్రియుడు
- నెల రోజుల క్రితమే కత్తి కొనుగోలు
- పదహార్ చింతల్‌తండా ఘటనపై డీసీపీ రవీందర్



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్

నర్సంపేట రూరల్: ప్రేమించి పెళ్లి చేసుకున్న ప్రియురాలిని తన నుంచి వేరు చేసి, దక్కకుండా చేస్తున్నారనే కోపంతో ప్రియుడు ఆమె తల్లిదండ్రులను హతమార్చి, ప్రియురాలు, అతని తమ్ముడిపై హత్యాయత్నం చేసినట్లు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహార్‌చింతల్‌తండాలో బుధవారం అర్ధరాత్రి జరిగిన జంట హత్యల కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలను వెల్లడించారు. వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ శ్రీను (44) సుగుణ (38)ల కుమార్తె దీపికకు ఐదేళ్ల క్రితం స్కూల్‌కు వెళ్లే సమయంలోనే మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెం గ్రామానికి చెందిన మేకల నాగరాజు అలియాస్ బన్నితో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. అక్టోబర్ 2023 చివరిలో వీరిద్దరూ హైదరాబాద్‌కు వెళ్లి నవంబర్ నెలలో జగద్గిరిగుట్ట వద్ద ప్రేమ వివాహం చేసుకున్నారు. దీపిక తల్లిదండ్రులు హనుమకొండలోని సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నారు. వారిద్దరినీ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ సైతం నిర్వహించారు. అప్పుడు దీపిక.. నాగరాజుతోనే హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఈలోగా నాగరాజు, దీపికల మధ్య గొడవలు జరగడంతో నాగరాజుతో ఉండడలేనని దీపిక తల్లిదండ్రులకు చెప్పుకోగా, తల్లి సుగుణ హైదరాబాద్ వచ్చి కూతురును వెంటతీసుకుని తండాకు వచ్చింది.

అమెజాన్‌లో కత్తి ఆర్డర్ పెట్టి..

దీపిక తన వద్దకు రాకపోగా, ఆమె తల్లిదండ్రులు తనను నుంచి వేరు చేశారనే అక్కసుతో వారిపై నాగరాజు కక్ష పెంచుకున్నాడు. వారిని ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో నెల రోజుల క్రితం నెక్కొండ గ్రామంలో పొడవాటి కత్తిని కొనుగోలు చేశాడు. 15 రోజుల క్రితం కూడా మరో కత్తిని 'అమెజాన్'లో ఆర్డర్ పెట్టి రెక్కీ నిర్వహిస్తూ వచ్చాడు. ఈ నెల 11న రాత్రి ఒంటిగంట సమయంలో ఆరుబయట పడుకుని ఉన్న దీపికపై దాడికి దిగగా ఆమె కేకలు వేయడంతో తల్లి సుగుణ అడ్డుపడింది. వెంటనే సుగుణను కత్తితో హతమార్చాడు. అనంతరం తండ్రి శ్రీను అడ్డుకోవడంతో అతన్ని కూడా చంపాడు. దీపికను, తమ్ముడు మదన్‌లాల్‌ను కత్తితో చంపేందుకు వెళ్లగా గాయాలతో వారు పరారై తప్పించుకున్నారు. ఈలోగా గ్రామస్తులు రావడంతో నాగరాజు పారిపోయాడు. అదే రోజు అర్ధరాత్రి నెక్కొండ సీఐ, చెన్నారావుపేట ఎస్సై నిందితుడిని పట్టుకుని విచారించగా తాను ప్రేమించిన అమ్మాయిని తనకు కాకుండా చేసిన కుటుంబాన్ని నాశనం చేయాలనే ఉద్దేశంతో ఈ దారుణానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నాగరాజుపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ రవీందర్ తెలిపారు. కాగా, నిందితుడు పోలీసులకు దొరికేముందు చేతికి గాటు పెట్టుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు.

8 గంటలు స్తంభంపైనే మృతదేహం

- విద్యుత్ ప్రమాదంలో ప్రైవేట్ హెల్పర్ దుర్మరణం
- స్థానికుల ఆందోళన.. రెండుసార్లు ఏఈపై దాడి..



స్తంభంపై మల్లేశం మృతదేహం

మల్లేశం (ఫైల్)

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వనపర్తికి చెందిన ప్రైవేట్ హెల్పర్ కుక్కల మల్లేశం (43) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో 8 గంటలపాటు స్తంభంపైనే మృతదేహం ఉంచి గ్రామస్తులంతా ఆందోళన చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్లేశం శుక్రవారం ఉదయం ఎల్‌సీ తీసుకొని స్తంభంపై గ్రామానికి చెందిన కుక్కల యాదగిరి ఇంటి సర్వీసు వైరు సరిచేస్తున్నాడు. అదే స్తంభానికి మరో ఫీడర్ వైరు ఉండడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా జరిగి మల్లేశం స్తంభంపైనే మృత్యువాత పడ్డాడు. ఒకే స్తంభం నుంచి నేలపోగుల, వనపర్తి ఫీడర్ల వైర్లు ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగిందని, మూడు నెలల క్రితం కట్టర్ మహేందర్‌రెడ్డి ఇదే విధంగా మృతిచెందాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు సమస్యను విన్నవించినా ఫలితం లేదని, అధికారుల నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణాలు పోతున్నాయని అక్కడకు వచ్చిన ట్రాన్స్‌కో ఏఈ శంకరయ్యపై రెండుసార్లు దాడికి పాల్పడగా పోలీసులు అడ్డుకున్నారు. అక్కడే ఉన్న ఓ ప్రైవేట్ వాహనాన్ని ట్రాన్స్‌కో అధికారులదిగా భావించి అద్దాలు పగులగొట్టారు. కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ శ్రీనివాస్‌యాదవ్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కుటుంబానికి న్యాయం చేస్తామని, ఎస్ఈ వేణుమాధవ్‌తో ఫోన్‌లో మాట్లాడించి ఆందోళన విరమింపజేశారు. అనంతరం మృతదేహాన్ని స్తంభంపై నుంచి సాయంత్రం 6 గంటలకు దింపి పోస్టుమార్టానికి తరలించారు. మృతుడికి భార్య భాగ్య, బీటెక్ చదువుతున్న కూతురు శ్రుతి, ఇంటర్ చదువుతున్న కుమారుడు చరణ్ ఉన్నాడు.

బ్రేక్‌ఫాస్ట్‌లో బల్లి ఘటనపై కేంద్రం సీరియస్

- నివేదిక కోరిన కేంద్ర ప్రభుత్వం
- ఇద్దరు వంట సిబ్బంది విధుల నుంచి తొలగింపు
- హాస్టల్ స్పెషల్ ఆఫీసర్, కేర్‌టేకర్లకు షోకాజ్ నోటీసులు
- రామాయంపేట మోడల్ స్కూల్‌లో జరిగిన ఘటనపై చర్యలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామాయంపేట మోడల్ స్కూల్ విద్యార్థినులు (ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మెదక్ జిల్లా రామాయంపేట మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఇచ్చే బ్రేక్‌ఫాస్ట్ (అల్పాహారం)లో బల్లి పడిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కేంద్ర విద్యాశాఖ నుంచి రాష్ట్రానికి ఆదేశాలందాయి. ఈ మేరకు స్టేట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి నివేదిక వెళ్లింది. సుమారు 600 మంది విద్యార్థులు వసతిపొందుతూ చదువుకుంటున్న ఈ మోడల్ స్కూల్‌లో ఈనెల 9న ఉదయం విద్యార్థులకు ఇచ్చిన అల్పాహారంలో బల్లి పడిన విషయం విదితమే. ఓ విద్యార్థిని అల్పాహారం తింటున్న ప్లేట్‌లో బల్లి కనిపించింది. అనంతరం 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్‌తో పాటు, ఆర్డీఓ రమాదేవి ఇతర అధికారులు హాస్టల్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను చక్కదిద్దారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కూడా హాస్టల్‌ను సందర్శించారు. ఈ ఘటనలో ఎవరికీ ఫుడ్‌పాయిజన్ కాలేదని, కేవలం వాంతులతో అస్వస్థతకు గురయ్యారని అధికారులు పేర్కొంటున్నారు.

మూతకు అతుక్కుని..: సిబ్బంది వంట చేస్తున్నప్పుడు మూత తీసి కింద పెట్టినప్పుడు ఆ మూతకు బల్లి అతుక్కుని ఉండిపోయిందని.. ఇది గమనించని వంట సిబ్బంది ఆ మూతను గిన్నెపై పెట్టడంతో బల్లి అల్పాహారంలో పడిపోయి అందులో కలిసిపోయిందని అధికారుల విచారణలో తేలింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ నుంచి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు అధికారులు నివేదిక ఇచ్చారు. అక్కడి నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఈ నివేదికను పంపారు.

ఇద్దరు సిబ్బంది తొలగింపు: ఈ ఘటనలో ఇద్దరు వంట చేసే సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ హాస్టల్ స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న అనురాధ, కేర్‌టేకర్ నవితలకు జిల్లా విద్యాశాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారి నుంచి వివరణ తీసుకుంది.

'నిజాం షుగర్స్'పై ముందుకా వెనక్కా?

▶ మొదటి పేజీ తరువాయి

రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని కమిటీకి గడువు విధించింది. బోధన్ చక్కెర కర్మాగారాన్ని సందర్శించిన ఈ కమిటీ చెరకు రైతులు, రైతుసంఘాల నేతలు, సంబంధిత వర్గాల నుంచి సమాచారం సేకరించి నివేదిక రూపొందించినట్టు తెలిసింది. అయితే ఎన్‌డీఎస్‌ఎల్‌లో 51 శాతం వాటా కలిగిన ప్రైవేట్ భాగస్వామ్య సంస్థ ఫ్యాక్టరీ తిరిగి తెరిచినా, తాము యూనిట్లు నడపలేమని చేతులు ఎత్తేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో యూనిట్లు తిరిగి తెరుచుకునే పక్షంలో ఏ తరహాలో నడపాలనే కోణంలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రైతులను భాగస్వాములను చేస్తూ సహకార పద్ధతిలో నడపడమా మరో సంస్థకు అప్పగించడమా అనే కోణంలోనూ నివేదికలో పొందుపరిచనట్టు సమాచారం.

రుణ విముక్తికి రూ. 190 కోట్లు

గతంలో ఎన్‌డీఎస్‌ఎల్‌ను దివాలా కంపెనీగా ప్రకటిస్తూ లిక్విడేట్ చేయాలని నేషనల్ కంపెనీ ఆఫ్ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలను పక్కన పెట్టింది. ఈ నేపథ్యంలో బ్యాంకర్ల వద్ద తీసుకున్న రుణాలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లించడం ద్వారా లిక్విడేషన్ గండం నుంచి బయటపడే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఓటీఎస్ కింద బ్యాంకులకు రూ.190 కోట్లకుగాను ఇప్పటివరకు మూడు విడతల్లో రూ.160 కోట్ల మేర చెల్లించారు. ఈ సెప్టెంబర్‌లోగా మరో రూ.30 కోట్లు చెల్లిస్తే ఎన్‌డీఎస్‌ఎల్‌కు బ్యాంకర్ల నుంచి రుణ విముక్తి లభిస్తుంది.

కన్సల్టెన్సీ ఎంపికకు కసరత్తు

ఎన్‌డీఎస్‌ఎల్ పరిధిలో బోధన్, మంభోజిపల్లి, మెట్‌పల్లి యూనిట్లు ఉండగా, 2015 నుంచి వీటిలో ఉత్పత్తి నిలిచిపోయింది. వీటిని తిరిగి తెరిచేందుకు అవసరమైన సలహాలు, సూచనలకు అనుభవం కలిగిన 'కన్సల్టెంట్'సేవలను వినియోగించుకోవాలని చక్కెర విభాగం నిర్ణయించింది. పునరుద్ధరణకు రాష్ట్ర కేబినెట్ పచ్చజెండా ఊపితే కన్సల్టెంట్‌ను ఎంపిక చేసే ప్రక్రియ ప్రారంభిస్తామని అధికారులు వెల్లడించారు. రోజుకు బోధన్ యూనిట్‌లో 3500 టన్నులు, మెట్‌పల్లి, మంభోజిపల్లిలో 2500 టన్నుల చెరకు క్రషింగ్ సామర్థ్యం కలిగి ఉన్నాయి. వీటిని తిరిగి తెరిచే పక్షంలో క్రషింగ్‌కు అవసరమైన చెరకు లభ్యత ఎంత ఉందనే కోణంలో చక్కెర విభాగం అధికారులు లెక్కలు సేకరిస్తున్నారు. 2015లో యూనిట్లు మూతపడిన వాటిలో యంత్రాల స్థితిగతులపైనా అధ్యయనం జరుగుతోంది. మరోవైపు 3యూనిట్లు ఒకేమారు కాకుండా తొలుత మెట్‌పల్లి యూనిట్‌ను ప్రారంభించి, అక్కడ ఎదురయ్యే పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాత మిగతా రెండు యూనిట్లు ప్రారంభించాలనే ప్రతిపాదన కూడా కమిటీ నివేదికలో ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో చక్కెర ఉత్పత్తి కంటే ఇథనాల్ బ్లెండింగ్‌కు ఎన్‌డీఎస్‌ఎల్ యూనిట్లను ఉపయోగించుకుంటే బాగుంటుందనే కోణంలోనూ కమిటీ సూచినట్టు తెలిసింది.



జగన్నాథ రహస్యం!

40 ఏళ్ల తర్వాత రేపు తెరుచుకోనున్న రత్నభండార్

లక్షలాది భక్తజనం పాల్గొనే విశ్వవిఖ్యాత రథయాత్రతో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన పూరీ జగన్నాథుని ఆలయం మరోమారు పతాక శీర్షికలకెక్కింది. రాజుల నుంచి మొదలుకుని సామాన్యుల దాకా శతాబ్దాలుగా జగన్నాథస్వామికి సమర్పించుకున్న కానుకల చిట్టా గుట్టు వీడబోతోంది. ఆదివారం ఆలయం దిగువన ఉన్న ఆభరణాల నిల్వ గది(రత్న భండార్)ని దాదాపు 40 సంవత్సరాల తర్వాత లెక్కింపు కోసం తెరవబోతున్నారు. విషసర్పాలు ఉండొచ్చన్న వార్తల నేపథ్యంలో అత్యయిక ఔషధాలను సిద్ధంచేసి వైద్యులు, పాములు పట్టే వాళ్లను వెంటబెట్టుకునిమరీ పురావస్తు, ప్రభుత్వ అధికారులు లోనికి వెళ్లబోతున్నారు. జగన్నాథుడికి చెందిన వజ్ర, వైఢూర్యాలు, గోమేధిక, పుష్యరాగాలు, కెంపులు, రత్నాలు, స్వర్ణాభరణాలు, వెండి తదితరాల బరువును తూచి, వాటి నాణ్యతను పరిశీలించి వేరే గదిలో సురక్షితంగా భద్రపరచాలని నిర్ణయించారు. చాన్నాళ్ల క్రితం గది తాళం చెవులు పోగొట్టి ఒడిశాలోని బిజూజనతాదళ్ సర్కార్ ఆలయ సంపద సంరక్షణలో విఫలమైందని బీజేపీ అసెంబ్లీ ఎన్నికలవేళ ఆరోపణలు గుప్పించడంతో గది తలుపులు తెరచి సంపదను సరిచూడాలన్న డిమాండ్ మళ్లీ ఊపందుకుంది. అయితే గది తెరవడంపై శనివారం తుది నిర్ణయం తీసుకుంటామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శుక్రవారం చెప్పారు.

180 రకాల ఆభరణాలు

1978లో గదిని తెరచి ఆభరణాలు, వెండి, బంగారం నిల్వలను లెక్కించి మళ్లీ పాడవాటి చెక్కపెట్టెల్లో భద్రపరిచారు. ఆనాడు అన్నింటినీ లెక్కించడానికి 70 రోజులు పట్టింది. గదిలో 180 రకాలకు చెందిన అమూల్యమైన ఆభరణాలు స్వామివారికి ఉన్నట్లు సమాచారం. స్వచ్ఛమైన పసిడి ఆభరణాలు 74 రకాలున్నాయి. ఒక్కోటి 100 తులాల బరువైన పురాతన ఆభరణాలూ ఉన్నాయి. '' 1978లో సంపద లెక్కించారు. అయితే జీర్ణావస్థకు చేరిన కొన్ని ఆభరణాల రిపేర్ పనుల కోసం 1985 జూలై 14వ తేదీన గది తెరిచారు. అప్పుడు నేనూ వెళ్లా. 9 అడుగుల పొడవు, 3 అడుగుల ఎత్తు ఉన్న 15 చెక్కపెట్టెల్లో ఆభరణాలను జాగ్రత్తగా భద్రపరిచారు. వెలకట్టలేని ఆభరణాలతోపాటు ఎంతో బంగారం, వెండి నిల్వలు గదిలో దాచారు. పెద్ద సింహాసనం, ఉత్తరభారత భక్తులు జగన్నాథ, బలభద్రులకు సమర్పించిన అరటిపువ్వు ఆకృతి చెవిదిద్దులు ఇలా ఎన్నో విభిన్న ఆభరణాలు అక్కడున్నాయి. తర్వాత గది తలుపులు మూసి రెండు రకాల తాళాలు వేసి సీల్‌వేశారు. తాళం చెవులను ట్రెజరీ ఆఫీస్ నుంచి వచ్చిన కలెక్టర్‌కు అందజేశాం' అని ఆనాటి ఆలయ నిర్వహణ అధికారి రవీంద్ర నారాయణ మిశ్రా రెండేళ్ల క్రితం ఒక టీవీచానల్ ఇంటర్వ్యూలో చెప్పారు. 12వ శతాబ్దంలో పూరీ ప్రాంత రాజుకు లొంగిపోయిన సామంతరాజుల కిరీటాలు, యుద్ధంలో గెల్చుకున్న విలువైన సొత్తునూ రహస్య గదిలో భద్రపరిచారని తెలుస్తోంది.

2018లో మరోసారి ప్రయత్నించి..

పురాతన గది శిథిలమై గోడలకు చెమ్మ రావడంతో గది పటిష్టత, ఆభరణాల పరిరక్షణ నిమిత్తం గది తలుపులు తెరవాలని హైకోర్టు ఆదేశాల మేరకు 2018 ఏప్రిల్ 4వ తేదీన 16 మంది సభ్యుల భారత పురావస్తుశాఖ నిపుణుల బృందం గది తెరిచేందుకు వెళ్లింది. అయితే తాళం చెవి అదృశ్యమయిందన్న వార్తల నడుమ వెనుతిరిగింది. అయితే కిటికీ నుంచి చూసి గది గోడలు దెబ్బతిన్నట్లు, పైకప్పు పెచ్చులు ఊడినట్లు నిర్ధారించుకున్నారు. ఈ తతంగం అంతా 40 నిమిషాల్లో ముగిసింది. చీకటిగదిని మళ్లీ 40 ఏళ్ల తర్వాత తెరుస్తున్న నేపథ్యంలో ఈసారైనా అన్ని ఆభరణాలు, బంగారం, వెండి నిల్వలను సరిచూసి శిథిల గదికి బదులు నూతన గదిలో సురక్షితంగా దాచాలని సగటు పూరీ జగన్నాథుని భక్తుడు కోరుకుంటున్నాడు.

- సాక్షి, నేషనల్ డెస్క్

బైడెన్.. మళ్లీ తడబడెన్!

'అమెరికా ఉపాధ్యక్షుడు ట్రంప్' ● 'ఉక్రెయిన్ అధ్యక్షుడు పుతిన్' ● మీడియా సమావేశంలో నోరుజారిన బైడెన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పట్టువీడటం లేదు. అధ్యక్ష బరి నుంచి తప్పుకోవాలంటూ ఇంటా బయటా డిమాండ్లు నానాటికీ పెరిగిపోతున్నా ఆ ప్రసక్తే లేదని మరోసారి కుండబద్దలు కొట్టారు. 81 ఏళ్ల వయసులోనూ రిపబ్లికన్ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించి మరోసారి అధ్యక్షునిగా పని చేసే సామర్థ్యం తనలో పుష్కలంగా ఉందని చెప్పుకొచ్చారు. నాటో శిఖరాగ్రం ముగింపు సందర్భంగా గురువారం బైడెన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తన వయసు, ఫిట్‌నెస్‌పై పెరిగిపోతున్న సందేహాల్లో పస లేదని నిరూపించేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. అయితే గంటకు పైగా జరిగిన ఈ భేటీలోనూ ఆయన తడబాట్ల పర్వం కొనసాగడం డెమొక్రాట్ల శిబిరంలో ఆందోళనలను మరింత పెంచింది. ప్రశ్నోత్తరాల సందర్భంగా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అనబోయి ట్రంప్ అంటూ బైడెన్ తికమకపడ్డారు! అధ్యక్ష రేసు నుంచి మీరు తప్పుకుంటే ట్రంప్‌ను ఓడించే సత్తా హారిస్‌కు ఉందా అని విలేకరులు ప్రశ్నించగా, ''అధ్యక్షునిగా పని చేయగల అర్హత, సత్తా ట్రంప్‌కు ఉన్నాయి. కనుకనే ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నా'' అన్నారు. దాంతో అంతా అవాక్కయ్యారు. అయినా బైడెన్ తన వ్యాఖ్యలను సరిచేసుకోలేదు. అంతకుముందు నాటో వేదికపై కూడా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని సభ్య దేశాల ప్రతినిధులకు 'అధ్యక్షుడు పుతిన్' అంటూ పరిచయం చేశారు!! జెలెన్‌స్కీ దీన్ని తేలిగ్గా తీసుకుంటూ నవ్వేసినా ప్రతినిధులంతా తెల్లబోయారు. ఈ నేపథ్యంలో బైడెన్ మానసిక ఆరోగ్యంపై నెలకొన్న సందేహాలు మరింత పెరిగాయి. అయితే వైద్యులు సూచిస్తే మానసిక పరీక్షలకు సిద్ధమని ఆయన ప్రకటించారు. ''అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఇప్పటిదాకా మూడుసార్లు న్యూరో పరీక్షలు చేయించుకున్నా. తాజా పరీక్ష గత ఫ్రిబ్రవరిలో జరిగింది. నేను మానసికంగా ఫిట్‌గా ఉన్నాననేందుకు అధ్యక్షునిగా నేను తీసుకుంటున్న రోజువారీ నిర్ణయాలే రుజువు. కానీ నేనెంత చేసినా ఎవరూ సంతృప్తి చెందడం లేదు'' అంటూ వాపోయారు! అయితే తన అభ్యర్థిత్వంపై సొంత పార్టీ నేతల్లో భయాలను దూరం చేయాల్సిన అవసరముందని అంగీకరించారు.

బ్రహ్మాండంగా పని చేశా

అధ్యక్ష ఎన్నికల్లో తలపడేందుకు అత్యంత అర్హున్ని తానేనని బైడెన్ చెప్పుకున్నారు. ''ట్రంప్‌ను ఓసారి ఓడించా. మళ్లీ ఓడించి తీరతా. అప్పుడే ఏమీ అయిపోలేదు. ప్రచారంలో ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉంది'' అన్నారు. నాలుగేళ్లలో అమెరికాను అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చేశానంటూ గణాంకాలు ఏకరువు పెట్టారు. ఆర్థిక రంగంలో తన పనితీరు చాలా బాగుందని ఏకంగా 16 మంది నోబెల్ గ్రహీతలైన ఆర్థికవేత్తలు కితాబిచ్చారని చెప్పుకున్నారు. రాత్రి 8 గంటల తర్వాత ప్రచారంతో పాటు ఎలాంటి కార్యక్రమాలూ పెట్టుకునేది లేదని తానన్నట్టు వచ్చిన వార్తలను బైడెన్ ఖండించారు. విదేశీ వ్యవహారాలు తదితరాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. గాజా ఆక్రమణ కూడదంటూ ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహూను, ఉక్రెయిన్‌పై యుద్ధంలో మద్దతివ్వొద్దంటూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను హెచ్చరించానని చెప్పుకొచ్చారు. రష్యాతో సాన్నిహిత్యానికి చైనా మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. లాడెన్‌ను చంపగానే అఫ్గాన్ నుంచి అమెరికా పూర్తిగా వైదొలగాల్సిందన్నారు.

ట్రంప్ విసుర్లు

బైడెన్ తనను ఉపాధ్యక్షునిగా పేర్కొనడంపై ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 'బిగ్ బోయ్ జో మీడియా భేటీ మొదట్లోనే నన్ను తన ఉపాధ్యక్షునిగా చెప్పుకున్నారు'' అని ఎద్దేవా చేస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



పెరుగుతున్న వ్యతిరేకత

తనకు వ్యతిరేకంగా గళమెత్తుతున్న సొంత పార్టీ నేతలు, ఎంపీల విశ్వాసాన్ని చూరగొనడమే లక్ష్యంగా తాజా మీడియా సమావేశంలో బైడెన్ సర్వశక్తులూ ఒడ్డారు. కానీ ఆ ప్రయత్నంలో ఆయన విఫలమయ్యారని పరిశీలకులు అంటున్నారు. బైడెన్ తప్పుకోవాలని సమావేశం ముగియగానే ముగ్గురు ప్రముఖ డెమొక్రాట్ ఎంపీలు జిమ్ హైమ్స్, స్కాట్ పీటర్స్, ఎరిక్ సొరెన్సన్ పిలుపునిచ్చారు! దాంతో ఆయన వైదొలగాలని డిమాండ్ చేస్తున్న సొంత పార్టీ ఎంపీల సంఖ్య 17కు పెరిగింది. నిజానికి గత నెల సీఎన్ఎన్ చానల్లో జరిగిన తొలి అధ్యక్ష డిబేట్‌లో ట్రంప్ ముందు బైడెన్ పూర్తిగా తేలిపోవడం తెలిసిందే. దానితో పోలిస్తే తాజా మీడియా భేటీలో ఆయన మెరుగ్గానే మాట్లాడారు. తాను తీరిక లేని షెడ్యూల్‌తో బిజీగా గడుపుతుంటే ట్రంప్ మాత్రం గోల్ఫ్ ఆడుతూ సేదదీరుతున్నారంటూ దుయ్యబట్టారు. ''ట్రంప్ నాలుగేళ్ల పాలనలో అస్తవ్యస్తం చేసిన నాటో కూటమిని ఎంతగానో శ్రమించి ఒక్కతాటిపైకి తెచ్చా. నాటో శిఖరాగ్రంలో పాల్గొన్న దేశాధినేతలెవరూ నా ఫిట్‌నెస్‌ను, మానసిక ఆరోగ్యాన్ని సందేహించలేదు. పైపెచ్చు ట్రంప్ మళ్లీ రావొద్దని, నేనే గెలవాలని కోరుకుంటున్నట్టు చెప్పారు'' అని అన్నారు.

ఒబామా, పెలోసీ కూడా...

బైడెన్ తప్పుకోవాలంటున్న డెమొక్రాటిక్ పార్టీ నేతల జాబితాలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ కూడా చేరుతున్న సూచనలు కన్పిస్తున్నాయి. ట్రంప్‌ను ఓడించడం బైడెన్‌కు తలకు మించిన పనేనని వారిద్దరూ తాజాగా ప్రైవేటు సంభాషణలో అభిప్రాయపడ్డట్టు తెలుస్తోంది. నాటో శిఖరాగ్రం అనంతరం బైడెన్ మీడియా సమావేశం చూసి వారు మరింతగా పెదవి విరిచినట్టు డెమొక్రటిక్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ''బైడెన్ అధ్యక్ష అభ్యర్థిత్వం దాదాపుగా ముగిసిన కథే. ఆయనకు మనస్తాపం కలగకుండా, పార్టీ అవకాశాలు దెబ్బ తినకుండా దీన్ని ప్రకటించడం ఎలాగన్నది మాత్రమే తేలాల్సి ఉంది. బహుశా బైడెన్ తనంత తానుగా తప్పుకుంటారని ఒబామా, పెలోసీ భావిస్తున్నారు. లేదంటే ఆయనకు నచ్చజెప్పి తప్పించే బాధ్యత తీసుకోగలిగింది వారిద్దరే'' అని పేర్కొంటున్నాయి. ఈ విషయమై ఉన్నత స్థాయి డెమొక్రాట్ నేతలు గురువారం ఉదయం పెలోసీతో సమావేశమైనట్టు అమెరికా మీడియా పేర్కొంది. ''ఇక ట్రంప్‌ను ఓడించడం బైడెన్‌కు శక్తికి మించిన పనేనన్న అభిప్రాయంతో పెలోసీ కూడా ఏకీభవించారు. అయితే నాటో శిఖరాగ్రం జరుగుతున్న నేపథ్యంలో దేశాధినేతల ముందు బైడెన్‌ను ఇబ్బంది పెట్టడం సరికాదని, కనీసం ఒక రోజన్నా ఆగాలని సూచించారు. దాంతో బైడెన్‌ను తప్పించేందుకు ఆమె కూడా సుముఖంగానే ఉన్నట్టు తేలిపోయింది. అందుకే భేటీ తర్వాత పలువురు డెమొక్రాట్ ఎంపీలు బైడెన్ తప్పుకోవాలని బాహాటంగా డిమాండ్ చేశారు'' అంటూ యూఎస్ మీడియాలో జోరుగా కథనాలు వెలువడుతున్నాయి.

నాటో భేటీ వేళ రష్యా యాత్రా?

మోదీ పర్యటనపై అమెరికా అసంతృప్తి

వాషింగ్టన్: నాటో శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ రష్యాలో పర్యటించడంపై అమెరికా అసంతృప్తితో ఉన్నట్టు బ్లూంబర్గ్ నివేదిక పేర్కొంది. ఇది భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపగలదని ఆ దేశ ఉన్నతాధికారులు భావిస్తున్నట్టు చెప్పుకొచ్చింది. ''పుతిన్‌ను మోదీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న తీరు అమెరికా ప్రభుత్వం లోపల, వెలుపల విమర్శలకు దారి తీసింది. వాషింగ్టన్‌లో నాటో సదస్సు జరుగుతుండగా మోదీ రష్యాలో పర్యటించడం బైడెన్ యంత్రాంగానికి చాలా ఇబ్బందికరమైన పరిస్థితిని సృష్టించింది. పుతిన్‌ను అంతర్జాతీయ సమాజంలో ఒంటరిని చేయాలన్న నాటో ప్రయత్నాలకు ఇది గండి కొట్టింది. అందుకే అమెరికా విదేశాంగ శాఖ ఉప మంత్రి కర్ట్ కాంప్‌బెల్ జూలై మొదట్లోనే భారత విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రాతో మాట్లాడారు. మోదీ రష్యా పర్యటన షెడ్యూల్ మార్చుకోవాల్సిందిగా కోరారు'' అని నివేదిక వివరించింది. ఈ ఉదంతంపై విదేశాంగ శాఖ స్పందించాల్సి ఉంది. అమెరికాతో స్నేహాన్ని తేలిగ్గా తీసుకోవద్దని భారత్‌లో ఆ దేశ రాయబారి ఎరిక్ గార్సెట్టీ గురువారం మీడియాతో సమావేశంలో నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. అవి రష్యా పర్యటనను ఉద్దేశించేనని చెబుతున్నారు. రష్యాను విశ్వసనీయమైన దీర్ఘకాలిక మిత్ర దేశంగా భారత్ పరిగణించడం పొరపాటని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివాన్ అభిప్రాయపడ్డారు.

జూన్ 25వ తేదీ రాజ్యాంగ హత్యా దినం

కేంద్ర ప్రభుత్వం ప్రకటన

న్యూఢిల్లీ: 1975లో దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన జూన్ 25వ తేదీని రాజ్యాంగ హత్యా దినంగా పాటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు హోం శాఖ ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎమర్జెన్సీ సమయంలో ఎంతో వేదనను అనుభవించి, త్యాగాలకు సిద్ధపడిన వారిని గుర్తు చేసుకునేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు హోం మంత్రి అమిత్ షా శుక్రవారం వెల్లడించారు. 'రాజ్యాంగ హత్యా దినం ప్రతి భారతీయుడిలో వ్యక్తి స్వేచ్ఛ కాంక్షను ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యతను సజీవంగా ఉంచడంలో సాయపడుతుంది. తద్వారా కాంగ్రెస్ వంటి నియంతృత్వ శక్తులను నిరోధించవచ్చు' అని తెలిపారు. '1975 జూన్ 25న ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించడం ద్వారా దేశ ప్రజాస్వామ్యం ఆత్మ గొంతు నులిమి నియంతృత్వ మనస్తత్వాన్ని చాటుకున్నారు. లక్షలాది మంది అమాయకులను కటకటాల్లోకి నెట్టారు. మీడియా గొంతు నొక్కారు'అని అమిత్ షా 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.

రాజ్యాంగం అణచివేతను గుర్తు తెచ్చుకునేందుకే: మోదీ

రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాచిన సమయంలో ఏం జరిగిందో గుర్తు చేసుకునేందుకే జూన్ 25ను రాజ్యాంగ హత్యా దినంగా పాటించాలని నిర్ణయించామని ప్రధాని మోదీ తెలిపారు. 'దేశ చరిత్రలో అదో చీకటి అధ్యాయం. ఆ సమయంలో అనేక కష్టాలను ఎదుర్కొన్న ప్రతి ఒక్కరికీ నివాళిగా ఈ నిర్ణయం తీసుకున్నాం' అన్నారు.

జూన్ 4 మోదీ ముక్తి దివస్: కాంగ్రెస్

కేంద్రం నిర్ణయాన్ని వార్తల్లో నిలిచేందుకు మోదీ చేసిన కుట్రపూరిత యోచనగా కాంగ్రెస్ పేర్కొంది. తాము కూడా 2016లో మోదీ ప్రభుత్వం నోట్ల రద్దు నిర్ణయం ప్రకటించిన నవంబర్ 8ని జీవనోపాధిని చంపిన రోజు (ఆజీవికా హత్యా దివస్)గా పాటించాలంటూ గెజిట్ విడుదల చేస్తామని తెలిపింది. పదేళ్లపాటు దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేసిన మోదీకి ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు నైతిక ఓటమి రుచి చూపిన జూన్ 4 మోదీ ముక్తి దివస్‌గా చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొంది.

జన భారతం @170 కోట్లు!

- 2060 దశకంలో తారాస్థాయికి
- ఆపై దిగిరానున్న భారత జనాభా
- 50–60 ఏళ్లలో 1,030 కోట్లకు చేరనున్న ప్రపంచ జనాభా
- ఐక్యరాజ్యసమితి నివేదిక



ఐక్యరాజ్యసమితి: భారతదేశంలో జనాభా విస్ఫోటం కొనసాగనుందని ఐక్యరాజ్యసమితి కుండబద్దలు కొట్టింది. ఈ శతాబ్దం చివరిదాకా అంటే 2100 సంవత్సరందాకా ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా భారత్‌పేరు నిలిచిపోనుందని ఐరాస ప్రకటించింది. ప్రస్తుత ఏడాదిలో 145 కోట్లుగా ఉన్న భారతదేశ జనాభా 2060 దశకంలో ఏకంగా 170 కోట్లకు చేరుకుంటుందని పేర్కొంది. ' ది వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024' పేరిట ఐరాస ఆర్థిక, సామాజిక వ్యవహారాలు, జనాభా విభాగం తాజాగా ఒక నివేదికను వెల్లడించింది. నివేదికలోని ముఖ్యాంశాలను ఐరాస అధికారి క్లేర్ మెనోంజీ వెల్లడించారు. ''భారత జనసంఖ్య 170 కోట్లకు చేరుకున్నాక నెమ్మదిగా 12 శాతం క్షీణతతో కిందకు దిగొస్తుంది. ప్రస్తుత ఏడాది 820 కోట్లుగా ఉన్న ప్రపంచజనాభా 2080 దశకం మధ్యకల్లా 1030 కోట్లకు చేరుకుంటుంది. ప్రపంచజనాభా గరిష్ట స్థాయికి చేరుకున్నాక 2100 సంవత్సరంకల్లా 1020 కోట్లకు దిగివస్తుంది. జనాభాలో ఇప్పటికే చైనాను దాటేసిన భారత్ తన జన ప్రభంజనాన్ని 2100దాకా కొనసాగిస్తుంది. అంటే అప్పటిదాకా ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశంగా భారత్ పేరిట రికార్డ్ పదిలంగా ఉండనుంది. భారత జనాభా 2054లో 169 కోట్లకు చేరుకుని 2100 నాటికి 150 కోట్లకు పడిపోనుంది'' అని మెనోంజీ అంచనావేశారు.

చైనాలో సగం జనాభా మాయం

''ప్రస్తుత ఏడాది 141 కోట్లుగా ఉన్న చైనా జనాభా 2054 కల్లా 121 కోట్లకు పడిపోనుంది. 2100 నాటికి 63.3 కోట్లకు మరింత తగ్గనుంది. 2024 నుంచి 2054 కాలంలో చైనా జనాభా వేగంగా తగ్గిపోనుంది. ఆ కాలంలో 20.4 కోట్లు తగ్గనుంది. జపాన్‌లో 2.1 కోట్లు, రష్యాలో కోటి జనాభా తగ్గిపోనుంది. 2100 నాటికి చైనాలోనే అత్యంత తక్కువ సంతాన సాఫల్యతా రేటు నమోదు కావ డమే ఈ జనాభా క్షీణతకు అసలు కారణం. 2100 కల్లా చైనాలో 78.6 కోట్ల జనాభా అంతరించిపోనుంది.

126 దేశాల్లో జనాభా పైపైకి..

2054 ఏడాదిదాకా ప్రపంచవ్యాప్తంగా 126 దేశాల్లో మాత్రం జనాభా పెరుగుతూనే పోతుందని ఐరాస అంచనావేసింది. 2100 ఏడాదిదాకా ఈ పెరుగుదల ధోరణి గరిష్టస్థాయికి చేరుకోనుంది. భారత్, ఇండోనేసియా, నైజీరియా, పాకిస్తాన్, అమెరికా వంటి దేశాల్లో ఈ జనాభా విస్ఫోటం కనిపించనుంది.

అమెరికాను దాటేయనున్న పాక్

ప్రపంచవ్యాప్తంగా జననాల రేటు 2.25గా ఉంది. 1990లో ఇది 3.31గా ఉండటం విశేషం. సాధారణంగా ఉండాల్సిన 2.1 కన్నా తక్కువ రేటు ప్రపంచంలోని సగానికిపైగా దేశాల్లో నమోదవుతోంది. 2054కల్లా పాకిస్తాన్ జనాభా అమెరికాను అధిగమించి 38.9 కోట్లకు చేరుకోనుంది. ప్రస్తుతం అమెరికా జనాభా 34.5 కోట్లు. 2054లో పాక్‌కంటే తక్కువగా అమెరికాలో 38.4 కోట్ల జనాభా ఉండనుంది. 2100కల్లా 51.1 కోట్ల జనాభాతో మూడో అతిపెద్ద దేశంగా పాక్ అవతరించనుంది.

తగ్గిన చిన్నారుల మరణాలు..

ప్రపంచ వ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు 2023లో 5లక్షల లోపుకు దిగొచ్చాయి. ఇంత తక్కువగా నమోదవడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. చిన్నారుల మరణాల్లో 95 శాతం జనాభా బాగా పెరుగుతున్న కాంగో, భారత్, పాకిస్తాన్, నైజీరియా వంటి 126 దేశాల్లో నమోదవుతున్నాయి. 2024లో ప్రపంచవ్యాప్తంగా సగటు ఆయుర్దాయం 73.3 ఏళ్లుగా నమోదైంది. 1995తో పోలిస్తే ఆయుర్దాయం 8.4 సంవత్సరాలు పెరగడం విశేషం. 2054 ఏడాదికల్లా ఆయుర్దాయం 77.4 సంవత్సరాలకు పెరగనుంది.

ఈడీ కేసులో కేజ్రీవాల్‌కు ఊరట

సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం విధానం కుంభకోణంపై ఈడీ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట దక్కింది. సుప్రీంకోర్టు శుక్రవారం ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మద్యం విధానం కుంభకోణం ఈడీ కేసులో ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషన్‌లో కేజ్రీవాల్ లేవనెత్తిన అంశాలు సుప్రీంకోర్టులోని విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తున్నామని, అదే సమయంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నామని స్పష్టం చేసింది. 'జీవించే హక్కు, స్వేచ్ఛ సర్వోన్నతమైనవని, అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నాం. ఈడీ అధికారి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా పీఎంఎల్ఏ సెక్షన్ 19 కింద అరెస్టు చేసే అధికారాన్ని వినియోగించడం కుదరదు. ఒక వ్యక్తిని నిర్దోషిగా నిర్ధారించే ఆధారాలను, రికార్డులను ఈడీ అధికారి పట్టించుకోకపోవడం.. ఆమోదయోగ్యం కాని ఫలితాలకు దారితీస్తుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పీఎంఎల్ఏ సెక్షన్ 19 కింద అరెస్టు చేయాల్సిన అవసరం ఉందా లేదా అనే చట్టపరమైన ప్రశ్నను విస్తృత ధర్మాసనానికి సిఫార్సు చేస్తున్నామని పేర్కొంది. మధ్యంతర బెయిల్‌కు సంబంధించి సుప్రీంకోర్టు కొన్ని షరతులు విధించింది. ''రూ.50వేల పూచీకత్తుతో బాండ్‌ను జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించాలి. ఈ సమయంలో సీఎంఓ, సచివాలయాన్ని సందర్శించరాదు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కోసం అవసరమైతే తప్ప అధికారిక ఫైళ్లపై సంతకం చేయకూడదు. కేసులో తన పాత్రకు సంబంధించి వ్యాఖ్యలు చేయరాదు. సాక్షులతో మాట్లాడకూడదు. కేసుకు సంబంధించిన ఫైళ్లు చూడరాదు'' అని షరతులు విధించింది. మధ్యంతర బెయిల్‌ను విస్తృత ధర్మాసనం పొడిగించవచ్చు, లేదా రీకాల్ చేయొచ్చని అభిప్రాయపడింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని నడిపే సీఎంను పదవి నుంచి వైదొలగాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయొచ్చా, లేదా అనే అంశాన్ని సీజేఐ దృష్టికి తీసుకువెళ్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

నేపాల్‌లో వరద బీభత్సం... 62 మంది దుర్మరణం!

వారిలో ఏడుగురు భారతీయులు

కఠ్మాండు: నేపాల్‌లో భారీ వరదలకు కొండచరియలు విరిగిపడి రెండు బస్సులు కొట్టుకుపోయాయి. చిట్వాన్ జిల్లా నారాయణ్‌ఘాట్–ముగ్లింగ్ రహదారిపై జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో ఏడుగురు భారతీయులతో పాటు 62 మంది గల్లంతయ్యారు. బిర్గూగంజ్ నుంచి కఠ్మాండు వైపు 24 మందితో వెళ్తున్న బస్సు, కఠ్మాండు నుంచి గౌర్ వైపు 41 మందితో వెళ్తున్న డీలక్స్ బస్సు శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో సిమల్టాల్ వద్ద త్రిసూలి నదిలో వరదలో చిక్కుకున్నాయి. డీలక్స్ బస్సులోని ముగ్గురు ప్రయాణికులు బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. ఆ వెంటనే రెండు బస్సులు వరదలో కొట్టుకుపోయాయి. సహాయక చర్యలు చేపట్టేందుకు సైన్యం రంగంలోకి దిగింది. వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో గురువారం నుంచి 11 మంది చనిపోయారు.

మెక్సికో నగరాల్లో మొసళ్ల సంచారం

మెక్సికో సిటీ: మెక్సికో దేశంలోని తీర ప్రాంత నగరాల్లో ఇటీవల మొసళ్ల సంచారం ఒక్కసారిగా పెరిగింది. సముద్ర తీరాల వెంబడి తక్కువ లోతు నీళ్లలో ఉండే మొసళ్లు ఇటీవలి వరుస తుపాన్లు, వరదలతో జనారణ్యంలోకి వచ్చిపడుతున్నాయి. టాంపికో, సియుడాడ్ మడెరో, అల్టమిరా నగరాల్లో తిరుగుతూ ప్రజలను భయకంపితుల్ని చేసిన కనీసం 200 మొసళ్లను పట్టుకుని, వాటి ఆవాసాలకు తీసుకెళ్లి వదిలేసినట్లు అధికారులు తెలిపారు. నీటి కొరత ఏర్పడినా, వరదలు వచ్చినా అవి ఇలా జనం మధ్యకు వచ్చేస్తుంటాయని, ఇదో సమస్యగా మారిందని అధికారులు అంటున్నారు. మెక్సికోలో మొసళ్లు రక్షిత జీవులు. అందుకే ప్రజలు చంపడానికి బదులుగా బంధించి అధికారులకు సమాచారమిస్తుంటారు.

ఎన్డీయే సర్కారు ఎక్కువ కాలం కొనసాగదు: మమత

ముంబైలో ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌లతో భేటీ

ముంబై: కేంద్రంలో అస్థిరమైన ఎన్డీయే సర్కారు పూర్తికాలం మనజాలదని తృణమూల్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఆమె శుక్రవారం ముంబైలో శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్‌లతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జూన్ 25ను రాజ్యాంగ హత్య దినంగా కేంద్రం ప్రకటించడంపై స్పందిస్తూ.. 'ఆట మొదలైంది. సాగుతూ ఉంటుంది' అని పేర్కొన్నారు. పదేళ్ల మోదీ పాలన ఎమర్జెన్సీని తలపించిందన్నారు. కొత్త నేర చట్టాలపై ఎవరినీ సంప్రదించలేదని ఆరోపించారు. పార్లమెంటులో ఎంపీలను సస్పెండ్ చేసి వాటిని ఆమోదింపజేసుకున్నారన్నారు. ముంబై నార్త్‌వెస్ట్ లోక్‌సభ స్థానంలో శివసేన (షిండే) అభ్యర్థి కేవలం 48 ఓట్లతో నెగ్గడంపై స్పందిస్తూ చాలాచోట్ల ఇలాగే గెలిచా రన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (యూబీటీ) తరఫున ప్రచారం చేస్తానని వెల్లడించారు.

అసాధారణ కేసుల్లోనే బెయిల్‌పై స్టే: సుప్రీం

న్యూఢిల్లీ: కారణాలు చూపకుండా యథాలాపంగా బెయిల్ ఉత్తర్వులపై స్టే సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. అరుదైన, అసాధారణ సందర్భాల్లో మాత్రమే నిందితుడికి ఊరటను (బెయిల్‌ను) నిరాకరించవచ్చని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఉగ్రవాద కేసుల్లో ప్రమేయం, బెయిల్ ఉత్తర్వులు హేతుబద్ధ లేమి, నిబంధనలను అతిక్రమణ వంటి అరుదైన, అసాధారణ సందర్భాల్లో మాత్రమే కోర్టులు బెయిల్ ఆర్డర్‌పై స్టే ఇవ్వాలి. అలాగాక యథాలాపంగా స్టేలు ఇచ్చుకుంటూ పోతే ఉపద్రవమే'' అని పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను ఢిల్లీ హైకోర్టు నిలిపేయడాన్ని సవాలు చేస్తూ పర్విందర్ సింగ్ ఖురానా వ్యక్తి పెట్టుకున్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

విశ్వాస పరీక్షలో ఓడిన ప్రచండ

ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకొచ్చిన ఓలి

కఠ్మాండు: నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ 'ప్రచండ' శుక్రవారం పార్లమెంట్‌లో జరిగిన బలపరీక్షలో ఓటమి పాలయ్యారు. ఆయన సంకీర్ణ ప్రభుత్వానికి ప్రధాన భాగస్వామి సీపీఎన్–యూఎంఎల్ మద్దతు ఉపసంహరించడంతో బల నిరూపణ జరిగింది. 275 మంది సభ్యుల్లో ప్రచండకు 63 మందే మద్దతు తెలిపారు. విశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా 194 ఓట్లు పడ్డాయి. 2022 డిసెంబర్‌లో ప్రధాని అయ్యాక ప్రచండకు ఇది నాలుగో విశ్వాస పరీక్ష! ఇప్పుడాయ గద్దె దిగడం అనివార్యమైంది. మాజీ ప్రధాని కేపీ శర్మ సారథ్యంలోని సీపీఎన్– యూఎంఎల్ ఇటీవల ప్రచండ సంకీర్ణ ప్రభుత్వం నుంచి వైదొలిగి షేర్ బహదూర్ దేవ్‌బా సారథ్యంలోని నేపాలీ కాంగ్రెస్‌తో జట్టు కట్టింది. వాటి ఒప్పందం ప్రకారం పార్లమెంట్ మిగిలిన పదవీ కాలంలో ఒకటిన్నరేళ్లు కేపీ శర్మ ఓలి ప్రధానిగా ఉంటారు. తాజా పరిణామాల నేపథ్యంలో రెండు, అంతకంటే ఎక్కువ పార్టీలు కలిసొచ్చి ఆదివారం సాయంత్రంలోగా మెజారిటీ నిరూపించుకోవాలని అధ్యక్షుడు రాంచంద్ర పౌడెల్ కోరారు. ఎన్సీ మద్దతుతో తాము ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీపీఎన్–యూఎంఎల్ సారథి కేపీ శర్మ ఓలి ప్రకటించారు.



విశ్వాస పరీక్షలో ఓడిన అనంతరం పార్లమెంట్‌లో ఒంటరిగా కూర్చున్న ప్రచండ



ఫిల్టర్ వాటర్ కావాలంటే స్మార్ట్ కార్డు రెడీ..
24 గంటలూ మంచి నీళ్లు అందుబాటులో ఉంటాయి..
పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్‌తో నేరుగా ఇంటికి వంటగ్యాస్ వస్తుంటుంది.. వాడుకున్న గ్యాస్‌కు నెలనెలా బిల్లు కడితే సరి..
ఏ ఇన్ఫర్మేషన్ అయినా ఇంటింటికీ వినిపించేలా ఏర్పాటు చేసిన మైక్‌లో చెప్పేస్తుంటారు..
.. ఇదంతా ఏదో అభివృద్ధి చెందిన దేశంలో జరుగుతున్నది కాదు. మన గ్రేటర్ హైదరాబాద్ శివార్లలోని మూడుచింతలపల్లి మండలంలో ఉన్న గ్రామాల్లోని 'హైటెక్' సౌకర్యాలివి..



విలేజీ టెక్నాలజీ



- గ్రేటర్ సిటీ శివార్లలోని మూడు గ్రామాల్లో అత్యాధునిక సదుపాయాలు
- టెక్నాలజీ వాడకంలో ముందున్న ఉద్దమర్రి, కొల్తూర్, పోతారం..
- స్మార్ట్ కార్డులతో 24 గంటలూ అందుబాటులో ఫిల్టర్ వాటర్
- ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా వంటగ్యాస్ సరఫరా.. నెలనెలా బిల్లు కడితే సరి
- ఏ సమాచారమైనా క్షణాల్లో ఊరంతా తెలిసేలా సౌండ్ సిస్టమ్

రాజీగళ్ల భూపాల్

మూడుచింతలపల్లి మండలంలోని పోతారం, కొల్తూర్ గ్రామాల్లో గేటెడ్ కమ్యూనిటీలకు దీటుగా పైప్‌లైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా జరుగుతోంది. ఇక్కడికి సమీపంలోని జీనోమ్ వ్యాలీలో ఉన్న ఫార్మా కంపెనీలకు ఎల్పీజీ గ్యాస్ సరఫరా చేసేందుకు మెగా గ్యాస్ కంపెనీ పోతారంలో సబ్‌స్టేషన్ (కంప్రెసర్) ఏర్పాటు చేసింది. తమ గ్రామంలో సబ్‌స్టేషన్ పెట్టిన నేపథ్యంలో.. ఇక్కడి ఇళ్లకు పైప్‌లైన్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేయాలని గ్రామస్తులు కోరడంతో ఆ ఏర్పాట్లు చేసింది. వినియోగదారులు రూ.6 వేలు చెల్లిస్తే.. వారి ఇంటికి వంటగ్యాస్ పైప్‌లైన్ కనెక్షన్ ఇస్తారు. దానికి ఒక మీటర్‌ను అమర్చుతారు. ప్రతి నెలా కంపెనీ సిబ్బంది వచ్చి మీటర్ వద్ద స్కాన్ చేసి.. వినియోగించిన గ్యాస్‌కు సంబంధించిన బిల్లు ఇస్తారు. అచ్చు కరెంటు బిల్లు తరహాలో నెలనెలా బిల్లు కట్టేస్తే సరిపోతుంది.



సిలిండర్ల కోసం ఇబ్బంది తప్పింది

పైప్‌లైన్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేయడం గ్రామస్తులకు ఉపయోగకరంగా ఉంది. గతంలో సిలిండర్ అయిపోతే రెండు, మూడు రోజుల వరకు ఇబ్బంది ఎదుర్కోవాల్సి వచ్చేది. దానికి తోడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చినప్పుడు డెలివరీ చార్జీలు, సర్వీస్ చార్జీలు అంటూ అదనంగా డబ్బులు తీసుకునేవారు. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా.. నిరంతరాయంగా వంట గ్యాస్ సరఫరా అవుతోంది. వాడుకున్న మేర బిల్లు చెల్లిస్తే సరిపోతోంది.

- హరిమోహన్‌రెడ్డి, పోతారం మాజీ సర్పంచ్

ఉద్దమర్రి గ్రామంలో స్మార్ట్ కార్డులు



మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రిలోని వాటర్ ఫిల్టర్ కేంద్రం (సామాజిక నీటి శుద్ధి కేంద్రం)లో సిబ్బంది లేకుండానే ప్రజలు నీటిని కొని తీసుకెళ్లేలా ఏర్పాటు చేశారు. తాజా మాజీ సర్పంచ్ యాంజాల అనురాధ పట్టభద్రురాలు కావడం, డిజిటల్ విధానంపై అవగాహన ఉండటంతో.. స్మార్ట్ కార్డు విధానం ఏర్పాటుకు నిర్ణయించారు. దీనిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ వాటర్ ఫిల్టర్ నిర్వాహకులకు ముందుగా రూ.50 చెల్లిస్తే ఒక 20 లీటర్ల వాటర్ క్యాన్‌తోపాటు యాక్టివేట్ చేసిన స్మార్ట్ కార్డును వినియోగదారులకు ఇస్తారు. తర్వాత వినియోగదారులు నగదు ఇచ్చి స్మార్ట్ కార్డును రీచార్జ్ చేసుకోవచ్చు. వాటర్ ప్లాంట్ వద్ద ఉన్న మిషన్ సెన్సర్ వద్ద స్మార్ట్ కార్డును స్కాన్ చేస్తే కార్డులో నుంచి రూ.5 కట్ అయి.. వారు నాజిల్ దగ్గర పెట్టిన వాటర్ క్యాన్ నిండుతుంది. ఇలా స్మార్ట్‌కార్డు వినియోగించిన ప్రతిసారీ రూ.5 చొప్పున కట్ అయి.. వాటర్ బాటిల్ నిండుతుంది. ఫిల్టర్ వాటర్ కేంద్రం 24 గంటలూ ఆన్‌లో ఉంటుంది. ఎప్పుడు కావాలన్నా వెళ్లి నీళ్లు తెచ్చుకోవచ్చు.



దండోరా కాదు..
మైక్‌లో అనౌన్స్‌మెంట్

- వివరాలు 8లో



కావాల్సినప్పుడల్లా తెచ్చుకుంటున్నాం..

స్మార్ట్ కార్డ్‌తో మంచి ప్రయోజనం ఉంది. రోజూ నీళ్లు తెచ్చుకోవాలంటే చేతిలో డబ్బులు, చిల్లర ఉండకపోవచ్చు. నెల మొదటి వారంలో డబ్బు ఉన్నపుడు రీచార్జి చేయించుకుంటే చాలు. ఈ కేంద్రం 24 గంటలూ అందుబాటులో ఉంటోంది. అవసరమైనప్పుడల్లా నీటిని తెచ్చుకుంటున్నాం.

-జూపల్లి పద్మ, ఉద్దమర్రి

క్వీన్ రైడర్స్



సొంత బైక్‌లపై పలు ప్రాంతాలను చుట్టేస్తూ..
ప్రపంచంలోనే ఎత్తైన రోడ్లపై ప్రయాణం
లద్దాఖ్‌లోని ఉమ్లింగ్ లా పాస్‌లో సాహస యాత్ర

- వివరాలు 13లో

చిన్నా.. రెడీ.. క్లిక్.. క్లిక్..!

నగరంలో పెరుగుతున్న ప్రీ బర్త్‌డే ఫొటోషూట్స్

ఇండోర్‌లోనే థీమ్‌లతో సెట్టింగ్స్

ఎంత ఖర్చయినా వెనుకాడని తల్లిదండ్రులు

రోజుకు రూ.10 వేల నుంచి ప్యాకేజీలు..

సినిమాటిక్ వీడియోలు చూసుకొని మురిసిపోతున్న పేరెంట్స్



చిన్నారులు చేసే చిలిపిపనులు..అల్లరి చూస్తుంటే కన్నవారి కడుపు నిండిపోతుంది. వారు చేసే బుజ్జిబుజ్జి పనులు ముద్దుగా అనిపిస్తాయి. అయితే తమ పిల్లలు చేస్తున్న అల్లరి పనులు ఎప్పటికీ గుర్తుండిపోవాలంటే.. ఒకప్పుడు ఫొటోలు తీసుకొని పదిలపరుచుకునేవారు. ఇప్పుడు టెక్నాలజీ పెరిగింది.. ట్రెండ్ మారింది. దానికి తగ్గట్టుగానే సినిమాటిక్ వీడియోలు, ఫొటోలు తీస్తున్నారు. సాధారణంగా ప్రీ వెడ్డింగ్, వెడ్డింగ్ షూటింగ్స్ ఔట్‌డోర్‌లో తీస్తుంటారు. కానీ చిన్నారులను ఔట్‌డోర్‌కు తీసుకెళితే ఆరోగ్య సమస్యలు వస్తాయి. అదీగాక చంటిపిల్లలను లాలించడం కొంచెం కష్టమే. అందుకే ఇండోర్ ఫొటోషూట్స్ ఈ మధ్య ట్రెండ్‌గా మారింది. ముఖ్యంగా ఫస్ట్ బర్త్‌డే ముందు ఇలాంటి ఫొటోషూట్స్ ఎక్కువగా జరుగుతున్నాయి. నగరంలో ఈ ట్రెండ్ కాస్తా బాగా పెరిగింది. దీంతో ఇండోర్ స్టూడియోలు కూడా ఎక్కువ అవుతున్నాయి. ఈ ట్రెండ్ ఎలా నడుస్తుందో ఓ 'క్లిక్' వేద్దాం.

..: సాక్షి, హైదరాబాద్ :..



ప్రీ వెడ్డింగ్ షూట్స్, బేబీబంప్ ఫొటోషూట్స్ ట్రెండ్ నగరంలో పెరిగింది. దీంతోపాటు ఇప్పుడు ప్రీ బర్త్‌డే ఫొటో షూట్‌కు క్రేజ్ పెరిగింది. పిల్లల ఫస్ట్ బర్త్‌డే

ఇండోర్‌లోనే సెట్టింగ్స్

ముందు ఇలాంటి ఫొటోషూట్స్ ఎక్కువగా చేయించుకుంటున్నారు. ఒకప్పుడు ఔట్‌డోర్ షూటింగ్స్ చేస్తుండేవారు. కానీ ఇప్పుడు అలాకాదు..ఇండోర్‌లోనే పేరెంట్స్ అడిగిన థీమ్ కోసం సెట్ వేస్తున్నారు. గ్రామీణ వాతావరణం లాంటి సెట్స్ కూడా ఇండోర్‌లోనే రూపొందిస్తున్నారు. పోలీస్, డాక్టర్ ఇలా ఏ థీమ్ కావాలని అడిగితే అలాంటి థీమ్‌లో సెట్స్ వేసి షూట్ చేస్తున్నారు.

సినిమాటిక్ వీడియోస్..

ఒకప్పుడు ఫొటోఆల్బమ్ తయారు చేయించుకొని భద్రపరుచుకునేవారు. కానీ ఇప్పుడంతా వీడియోలదే కాలం. కేక్ స్మాషింగ్, స్నానాలు చేయించడం, తులసి చెట్టు దగ్గర పూజలు చేయిస్తున్నట్టు వీడియోలు తీస్తున్నారు. ఆ వీడియోలను పోట్రెయిట్ మోడ్‌లో తీస్తూ ఆ విజువల్స్‌ను సినిమాటిక్ వీడియోలుగా రూపొందిస్తున్నారు.

ఎన్నో..ఎన్నెన్నో థీమ్స్

చిన్నారుల ఫొటోషూట్‌కు ఒక్కొక్కరు ఒక్కో సెట్ అడుగుతుంటారు. చాలావరకు ఫొటోగ్రాఫర్ల వద్ద ఉన్న సెట్స్‌లోనే ఎంచుకుంటారు. కానీ కొందరు మాత్రం తమకు నచ్చిన సెట్స్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో వారు కోరినట్టుగా ఇండోర్‌లోనే సెట్టింగ్స్ వేస్తున్నారు. క్రికెట్ స్టేడియం, బాక్సింగ్ కోర్టు, పల్లెటూరు, పోలీస్‌స్టేషన్ సెట్టింగ్, మహారాజా సెట్టింగ్, బోటింగ్, హాస్పిటల్, ఫారెస్ట్, కిచెన్ సెట్టింగ్, బార్బీ డాల్ బెడ్రూమ్, ఆర్మీ సెట్టింగ్, స్కూల్ సెట్టింగ్ వంటి వందల రకాల సెటప్స్ అందుబాటులో ఉన్నాయి.

ఫొటోస్.. హై క్వాలిటీ

వీడియో షూట్‌తోపాటు ఫొటోలు కూడా తీయిస్తున్నారు. వీటిని కూడా హైక్వాలిటీతో తీసి ఆల్బమ్స్‌గా అందజేస్తున్నారు. మ్యాట్ ఫినిషింగ్, ఎంబోజ్, గ్లిట్టర్, త్రీడీ రూపంలో ఆల్బమ్‌లో ఒక్కో పేజీని ప్రింట్ చేస్తున్నారు. ఆల్బమ్‌పై ఉన్న కవర్‌పేజీ కూడా ఎంతో సృజనాత్మకంగా డిజైన్ చేయిస్తున్నారు.



ఉదయం నుంచి...

మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు ఇప్పుడు ఎక్కువగా ఫొటోషూట్స్‌కు వస్తున్నారు. కాస్త డబ్బు ఎక్కువ అయినా సరే మంచి సెట్టింగ్ కావాలని అడుగుతున్నారు. మా దగ్గరకు వచ్చేవారిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారు. ఒక్కో ఫొటోషూట్ చేసేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు సమయం పడుతుంది. షూట్స్‌కి వచ్చే క్లయింట్స్‌కు భోజనంతోపాటు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం.



విష్ణుప్రసాద్‌గౌడ్
స్టూడియో ఓనర్

రూ.10 వేల పైమాటే..

ఫొటోషూట్స్ ప్యాకేజీ ఒకరోజుకు రూ.10 వేల నుంచి అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే చాలామంది రూ.20 వేలకు పైగా ఉన్న థీమ్స్‌నే ఇష్టపడుతున్నారని అంటున్నారు రూ.40 వేల నుంచి లక్ష వరకు ప్యాకేజీలు ఉన్నాయి. ఎంత ఖర్చయినా కూడా వెనుకాడకుండా ప్యాకేజీలు సెలెక్ట్ చేసుకొని పిల్లల షూట్స్ చేయించేవారూ ఉన్నారు.

హాబీగా మొదలై..



రమ్యశ్రీ,
స్టూడియో ఓనర్

అప్పుడప్పుడూ ఇంట్లో పిల్లల ఫొటోలు తీయడం అలవాటు. మా ఆయన ఫొటోగ్రాఫర్ కావడంతో ఫొటోషూట్స్‌పై కాస్త అవగాహన ఉంది. దీంతో ఇండోర్‌లోనే సెట్టింగ్స్ వేసి షూటింగ్స్ చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. వెంటనే ఈ వ్యాపారం ప్రారంభించాం. ఇప్పుడు చాలామంది పిల్లలు ఫొటో షూట్స్‌కు వస్తున్నారు. నెలకు 40 వరకు ఫొటోషూట్స్ తీస్తున్నాం.

..మైక్‌లో అనౌన్స్‌మెంట్



గ్రామాల్లో ప్రజలకు ఏదైనా సమాచారం అందించాలంటే దండోరా వేస్తుంటారు. దండోరా వేసే వ్యక్తి గ్రామంలోని కూడళ్లు, వీధుల్లో తిరుగుతూ డప్పు చప్పుడు చేస్తూ.. అందరికీ వినపడేలా గట్టిగా అరుస్తూ చెప్పేవారు. ఆ వ్యక్తి గ్రామమంతా తిరగాల్సి ఉంటుంది. కానీ మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో భిన్నంగా ఏర్పాటు చేశారు. గత సర్పంచ్ ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసిన మధుకృష్ణ.. తాను గెలిస్తే గ్రామంలో మైక్ సిస్టమ్ ఏర్పాటు చేస్తానని ప్రతిపాదించారు. ఆయన ఓడిపోయినా.. సర్పంచ్‌గా గెలిచిన ఆంజనేయులు, గ్రామ యువకుల సహకారంతో మైకులు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో అనౌన్స్‌మెంట్ మైక్, యాంప్లిఫయర్ వ్యవస్థను పెట్టారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ప్రతీ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న స్తంభాలకు మైకులు అమర్చారు. వాటికి గ్రామ పంచాయతీ కార్యాలయంలోని సౌండ్ సిస్టమ్‌కు వైర్లతో కనెక్షన్ ఇచ్చారు. ఇప్పుడు గ్రామస్తులకు ఏ విషయం చెప్పాలన్నా.. పంచాయతీ కార్యాలయంలోని మైక్ ముందు కూర్చుని ప్రకటిస్తే చాలు. క్షణాల్లో గ్రామమంతా వినిపిస్తుంది. ఒకటికి రెండుసార్లు చెప్పే అవకాశమూ వచ్చింది.



క్షణాల్లో సమాచారం వెళ్తుంది..

మా గ్రామం మిగతా గ్రామాలకు దీటుగా ఉంటుంది. ఏ సమాచారం అయినా నిమిషాల వ్యవధిలో ఊరంతా చేరుతుంది. పండుగలు, గ్రామంలో ఏవైనా కార్యక్రమాలు, ఇతర ముఖ్య సమాచారమంతా మైకుల ద్వారా ప్రకటిస్తారు. చాలా సులువుగా కావాల్సిన విషయాలు తెలుస్తున్నాయి.

క్యాతం మధుకృష్ణ,
లక్ష్మాపూర్



ప్రకృతి నిలయం

ఇల్లంతా మొక్కల మయం...

ఇంటి చుట్టూ వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు

పక్షులకు ఆవాసంగా.. అనుకూలంగా..

- వివరాలు 13లో



టీడీఆర్.. ఇక ఆన్‌లైన్..

హెచ్‌ఎండీఏలో ఆన్‌లైన్ టీడీఆర్ అమల్లోకి వచ్చింది. శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చారు. -12లో

'రూపవతి' రాకకు బ్రేకులు

సాక్షి, సిటీబ్యూరో: బీబీ కా ఆలం, బోనాల సందర్భంగా రూపవతి ఏనుగు ఊరేగింపునకు బ్రేకులు పడ్డాయి. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను భారత ప్రభుత్వం పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖ నిలిపివేసింది. జంతువుల తరలింపులపై కొత్త నిబంధనల కారణంగా రూపవతి రాకకు కేంద్రం బ్రేకులు వేసింది.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.0/24.0

నగరంలో రాబోయే 24 గంటల్లో ఓ మోస్తరు వర్షం పడవచ్చు. గరిష్ఠంగా 33, కనిష్ఠంగా 24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను వెంటనే ప్రారంభించాలి: కేటీఆర్



సాక్షి, సిటీబ్యూరో: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనులు పూర్తి చేసిన గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను వెంటనే ప్రారంభించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరగటానికి ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపట్ల కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గోపన్‌పల్లి ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే నల్లగండ్ల, గోపన్‌పల్లి, తెల్లాపూర్, చందానగర్ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయన్నారు. దీన్ని కేవలం ప్రారంభించాల్సి ఉన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైనా ప్రారంభించకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఫ్లై ఓవర్‌ను ప్రారంభించాలని, లేదంటే ప్రజలే ప్రారంభించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

డెంగీ నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



సాక్షి, సిటీబ్యూరో: డెంగీ నివారణకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సూచించారు. శుక్రవారం సంబంధిత విభాగాల అధికారులు, జోనల్ కమిషనర్లతో నగరంలో డెంగీ నియంత్రణకు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. డెంగీ హాట్ స్పాట్ పాయింట్స్ గుర్తించి, సదరు ప్రాంతాల్లోని ప్రజలకు, పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. నమోదైన డెంగీ కేసుల వివరాలు, సంబంధితుల చిరునామాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల నుంచి తీసుకోవాలని తెలిపారు. జోనల్ కమిషనర్లు తమ తమ పరిధిలో డెంగీ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వల్నరబుల్ గార్బేజ్ పాయింట్ల తొలగింపు చర్యలను వేగవంతం చేయాలని, ఎంటమాలజీ వర్కర్స్, శానిటేషన్ కార్మికుల హాజరు శాతం మెరుగుపర్చాలని సూచించారు. అక్రమ భవన నిర్మాణాలను ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. వాటర్ స్టాగ్నేషన్ పాయింట్స్, సంపుల నిర్మాణ ప్రతిపాదనలు వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జోనల్ కమిషనర్లు, శానిటేషన్, ఎంటమాలజీ, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దమ్మ తల్లి శాకంబరి ఉత్సవాలు



శాకంబరి ఉత్సవాల కోసం సిద్ధంగా కూరగాయలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు శాకంబరి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ వర్గాలు ఏర్పాట్లు పూర్తిచేశాయి. ఉత్సవాల కోసం ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో సర్వాంగ సుదరంగా ముస్తాబు చేశారు. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు అమ్మవారికి అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం శ్రీవిఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, నవగ్రహ మంటపారాధనలు, కలశ స్థాపన, అరుణ పారాయణం, దేవీ భాగవతం, చండీ పారాయణం, నవగ్రహ రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం సామూహిక శ్రీలలితా సహస్ర నామ కుంకుమార్చన, రాత్రి పెద్దమ్మ తల్లి ఉత్సవమూర్తి పల్లకి సేవ నిర్వహించనున్నారు. సోమవారం నవగ్రహ హోమం, రుద్ర చండీహోమాలు, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన జరగనున్నాయి. రాత్రి 8 గంటలకు పెద్దమ్మ తల్లి ఉత్సవ మూర్తి పల్లకి సేవ, విశేష బాణసంచా విన్యాసాలు కన్నులపండువగా జరగనున్నాయి. అనంతరం రాత్రి 9 గంటలకు దేవస్థానంలో అలంకరించిన కూరగాయలను భక్తులకు వితరణ చేయనున్నారు. మూడురోజుల పాటు మధ్యాహ్నం ఒంటి గంటకు ఉచిత అన్నప్రసాద వితరణ ఉంటుంది.

కుల గణన చేసే వరకూ పోరాటం ఆగదు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ కోఆర్డినేటర్ ఉప్పర శేఖర్ సగర ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి కామారెడ్డి టు కరీంనగర్ వరకు నిర్వహించనున్న సమగ్ర కులగణన సాధన యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 31 వరకు 10 జిల్లాల్లో 'సమగ్ర కుల గణన సాధన యాత్ర' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లో ముగింపు సభను నిర్వహిస్తామన్నారు. యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కోఆర్డినేటర్ వేముల వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ సంఘాల నేతలు కనకాల శ్యాం కుర్మ, గొడుగు మహేష్ యాదవ్, మణిమంజరి, రేణుక పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి..

కేబీఆర్ చుట్టూ 6 ఫ్లై ఓవర్లు

- పాత ప్రతిపాదనలకు కొత్త ప్రభుత్వం చర్యలు
- ఫ్లై ఓవర్లతో పాటు అండర్‌పాస్‌లు కూడా..



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి చేపట్టిన ఎస్సార్‌డీపీలో భాగంగా గత ప్రభుత్వం చేయలేక పోయిన కొన్ని పనుల్ని ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు చేయాలని భావిస్తోంది. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దాలనే ఆలోచనలో భాగంగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, రవాణా సదుపాయాలకు అధిక ప్రాధాన్యమిచ్చింది. హెచ్‌ఎండీఏ పరిధి వరకు ట్రాఫిక్ చిక్కులు లేని సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కోసం దాదాపు రూ.25 వేల కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. ఆ పనుల్ని ఐదు ఫేజ్‌ల్లో చేయాలని భావించింది. అందులో భాగంగా తొలిదశలో కేబీఆర్ పార్కు కేంద్రంగా వివిధ ప్రాంతాలకు వెళ్లేవారికి ట్రాఫిక్ చిక్కుల్లేకుండా చేసేందుకు ఆరు పనులకు దాదాపు రూ.586 కోట్ల అంచనాతో ప్రణాళిక రూపొందించింది. అయితే.. క్షేత్రస్థాయి పరిస్థితుల్ని బట్టి, ఎదురైన ఆటంకాలతో మెజార్టీ పనుల్ని వాయిదా వేసింది. ఆయా ఫేజ్‌ల్లోని పనులు మారిపోయాయి. ఐదు ఫేజ్‌లు సైతం మారిపోయాయి. అయినా ఐదు ఫేజ్‌ల్లో పేర్కొన్న పనుల్లో చాలా పనుల్ని ఆ ప్రభుత్వం పూర్తిచేసింది.

- అప్పుడు ఫేజ్–1లో భాగంగా కేబీఆర్ పార్కు ఎంట్రన్స్ జంక్షన్, ఫిల్మ్‌నగర్ జంక్షన్, రోడ్ నెంబర్ 45 జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్, ఎన్‌ఎఫ్‌సీఎల్–కేబీఆర్‌పార్కు ఎంట్రన్స్, రోడ్‌నెంబర్ 45– దుర్గం చెరువు వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలనుకున్నారు. కానీ.. వీటిలో రోడ్‌నెంబర్ 45– దుర్గం చెరువు వరకు ఎలివేటెడ్ కారిడార్ మాత్రమే పూర్తయింది. మిగతావి పూర్తి కాలేదు. అందుకు కారణం కేబీఆర్ పార్కు ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఉండటం, కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు కావాల్సి ఉండటంతో పాటు పర్యావేరణ వేత్తల అభ్యంతరాలు వంటి వాటితో ఆ పనులు ప్రారంభం కాలేదు. మరోవైపు హైకోర్టులోనూ కేసులున్నట్లు సమాచారం.

1. జూబ్లీ చెక్‌పోస్ట్
2. రోడ్ నెంబర్– 45
3. ఎల్‌వీ ప్రసాద్
4. బసవతారకం కేన్సర్ హాస్పిటల్
5. మహారాజా అగ్రసేన్
6. ఫిల్మ్‌నగర్ ..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేబీఆర్ చుట్టూ ఆగిపోయిన ప్రాజెక్టుల్ని చేపట్టే యోచనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నట్లు తెలిసింది. మున్సిపల్ పరిపాలన శాఖ కూడా ఆయన వద్దే ఉండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరిగి

సీఎం రేవంత్ చొరవతో..

దిగువ ప్రాంతాల వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణాలకు సంబంధించి కన్సల్టెంట్ సేవల్ని జీహెచ్‌ఎంసీ కోరుతోంది. త్రీడీ డిజైన్‌లో వాటిని అందజేయాల్సిందిగా తెలిపింది. అంటే ప్రస్తుతం ఆయా జంక్షన్లలో పరిస్థితులు, ట్రాఫిక్ రద్దీ, ఫ్లై ఓవర్లు పూర్తయితే ఎలా ఉంటాయి.. ట్రాఫిక్ చిక్కులు ఎలా తగ్గుతాయి.. సిగ్నల్ ఫ్రీగా ఎలా సదుపాయంగా ఉంటుంది అనే అంశాల్ని యానిమేషన్ ద్వారా ప్రదర్శించాల్సి ఉంటుంది.

వీటిలో బసవతారకం కేన్సర్ హాస్పిటల్ వద్ద తొలుత ప్రతిపాదనలున్నప్పటికీ, అనంతరం తొలగించారు. తిరిగి ఇప్పుడు మళ్లీ అక్కడ కూడా ఫ్లై ఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు.

- ఫ్లై ఓవర్లతో పాటు అండర్‌పాస్‌లు సైతం నిర్మించనున్నారు. ట్రాఫిక్ ఫ్రీ కోసం చేపట్టే పనులకు ఎక్కువ నిధులు ఖర్చు కాకుండా ఉండేందుకు అండర్‌పాస్‌లను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

సిటీ హార్ట్‌గా ..

కేబీఆర్ పార్కు అనేది నగరానికి హార్ట్‌లా ఉండటంతో పాటు సంపన్న వర్గాలు, సినీతారలు, రాజకీయ ప్రముఖులు, తదితర వీఐపీలు నిత్యం సంచరించే ప్రాంతం కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆ జంక్షన్లపై దృష్టి సారించినట్లు తెలిసింది. కేంద్రం నుంచి అవసరమైన అనుమతులకు సైతం అభ్యంతరాలు ఉండవనే ధీమాతో ప్రభుత్వం ఉంది.

ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో 'మేక్ ఇట్ మెట్రో'



కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తనికెళ్ల భరణి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా టీ–వర్క్స్ కొత్త ఆవిష్కణలకు నాంది పలికింది. ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి మేక్ ఇట్ మెట్రో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీ–వర్క్స్–ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రూపొందించిన 'మేక్ ఇట్ మెట్రో'ను శుక్రవారం ఉదయం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో నూతన ఆవిష్కరణలకు టీ–వర్క్స్ గొప్ప అవకాశమని పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రాన్ని మేకర్‌గా మార్చడానికి గల అనుకూలతలు జయేష్ రంజన్ వివరించారు. ముఖ్యంగా ఎవరైనా మేకర్‌గా మారవచ్చని, దాని కోసం ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. మేకర్‌గా కల ఉన్నతమైనదైతే దాని సాకారం కోసం ఇక్కడే నూతన సంస్కృతిని నిర్మించాలని సూచించారు. టీ–వర్క్స్ ప్రతినిధి అజయ్ మాట్లాడుతూ... ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో టీ–వర్క్స్ ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మేక్ ఇట్ మెట్రో ఈవెంట్‌లో వివిధ వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కేవీబీ రెడ్డి, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళీ వరదరాజన్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రిషి కుమార్ వర్మ, టీ–వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల కలకలం



డెకాయ్ టీమ్‌పై దాడికి యత్నంతోనే..

- నిందితుడి వద్ద గొడ్డలి ఉండటంతో అప్రమత్తం
- ఆత్మరక్షణలో భాగంగానే పోలీసుల కాల్పులు
- ఒకరి కుడి తొడ నుంచి దూసుకుపోయిన తూటా
- మరో యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద గురువారం అర్ధరాత్రి ఘటన



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, స్వాధీనం చేసుకున్న గొడ్డలి (ఇన్‌సెట్లో)



నాంపల్లి: నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద గురువారం అర్ధరాత్రి విధులు నిర్వర్తిస్తున్న డెకాయ్ టీమ్‌పై దాడికి యత్నించిన ఇద్దరు నేరగాళ్లపై పోలీసులు జరిపిన కాల్పుల ఘటనలో ఒకరి కుడి కాలు నుంచి తూటా దూసుకుపోయింది. అతడిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు ఘటనా స్థలి నుంచి పారిపోయిన మరో నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు మధ్య మండల డీసీపీ అక్షాంశ్ యాదవ్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

రంగంలోకి డెకాయ్ బృందాలు..

ఇటీవల కాలంలో నగరంలో చోటు చేసుకున్న ఉదంతాల నేపథ్యంలో ఉన్నతాధికారులు డెకాయ్ బృందాలను రంగంలోకి దింపారు. సాయుధుడైన ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) కానిస్టేబుల్ సహా ఇద్దరు ఒక్కో బృందంలో ఉంటారు. నేరాలు జరిగే అవకాశం ఉన్న, గతంలో జరిగిన ప్రాంతాల్లో ఈ టీమ్స్ రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 5 వరకు విధుల్లో ఉంటాయి. మధ్య మండలానికి చెందిన డెకాయ్ టీం గురువారం రాత్రి నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద విధులు నిర్వర్తిస్తోంది. అక్కడ ఫుట్‌పాత్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించడాన్ని అర్ధరాత్రి 12.10 గంటలకు ఈ బృందం గమనించింది. సమీపంలో వెళ్లగా.. ఒకరి నడుము వద్ద గొడ్డలి ఉండటాన్ని గమనించారు. దాని పిడి బయటకు కనిపిస్తుంటంతో అప్రమత్తమైన టీం వారిని ప్రశ్నించేందుకు ప్రయత్నించింది. దీంతో ఒకరు తమ వద్ద ఉన్న గొడ్డలితో, మరొకరు సమీపంలోని రాళ్లతో దాడికి దిగారు.

లొంగిపోవాలని హెచ్చరించినా..

రైల్వేస్టేషన్ ముఖద్వారం పక్కన ఉన్న చిల్లా వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో అప్రమత్తమైన ఏఆర్ కానిస్టేబుల్ తన వద్ద ఉన్న తుపాకీ చూపిస్తూ లొంగిపోవాల్సిందిగా హెచ్చరించారు. అయినప్పటికీ ఆ ద్వయం దాడికి ప్రయత్నం కొనసాగించడంతో తొలుత గాలిలోకి ఒక రౌండ్, ఆపై ఆత్మరక్షణ కోసం ఓ దుండగుడిపై మరో రౌండ్ కాల్చారు. ఈ తూటా అతడు కుడి తొడ నుంచి దూసుకుపోవడంతో అక్కడికక్కడే కూలిపోగా.. మరొకడు పారిపోయాడు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు అతడు మాన్గార్ బస్తీకి చెందిన కె.రాజు (19)గా గుర్తించారు. అతడి ద్వారానే పరారైంది అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాజా అలియాస్ అయాన్‌గా (19) తెలుసుకున్న పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి పట్టుకున్నారు. వీరిపై గతంలో ఎలాంటి కేసులు నమోదు కానప్పటికీ ప్రాథమిక విచారణ నేపథ్యంలో ఇటీవలే నాలుగు నేరాలు చేసినట్లు వెలుగులోకి వచ్చింది.



గాయపడ్డ రాజు



పోలీసుల అదుపులో అయాన్

క్షతగాత్రుడికి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స..

కాల్పుల ఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడు రాజుకు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. అతని కుడికాలులో దూసుకెళ్లిన తూటాను తొలగించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

అర్ధరాత్రి వేళ ప్రయాణికులే టార్గెట్

రోజంతా డ్రైవింగ్ చేసి బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద సేదతీరుతున్న ఆటోడ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లను టార్గెట్‌గా చేసుకుని వీళ్లు నేరాలు చేస్తున్నారు. వారి వద్ద, వాహనాల్లోనే ఉన్న మొత్తాలతో పాటు సెల్‌ఫోన్లు తస్కరిస్తున్నారు. పిక్‌పాకెటింగ్స్ కూడా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఫుట్‌పాత్స్‌పై నిద్రిస్తున్న వారినీ విడిచిపెట్టని ఈ ద్వయం గురువారం రాత్రి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద నిద్రిస్తున్న వ్యక్తి నుంచి రూ.400 తస్కరించారు. తాము నేరం చేస్తున్నప్పుడు ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేసినా, ప్రతిఘటించినా దాడి చేయడానికి గొడ్డలి దగ్గర పెట్టుకున్నట్లు నిందితులు అంగీకరించారు. ఇతర ప్రాంతాల నుంచి అర్ధరాత్రి వేళ వచ్చే రైలు ప్రయాణికులను టార్గెట్‌గా చేసుకుని ఇరువురూ అక్కడకు వచ్చినట్లు తెలుస్తోంది. గత నెల 13 అర్ధరాత్రి ఇదే ప్రాంతంలో ఓ గుర్తు తెలియని యువకుడి (35)పై పిక్‌పాకెటర్లు దాడి చేసి అత్యంత కిరాతంగా హత్య చేశారు. ఈ ఉదంతం తర్వాత పోలీసులు నిఘా ముమ్మరం చేశారు.

యాచకుడి ప్రాణం తీసిన ట్రావెల్స్ బస్సు

- ఆగి ఉన్న వాహనం కింద పడుకోవడంతో దుర్ఘటన



మృతి చెందిన యాచకుడు

శ్రీనగర్‌కాలనీ: ఆగి ఉన్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కింద పడుకున్న గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. డ్రైవర్ అతడిని గమనించకుండా బస్సును నడిపించడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మధురానగర్ పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ఆర్‌కే ట్రావెల్స్‌కు చెందిన బస్సు విజయవాడ నుంచి వచ్చి అమీర్‌పేటలో ఆగింది. బస్సులోంచి లగేజీని దింపుతున్నారు. ఈ సమయంలో ఓ యాచకుడు బస్సు వెనక చక్రాల కింద పడుకున్నాడు. ఆ సమయంలో అక్కడ వ్యక్తి ఉన్నాడని తెలియని బస్సు డ్రైవర్ రవీందర్ వాహనాన్ని ముందుకు నడిపాడు. దీంతో ఘటన స్థలంలోనే యాచకుడు మృతిచెందాడు. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పతికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న 11 కేవీ ఫీడర్ల సమగ్ర సర్వే

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో 11 కేవీ ఫీడర్ల సమగ్ర సర్వే విజయవంతంగా కొనసాగుతోంది. గత నెల 24 నుంచి హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ సహా ఉమ్మడి జిల్లాల పరిధిలోని 44 పట్టణాలు/నగరాల పరిధిలో సర్వే చేస్తున్న విషయం తెలిసిందే. 3,380 ఫీడర్లలో ఇప్పటికే దాదాపు 90శాతం ఫీడర్ల సర్వే పూర్తయింది. సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల వారీగా ఉన్న లోపాలను గుర్తించి సంస్థ రూపొందించిన టీజీఏఐఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. సెక్షన్ల వారీగా చేయాల్సిన పనులపై అంచనాలు రూపొందించేందుకు ఈ వివరాలు కీలకంగా మారబోతున్నాయి. మరమ్మతులు, నిర్వహణ సులభతరమవుతుందని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని శుక్రవారం సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పేర్కొన్నారు.

నగరంలో మెరుగుపడిన శాంతిభద్రతలు

- గణనీయంగా తగ్గుముఖం పట్టిన రోడ్డు ప్రమాదాల సంఖ్య
- ప్రకటన విడుదల చేసిన ముఖ్యమంత్రి కార్యాలయం

గతంతో పోలిస్తే తగ్గిన హత్యలు, హత్యాయత్నం కేసులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో శాంతిభద్రతలు గత ఏడాదితో పోలిస్తే మెరుగయ్యాయని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి తొలి ఆరు నెలల గణాంకాలను విశ్లేషిస్తూ హత్యలు, హత్యాయత్నాలు, దాడులు తగ్గాయంటూ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రోడ్డు ప్రమాదాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గినట్లు పేర్కొంది. 2023లో జనవరి–జూన్ మధ్య 47 హత్యలు జరగ్గా.. ఈ ఏడాది ఆ సంఖ్య 45గా ఉందని పేర్కొంది. హత్యాయత్నాల సంఖ్య కూడా 155 నుంచి 145కి తగ్గిందని.. వీటి ప్రకారం హత్యల్లో 5 శాతం, హత్యాయత్నాల్లో 8 శాతం తగ్గుదల నమోదైందని వివరించింది. తీవ్రమైన దాడుల కేసులు 151 నుంచి 103కు తగ్గినట్లు పేర్కొంది. ఈ కాలంలో లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పటికీ దాడులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు సఫలమయ్యారని స్పష్టం చేసింది. నగరంలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, గతేడాది తొలి ఆరు నెలల కాలంలో డ్రగ్స్‌కు సంబంధించి 103 కేసులు నమోదు చేస్తే ఈ ఏడాది ఆ సంఖ్య 151కి చేరిందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ఈ కేసులు నమోదు, నిందితుల అరెస్టు విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉండటమే ఇందుకు కారణమని వివరించింది. రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య గత ఏడాది 209 ఉండగా.. ఈ ఏడాది 160కి తగ్గిందని పేర్కొంది.

సీజనల్ వ్యాధులపై అవగాహన

లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ వ్యాప్తంగా శుక్రవారం డ్రై డే నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా విభాగాల అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని సర్కిళ్లలో కాలనీ ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, జాగ్రత్తల గురించి వివరించారు. దోమల, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, ఇంట్లో ఉన్న పనికిరాని వస్తువులు తీసివేయాలని చెప్పారు. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, బల్దియా అధికారులు పలువురు పాల్గొన్నారు.

తొలిసారిగా ట్రాఫిక్ మార్షల్స్

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సహకారంతో పలువురు యువకులను ట్రాఫిక్ మార్షల్స్‌గా ఎంపిక చేశారు. వీరికి ట్రాఫిక్ నియంత్రణ, వాహన రద్దీ క్రమబద్ధీకరణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శుక్రవారం నుంచి ట్రాఫిక్ మార్షల్స్ విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ అవినాష్ మహంతి మాట్లాడుతూ.. క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పనిచేసి పోలీస్ శాఖకు వన్నెతెచ్చే విధంగా ట్రాఫిక్ మార్షల్స్ విధులు నిర్వర్తించాలని సూచించారు.

ఆలిని చంపి అదృశ్యమయ్యాడు

బాత్రూంలో మృతదేహాన్ని మూటగట్టి పారిపోయిన భర్త

ఉప్పల్: కట్టుకున్న ఇల్లాలిని అనుమానంతో హత్య చేసి పారిపోయిన ఓ భర్త ఉదంతం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రదీప్ బోలా ఆరు నెలల క్రితం నగరానికి వలస వచ్చాడు. భార్య మధుస్మిత (24)తో కలిసి వచ్చి ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లో అద్దె గదిలో వీరు నివాసముంటున్నారు. వీరికి 10 నెలల కుమారుడు ఉన్నాడు. ప్రదీప్ ఉప్పల్ భగాయత్‌లోని కోణార్క్ టిఫిన్ సెంటర్‌లో మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ప్రదీప్ ఉంటున్న ఇంటి నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తుండటంతో స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. ఉప్పల్ పోలీసులు ఘటన స్థలానికి వచ్చి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా బాత్రూంలో గోనె సంచిలో శవాన్ని కుక్కి మూటగట్టి ఉంది. అందులోంచి కుళ్లిన దుర్వాసన వస్తోంది. మూటను విప్పి చూడగా



నిందితుడు ప్రదీప్ (ఫైల్)



మృతురాలు మధుస్మిత (ఫైల్)

నాలుగు రోజుల క్రితం భార్య మధుస్మితను ప్రదీప్ హత్య చేసి మూటగట్టి పడేసి.. కుమారుడితో పారి పోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. భార్య ప్రవర్తనపై అనుమానంతోనే ఆమెను హత్య చేసి పారిపోయి ఉంటాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

చెయ్యెత్తి.. జైకొట్టి!

వరుసగా కారు దిగుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

మొన్న కాలె యాదయ్య.. నిన్న ప్రకాష్.. తాజాగా 'గాంధీ'

అసెంబ్లీ సమావేశాల నాటికి గ్రేటర్ గులాబీ ఎమ్మెల్యేలంతా ఖాళీ?



అరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే

ప్రకాష్‌గౌడ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే

కాలె యాదయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీకి షాక్‌ల మీద షాక్ ఇస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘోరపరాజయం పాలైన ఆ పార్టీని ఒక్కొక్కరుగా వీడుతున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కారు దిగి హస్తం గూటికి చేరగా.. ఆ తర్వాత నగర మేయర్ విజయలక్ష్మి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీని వీడారు. తాజాగా శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కూడా శనివారం బీఆర్ఎస్‌ను వీడనున్నారు. ఇలా ఒకరి తర్వాత మరొకరు కారు దిగి హస్తం గూటికి చేరుకుంటూ గులాబీ పార్టీ అధిష్టానానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగి.. ఎమ్మెల్యేలను బుజ్జగించే ప్రయత్నం చేసినా.. వలసలు మాత్రం ఆగకపోవడం ఆ పార్టీని ఆందోళనకు గురి చేస్తోంది.

- అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నాటికి గ్రేటర్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా పార్టీని వీడే అవకాశం ఉందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ నవీన్‌రావు సహా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద సహా మరికొంత మంది బీఆర్ఎస్ నేతలు పార్టీ మారనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే వీరంతా రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును, ఏపీ సీఎం చంద్రబాబును కలిశారు. అనంతరం గచ్చిబౌలిలోని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. వీరి చేరికల తర్వాత బీఆర్ఎస్ ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసే అవకాశం ఉంది. ఇదే జరిగితే పదేళ్ల పాటు గ్రేటర్‌లో హవా కొనసాగించిన బీఆర్ఎస్.. త్వరలోనే పూర్తిగా కనుమరుగు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

గాంధీతో పాటు మరికొందరు..

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ఆయనతో పాటు చందానగర్, మియాపూర్, హైదర్‌నగర్, వివేకానందనగర్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. పార్టీ మారుతున్నట్లుగా గాంధీ ఆయన ముఖ్య కార్పొరేటర్లు, డివిజన్ స్థాయి అనుచరులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరికపై గాంధీ బిజీబిజీగా ఉన్నారు. కాగా.. శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్‌లో చేరేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

సమష్టి పోరాటాలతోనే తెలంగాణ సిద్ధించింది

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ ప్రజల సమష్టి పోరాటాలు, నిరంతర కృషితోనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందే తప్ప ఏ ఒక్కరి వల్ల రాలేదని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ భవనంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారు ఇప్పుడు ఏదో ఒక గుర్తింపు, సహాయం ఆశిస్తున్నారని, వారిని ప్రభుత్వం ఆదరించాలని కోరారు. గత పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు సరైన గౌరవం, గుర్తింపు దక్కలేదన్నారు. కాచం సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపు బాధ్యత కోదండరాం సార్‌కి అప్పగిస్తామని, అసలైన నికార్సైన ఉద్యమకారులకే న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విమలక్క, జేఏసీ నాయకులు కేవీ రంగారెడ్డి, కప్పాటి పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ గోదాంపై దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న అల్లం-వెల్లుల్లి పేస్ట్

రాజేంద్రనగర్: యాసిడ్, సింథటిక్ రంగులు, వివిధ రసాయనాలతో అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న గోదాంపై సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. దాదాపు రూ.15 లక్షల విలువైన 7.3 టన్నుల అల్లం, వెల్లుల్లి పేస్టును స్వాధీనం చేసుకున్నారు. దీన్ని పరీక్షల కోసం ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. ఎస్ఓటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీర్ అనే వ్యక్తి బుద్వేల్ గ్రీన్ సిటీలో అప్నా ఎంటర్‌ప్రైజెస్ పేరిట గోదాంను అద్దెకు తీసుకున్నాడు. మొదట ఇందులో వివిధ గరం మసాలాలకు సంబంధించిన ప్యాకింగ్ నిర్వహిస్తామని యజమానికి తెలిపాడు. కానీ అల్లం, వెల్లుల్లి పేస్టును తయారు చేసే మిషన్లను తీసుకొచ్చి బిగించాడు. అల్లం, వెల్లుల్లిలను తయారు చేసేందుకు క్యాబేజీ, ఆలుగడ్డ, అరటి గుజ్జుతో పాటు సింథటిక్ కలర్స్, యాసిడ్, కెమికల్ వాటర్‌ను ఉపయోగించి పేస్టును తయారు చేస్తున్నాడు. ఇందులో కొంత అసలైన అల్లం, వెల్లుల్లి ఉపయోగిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు గోదాంపై దాడి చేశారు. నిందితున్ని అరెస్టు చేసి గోదాం సీజ్ చేశారు.

'డోరీ' ఎగ్జిబిషన్‌లో కిషన్‌రెడ్డి సతీమణి



లక్డీకాపూల్: 'డోరీ' ఏర్పాటు చేసిన ఎస్ లాబెల్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంటోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్ ఎదురుగా పాపప్ స్పేస్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. పాత కాలపు సంప్రదాయ డిజైన్లకు ఆధునికత జోడించి రూపొందించిన ఆభరణాలు, దుస్తులు చాలా బాగున్నాయన్నారు.

రూ. 5 వేలు ఇవ్వకపోతే చంపేస్తా...

బ్లేడుతో యువకుడిని బెదిరించిన నిందితుడి రిమాండ్



నిందితుడు మహ్మద్ ఖాజా

బంజారాహిల్స్: రాత్రిపూట విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ యువకుడిని అడ్డగించి బ్లేడ్ చూపి రూ.5 వేలు డిమాండ్ చేసిన ఘటనలో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని గౌరీశంకర్‌కాలనీలో నివసించే ఓ యువకుడు ఈ నెల 9వ తేదీన రాత్రి 10 గంటల ప్రాంతంలో విధులు ముగించుకుని నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా సింగాడికుంట బస్తీకి చెందిన మహ్మద్ ఖాజా అలియాస్ సోయబ్ (23) అనే మెకానిక్ అడ్డగించాడు. రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తన వద్ద లేవని చెప్పడంతో బ్లేడ్ తీసి మెడ కోసేందుకు యత్నించాడు. బాధితుడు అక్కడి నుంచి తప్పించుకోగా వెంటపడి తీవ్రంగా కొట్టాడు. నిందితుడి నుంచి తప్పించుకుని బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీసి ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు మహ్మద్ ఖాజాను అరెస్టు చేసి బ్లేడ్‌తో పాటు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

నిమిషాల్లో న్యాయం!

- సైబర్ నేరాల్లో గోల్డెన్ అవర్ అత్యంత కీలకం
- బాధితులు వెంటనే ఫిర్యాదు చేస్తే ఫలితం
- రూ.22.2 లక్షలు ఫ్రీజ్ చేయించిన పోలీసులు
- రెండు రోజుల్లో ముగ్గురు బాధితులకు ఊరట

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బాధితులకు 'నిమిషాల్లో న్యాయం' చేస్తున్నారు. గోల్డెన్ అవర్‌లో వచ్చి ఫిర్యాదు చేసిన వారి నగదును వెంటనే ఫ్రీజ్ చేయిస్తున్నారు. బుధ, గురువారాల్లో ముగ్గురు బాధితులకు సంబంధించిన రూ.22.2 లక్షలు ఫ్రీజ్ చేయించామని, చట్ట పరమైన ప్రక్రియలు పూర్తి చేసిన తర్వాత త్వరలోనే ఈ మొత్తం బాధితుల ఖాతాలోకి చేర్చడానికి సన్నాహాలు చేస్తున్నామని డీసీపీ దార కవిత శుక్రవారం ప్రకటించారు. వైద్య రంగంలో పని చేస్తున్న ఓ వ్యక్తి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సైబర్ క్రైమ్ ఠాణాకు వచ్చారు. తాను సైబర్ నేరగాళ్ల బారినపడి రూ.17,45,041 నష్టపోయినట్లు అక్కడి అధికారులకు తెలిపారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ జావేద్ ఈ ఫిర్యాదుపై తక్షణం స్పందించారు. సదరు పోర్టల్‌లో బాధితుడి వివరాలతో ఆన్‌లైన్ కంప్లెయింట్ రిజిస్టర్ చేయడంతో పాటు బ్యాంకు అధికారులను అప్రమత్తం చేశారు. ఆ అధికారుల స్పందనతో కేవలం 22 నిమిషాల్లోనే బాధితుడి ఖాతా నుంచి వివిధ ఖాతాల్లోకి వెళ్లిన నగదు మొత్తం ఫ్రీజ్ అయింది. గురువారం సాయంత్రం 6.55 గంటలకు ఓ బాధితుడు సైబర్ క్రైమ్ ఠాణా మెట్లు ఎక్కారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న పోర్టల్ ఆఫీసర్ శ్రీకాంత్ నాయక్ తక్షణం స్పందించారు. ఫలితంగా 21 నిమిషాల్లో బాధితుడికి సంబంధించి రూ.3.79 లక్షలు ఫ్రీజ్ అయ్యాయి. అదే రోజు అర్ధరాత్రి సైబర్ నేరం బారినపడిన మరో ప్రైవేట్ ఉద్యోగి సైతం ఏమాత్రం ఆలస్యం చేయకుండా సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌కు వచ్చారు. అప్పుడు రాత్రి విధుల్లో ఉన్న బి.సందీప్ జరిగిన విషయం తెలుసుకున్నారు. తక్షణం స్పందిస్తూ బాధితుడి ఖాతా నుంచి రూ.97,312 బదిలీ అయిన లోకాన్ సొల్యూషన్స్ సంస్థను సంప్రదించి విషయం చెప్పారు. దీనిపై స్పందించిన ఆ సంస్థ ఆ మొత్తం సైబర్ నేరగాడికి చేరకుండా ఫ్రీజ్ చేస్తున్నామని, వారం నుంచి పది రోజుల్లో బాధితుడి ఖాతాకు తిరిగి పంపిస్తామని బదులిచ్చింది. సైబర్ నేరాల్లో మోసం పోవడం ఎంత తేలికో... ఈ కేసులు కొలిక్కి రావడం అంత కష్టం. పోలీసుల చర్యలతో నిందితులు చిక్కినా... రికవరీలు అనేది దుర్లభం. ఈ నేపథ్యంలోనే బాధితులు 'గోల్డెన్ అవర్'లో అప్రమత్తం కావడంతో పాటు తక్షణం పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరుతున్నారు. నేరం బారినపడిన తర్వాత తొలి గంటనే గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారు. ఆ తర్వాత ఎంత ఆలస్యమైతే నగదు వెనక్కు వచ్చే అవకాశాలు అంత తగ్గిపోతుంటాయి. ఆర్థికాంశాలతో ముడిపడి ఉన్న సైబర్ నేరాల్లో బాధితులైన వాళ్లు తక్షణం 1930 నెంబర్‌కు కాల్ చేసి లేదా (cybercrime.gov.in)కు లాగిన్ అయి ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ డీసీపీ కవిత చెప్పారు.

ఐఎల్‌సీఏ4 విజేతలు యువరాజ్, సౌమ్య

యూత్ ఓపెన్ రెగెట్టా



సాక్షి, హైదరాబాద్: హుస్సేన్ సాగర్ జలాల్లో సికింద్రాబాద్ క్లబ్ నిర్వహించిన యూత్ ఓపెన్ రెగెట్టా చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ముగిశాయి. తొమ్మిది వేర్వేరు కేటగిరీల్లో అండర్-15, అండర్-17, అండర్-19 విభాగాల్లో కలిపి 80 మందికి పైగా సెయిలర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ లేజర్ క్లాస్ అసోసియేషన్ (ఐఎల్‌సీఏ) 4 బాలుర విభాగంలో శరణ్య యువరాజ్ జాదవ్ (ఎన్‌బీఎస్‌సీ) విజేతగా నిలవగా...బి.శశాంక్ (ఎస్ఎస్ఎస్), అక్షత్ కుమార్ దొహారే (ఎస్ఎస్ఎస్) తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఐఎల్‌సీఏ 4 బాలికల విభాగంలో సౌమ్య సింగ్ పటేల్ (ఎస్ఎస్ఎస్) స్వర్ణం గెలుచుకోగా...ఆలియా సబ్రీన్ (ఓవైఏ), మాన్య రెడ్డి (ఎస్ఎస్‌సీ) రజత, కాంస్యాలు అందుకున్నారు.

సీబీఐ ఆఫీసర్లమంటూ మోసం.. ఇద్దరి రిమాండ్

సిటీ కోర్టులు : సీబీఐ ఆఫీసర్లమంటూ ఏడుగురు వ్యక్తులు భారీ మోసానికి ఒడిగట్టారు. ఓ వ్యక్తిని మోసగించి రూ.63.89 లక్షలు ఎత్తుకెళ్లారు. ఇందులో ఇద్దరికి శుక్రవారం నాంపల్లి కోర్టు 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ 16 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించింది. గత జూన్ 2న నగరానికి చెందిన పోలీస్ నాగభూషణం అనే వ్యక్తికి సీబీఐ ఆఫీసర్లమంటూ మధ్యప్రదేశ్ నుంచి ఓ కాల్ వచ్చింది. మీరు మనీలాండరింగ్, మానవ అక్రమ రవాణ, వేధింపులకు పాల్పడ్డారని, మీపై కేసులు మీపై నమోదయ్యాయని బెదిరించారు. మీరు కేసు నుంచి బయటపడాలంటే 48 గంటల్లో అడిగిన డబ్బులు ఇవ్వాలని చెప్పగా..ఆయన భయపడిపోయి రూ. రూ.63.89 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ఏడుగురు నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన వారు మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. వీరిలో ముద్దం రమేశ్, జి.మహేశ్‌లను జూన్ 27న అరెస్టు చేశారు. అన్మోల్ మహానా, ప్రదీప్ గుల్జార్‌ను జులై 9న అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించింది. వీరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. మిగతా వారి కోసం గాలింపు చేపట్టారు.

ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్లపై వేటు!

నార్సింగి సెక్షన్‌లో అడ్డగోలు ఎల్సీలపై సీఎండీ సీరియస్

సాక్షి, సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా ఎల్సీలు తీసుకుని, గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేసిన సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని ఇబ్రహీంబాగ్ డివిజన్ నార్సింగి సెక్షన్ ఏఈ టి.సందీప్‌రెడ్డి, లైన్‌మెన్ ఇన్స్‌పెక్టర్ మనోహర్‌బాబులపై డిస్కం వేటు వేసింది. ఈ మేరకు శుక్రవారం వారికి సస్పెన్షన్ నోటీసులు జారీ చేసింది. వివేకానంద ఫీడర్ పరిధిలో జూన్ 29న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ జారీ, 11కేవీ లైన్ పోల్ షిఫ్టింగ్, కొత్తగా స్తంభాలు నాటే పనుల కోసం నిర్దేశిత సమయానికి మించి ఎల్సీ తీసుకున్నారు. డిస్కం నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా గుట్టుగా మరికొన్ని పనులు చేపట్టి..సరఫరాలో అంతరాయానికి కారణమయ్యారు. ఇదే అంశంపై డిస్కంకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ అంశంపై సీఎండీ విచారణకు ఆదేశించగా, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, గుత్తేదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు చర్యలకు ఉపక్రమించారు. ఇదిలా ఉంటే ఈ నెల తొమ్మిదిన మాసబ్‌ట్యాంక్ సమీపంలోని చాచానెహ్రూపార్క్ వద్దనున్న 100 కేవీఏ ట్రాన్స్ ఫార్మర్లో సాంకేతిక లోపం తలెత్తింది. సరఫరాను పునరుద్ధరించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో అసిస్టెంట్ ఇంజనీర్ నాగ చైతన్య, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మల్లయ్యలకు డిస్కం షోకాజ్ నోటీసులు జారీ చేయడం తెలిసిందే.

ట్రాన్స్‌జెండర్ దారుణ హత్య



ఘటనా స్థలంలో షీలా మృతదేహం..

సనత్‌నగర్: సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫతేనగర్-వాల్మీకినగర్ సమీపంలో ఓ ట్రాన్స్‌జెండర్ హత్యకు గురయ్యాడు. బాలానగర్ ఏసీపీ హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం వాల్మీకినగర్ సమీపంలో ఓ మృతదేహం ఉందంటూ డయల్ 100 ద్వారా బాలానగర్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులు ఇచ్చిన సమాచారాన్ని బట్టి ఆ మృతదేహం ట్రాన్స్‌జెండర్ షీలా అలియాస్ షేక్ సాజిద్ అహ్మద్ అబ్బాస్ (30)గా గుర్తించారు. వరంగల్ జిల్లాకు చెందిన షీలా కొన్నేళ్లుగా బాలానగర్ హెచ్ఎంటీ సొసైటీలో నివాసం ఉంటున్నారు. షీలా చేతులపై గోళ్లతో రక్కిన గాయాలు, కాలికి కాలిన గాయాలు, తల నుంచి రక్తస్రావం జరిగినట్లుగా ఆనవాళ్లు కన్పించాయి. దీంతో తలపై కర్రతో గానీ, బండరాయితో గానీ కొట్టి హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. హత్య జరిగిన ప్రాంతానికి వెళ్లే రహదారుల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కాగా ఈ కేసులో ఓ రౌడీషీటర్‌తో సహా నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇక ఈ హత్యకు నిరసనగా ట్రాన్స్‌జెండర్లు శుక్రవారం సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. వీరికి పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య మద్దతు తెలిపారు.

ఇస్రో రిటైర్డు సైంటిస్టు సెల్‌ఫోన్‌ను రికవరీ చేసిన పోలీసులు

లాలాపేట: ఇస్రో రిటైర్డు సైంటిస్టు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఓయూ పోలీసులు రికవరీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓయూలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌తో కలిసి ఏసీపీ జగన్ వివరాలు వెల్లడించారు. తార్నాకలో ఉంటున్న ఇస్రో రిటైర్డు సైంటిస్టు గోపాల్ ఈ నెల 6న రాత్రి బెంగుళూరుకు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అయితే రైలు ఆలస్యంగా వెళ్తుందని తెలుసుకుని అదే రాత్రి 11 గంటల ప్రాంతంలో తార్నాకలోని ఇంటికి వెళ్లడానికి రైల్వే స్టేషన్ వద్ద ఆటో కోసం వేచి ఉన్నాడు. ఈ క్రమంలో బోయిన్‌పల్లికి చెందిన ఆంథోనీ ఫ్లెక్స్ ఖాన్(29) తన వాహనంపై అక్కడికి వచ్చి లిఫ్ట్ ఇస్తానని, తనకు రూ.200 ఇవ్వాలని కోరగా గోపాల్ నమ్మాడు. తార్నాకలోని గోపాల్ ఉంటున్న హ్యాపీ హోమ్స్ అపార్టుమెంట్ వద్ద అతన్ని డ్రాప్ చేశాడు. దీనికి ప్రతిగా ఆన్‌లైన్‌లో డబ్బులు పంపేందుకు ప్రయత్నించగా ఫలించలేదు. దీంతో గోపాల్ తన జేబులోంచి డబ్బులు తీసి ఇస్తుండగా..అకస్మాత్తుగా ఆంథోనీ సెల్‌ఫోన్‌ను, రూ.1700 నగదును లాక్కొని ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. వెంటనే గోపాల్ ఓయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు శుక్రవారం దుండగుడు లాక్కెళ్లిన సెల్‌ఫోన్‌ను విక్రయిస్తుండగా పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ సేవలు అభినందనీయం

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ బంజారా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బంజారా బజార్ ఎడిషన్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు వినియోగించడం అభినందనీయమని, ఇది చాలా గొప్ప విషయమని అన్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు మన్మీత్ మాట్లాడుతూ మహిళా ఎంట్రిప్రెన్యూనర్లను ప్రోత్సహించేందుకు తాము ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో 65 మంది మహిళలు వివిధ రకాల చేతి వృత్తుల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా హిజ్రాలు తయారు చేసిన జూట్ బ్యాగులను సైతం ఇక్కడ విక్రయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు కార్యదర్శి సవిత, రోమాగాంధీ, అంజలి బన్సాల్, ఇందిరా డొచానియా, రశ్మి దోషి, ఉషా చౌదరి, నవనీతా సంఘి, వీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల కోసం సమయం కేటాయించాలి



విద్యార్థి నాయకులతో డీఎంసీ ప్రశాంతి



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

బంజారాహిల్స్: నగరవాసుల ఉరుకుల పరుగుల జీవన విధానంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన సమయం ఇవ్వడం లేదని దీంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయని జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి అన్నారు. ప్రస్తుత డిజిటల్ కిడ్స్‌ను అర్థం చేసుకొని వారిని సన్మార్గంలో నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని మెరీడియన్ స్కూల్ ఫౌండేషన్‌తో పాటు విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డీఎంసీ ప్రశాంతి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందజేసి అభినందించచారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడంలో వల్ల భవిష్యత్‌లో ఎన్నో ఉపయోగాలు ఉంటాయని డీఎంసీ పేర్కొన్నారు. అనంతరం స్కూల్ న్యూస్ లెటర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకులు నీలకంఠ బుట్టా, సహ వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ బుట్టా రేణుక, డైరెక్టర్ ప్రతుల్, బుట్టా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సీఈవో తేజస్వి, మెరిడియన్ స్కూల్స్ ప్రెసిడెంట్ లలితా నాయుడు, ప్రిన్సిపాల్ నిషిరాణా, వైస్ ప్రిన్సిపాల్ రహత్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో పైప్‌లైన్ పనుల పూర్తి



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో నిర్మిస్తున్న భారీ సీవరేజి పైప్‌లైన్ పనులను జలమండలి డీవోపీ విజయారావు, సీజీఎం ప్రభు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 450 ఎంఎం డయా సామర్థ్యంతో 300 మీటర్ల మేర రూ. కోటి వ్యయంతో దీన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రధాన రోడ్డులో ఉన్న సీవరేజి సమస్యకు ఇది పరిష్కారంగా నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. మరో వారం రోజుల్లో ఇక్కడ పనులు పూర్తవుతాయని అన్నారు. జలమండలి డివిజన్–6 జీఎం హరి శంకర్, తట్టికాన మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని జలమండలి తట్టికాన సెక్షన్ కార్యాలయంలో శుక్రవారం బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, యూనియన్ నేతలు, కార్మికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో కార్మికులతో కలిసి కార్యాలయం ఆవరణలో ఉన్న అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నదని సెక్షన్ మేనేజర్ రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీవోపి విజయారావు, సీజీఎం ప్రభు, జీఎం హరి శంకర్, డీజీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న అధికారులు, నేతలు

బైక్‌లో మర్చిపోయిన ఆభరణాల అప్పగింత

బంజారాహిల్స్: ఈ నెల 10వ తేదీన గ్రీన్‌ల్యాండ్ చౌరస్తాలో జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో అబిడ్స్‌కు చెందిన ప్రసాద్ అనే కేర్ టేకర్ మద్యం సేవించి పట్టుబడ్డాడు. దీంతో ఆయన బైక్‌ను పంజగుట్ట ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు సీజ్ చేసి స్టేషన్‌లో భద్రపరిచారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తర్వాత సీజ్ చేసిన వాహనాల్లో ఖరీదైన వస్తువులు ఉంటే వాటిని పోలీసులు భద్రపరుస్తారు. ఈ నేపథ్యంలోనే ప్రసాద్ పట్టుబడిన బైక్‌లో బంగారు ఆభరణాలు ఉండటంతో వాటిని జాగ్రత్తగా భద్రపరిచి సమాచారం అందించారు. దీంతో కౌన్సెలింగ్ హాజరై బైక్ తీసుకువెళ్లడానికి వచ్చిన బాధితుడికి శుక్రవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌ఖాన్ ఆభరణాలను యజమానురాలికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బైక్ డిక్కీలో ఆభరణాలు ఉన్న విషయాన్ని తాము మరిచిపోయామని, ఇలా భద్రంగా తమ చేతికి వస్తాయని ఊహించలేదన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులకు వాటిని భద్రపరిచి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

భార్యాపిల్లలున్నా.. మరో పెళ్లి!

వెంగళరావునగర్: భార్య, పిల్లలు ఉన్న వ్యక్తి మరో వివాహం చేసుకుని యువతిని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడ ప్రాంతానికి చెందిన యువతిని జి.శివ అనే వ్యక్తి గత ఏడాది ఫిబ్రవరిలో వివాహం చేసుకున్నాడు. భార్యభర్తలు ఎల్లారెడ్డిగూడలోనే నివాసం ఉంటున్నాడు. గత నెల 15వ తేదీ నుంచి శివ సరిగ్గా ఇంటికి రావడం లేదు. ఫోన్ చేసి అడగ్గా తీవ్రంగా దుర్భాషలాడుతున్నాడు. అతని గురించి ఆరా తీయగా ఖైరతాబాద్ సమీపంలోని శ్రీరామ్‌నగర్‌లో ఉంటున్నట్టుగా తెలిసింది. తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిచూడగా ఆ ప్రాంతంలోని ఒక ఇంట్లో మహిళ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. తన భర్త శివ అని, ముగ్గురు పిల్లలు ఆయన పిల్లలని, తొమ్మిదేళ్ల కిందటే మాకు పెళ్లయినట్టుగా తెలియజేసింది. దీంతో తాను మోసపోయాయని తెలుసుకొని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వివాదాస్పదంగా బస్తీ ఎన్నికలు!

- మధురానగర్ బస్తీ ఎన్నిక నిర్వహణపై వాదోపవాదాలు
- బోరబండ, రహమత్‌నగర్ కార్పొరేటర్ల ఎంట్రీ
- పరస్పర నినాదాలతో పీఎస్ వద్ద ఉద్రిక్తత
- మధురానగర్ పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు



సెక్టార్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: బస్తీ ఎన్నికల పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. ప్రజా ప్రతినిధులు ఎంట్రీ ఇవ్వడంతో అదికాసోత్ ఉద్రిక్తతకు దారి తీసింది. పరస్పర నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పి బయటికి పంపించడంతో సమస్య సద్దుమణిగింది. వివరాలివీ... బోరబండ డివిజన్ మధురానగర్ బస్తీ ఎన్నికల గొడవ గత కొన్ని రోజులుగా కొనసాగుతుంది. బస్తీ ఎన్నికలు నిర్వహించాలని ఓ వర్గం వారు.. ఎన్నికల నిర్వహిస్తే స్థానికుల్లో ఐక్యత దెబ్బతింటుందని వ్యతిరేకిస్తున్నారు మరో వర్గం వారు. ఈ క్రమంలో శుక్రవారం బస్తీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. దీంతో బస్తీకి చెందిన కొంత మంది యువకులు వ్యతిరేకించారు. ప్రజలందరూ కలిసి మెలిసి ఉండే తమ బస్తీల్లో ఎన్నికల పేరుతో చిచ్చు పెట్టకూడదని వారు వారించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బోరబండ పోలీస్ స్టేషన్ తన అనుచరులతో కలిసి చేరుకున్నారు. అదే సమయంలో బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డిలు తమ అనుచరులతో కలిసి పీఎస్‌కు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాల వారిని బయటికి పంపించారు. ఈ క్రమంలో పీఎస్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సి.ఎన్.రెడ్డిలు సెక్టార్ ఎస్ఐ మనోజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాబ ఫసియుద్దీన్ మాట్లాడుతూ... మధురానగర్ బస్తీలో గొడవలు సృష్టించేందుకే ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలను వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఎన్నికలకు వ్యతిరేకిస్తే మహేష్ అనే యువకుడిపై బస్తీకి చెందిన ఆనంద్ అతని అనుచరులు దాడి చేసి, కులం పేరు పెట్టి దూషించడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. పోలీసులు విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జరిగిన ఘటనపై విచారణ సమగ్ర చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బోరబండ పోలీసు అధికారులు తెలిపారు.

బోనాలను వైభవంగా నిర్వహిద్దాం

- ప్రతి ఆలయానికి 10 శాతం నిధులు పెంచాం
- నిధులు సరిపోని ఆలయాలకు మరోసారి ప్రతిపాదన పెడతాం
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



ఆలయాల నిర్వాహకులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల జాతర సంబురాలను ఆలయాల నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించాలని.. అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను తాము చేస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ఆదివాసి కొమురం భీం భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బంజారామిల్స్, వెంకటేశ్వరకాలనీ, హిమాయత్‌నగర, సోమాజిగూడ డివిజన్ల పరిధిలో ఉన్న ఆలయాల నిర్వాహకులకు, చైర్మన్లకు బోనాల చెక్కులను పంపిణీ చేశారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ... గతేడాది కంటే ఈ ఏడాది ప్రతి ఆలయానికి 10 శాతం నిధులను బోనాల వేడుకలకు పెంచినట్లు తెలిపారు. అయినా కొన్ని ఆలయలకు నిధులు సరిపోవడం లేదని వినతులు వస్తున్నాయన్నారు. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొని మరోసారి ప్రతిపాదనలు రూపందిస్తామని దానం స్పష్టం చేశారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో 133 ఆలయాలకు నిధులు కావాలని దరఖాస్తు చేసుకున్నారని ఇప్పటి వరకు రెండు లిస్టుల వారికి చెక్కులు మంజూరు అయ్యాయని తెలిపారు. మిగతా వారికి మూడో లిస్ట్‌లో చెక్కులు అందజేస్తామని వెల్లడించారు. ఆలయాల వద్ద ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని తాము ఇప్పటికీ జీహెచ్ఎంసీ, జలమండలి, వీధి దీపాల విభాగం , మలేరియా విభాగం అధికారులతో పలు మార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించామన్నారు.
- ఏ సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సంబంధిత అధికారులు వెంటనే స్పందిస్తారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం స్పష్టం చేశారు.
- కార్యక్రమంలో చెక్కుల డిస్ట్రిబ్యూషన్ నోడల్ అధికారి, షేక్‌పేట తహసిల్దార్ అనితారెడ్డి, ఈవో జయరామయ్య, కార్పొరేటర్లు మహాలక్ష్మి, వెల్దండ వెంకటేష్, వనం సంగీతాయాదవ్ తదితరులు పాల్గొన్నారు..

ఘనంగా కంజర్ల పుట్టినరోజు వేడుక



కంజర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

శ్రీనగర్‌కాలనీ: మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివయాదవ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఎర్రగడ్డలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలువురు నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేయించారు. నేతలు డేరెంగుల వెంకటేశ్వరరావు, డేరెంగుల శ్రీనివాస్, డేరెంగుల భానుప్రసాద్, డేరెంగుల ప్రసన్న, మణి తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ లేకుండా సేవలందిస్తున్న 'ఓల్టా యాప్'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యాప్ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: ఆటో డ్రైవర్ల శ్రమకు తగిన ఫలితాన్ని దేశంలోనే మొదటి సారిగా అందిస్తున్నామని 'ఓల్టా యాప్' సీఈఓ రాజా విక్రం తెలిపారు. ఓల్టా యాప్ ఆటో డ్రైవర్ల నుంచి ఎలాంటి కమీషన్, ప్లాట్ ఫామ్ చార్జీలు తీసుకోకుండా రైడింగ్‌లకు వచ్చే మొత్తం డబ్బులను డ్రైవర్లకే చెల్లిస్తుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన శశికాంత్ కనపర్తి ప్రారంభించిన 'ఓల్టా యాప్'పై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ రాజా విక్రం మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లు చేసే శ్రమకు తగిన డబ్బులను పూర్తిగా వారికే అందించాలనే లక్ష్యంతో ఓల్టా యాప్ తీసుకువచ్చినట్లు తెలిపారు. డ్రైవర్లకు రూ. 10 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని, 24 గంటల కస్టమర్ కేర్ సపోర్ట్‌ను, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన సహాయం కోసం 'ఎస్ఓఎస్' విధానాన్ని ఓల్టా సంస్థ కల్పిస్తుందని తెలిపారు. మేనేజర్ ఉదయ్ భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం,నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి యాప్ గురించి డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

సందడిగా వన మహోత్సవం



వన మహోత్సవంలో విద్యార్థుల సందేశాత్మక నృత్యాలు



మొక్క నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థిని

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో వన మహోత్సవం కార్యక్రమం శుక్రవారం సందడిగా జరిగింది. ప్రజల ఆయురారోగ్యాలకు మూలమైన క్కల పెంపకం ఆవశ్యకతను విద్యార్థులు గుర్తించే విధంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైన్స్ విభాగం హెచ్ఓడీ లావణ్య స్వాగతోపన్యాసం చేస్తూ విద్యార్థులు సైన్స్ విభాగంలో సాధించిన విజయాలను వారి ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు కనువిందుచేశాయి. ఆదేవిధంగా సెకండరీ విద్యార్థులు 'చెట్లు ప్రగతికి మెట్లు' అంటూ హిందీ భాషలో ఆలపించిన గానం అందరినీ ఆలోచింపజేసింది. ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటి కాలుష్య రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. ప్రకృతి పట్ల అవగాహన కల్పించడానికి, తద్వారా పర్యావరణ పరిరక్షణ బాధ్యతను పెంపొందించడం కోసం ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమం ద్వారా అందించిన సందేశాన్ని ఆచరించాలని కోరారు.

రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం, కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్‌లోని విజయ డయాగ్నస్టిక్స్ లైన్‌లో సీసీ రోడ్డు పనులను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సబిత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, కాంగ్రెస్ నాయకుడు రామన్ గౌడ్, యతిరాజ్, డివిజన్ అధ్యక్షుడు నయీమ్, ప్రియరాజ్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీకృష్ణ చాముండేశ్వరి పీఠంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం పేద విద్యార్థులకు పీఠం ఆధ్వర్యంలో ఉచిత పుస్తకాలను అందించారు. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు, సముద్రాల వేణుగోపాలాచారి వారాహి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. మరో నాలుగురోజుల పాటు అమ్మవారి పూజలు అంగరంగ వైభంగా నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి తెలిపారు.



పూజల్లో నాందెడ్ల భాస్కర్‌రావు

కబ్జాచెరలో ప్రభుత్వ భూమి



ప్రభుత్వ భూమిలో తవ్విన గుంతలు

శ్రీనగర్‌కాలనీ: ప్రభుత్వ భూమి అక్రమణకు గురవుతున్నా పట్టించుకోనే నాథుడే లేడు. ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని సారథినగర్ సొసైటీ కాలనీలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోంది. రెవెన్యూ, టైన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాలివీ... సారథినగర్‌కాలనీ సొసైటీలో ప్లాట్ నెం 30, 31 మధ్య 30 అడుగుల వెడల్పు, 90 అడుగుల పొడవులో రోడ్డు ఉన్నది. గత నెలలో అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, మరో వర్గంలో ప్లాట్ నెం 30 తమదే స్థలమంటూ వాగ్వాదానికి దిగారు. రెవెన్యూ అధికారులు ఇరువర్గాల రిజిస్ట్రేషన్ పత్రాలను చూసి కోర్టుకు అందించారు. ఈ స్థలం కార్పొరేటర్ సరళకు చెందినదిగా రెవెన్యూ, కోర్టు నుంచి అధికారికంగా ధ్రువీకరణ పత్రాలను పొందారు. అయితే ప్లాట్ పక్కనే గతంలో 30 అడుగుల భూమి ప్రభుత్వ స్థలమని బోర్డుకు కూడా పెట్టారు. ప్లాట్ నెం 8, 9 మధ్య ఉన్న స్థలాన్ని 20 ఏళ్ల క్రితం ఓ వ్యక్తి అక్రమించి నిర్మాణం చేపట్టాడు. కార్పొరేటర్ స్థలం పక్కనే రోడ్డు స్థలం లే అవుట్‌లో 9.15 మీటర్ల రోడ్డు ఉందని స్పష్టంగా ఉంది. గతంలో ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టిన ఈ రోడ్డు భూమిలో నేడు గుంతలు తవ్వి కబ్జా చేసి నిర్మాణాలను చేపడుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకుంటామని చెప్పి ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం అర్థం కావడం లేదంటున్నారు.

2న 'గ్లోబల్ పీస్ ర్యాలీ'

హిమాయత్‌నగర్: దేశ ప్రజల సుభిక్షం కోసం కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా గ్లోబల్ పీస్ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 'గ్లోబల్ పీస్ ర్యాలీ, జాతీయ స్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.పాల్ తెలిపారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ర్యాలీ, సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను సంస్థ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

బంజారాహిల్స్: ఆర్థికంగా వెనుకబడి ఉన్న నిరుద్యోగ యువతకు కంప్యూటర్ విద్యతో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు భారతీయ విద్యా భవన్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్ తెలిపారు. కంప్యూటర్ సంబంధిత కోర్సులు ఆఫీస్ అసిస్టెంట్ కోర్సు, అకౌంట్ అసిస్టెంట్ కోర్సులను ట్యాలీ ప్రైమ్, డీటీపీతో కలిపి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 24 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 18 లోపు తమ దరఖాస్తులను ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు కింగ్ కోఠి బషీర్‌బాగ్‌లోని కులపతి మున్షీ సదన్‌లోని భారతీయ విద్యాభవన్‌లో అందజేయాలన్నారు. 17 ఏళ్ల నుంచి 34 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ ఉండాలని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికే ప్రాధాన్యం ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్: 040 2324 1629లో సంప్రదించాలన్నారు.

జెడ్‌సీ అనురాగ్ జయంతికి అభినందనలు



వెంకటేశ్వరకాలనీ: జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనురాగ్ జయంతిని శుక్రవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. అలాగే డివిజన్‌కు సంబంధించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా నందినగర్, ఎస్‌పీనగర్, శ్రీనికేతన్ కాలనీ, దూద్‌ఖానా బస్తీ, షౌకత్‌నగర్, దేవరకొండ బస్తీ, నూర్‌నగర్, ఇబ్రహీంనగర్, సింగాడకుంట బస్తీల్లో కొత్తగా మంజూరైన వీడీసీసీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఆమె కోరారు. త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారం



ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార మహోత్సవం శుక్రవారం కనుల పండువగా రిగింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎస్.చక్రవర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు దశావతారం థీమ్‌తో చేసిన కూచిపూడి నృత్యం ఆహూతులను ఎంతగానో అలరించింది. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణన్, అకడమిక్ డైరెక్టర్ సీ రమాదేవి, ప్రిన్సిపాల్ అరుణశ్రీ, రీజనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆప్ విద్యార్థి సంఘం అధ్యక్షుడి అక్రమ అరెస్టుపై న్యాయ విచారణ జరపాలి



డీజీపీ కార్యాలయం వద్ద ఆప్ నేతలు

హిమాయత్‌నగర్: ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సురేష్‌ను అరెస్టు చేసి, చితకబాది సెల్ పోన్ లాక్కున్న సంఘటన పై న్యాయ విచారణ జరిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు రాష్ట్ర డీజీపీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ తొర్రూర్ సిఐ ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సురేష్‌ను అరెస్టు చేసి, చితకబాది సెల్ పోన్ లాక్కోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ఈ సంఘటన పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నూతన డీజీపీ ఇటువంటి సాంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరామని తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో ఆప్ కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాములు గౌడ్, మహమ్మద్ మాజీద్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, యువజన నాయకులు పవార్, సంతోష్, దర్శనం రమేష్, శివాజి తదితరులు పాల్గొన్నారు.

బోనాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఫిలింనగర్: బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మవారి ఆలయాల కమిటీ ప్రతినిధులతో శుక్రవారం పోలీసులు సమావేశం నిర్వహించారు. ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు వారికి పలు సూచనలు చేశారు. ఆలయాల వద్ద డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని, ఎవరూ డీజేలను పెట్టవద్దన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరపడంలో ఆలయ కమిటీ ప్రతినిధులదే ప్రధానపాత్ర అన్నారు. ఉత్సవాల పేరుతో అలజడులు సృష్టిస్తే సహించేది లేదన్నారు. ఆలయాల వద్ద నిరంతర నిఘా ఉంటుందని, సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనుమానితుల సమాచారాన్ని తమకు ఇవ్వాలన్నారు.

బ్లాక్ ఫిల్మ్ వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

హిమాయత్‌నగర్: హైదరాబాద్ నగరంలోని బ్లాక్ ఫిల్మ్ వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నాలుగు రోజుల్లో 1007 కేసులు నమోదు చేసి, వాహనాలకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ను తొలగించామని నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ పి.విశ్వప్రసాద్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 4 రోజులలో సీఎంవీ రూల్ 100–సెక్షన్ 177,179 (1) మోటారు వాహనాల చట్టం 1988 కింద మొత్తం 1007 కేసులు నమోదు చేసి, వాహనదారులకు రూ.1000 జరిమాన విధించినట్లు తెలిపారు. ఈ బ్లాక్ ఫిల్మ్ వేయించడం ట్రాఫిక్ ఉల్లంఘనలకు మాత్రమే కాకుండా, నేర కార్యకలాపాలకు కూడా దోహదపడేవిగా ఉంటాయన్నారు. సుప్రీం కోర్టు, సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్ 100 ప్రకారం, వాహన తయారీదారులు ముందు విండ్‌స్క్రీన్, వెనుక కిటికీలకు 70 శాతం విజువల్ ట్రాన్స్‌మిషన్‌ను అందించాలని, పక్క కిటికీలకు 50 శాతం కంటే తక్కువ కాకుండా ఉండాలన్నారు.

హెచ్‌ఎంటీని సందర్శించిన కేంద్ర మంత్రులు



హెచ్‌ఎంటీ పరిశ్రమలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం హెచ్‌ఎంటీ పరిశ్రమను కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి ఏఈ కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం వారు పరిశ్రమల పనితీరు, ఉత్పత్తి, ఎగుమతులు- దిగుమతులపై అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్‌ఎంటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంటీ పరిశ్రమకు చెందిన ఖాళీ స్థలం హెచ్‌ఎంటీకి ఆనుకుని ఉన్న బస్తీలు, కాలనీల ప్రాంతాల్లో ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని వెనక్కి తీసుకుని ఖాళీగా ఉన్న భూములను ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరుతూ బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి ప్రెసిడెంట్ డాఎస్ మల్లారెడ్డి, పలువురు బీజేపీ నేతలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి తదితరులు ఉన్నారు.

ఎస్‌ఎమ్‌ఏ వ్యాధిపై అవగాహన కోసమే 5కే, 10కే రన్

సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలి స్టేడియం వేదికగా స్పైనల్ మస్కులర్ అట్రోఫీపై అవగాహన కల్పించడానికి 'రన్ ఫర్ ఎస్‌ఎమ్‌ఏ' పేరుతో అతి పెద్ద రన్ నిర్వహించనున్నారు. క్యూర్ ఎస్‌ఎమ్‌ఏ ఇండియా ఆధ్వర్యంలో ఆగస్టు 4న నిర్వహించనున్న ఈ రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. రెయిన్‌బో ఆస్పత్రి పిల్లల వైద్యులు డాక్టర్ రమేష్ కోనంకి మాట్లాడుతూ.. చిన్నారులకు చేరువవుతున్న భయంకరమైన ఎస్‌ఎమ్‌ఏ వ్యాధిని ఆదిలోనే అంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ రన్‌లో భాగంగా అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. వెన్నెముక కండరాల క్షీణత అనేది జన్యుపరమైన వ్యాధి, ఇది వెన్నుపాములోని మోటారు నరాల కణాలను బలహీనపరుస్తుందని, ఐజీ ఆస్పత్రికి చెందిన క్లినికల్ జెనెటిసిస్ట్ డాక్టర్ తెల్లా సునిత వివరించారు. క్యూర్ ఎస్‌ఎమ్‌ఏ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సహ వ్యవస్థాపకురాలు శ్రీలక్ష్మీ నాళం మాట్లాడుతూ ఎస్‌ఎమ్‌ఏ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో క్యూర్ ఎస్‌ఎమ్‌ఏ రీజినల్ కో ఆర్డినేటర్ మిస్టర్ సతీష్, కమాండెంట్ ఎన్వీ రామారావు, మోసీన్ ఖాన్, అభిరామ్, నూర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు బోనం



బంగారు బోనంతో నృత్యం చేస్తున్న జోగిని నిషా క్రాంతి

చార్మినార్: భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో భక్తులు శుక్రవారం జూబ్లీ హిల్స్ పెద్దమ్మ తల్లి అమ్మ వారికి బంగారు బోనం సమర్పించారు. పోతరాజుల నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలతో అమ్మ వారికి బంగారు బోనం బోనాన్ని తీసుకెళ్లి సమర్పించారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, మాజీ చైర్మన్ రాకేష్ తివారి, జనగామ మధుసూదన్‌గౌడ్, ప్రస్తుత ఉపాధ్యక్షుడు మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హస్‌రాజ్, కోటిరెడ్డి, కాట రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 14న విజయవాడ కనకదుర్గ అమ్మ వారికి బంగారు బోనం సమర్పించనున్నారు. ఇందులో భాగంగా శనివారం పాతబస్తీ బేలా ముత్యాలమ్మ దేవాలయం నుంచి భక్తులు, కళాకారులు విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

మార్కెట్‌లో ట్రెండ్ సెట్టర్‌గా భారతీ సిమెంట్



డీలర్లకు వోచర్స్ అందజేస్తున్న ప్రతినిధులు కొండల్‌రెడ్డి, మల్లారెడ్డి

ఉప్పల్: నాణ్యత, మన్నికకు పెట్టింది పేరుగా నిలిచిన భారతీ సిమెంట్ మార్కెట్‌లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందని ఆ సంస్థ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్లు కొండల్‌రెడ్డి, మల్లారెడ్డి అన్నారు. భారతీ సిమెంట్ తెలంగాణ జిల్లాల డీలర్స్ మీట్–2024 సమావేశాన్ని శుక్రవారం ఉప్పల్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల డీలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అల్ట్రాఫాస్ట్ సిమెంట్, ఫాస్ట్ సెట్టింగ్ అవ్వడానికి ప్రత్యేకంగా స్లాబ్, ప్లింత్ బీంలు, కాలమ్స్‌లను వేసేందుకు వినియోగదారులు అధిక సంఖ్యలో భారతీ సిమెంట్ వాడుతున్నట్లు తెలిపారు. మార్కెట్‌లోకి భారతి సిమెంట్ రంగ ప్రవేశంతో 70 సంవత్సరాల పాటు సిమెంట్ రంగంలో ఉన్న సంస్థలు చతికిల పడ్డాయన్నారు. మార్కెట్‌లో నూతన ఒరవడి సృష్టిస్తూ అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. మార్కెట్ రంగంలో భారతి సిమెంట్ సరికొత్త మార్పులు తీసుకువస్తూ నిర్మాణ రంగంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందని స్పష్టం చేశారు. దాన్నే మిగిలిన కంపెనీలు ఫాలో అవుతున్నట్లు వివరించారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లో అగ్రగామిగా చేరడంలో డీలర్ల కృషి అభినందనీయం అన్నారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో భారతీ సిమెంట్ విక్రయాలు నంబర్ వన్ స్థానంలో ఉన్నాయని చెప్పారు. అందుకు కారణం భారతీ సిమెంట్ మిగిలిన వాటితో పోలిస్తే మూడు విధాలుగా ఉన్నత స్థాయిలో ఉంటుందన్నారు. ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్, రోబోటిక్ క్వాలిటీ, జర్మనీ టెక్నాలజీ ప్రత్యేకతలని పేర్కొన్నారు. అనంతరం 2023 సంవత్సరానికి గాను వ్యాపార రంగంలో అత్యధిక వ్యాపారాన్ని అందించిన డీలర్లకు సంస్థ గోల్డ్ వోచర్స్‌ను అందజేసింది. మరికొంత మంది డీలర్స్‌ను శాలువాలతో సత్కరించారు. డీలర్లు, కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓయూ న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎల్‌ఎల్‌ఎంతో పాటు యూజీసీ నెట్, సెట్ అర్హత గల విద్యార్థులు కెటగిరి–1లో నేరుగా ప్రవేశాలకు ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొ.విజయలక్ష్మీ పేర్కొన్నారు. ఉస్మానియా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు.

- హెచ్‌ఎండీఏలో ఆన్‌లైన్ టీడీఆర్ బ్యాంక్
- అమల్లోకి వచ్చిన ఆన్‌లైన్ సేవలు
- పారదర్శకంగా టీడీఆర్ సర్టిఫికెట్‌ల జారీకి అవకాశం
- రహదారుల విస్తరణ, లింకురోడ్ల అభివృద్ధి పనుల్లో టీడీఆర్‌లకు అనూహ్య స్పందన
- ఎలివేటెడ్ కారిడార్, మూసీ అభివృద్ధి ప్రాజెక్టుల్లో టీడీఆర్



టీడీఆర్.. ఇక ఆన్‌లైన్..



హెచ్‌ఎండీఏలో ఆన్‌లైన్ టీడీఆర్(ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకు నేరుగా అందజేసిన టీడీఆర్ సర్టిఫికెట్లను శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చారు. పారదర్శకంగా టీడీఆర్ సర్టిఫికెట్‌లను అందజేసేందుకు ఆన్‌లైన్ బ్యాంకింగ్ విధానానికి మార్చిలోనే అధికారులు చర్యలు చేపట్టారు. టీడీఆర్ ఆన్‌లైన్ బ్యాంకింగ్ కోసం అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. తాజాగా ఆన్‌లైన్ టీడీఆర్ బ్యాంకింగ్ అమల్లోకి రావడంతో ఎలాంటి లోపాలు, పొరపాట్లకు తావులేకుండా ఈ సర్టిఫికెట్లను విడుదల చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

ఇప్పటి వరకు వివిధ రకాల నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టుల్లో, మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ వంటి పనుల్లో భూములను కోల్పోయిన వారికి టీడీఆర్‌లను మ్యానువల్‌గా అందజేశారు. ప్లానింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అందజేసే నివేదికల ఆధారంగా టీడీఆర్‌లు విడుదలవుతాయి. దీంతో పారదర్శకత లోపిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఒక అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా టీడీఆర్‌లపైన ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించినట్లు తెలియడంతో సదరు ఏపీఓపైన అప్పటి హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్ సస్పెన్షన్ విధించారు. ప్రస్తుతం టీడీఆర్ ఆన్‌లైన్ బ్యాంకింగ్ విధానం అమల్లోకి వచ్చినందువల్ల అలాంటి తప్పిదాలకు ఏమాత్రం అవకాశం ఉండదని, వంద శాతం పారదర్శకత ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

అవుటర్ వరకు టీడీఆర్..

జీహెచ్‌ఎంసీలో టీడీఆర్ ఆన్‌లైన్ బ్యాంక్ సేవలు అందుబాటులో ఉన్నాయి. రహదారుల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లై ఓవర్లు, చెరువుల సుందరీకరణ, మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్ల వెడల్పు, లింకు రోడ్ల అభివృద్ధి వంటి అనేక ప్రాజెక్టుల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు టీడీఆర్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన వారికి చాలా వరకు నగదు రూపంలో పరిహారం చెల్లించడానికి బదులు టీడీఆర్‌లను అందజేశారు. దీంతో వారు వీటిని ఇతరులకు విక్రయించుకొనేందుకు, అదనపు అంతస్తులను నిర్మించుకునేందుకు అవకాశం లభించింది.

- 1988లో అప్పటి ఉమ్మడి ప్రభుత్వం ఈ పద్ధతిని అమల్లోకి తెచ్చింది. 2012లో ఈ పథకాన్ని పునరుద్ధరించారు. టీడీఆర్ విలువను 200 శాతానికి పెంచారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో మాత్రమే ఇది అమలయ్యేది. 2017లో ప్రభుత్వం టీడీఆర్‌పైన మరోసారి దృష్టి సారించింది. దీని విలువను 400 శాతానికి పెంచింది. 2022 నుంచి హెచ్‌ఎండీఏ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు వరకు టీడీఆర్ పరిధిని విస్తరించారు. ఈ మేరకు టీడీఆర్‌ను పొందిన భూయజమానులు ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఎక్కడైనా దీన్ని విక్రయించుకొనేందుకు, అదనపు అంతస్తులను కట్టుకొనేందుకు అవకాశం లభించింది.
- లింకురోడ్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, చెరువుల సుందరీకరణ వంటి హెచ్‌ఎండీఏ స్వయంగా చేపట్టే ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి టీడీఆర్‌లను అందజేస్తున్నారు. హైదరాబాద్‌లో అమలు చేస్తున్న టీడీఆర్‌లకు దేశవ్యాప్తంగా చక్కటి గుర్తింపు లభించిందని, నీతి ఆయోగ్ సైతం ప్రశంసించిందని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు.

ఎలివేటెడ్ కారిడార్‌కు టీడీఆర్

ప్రభుత్వం తలపెట్టిన అన్ని అభివృద్ధి ప్రాజెక్టుల్లో సాధ్యమైనంత వరకు టీడీఆర్ సర్టిఫికెట్‌లనే అందజేయాలని భావిస్తున్నారు. వివిధ ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి పరిహారంగా నగదు చెల్లించడం ఎంతో భారంగా మారనున్నందువల్ల టీడీఆర్‌పైనే దృష్టి సారిస్తున్నారు.

- ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం ఇప్పటికే సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ వరకు వివిధ ప్రాంతాల్లో భూసేకరణపై దృష్టి కేంద్రీకరించిన సంగతి తెలిసిందే. ఈ రూట్‌లో ఆస్తులు, భూములు కోల్పోయేవారికి టీడీఆర్‌లనే అందజేయనున్నారు.
- 55 కిలోమీటర్ల మూసీ మార్గంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నదికి ఇరువైపులా ఆస్తులను కోల్పోయే వారికి మూడు రకాలుగా పరిహారం చెల్లించాలని ప్రభుత్వం భావిస్తోంది. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లతో పాటు అవసరమైన వారికి టీడీఆర్‌లను అందజేస్తారు. నగదు రూపంలో కూడా ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల స్పష్టం చేశారు. కానీ సాధ్యమైనంత వరకు టీడీఆర్ ద్వారానే పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

ఊబకాయంతో జాగ్రత్త..



డా.బి.హారిక, అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్

సాక్షి, సిటీబ్యూరో: ఊబకాయం పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్యురాలు హారిక ఒక ప్రకటనలో తెలిపారు. ఊబకాయం ప్రపంచ మహమ్మారిగా మారిందన్నారు. లాన్సెట్ నివేదిక ప్రకారం గత ఐదు దశాబ్దాలలో ఊబకాయం ప్రాబల్యం మూడు రెట్లు పెరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 13–15 శాతం మంది పెద్దలు ఊబకాయంతో ఉన్నారన్నారు. వీరిలో 40 శాతం మంది మహిళలు ఉన్నారని తెలిపారు. మెనోపాజ్ జీవన నాణ్యత, శారీరక, మానసిక, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వివరించారు. ఫలితంగా బరువు పెరుగుతారన్నారు. అవసరమైన విశ్రాంతి తీసుకోవాలి. కంటి నిండా నిద్రపోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని చెప్పారు. పాలు, పెరుగు వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవాలన్నారు. యోగా, ధ్యానం పాటించాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఊబకాయం లక్షణాలు తగ్గడంతో పాటు జీవన నాణ్యత మెరుగు పడుతుందన్నారు.

ఈసీఐఎల్ నుంచి మెహిదీపట్నంకు సిటీ బస్సు

సాక్షి, సిటీబ్యూరో: ఈసీఐఎల్ నుంచి మెహదీపట్నం వరకు కొత్తగా నాలుగు మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఈ బస్సులు ప్రారంభం కానున్నాయి. ఈసీఐఎల్ నుంచి సికింద్రాబాద్, పంజగుట్ట, రోడ్ నంబర్–7, మాసాబ్‌ట్యాంక్ మీదుగా మెహదీపట్నంకు ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ఈసీఐఎల్ నుంచి మొదటి బస్సు ఉదయం 7 గంటలకు, చివరి బస్సు రాత్రి 7.30 గంటలకు బయలుదేరుతుంది. మెహదీపట్నం నుంచి మొదటి బస్సు ఉదయం 8.35 గంటలకు, చివరి బస్సు రాత్రి 9.35 గంటలకు బయలుదేరుతుంది.

రోజుకు 20 లక్షల మందికి ఆహారం

- ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అక్షయపాత్ర
- నార్సింగిలో సోలార్ ప్లాంటును ప్రారంభించిన ట్రస్టీ సత్యగౌరచంద్ర దాస

సాక్షి, సిటీబ్యూరో: అక్షయ పాత్ర ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంద సంస్థని ఫౌండేషన్ ట్రస్టీ సత్యగౌర చంద్రదాస అన్నారు. నార్సింగిలో అక్షయపాత్ర వంటశాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 16 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 24,082 పాఠశాలల్లో 20 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ భోజనం అందిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి పోషణ్ అభియాన్‌లో భాగంగా లాభాపేక్ష లేని భాగస్వామిగా అక్షయపాత్ర పనిచేస్తోందన్నారు. నార్సింగిలో వంటశాలలో 165 కిలోవాట్ల సోలార్ ప్లాంటు, 2 వేల కిలోల బయోగ్యాస్ ప్లాంటులను అందుబాటులోకి తెచ్చామన్నారు. పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేయడమే కాకుండా ఏడాదికి సుమారు 152 టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గిస్తున్నామన్నారు. రానున్న 20 ఏళ్లలో సోలార్ ప్లాంట్లతో ఖర్చులను గణనీయంగా ఆదా చేయవచ్చన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగించుకోవాలని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా గ్లోబల్ సర్వీసెస్ సెంటర్ అధ్యక్షుడు మదిరెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పిల్లలకు ఆరోగ్యకరమైన భోజనం అందించేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్‌తో పనిచేయడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.

నగరంలో నేడు

- హ్యాపీ స్పేస్ పేరిట కిడ్స్ ఆర్ట్ జమ్మింగ్(పెయింటింగ్ అండ్ కలరింగ్) కార్యక్రమం వీకెండ్ ఫన్‌గా ఉదయం 11.30గంటలకు బంజారాహిల్స్ రోడ్ నంబర్–1లోని లామకాన్‌లో జరుగుతుంది.
- తెలంగాణ వికాస సమితి, చేతన సాహిత్య సమాఖ్య ఆధ్వర్యంలో గోదావరి గొంతుక పేరిట మల్లావరుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదానం ఉంటుంది. రవీంద్ర భారతి మినీ హాల్‌లో సాయంత్రం 5 గంటలకు సభ నిర్వహిస్తారు.
- మాదాపూర్‌లోని శిల్పారామం ఆంపి థియేటర్‌లో సాయంత్రం 6 గంటలకు తన్మయి ఆర్ట్ స్టూడియో శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుంది. కార్యక్రమానికి విరించి హాస్పిటల్ చైర్మన్ మాధవిలత, కూచిపూడి దేవదాసి డాక్టర్ యశోధఠాగూర్ హాజరుకానున్నారు.
- మాదాపూర్ హెచ్‌ఐసీసీలో ఉదయం 11గంటలకు హైలైఫ్ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. ఇందులో పలువురు మోడల్స్ తయారు చేసిన వస్త్రాభరణాలు అందుబాటులో ఉంటాయి. కార్యక్రమంలో నటి తనిషా మెహతా, శ్రవంతి చోకరపు, అమిక్ష తదితరులు పాల్గొంటారు.
- గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఉదయం 10.30 గంటలకు 4వ గ్రాడ్యుయేషన్ డే వేడుక జరుగుతుంది. 4 సంవత్సరాలుగా కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు పట్టాలను అందజేస్తారు. డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ లేబరేటరీ(డీఆర్‌డీఎల్) శాస్త్రవేత్త పాల్గొంటారు.
- గ్రామ భారతి, సీఎస్‌ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి 9 గంటలకు తార్నాకాలోని మర్రి కృష్ణ హాల్‌లో మూలం సంత జరుగుతుంది.

జేఎన్‌టీయూహెచ్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

- జేపీసీ చైర్మన్ బొట్ల భిక్షపతి
- నేడు యూనివర్సిటీకి సీఎం రాక

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డికి జేపీసీ చైర్మన్ బొట్ల భిక్షపతి శుక్రవారం విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జేఎన్‌టీయూకు ఈ నెల 13న విచ్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జేఎన్‌టీయూహెచ్ జేపీసీ తరఫున స్వాగతం పలుకుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం యూనివర్సిటీ అనుబంధ కళాశాలలకు కేటాయించిన సరైన బడ్జెట్ ఇవ్వలేదని, అందువల్ల యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో సొంత భవనాలు, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వనపర్తి, పాలేరు, సిరిసిల్ల, మహబూబాబాద్ సొంత భవనాల అభివృద్ధికి 2 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరుతున్నామన్నారు. ఆరోపణల నేపథ్యంలో ప్రొఫెసర్ కె.విజయకుమార్‌రెడ్డిని యూనివర్సిటీ రెక్టార్ పదవి నుంచి తక్షణమే తొలగించి, అవకతవకలపై ఉన్నత స్థాయి విచారణ కమిటీ వేయాలన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్‌ను యూనివర్సిటీ రెక్టార్‌గా నియమించాలన్నారు.

కొత్త చట్టాలకు వ్యతిరేకంగా న్యాయపోరాటం



మాట్లాడుతున్న మాడభూషి శ్రీధర్

పంజగుట్ట: ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త చట్టాలు మానవ జాతి జీవిత అనుభవాలకు దూరంగా ఉన్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఇన్‌ఫార్మల్ లేబర్, వర్కర్స్ ఫెడరేషన్(ఐఎల్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో కొత్త క్రిమినల్ చట్టాలు రద్దు చేసుకోవాలి.. మానవ హక్కులను కాపాడుకోవాలి అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఫెడరేషన్ చైర్మన్ ఇనాయత్ అలీ బాక్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ న్యాయమూర్తులు జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ పి.ఎస్.నారాయణ, రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ మాజీ జాతీయ కమిషనర్ మాడభూషి శ్రీధర్, సీపీఐ ఎమ్‌ఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు గోవర్ధన్ హాజరై మాట్లాడారు. చట్టాలు చేసే సమయంలో అందులో నిష్ణాతులైన వారి అభిప్రాయాలు తీసుకొని, పార్లమెంట్‌లో చర్చలు జరపాలని, కానీ ఎలాంటి చర్చ లేకుండా భారత రాజ్యాంగంలోని మౌలిక హక్కులను ప్రమాదంలోకి నెట్టేసేలా చట్టాలు రూపొందించడం సరికాదన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా న్యాయపరమైన పోరాటం చేస్తూనే వీధుల్లోకి వెళ్లి పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సోగరా బేగం, నాగరాజు, కాంగ్రెస్ నాయకుడు మోహన్, కుర్రాం అలీ తదితరులు పాల్గొన్నారు.

సత్వర, సులభతర పరిష్కారం

- చర్లపల్లి సీఐఏలో ఎంఎస్ఈఎఫ్ కౌన్సిల్ ఏర్పాటు
- 54 కేసుల్లో 6 కేసుల పరిష్కారం .. రూ.3 కోట్ల రికవరీ
- వివరాలు వెల్లడించిన కౌన్సిల్ చైర్మన్ రవీందర్

కుషాయిగూడ: చిన్న తరహా సూక్ష్మ పరిశ్రమల ఉత్పత్తుల సప్లైకి సంబంధించి చెల్లింపుల విషయంలో తలెత్తే సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైక్రో స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ ఫెసిలిటేషన్ కౌన్సిల్(ఎంఎస్ఈఎఫ్‌సీ) సులభతరమైన సత్వర పరిష్కార వేదిక అని కౌన్సిల్ చైర్మన్ పి.రవీందర్ అభిప్రాయపడ్డారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని చర్లపల్లి ఇండస్ట్రీయల్ అసోసియేషన్ కార్యాలయంలో ఎంఎస్ఈఎఫ్ కౌన్సిల్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 54 కేసులను పరిశీలించిన కౌన్సిల్ 6 కేసులకు పరిష్కారం చూపి సుమారు రూ.3 కోట్లు రికవరీ చేస్తూ తీర్పునిచ్చింది. అనంతరం కౌన్సిల్ చైర్మన్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ సర్వీసు, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ల ఉత్పత్తులు, కొనుగోలు చేసిన సంస్థల నుంచి చెల్లింపుల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గడిచిన ఐదేళ్లలో సుమారు 2 వేల యూనిట్లు న్యాయం కోసం కౌన్సిల్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈల మనుగడ ప్రశ్నార్థకం అయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో సత్వర, సులభతరమైన పరిష్కార వేదికగా ఎంఎస్ఈఎఫ్ కౌన్సిల్ దోహదపడుతుందన్నారు. ఉత్పత్తుల కొనుగోలుదారు నుంచి చెల్లింపుల అంశంలో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యల కోసమే కేంద్రం డిలేట్ పేమెంట్ యాక్ట్‌ను ప్రవేశపెట్టి కౌన్సిల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అంతేగాకుండా సమాధాన్ పోర్టల్‌ను రూపొందించి ఎలాంటి రుసుము లేకుండా నేరుగా కేసు ఫైల్ చేసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. అందుకు సంబంధించి పత్రాలను 15 రోజుల్లో జిల్లా పరిశ్రమల అధికారికి కార్యాలయంలో అందజేస్తే కేసు కౌన్సిల్ ముందుకు వస్తుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకొని ఎంఎస్ఎంఈ యూనిట్లు పటిష్టం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు అప్పిరెడ్డి, రితేష్ మిట్టల్, ఎల్‌డీఎం సి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్‌లో బాధితుల సమస్యలు వింటున్న కౌన్సిల్ చైర్మన్ రవీందర్, సభ్యులు

గోల్కొండ 3వ బోనానికి పటిష్ట ఏర్పాట్లు

రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్

గోల్కొండ: గోల్కొండ కోట బోనాల ఏర్పాట్లపై పలు శాఖల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్ అన్నారు. ఈ నెల 14న గోల్కొండ కోటలో 3వ బోనం ఏర్పాట్లపై శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యుత్ శాఖ, శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆదివారం జరిగిన మొదటి బోనాల ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయని, దీనికి అధికారుల నిర్లక్ష్యమేనని ఆమె అన్నారు. గోల్కొండ కోటలో గత వారం రాష్ట్ర మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారని, ఈ సమావేశానికి విద్యుత్ శాఖ అధికారులు ఎవరూ హాజరుకాలేదని ఆమె మండిపడ్డారు. గోల్కొండ కోట అమ్మవార్లకు జరిగే తొమ్మిది పూజల్లో 3వ పూజ అతిపెద్దదని, సుమారు 2 లక్షల మంది భక్తులు అమ్మవార్ల దర్శనానికి వచ్చే అవకాశం ఉందన్నారు. 4 లక్షల భక్తులకు సరిపడే ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. సాయంత్రం విద్యుత్ సరఫరా నిలిచిపోతే మొబైల్ జనరేటర్‌లను సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ ఏఈని ఆదేశించారు. ఇతర సౌకర్యాలపై ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి మాట్లాడుతూ బోనాల ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామని, వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు తాము చేస్తున్న ఏర్పాట్లను గ్రూప్‌లో షేర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంతరావు, డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావు, నగర అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ సి.చంద్రమోహన్, బల్దియా డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, గోల్కొండ తహసీల్దార్ అహల్యారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు టి.జీవన్‌సింగ్, గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తదితరులున్నారు.



సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, జిల్లా కలెక్టర్

'ఎస్కీ'కి గ్రీన్ అవార్డుతో పాటు 4 ఐఎస్ఓ సర్టిఫికెట్లు

రాయదుర్గం: గ్రీన్ అవార్డుతో పాటు నాలుగు ఐఎస్ఓ సర్టిఫికెట్లను ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ) సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఎస్కీ బోర్డు రూమ్‌లో శుక్రవారం అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావుకు ఐఎస్ఓ సర్టిఫికెట్స్‌ను హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శివరామ్ ఆలపాటి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్కీలో పరిపాలనా వ్యవహారాలు, డాక్యుమెంటేషన్ విధానాలు, ఉద్యోగులు తమ విధి విధానాలను పాటించడం, సమయపాలన, ఫైళ్ల సత్వర పరిష్కారం తదితర అంశాల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చినందున ఐఎస్ఓ–9001 క్వాలిటీ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ అందజేసినట్లు తెలిపారు. సహజ సంపదలో భాగంగా పెద్ద పెద్ద బండరాళ్లు, భారీ చెట్లను ఇప్పటికీ పరిరక్షించడం, అటవీ సంపదను కాపాడటంతో ఐఎస్ఓ–14001 ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ కూడా అందుకున్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు, ఎస్కీ చీఫ్‌లు లక్ష్మీకాంతరావు, వెంకటశాస్త్రి పాల్గొన్నారు.



ఐఎస్ఓ సర్టిఫికెట్లు అందుకుంటూ..

రేపు హోమియోపై జాతీయస్థాయి సెమినార్

పంజగుట్ట: దేవ్స్ హోమియోపతి మెడికల్ కాలేజీ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో ఆదివారం జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ మర్రి రాంరెడ్డి తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తుమ్మల మురళి, డాక్టర్ సత్యదేవ్‌తో కలిసి శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సెమినార్‌లో రాష్ట్రంలోని అన్ని హోమియో వైద్య కళాశాలతో పాటు దేశంలోని వివిధ కళాశాలల విద్యార్థులు, వైద్యులు సుమారు 400 మందికిపైగా హాజరవుతారని తెలిపారు. కేన్సర్‌కు హోమియో చికిత్స గురించి ఒడిశాకు చెందిన ప్రఖ్యాత హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ ఎల్.కె.నందా వివరిస్తారని, జీవనశైలి వ్యాధుల గురించి మహారాష్ట్రకు చెందిన డాక్టర్ ప్రఫుల్ బోర్కర్ అవగాహన కల్పిస్తారని తెలిపారు. ముఖ్య అతిథిగా త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, గౌరవ అతిథిగా హోమియోపతి అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ లింగరాజు, డాక్టర్లు తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శనివారం, 13, జూలై, 2024



క్వీన్ రైడర్స్

షాట్ డిస్టెన్స్‌తో మొదలై లాంగ్ టూర్స్ వరకూ..

విభిన్న రంగాలకు చెందిన మహిళల్ని ఒకే బాట పట్టిస్తోంది బైక్ రైడింగ్. అలా వేర్వేరు రంగాలకు చెందిన నలుగురు నగర మహిళలు బైకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో తాజాగా లధాక్‌లోని ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఉమ్లింగ్లా పాస్‌ను అధిరోహించారు. ఈ సందర్భంగా 'సాక్షి' వారిని పలకరించినప్పుడు తమ రైడింగ్ అనుభవాలు పంచుకున్నారు.. ఆ వివరాలు...

సొంత బైక్‌లపై పలు ప్రాంతాలను చుట్టేస్తూ..

ప్రపంచంలోనే ఎత్తైన రోడ్లపై ప్రయాణం

లధాక్‌లోని ఉమ్లింగ్లా పాస్లో సాహస యాత్ర

'మేఘాలలో తేలిపొమ్మన్నది.. తూఫానులా రేగిపొమ్మన్నది.. అబ్బాయితో సాగుతూ చిలిపి మదీ' అంటూ మార్చేసి పాడేసే టైమ్ వచ్చేసింది. ఒకప్పుడు కింగ్స్‌కి మాత్రమే పరిమితమైన బైకింగ్ ఇప్పుడు క్వీన్స్‌కి కిరీటాలు అలంకరించేస్తోంది. ఈ క్రమంలో నగరానికి చెందిన నలుగురు మహిళల బృందం కూడా ఒక రేర్ రైడ్‌తో సిటీలో టాక్ ఆఫ్ ద బైకింగ్ క్లబ్‌గా మారారు.

- సాక్షి, సిటీబ్యూరో

సొంతంగా కొనుక్కున్న బైక్‌తో..

జూబ్లీహి గత కొంత కాలంగా బైక్ రైడింగ్ అలవాటైంది. మన ఇంట్రెస్ట్ కోసం పేరెంట్స్‌ని ఇబ్బంది పెట్టకూడదని గూగుల్లో పనిచేసి, ఆన్‌లైన్ బిజినెస్.. ద్వారా రూ.1.50 లక్షలు సంపాదించి సొంతంగా యమహా ఆర్15 వి2 బైక్ కొన్నాను. గతంలో షార్ట్ రైడ్స్‌కి కొన్నిసార్లు వెళ్లాను. అయితే బైకర్నీలో చేరాక లాంగ్ రైడ్స్ మీద ఆసక్తి బాగా పెరిగింది. ఉమింగ్లా పాస్ రైడ్ అనుకున్నప్పుడు గతంలో ఎన్నడూ అంత లాంగ్ డ్రైవ్‌కి వెళ్లకపోవడం వల్ల ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయేమో అనే భయం ఉండేది. కానీ.. గ్రూప్‌లో వెళ్లాం కాబట్టి చిన్న చిన్న ప్రాబ్లమ్స్ తప్ప పెద్దగా ఏమీ ఫేస్ చేయలేదు. మైనస్ డిగ్రీస్ చలిలో మా టార్గెట్ రీచ్ అవడం అద్భుతమైన థ్రిల్లింగ్ ఇచ్చింది.

– గీతిక పోలిశెట్టి (28), ఫ్యాషన్ డిజైనర్





డ్రీమ్ రైడ్ అదే..

మేం మోకిలాలో నివసిస్తున్నాం. మొదట నేను యమహా ఆర్ఎక్స్ 100 నడిపేదాన్ని. ఆ తర్వాత నా సొంత బైక్ అంటే బెనల్లీ టీఎన్‌టీ 25, ప్రస్తుతం బీఎండబ్ల్యూ జీ310ఆర్ నడిపిస్తున్నాను. ఏడేళ్లలో సిక్కిం, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటకలకు వెళ్లాం. ఎన్ని లాంగ్ రైడ్స్ వేసినా ఉమింగ్లా పాస్‌కు రైడ్ అనేది ఒక మరచిపోలేని అనుభూతిని అందించింది. మైనస్ డిగ్రీల వాతావరణం అలవాటు లేక కొంత ఇబ్బంది పడ్డాం. బైక్ స్కిడ్ అయి పడిపోవడం.. వంటి కొన్ని సంఘటనలు జరిగాయి. అయితే థాంక్ ఫుల్లీ.. ఎవరికీ ఏమీ కాలేదు. టిబెట్, భూటాన్, వియత్నాం.. రూట్ కవర్ చేయాలనేది డ్రీమ్ రైడ్. – సుష్మారెడ్డి (42), బిజినెస్ ఎనలిస్ట్

బైక్ రైడింగ్ ఇష్టం..

మేం ఎల్బీనగర్‌లో ఉంటాం. చిన్నప్పటి నుంచీ బైక్ రైడింగ్ ఇష్టం. మా తాతయ్యకు లూనా ఉండేది. నేను వెనక ఎక్కేదాన్ని. ఆ తర్వాత మా నాన్నకి హోండా సీడీ 100 ఉండేది. ఆ బైక్ నేను డ్రైవ్ చేశాను. అందుకే నేను వాడిన నా ఫస్ట్ బైక్ జావా 42.. ఇప్పుడు బీఎండబ్ల్యూ జీ3 10ఆర్ ఉంది. దీన్ని కేవలం లాంగ్ రైడ్స్‌కి వినియోగిస్తుంటాను. కర్ణాటక, హైదరాబాద్ టూ కన్యాకుమారి.. ఇలా టూర్స్ వెళ్లొచ్చాను. తొలి దశలో ఇంట్లో వాళ్లు కొంచెం భయపడ్డారు కానీ..ఇప్పుడు ఫుల్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. వీలైనంత వరకూ బైక్ రైడ్ ద్వారా మంచి మంచి ప్రదేశాలు చుట్టిరావాలని ఆశిస్తున్నాను. దీని తర్వాత నేపాల్, టిబెట్ రైడ్‌కి వెళ్లాలనేది ప్లాన్..

–సుష్మితారెడ్డి (27), బిజినెస్ ఎనలిస్ట్



ఫిజికల్లీ ఫిట్..

మేం నేరేడ్ మెట్లో ఉంటాం. డిగ్రీ పూర్తి చేశాక 2017లో రైడింగ్ స్టార్ట్ చేశాను. మా నాన్నగారి ఓల్డ్ మోడల్ ఎలక్ట్రా 350 (రాయల్ ఎన్‌ఫీల్డ్) నడిపేదాన్ని. ఆ తర్వాత నా సొంతంగా థండర్‌బోల్ట్ 350ఎస్ కొనుక్కున్నా. తొలిరైడ్ 1700 కి.మీ నడిపించాను. వేల కిమీ లాంగ్ రైడ్స్ చేశాను. ఒక మహిళా రైడర్‌గా నాకున్న పరిధులు, పరిమితుల ప్రకారం.. పూర్తి ప్రణాళికా బద్ధంగా రైడ్స్‌కి వెళ్తుంటాను. ఎక్కడికి వెళ్లినా సాయంత్రం లోపు రైడ్ కంప్లీట్ చేసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటాను. అలాగే ఒక ఫిట్నెస్ ఫ్రీక్‌గా బైక్ పడినా సులభంగా లేపగలిగిన ఫిట్నెస్ ఉండాలి. అందుకే లేహ్ లడక్‌కు వెళ్లిన ప్రతి ఒక్కరికీ అనుభవంలోకి వచ్చే అల్టిట్యూడ్ మౌంటైన్ సిక్‌నెస్ రాలేదంటే...అందుకు కారణం నేను అనుసరించే సీరియస్ ఫిట్నెస్ రొటీన్ అని చెప్పగలను. –అనీషా ఫాతిమా లతీఫ్ (28), వృత్తి జిమ్ యజమాని



---

20 నుంచి స్టైల్ తత్వా

నగరానికి చెందిన ఫిక్కీ లేడీస్ క్లబ్ (ఎఫ్ఎల్ఒ) ఆధ్వర్యంలో నగరంలో స్టైల్ తత్వా పేరిట ఫ్యాషన్ ఉత్పత్తుల ప్రదర్శన జరగనుంది. ఈ విషయాన్ని ఎఫ్ఎల్ఓ చైర్ పర్సన్ ప్రియా గజదార్ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఈ నెల 20న ప్రారంభమై రెండు రోజుల పాటు ప్రదర్శన ఉంటుందని, ఇందులో 212 మంది ఔత్సాహిక మహిళా వ్యాపారులు, చేనేత, హస్తకళాకారులు, పేరున్న 200 బ్రాండ్స్ పాల్గొంటాయని వివరించారు. బంగారు, వెండి ఆభరణాలు, విలాసవంతమైన ఉత్పత్తులు, కళాకృతులు.. ఈ ప్రదర్శనలో కొలువుదీరనున్నాయి. 8వేల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ఢిల్లీకి చెందిన ఫ్యాషన్ డిజైనర్ నమ్రత జోషి పూరి పాల్గొంటారని వివరించారు. సమావేశంలో మాజీ చైర్ పర్సన్ రేఖాలహోటి, వైస్ చైర్ పర్సన్ ప్రతిభా కుందా పాల్గొన్నారు.



ఉదయం నుంచి రాత్రి వరకూ కంప్యూటర్లతో కుస్తీ పట్టే ఉద్యోగులకు ఆ ఈవెంట్ వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచింది. ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ సింక్రొనీ.. ఎనర్జీ పేరిట నిర్వహించే వార్షిక ఈవెంట్ ముగిసింది. రెండు రోజుల ఈవెంట్‌లో భాగంగా లీడర్‌షిప్ క్వాలిటీస్ గురించి ప్రముఖుల సందేశాలు, కెరీర్‌లో వృద్ధిని అందించేలా వైవిధ్యంగా నిర్వహించిన వర్క్‌షాప్స్ ఆకట్టుకున్నాయి. సృజనాత్మకతను, వైవిధ్యాన్ని, సమస్యల పరిష్కారంలో చురుకుదనాన్ని పెంచే యాక్టివిటీస్‌తో పాటు రెండో రోజున ఉద్యోగ బృందాల మధ్య చర్చలు, ఉపన్యాసాలు చోటు చేసుకున్నాయి. సంస్థ కంట్రీ హెడ్ రచనా బహదూర్ పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు తమ ఆటపాటలు, నృత్యాలతో హోరెత్తించారు. బాలీవుడ్ స్టార్ సోనూసూద్ పాల్గొని ఉద్యోగుల ఉత్సాహాన్ని పెంచారు.

వావ్... ఎనర్జీ...



అందుబాటులో పెట్ కేర్ సేవలు



దేశంలోనే ప్రప్రథమంగా టెక్ ఆధారిత ఓమ్నిచానెల్ పెట్ కేర్ బ్రాండ్ జిగ్లీ సికింద్రాబాద్‌లో తన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేసింది. పెట్ కేర్ సర్వీస్ ప్రారంభించిన సందర్భంగా గురువారం ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లోని వెటర్నరీ కన్సల్టెంట్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడారు. పెట్స్ 24/7 సురక్షితంగా ఉండేందుకు పెట్ కేర్ సేవలు చాలా కీలకమన్నారు. ఒకే చోట సంపూర్ణ సంరక్షణ (పోషకాహారం, వస్త్రధారణ, వైద్య మద్దతు) తాము అందిస్తామని, దీని ద్వారా పెట్ లవర్స్ ఆదరణ పొందగలమని, తమ సేవలు వారికి ఉపకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



ప్రకృతి నిలయం

- ఇల్లంతా మొక్కల మయం...
- ఇంటి చుట్టూ వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు
- పక్షులకు ఆవాసంగా.. అనుకూలంగా..
- ప్రకృతి ప్రేమికుడు రాము..

కాంక్రీట్ జంగిల్లో చెట్లు సరికి బహుళ అంతస్తుల మేడల నిర్మాణం చేపడుతున్నారు. నగరంలో చెట్ల కన్న అద్దాల భవనాలే ఎక్కువగా కనిపిస్తుంటాయి. పచ్చని మొక్కలు, చెట్లు చూడాలంటే ఏ పల్లెటూరుకో.. నగర శివారుకో.. లేదా రిసార్ట్స్‌కో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అలాంటిది అతని ఇల్లే పచ్చని మొక్కలతో ఉంది. ఎటు చూసిన మొక్కలతో పచ్చగా కన్పిస్తాయి. బాల్కనీ, టెర్రస్‌లోనే కాదు. బెడ్‌రూం, మెట్లు, హాల్లో, పూజ గది ముందు, బాత్రూంలో, కిచెన్‌లో పచ్చని మొక్కలు దర్శనమిస్తాయి. అరే ఈ ప్రాంతంలో కూడా మొక్కలు పెంచవచ్చా అన్నట్లు ఉంటుంది ఆ ఇల్లు. అతనే మూసాపేట అంజనేయనగర్‌కు చెందిన ప్రకృతి ప్రేమికుడు రాము. - మూసాపేట

అతని అసలు పేరు పత్తిరెడ్డి రామానుంజన్‌రెడ్డి. కానీ అందరూ ప్రకృతి రాము అని పిలుస్తారు. అలాగే గుర్తుపడతారు. పూర్తి పేరు చాలా మందికి తెలియదు. అతని ఇల్లు చూసి పేరు అడిగితే చెట్లు, పక్షులంటే ఇష్టం కాబట్టి ప్రకృతి రాముగా పిలుస్తారేమో అనుకుంటారు. కానీ కొన్ని రోజులు ప్రకృతి సూపర్ మార్కెట్ నడిపి సేంద్రియ ఉత్పతులు విక్రయించడంతో ప్రకృతి రాముగా పేరు స్థిరపడింది. అయితే సహజంగానే ప్రకృతి అంటే మక్కువ. తన ఇంటి పేరు కూడా ప్రకృతి నిలయం అని పెట్టుకోవడం ప్రకృతిపై ఉన్న ఇష్టాన్ని తెలియజేస్తుంది.

పక్షులు అధికంగా రావాలని వాటి కోసం ప్రత్యేకమైన చెట్లు పెంచుతున్నారు. రామచిలకలు, కోయిలలు, పావురాలు, పల్లెటూరులో కన్పించే పిట్టలు, రంగుల పిచ్చుకలు, సీజనల్ పక్షులు ఆ ఇంటిపై వాలతాయి.

పల్లె వాతవరణం తలపించేలా..

పక్షుల కోసం నీరు, గింజలు కూడా ఏర్పాటు చేస్తారు. సహజంగా తినాలని వాటి కోసం జొన్న కంకులు తీసుకొచ్చి చెట్లకు కడతారు. ఆ మొక్కలపై పక్షుల గూళ్లు కూడా కన్పిస్తాయి. ఉదయం పక్షుల కిలకిలరావాలతోనే నిద్రలేస్తారు. పక్షులతోనే ఎక్కువగా కాలక్షేపం చేస్తుంటారు.

ఇల్లూ ప్రత్యేకమే...

ఎవరైనా ఇల్లు కట్టుకుంటే కొద్ది స్థలం కూడా వదలకుండా కట్టుకుని కిరాయిలకు ఇచ్చుకుంటాం. కానీ అతని కుటుంబానికి సరిపడ డబుల్ బెడ్‌రూం, హాల్, ఓపెన్ కిచెన్‌తో పాటు గెస్ట్ రూంలు కూడా ఏర్పాటు చేసి మొక్కలకే ఎక్కువ స్థలాన్ని కేటాయించాడు. పెంట్‌హౌస్ మాదిరిగా రూంలు ఉండి, ముందు భాగం మొత్తం మొక్కలు ఉంటాయి. ఉదయం లేచి మొక్కల మధ్య కూర్చొని టీ తాగేందుకు, టిఫిన్ చేసేందుకు అరుగులు ఏర్పాటు చేశారు. టెర్రస్‌పై సాయంం సంధ్య వేళ మొక్కలు కదులుతూ గాలి వీస్తుంటే ఎక్కడో ప్రకృతికి దగ్గరగా ఉన్నట్లు ఉంటుంది.



పక్షులకు ఆవాసంగా..

ఇంట్లో ఉన్న మొక్కలు.. పక్షులకు ఆవాసంగా ఉంటాయి.. జామ, దానిమ్మ, మామిడి, ఉసిరి, నేరేడు వంటి పండ్ల మొక్కలతో పాటు చెరుకు, బొప్పాయి, నిమ్మ చెట్లు ఉన్నాయి. పక్షులకు అవసరమైన జొన్న, వరి మొక్కలు సైతం ఏర్పాటు చేశాడు. పూలమొక్కలైన కనకాంబరం, సన్నమల్లె, జాజి మల్లె, లిల్లీ, మందారంలో 5 రకాలు, బొడ్డు మల్లె, ఐదు రకాల గులాబీ పూలు వంటి పూల మొక్కలు. టమాట, వంకాయ, పచ్చి మిరప వంటి కూరగాయలతో పాటు పుదీనా, కొత్తిమీర, పాలకూర, మెంతి, బచ్చలి వంటి ఆకు కూరలు కూడా ఉంటాయి. పేపర్ పూలు వంటి షో మొక్కలు అనేకం ఉన్నాయి.

గ్లామర్ దౌడ్

15 రోజుల్లో 6,300 కి.మీ. ప్రయాణం

వృత్తి చెత్త సేకరణ.. ప్రవృత్తి సాహస యాత్ర



సాహసమే అతడి ఊపిరి.. బైకులంటే అతడికి ప్రాణం.. బైక్ పై కొత్త ప్రదేశాలకు వెళ్లడమంటే తనను తానే మర్చిపోతాడు. పుట్టి పెరిగింది బస్తీలో.. చేసేది చెత్త సేకరణ అయినా.. సాహస యాత్రలు చేయడం అతడి ప్రవృత్తి.. బతుకమ్మ కుంట నుంచి మంచు కొండలపైకి వెళ్లి ఔరా అనిపిస్తున్నాడు..అలా జమ్మూ కశ్మీర్‌లోని అత్యంత ఎత్తైన మంచు కొండలను ఎక్కి అందరి ప్రశంసలూ పొందుతున్నాడు. సాధారణంగా ఎత్తైన కొండలు ఎక్కాలంటే బుల్లెట్, హిమాలయన్ వంటి బైక్‌లపై వెళ్తుంటారు. కానీ మనోడు గ్లామర్ బండిపై లధాక్ వరకు వెళ్లాడు. అతడే అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట బస్తీకి చెందిన నల్లబోతుల రమేశ్..

- సాక్షి, సిటీబ్యూరో



రమేశ్ జూన్ 15న హైదరాబాద్ నుంచి తన ప్రయాణం ప్రారంభించాడు. ఇక్కడ మరో విశేషం ఏంటంటే తనతో పాటు అదే బైక్‌పై తన తమ్ముడు నరేశ్‌ను కూడా తీసుకెళ్లాడు. తిరిగి 30వ తేదీన హైదరాబాద్ చేరుకున్నారు. 15 రోజుల్లో 6,300 కి.మీ. దూరం ప్రయాణించి ఔరా అనిపిస్తున్నాడు.

15 రోజులు, 6,300 కిమీ..

చిన్న బ్యాగులో 15 రోజులకు ఐదారు జతల బట్టలు సర్దుకుని వెళ్లాం. కొన్ని చిరుతిళ్లు పెట్టుకున్నాం. రోజుకు 500 కిలోమీటర్లు ప్రయాణిస్తూ.. ఎక్కడైనా లాడ్జిలో గది అద్దెకు తీసుకుని రాత్రి నిద్రపోయేవాళ్లం. తెల్లవారుజామునే లేచి మళ్లీ ప్రయాణం మొదలు పెట్టేవాళ్లం. మధ్యలో ఎక్కడైనా హోటల్లో బట్టలు ఉతుక్కునేవాళ్లం. ఎండ బాగా ఉన్నప్పుడే ఉతుక్కుని వెంటనే బయల్దేరి వెళ్లేవాళ్లం.

ఆహారంలో ఇబ్బందులు..

ఆహారం విషయంలో చాలా ఇబ్బందులు పడ్డాం. అన్నం అస్సలు దొరక్కపోయేది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధమైన ఆహారం ఉండేది. అయితే అక్కడ దొరికే ఆహారం తినలేకపోయే వాళ్లం. సరిగ్గా తినకపోవడంతో నీరసంగా ఉండేది. కానీ లధాక్ చేరుకోవాలనే కోరిక ముందు ఈ సమస్యలు చిన్నగా అనిపించాయి.

గతంలోనూ సాహసయాత్ర.. 2019లో కూడా బుల్లెట్ బైక్‌పై వెళ్లాం. అయితే అప్పుడు బుల్లెట్ బైక్‌పై లధాక్ వరకూ ప్రయాణం చేశా. ఒకట్రెండు సార్లు బైక్‌పై గోవా కూడా వెళ్లొచ్చా. దక్షిణ భారతంలో కూడా బైక్‌పై పర్యటించాలనేది నా కల. ఆర్థిక ఇబ్బందులతో ఇష్టమైన బుల్లెట్ బైక్ అమ్ముకోవాల్సి వచ్చింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తన సాహస యాత్రను మాత్రం కొనసాగిస్తా. కుటుంబసభ్యులు చాలా మద్దతు ఇస్తున్నారు.. ప్రయాణంలో చాలా ఇబ్బందులు పడ్డాం. కొండలు ఎక్కుతుంటే ఒకసారి కిందపడ్డాం. అందరిలా బుల్లెట్‌పై కాకుండా వినూత్నంగా గ్లామర్‌పై వెళ్లిరావాలనే ఆలోచన వచ్చింది. డబ్బులు పోగు చేసుకుని ముగ్గురం కలిసి టూర్ ప్లాన్ చేసుకుని వెళ్లాం.

– నల్లబోతుల రమేశ్, సాహస యాత్రికుడు



పంక్చర్ అయితే అంతే..

మధ్యప్రదేశ్ వద్ద అడవి మధ్యలో బైక్ టైర్ పంక్చర్ అయ్యింది. 50 కిలోమీటర్ల వరకూ ఒక్క పంక్చర్ షాప్ కూడా లేదు. వేరే వ్యక్తి బైక్‌పై వెళ్లి పంక్చర్ అతికించే వ్యక్తిని తీసుకురావాల్సి వచ్చింది. మరోసారి జోజిలా పాస్ వద్ద బైక్ టైర్ పంక్చర్ అయ్యింది. అక్కడ కూడా ఎవరూ పంక్చర్ అతికించేవారు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డాం. చివరకు ఒకతను పంక్చర్ అతికిస్తానని చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నాం. కాకపోతే ఒక్క పంక్చర్ అతికించినందుకు రూ.2 వేలు వసూలు చేశారు. దీంతో ఖంగుతిన్నాం. కచ్చితంగా పంక్చర్‌కు సంబంధించిన టూల్ కిట్ వెంట తీసుకెళ్లాలి.

చలికి తట్టుకోలేం..

ఎముకలు కొరికే చలిలో ఎప్పుడైనా బీపీ డౌన్ అయిపోయే ప్రమాదం ఉంది. అందుకే చలిని తట్టుకునేలా దట్టమైన దుస్తులు, స్వెటర్లు తీసుకెళ్లాలి. లేదంటే అక్కడ అద్దెకు కూడా ఇస్తుంటారు. ఎట్టిపరిస్థితుల్లోనూ చెప్పులేకుండా కాళ్ల కింద పెట్టకూడదు. పెడితే బీపీ డౌన్ అవుతుంది.

‘సుప్రీం’ వారించినా వినరా?

కక్ష సాధింపుతో న్యాయ ధిక్కారానికి తెగించిన ఏపీ ప్రభుత్వం • ఎమ్మెల్యే రఘురామ ఈ మెయిల్‌తో కేసు నమోదు

- ఐపీఎస్‌లు సునీల్‌కుమార్, పీఎస్‌ఆర్‌తోపాటు మాజీ సీఎం జగన్‌పై కేసులు
- గతంలో ఇదే అంశంపై కోర్టులను ఆశ్రయించిన రఘురామ
- ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదని తేల్చి చెప్పిన వైద్య నివేదిక
- దాంతో ఆ పిటిషన్‌ను తోసిపుచ్చిన హైకోర్టు, సుప్రీంకోర్టు
- అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను లెక్క చేయకుండా తాజాగా కేసు నమోదు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కాకుండా నారా లోకేశ్ తయారు చేసుకున్న రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతున్నట్లు మరోసారి నిరూపితమైంది! ఏకంగా హైకోర్టు, సుప్రీం కోర్టు మూడేళ్ల క్రితం తోసిపుచ్చిన ఆరోపణల ఆధారంగా కూటమి సర్కారు తాజాగా తప్పుడు కేసు నమోదు చేయడమే అందుకు తాజా నిదర్శనం. 2021లో తనను సీఐడీ అధికారుల కస్టడీలో గుర్తు తెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టారని.. హింసించారని నాటి ఎంపీ కనుమూరి రఘురామకృష్ణరాజు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని వైద్య పరీక్షలు గతంలోనే నిర్ధారించాయి. ఆ ఆరోపణల ఆధారంగా రఘురామకు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించగా, అదే ఆరోపణల ఆధారంగా సీబీఐ విచారణకు ఆదేశించేందుకు సుప్రీం కోర్టు సైతం తిరస్కరించింది. తాజాగా అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా వ్యవహరించేందుకు బరి తెగించింది. నాడు న్యాయస్థానాలు తోసిపుచ్చిన ఆరోపణలతోనే రఘురామరాజు మూడేళ్ల తరువాత మెయిల్‌లో ఫిర్యాదు చేయడం... ఆ వెనువెంటనే ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, పీఎస్ఆర్ ఆంజనేయులు, నాటి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిలతోపాటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కేసులు నమోదు చేయడం విస్మయపరుస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ చర్య కక్ష సాధింపు మాత్రమే కాదు... కచ్చితంగా న్యాయ ధిక్కారమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో రాజ్యమేలుతున్న అరాచకానికి ఈ పరిణామాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఆరోపణలు తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
సీబీఐ విచారణకు తిరస్కరణ

హైకోర్టులో చుక్కెదురు కావడంతో రఘురామ దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుంటూరు జిల్లా జైలులో ఒక రోజు ఉన్న తరువాత సుప్రీం కోర్టు ఆదేశాలతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం అక్కడి నుంచి పోలీసుల వాహనంలో కాకుండా తన సొంత వాహనంలో హైదరాబాద్‌లోని ఆర్మీ ఆసుపత్రికి వెళ్లారు. రెండు రోజుల తరువాత ఆర్మీ ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన్ను పోలీసులు కొట్టినట్టు ఆ వైద్య పరీక్షల్లోనూ వెల్లడి కాలేదు. అయితే సుప్రీంకోర్టును మరోసారి ఆశ్రయించిన ఆయన.. సీఐడీ కస్టడీలో తనను గుర్తు తెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టారని ఆరోపిస్తూ సీబీఐతో విచారణ నిర్వహించాలని కోరారు. హైదరాబాద్ ఆర్మీ ఆసుపత్రి వైద్యులు ఇచ్చిన నివేదికను పరిశీలించిన సుప్రీంకోర్టు రఘురామరాజు ఆరోపణలను తోసిపుచ్చింది. సీబీఐ విచారణ నిర్వహించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. దాంతో రఘురామ ఎత్తుగడ బెడిసికొట్టింది. తనను సీఐడీ అధికారులు తీవ్రంగా కొట్టారని, శారీరకంగా హింసించారంటూ రఘురామ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని నిర్ధారణ అయ్యింది. దాంతో ఆ అధ్యాయానికి తెర పడింది.

కక్ష సాధింపుతో తప్పుడు కేసు..
ఒక రోజు ముందే పోలీసులకు ఉప్పు..

రెడ్ బుక్ రాజ్యాంగాన్నే తమ ప్రభుత్వం అనుసరిస్తుందని సీఎం చంద్రబాబు మరోసారి నిరూపించారు. రఘురామను సీఐడీ అధికారులు కస్టడీలో హింసించలేదని నిర్ధారిస్తూ హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను బేఖాతర్ చేశారు. గుంటూరు జీజీహెచ్, హైదరాబాద్ ఆర్మీ ఆసుపత్రి వైద్యుల నివేదికలను బుట్ట దాఖలు చేస్తూ కేవలం కక్ష సాధింపే తమ విధానమని మరోసారి చాటుకున్నారు. 2021 మేలో తనను సీఐడీ అధికారులు కస్టడీలో హింసించారని ఆరోపిస్తూ మూడేళ్ల తరువాత రఘురామరాజు ఈ ఏడాది జూన్ 11న పోలీసులకు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం తనను గుర్తు తెలియని వ్యక్తులు కొట్టారని కోర్టులో పిటిషన్ వేసిన ఆయన.. ఇప్పుడు ఇచ్చిన ఫిర్యాదులో మాత్రం 2021లో సీఐడీ అదనపు డీజీగా ఉన్న పీవీ సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న పీఎస్ఆర్ ఆంజనేయులు(వాస్తవానికి అప్పట్లో ఏసీబీ అదనపు డీజీగా ఉన్నారు)తోపాటు నాటి సీఎం వైఎస్ జగన్‌ను నిందితులుగా పేర్కొనడం గమనార్హం. వారితోపాటు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ ప్రభావతి, సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌పై కూడా ఆరోపణలు చేశారు. ఇక్కడ మరో విచిత్రం ఏమిటంటే.. రఘురామరాజు ఈ ఏడాది జూన్ 11న ఫిర్యాదు చేయగా అంతకు ఒకరోజు ముందే అంటే జూన్ 10నే ఆయన ఫిర్యాదుపై పోలీసులు న్యాయ సలహా కోరారు. అంటే చంద్రబాబు ప్రభుత్వం ఎంత కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నది స్పష్టమవుతోంది. రఘురామ ఫిర్యాదు ఆధారంగా గుంటూరు నగరపాలెం పోలీసులు ఈనెల 11న కేసు నమోదు చేశారు.


UPON hearing the counsel the Court made the following
O R D E R
SLP(Crl.) No.6786/2024
Leave granted.
The appeal is allowed in terms of the signed order.
Pending application(s), if any, stands disposed of.
SLP (Crl.) No.3868 of 2021
Heard learned senior counsel for the parties.
In view of the order dated 17.05.2021 passed in this special leave petition as well as the order dated 21.05.2021 in Criminal Appeal No.515 of 2021 @ out of SLP(Crl.) No.3769/2021, no further order need be passed in this special leave petition.
The special leave petition is disposed of accordingly.
Pending application(s), if any, stands disposed of.
(ARJUN BISHT) COURT MASTER (SH)
(R.S. NARAYANAN) COURT MASTER (NSH)
(Signed order is placed on the file)

రఘురామ పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, పీఎస్ఆర్ ఆంజనేయులు, సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్, డాక్టర్ ప్రభావతిలతోపాటు మరికొందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

సుప్రీం తీర్పులు పట్టవా?

ఏదైనా కేసులో 77 రోజుల తరువాత సాక్షులను విచారించడం సరికాదని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు చెప్పింది. రఘురామ ఫిర్యాదు విషయంలో ఏకంగా మూడేళ్ల తరువాత... అదీ అప్పటికే ఆ ఆరోపణలతో దాఖలైన పిటిషన్లను హైకోర్టు, సుప్రీంకోర్టు తిరస్కరించిన అంశాలతో చంద్రబాబు ప్రభుత్వం కేసు నమోదు చేయడం విస్మయపరుస్తోందని న్యాయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం, పోలీసుల చర్య కచ్చితంగా కక్ష సాధింపేనని స్పష్టం చేస్తున్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఇప్పటికే తోసిపుచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేయడం న్యాయ ధిక్కారమేనని తేల్చి చెబుతున్నారు.

బెడిసికొట్టిన పన్నాగం..
రఘురామను హింసించలేదన్న వైద్య నివేదికలు

సమాజంలో వర్గ విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న కె.రఘురామకృష్ణరాజుపై సీఐడీ అధికారులు 2021 మే నెలలో కేసు నమోదు చేశారు. ఆయన్ను హైదరాబాద్‌లో అరెస్ట్ చేసే సమయంలో సీఐడీ అధికారులపై దాడికి పాల్పడినా ఎంతో సంయమనం పాటిస్తూ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయానికి తరలించి విచారించారు. ఈ క్రమంలో రఘురామరాజు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన ప్లేటు ఫిరాయించి గుంటూరు మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచిన సమయంలో అసత్య ఆరోపణలు చేశారు. కస్టడీలో సీఐడీ అధికారులు తనను కొట్టారని... హింసించారని ఆరోపిస్తూ బెయిల్ ఇవ్వాలని కోరారు. మరోవైపు తనను సీఐడీ అధికారులు కస్టడీలో హింసించారని ఆరోపిస్తూ దానిపై విచారణ జరిపించాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాంతో ఆయనకు వైద్యుల బృందంతో పరీక్షలు నిర్వహించి నివేదిక సమర్పించాలని గుంటూరు జీజీహెచ్ వైద్య అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి నేతృత్వంలో నలుగురు వైద్యుల బృందం రఘురామకు వైద్య పరీక్షలు నిర్వహించింది. ఎక్స్‌రే, స్కాన్లు తీసింది. రఘురామ శరీరంపై ఎలాంటి గాయాలు లేవని.. సీఐడీ అధికారులు కస్టడీలో ఆయన్ను శారీరకంగా హింసించలేదని నిర్ధారించింది. అదే విషయాన్ని హైకోర్టుకు నివేదించింది. సీఐడీ అధికారులు నిజంగానే కస్టడీలో శారీరకంగా హింసించి ఉంటే అవి ఎక్స్‌రే, స్కాన్ రిపోర్టులలో బయటపడేవి. అలాంటిది ఏమీ లేకపోవడంతో వైద్య బృందంలోని నలుగురు డాక్టర్లు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తూ నివేదిక సమర్పించారు. ఒకవేళ నలుగురు వైద్యుల్లో ఎవరైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసి ఉంటే మరోసారి వైద్య పరీక్షలు చేయాలని ఇతర ఆస్పత్రులకు హైకోర్టు అప్పుడే ఆదేశించి ఉండేది. ఈ నేపథ్యంలో రఘురామను సీఐడీ అధికారులు శారీరకంగా హింసించలేదని పూర్తి ఆధారాలతో వైద్యులు నిగ్గు తేల్చిన నివేదికను హైకోర్టు ఆమోదించింది. ఆయనకు బెయిల్ మంజూరు చేసేందుకు న్యాయస్థానం నిరాకరించడంతో రఘురామను జ్యుడిషియల్ కస్టడీ కోసం గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. తమ కస్టడీలో ఉన్న నిందితుడిని జైలుకు తరలించడంతో సీఐడీ / పోలీసు అధికారుల బాధ్యత ముగుస్తుంది. తరువాత పరిణామాలతో వారికి సంబంధం ఉండదు.

అసత్యాలు చెబుతున్న షర్మిల.. ఇవిగో వాస్తవాలు

‘అమ్మకు వందనం’పథకంపై చంద్రబాబు యూటర్న్

- సర్వత్రా విమర్శలతో సంకటస్థితిలో టీడీపీ ప్రభుత్వం
- సరిగ్గా ఈ సమయంలో నేనున్నానంటూ రంగంలోకి దిగిన షర్మిల
- టీడీపీ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు



బడికి పిల్లలను పంపితే చాలు ప్రతి తల్లికి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని పేర్కొన్న వైఎస్సార్‌సీపీ 2019 ఎన్నికల మేనిఫెస్టో ఇది



స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని పేర్కొన్న టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో-2024 ఇది

సాక్షి, అమరావతి: ‘అమ్మ ఒడి’పథకం విషయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలను మోసం చేశారని ఏపీసీసీ చీఫ్ షర్మిల వ్యాఖ్యానించడం పట్ల సర్వత్రా ఆశ్చర్యం, ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో చెప్పింది చెప్పినట్లు అమలు చేసి చూపిన చరిత్ర వైఎస్ జగన్‌ది. పిల్లలను బడికి పంపే తల్లులకు ఏటా రూ.15 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు మాట నిలుపుకున్నారు. జగన్ ప్రతి తల్లికి రూ.15 వేలు ఇచ్చారని, తాము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు సహా కూటమి నేతలంతా హామీ ఇచ్చారు. జగన్, చంద్రబాబు హామీ మధ్య తేడా ఇంత స్పష్టంగా కనిపిస్తోంటే ఎవరు మోసం చేసింది షర్మిలకు కనిపించడం లేదు కాబోలు. జగన్ కూడా ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఇస్తానని చెప్పారని ఇప్పుడు షర్మిల చెప్పడం.. ముమ్మాటికీ మాట తప్పిన చంద్రబాబును కాపాడటానికేనని స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా కనిపించే మూడు పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ అయితే.. కనిపించని నాలుగో పార్టీనే రాష్ట్ర కాంగ్రెస్ అన్నది షర్మిల మాటలను బట్టి మరోసారి నిరూపితమైంది. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను చూడకుండానే శుక్రవారం ఆమె విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్ జగన్‌పై ఆరోపణలు గుప్పించడం విస్తుగొలుపుతోంది. ప్రతిపక్ష పార్టీగా అధికార పక్ష హామీలపై నిలదీయాల్సింది పోయి.. జగన్‌ను తప్పు పట్టడం విస్తుగొలుపుతోంది. అసాధ్యమైన హామీలతో ప్రజల్ని మోసగించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మేనిఫెస్టో అమలు చేయలేక ఆత్మరక్షణలో పడగానే షర్మిల హఠాత్తుగా తెరపైకి వచ్చారు. తల్లికి వందనం పథకంపై చంద్రబాబు యూటర్న్ తీసుకోవడాన్ని ప్రశ్నిస్తారని అంతా భావించారు. సూపర్ సిక్స్ మేనిఫెస్టోను ఎప్పటి నుంచి అమలు చేస్తారని నిలదీస్తారనుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా షర్మిల చంద్రబాబుకు రాజకీయంగా వత్తాసు పలకడం ద్వారా చంద్రబాబు వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకేనని స్పష్టమైంది. చంద్రబాబు ‘తల్లికి వందనం’పథకం అమలులో ప్రజలను మోసగించిన తీరును వివరిస్తూ సాక్షి పత్రిక ప్రచురించిన కథనాన్ని చూపిస్తూ షర్మిల వైఎస్సార్‌సీపీని విమర్శిస్తూ చంద్రబాబు స్క్రిప్ట్‌ను వినిపించడం విస్మయపరిచింది.

జగనన్న అమ్మ ఒడితో విద్యా విప్లవం

- ‘జగనన్న అమ్మ ఒడి పథకం’దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. విద్యా రంగంలో విప్లవాన్ని తీసుకురావడమే కాకుండా సామాజిక, సాంఘిక సంస్కరణగా గుర్తింపు పొందింది. వైఎస్ జగన్ కచ్చితమైన క్యాలెండర్‌ను అనుసరిస్తూ ఈ పథకం కింద నాలుగేళ్లలో రూ.26,067.28 కోట్లు తల్లుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేశారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే అన్ని పథకాలు ఈపాటికి సక్రమంగా అమలయ్యేవని ప్రజలు ఇప్పటికే గుర్తించారు. ఇప్పటికే జగనన్న అమ్మ ఒడి పథకం రూ.6,500 కోట్లు తల్లుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అయ్యేవి. విద్యా దీవెన పథకం రెండు విడతల్లో రూ.1,400 కోట్లు ఖాతాల్లో వేసేవారు. వసతి దీవెన కింద రెండు విడతల కింద రూ.1,100 కోట్లు లబ్ధిదారులకు అందేవి. వైఎస్సార్ రైతు భరోసా మొదటి విడత కింద రూ.7 వేల కోట్లకుపైగా జమ చేసేవారు.
- ఈ విషయాలన్నీ చెబుతూ షర్మిల చంద్రబాబును నిలదీయాలి. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రశ్నించాలి. రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం, పిల్లలందరికీ రూ.15 వేలు, మత్స్యకార్య భరోసా, 1.85 కోట్ల మంది మహిళలకు నెలకు రూ.1,500, 1.60 కోట్ల మంది నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఎప్పుడు ఇస్తారని అడగాలి. బాబుకు మేలు చేసేందుకే ఆమె రాజకీయం చేస్తున్నారని ప్రజలు గమనించారు. అందుకే ఆమెకు కడప లోక్‌సభ ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కలేదు.

తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా అలేఖ్య బాధ్యతలు



గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా అలేఖ్య పుంజాల శుక్రవారం రవీంద్రభారతిలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను బలవంతంగా బీఆర్ఎస్‌లోకి చేర్చుకుందని గుర్తుచేశారు. ఎవరైనా తమ పార్టీలోకి వస్తుంటే వద్దంటామా అన్నారు. బీఆర్ఎస్‌లో మిగిలేది నలుగురు మాత్రమేనని, బీఆర్ఎస్ నాయకులకు ఫిరాయింపులపై మాట్లాడే అర్హత లేదని పేర్కొన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం సాహిత్య, సాంస్కృతిక కళలకు తగిన ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపకశాఖ డైరెక్టర్‌గా నారాయణ రావు బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్, గచ్చిబౌలి: అగ్నిమాపకశాఖ డైరెక్టర్‌గా గుమ్మడి వెంకట నారాయణరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేసిన నారాయణరావుకు డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ అగ్నిమాపకశాఖ డీజీ వై. నాగిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో జి.వి.నారాయణరావు బాధ్యతలు చేపట్టారు. ఎన్ఐటీ అలహాబాద్ నుంచి బీఈ (సివిల్ ఇంజనీరింగ్)పూర్తి చేసిన ఆయన 1995లో గ్రూప్-1 పరీక్షల్లో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. 2010లో రీజనల్ ఫైర్ ఆఫీసర్ (ఆర్ఎఫ్ఓ)గా, 2020లో అడిషనల్ డైరెక్టర్‌గా ప్రమోషన్ పొందారు. ఎన్నో అగ్నిప్రమాద ఘటనల రెస్క్యూ ఆపరేషన్స్‌లో పాల్గొన్నారు. ఇందుకుగానూ నారాయణరావుకు కేంద్రం నుంచి ప్రెసిడెంట్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసెస్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవాపతకం, ఉత్తమ సేవాపతకాలు దక్కాయి. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 40 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రతి పాదనలు రూపొందించామని, ఏడు స్టేషన్లు నిర్మాణ దశలో ఉన్నాయని జీ.వీ.నారాయణ రావు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మాట్లాడుతూ హైరైజ్డ్ బిల్డింగ్‌లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే సహాయక చర్యలు చేపట్టేందుకు 100 మీటర్ల ఎత్తున్న బహుబలి బ్రోంటో స్కై లిఫ్ట్ త్వరలో అందుబాటులోకి రానుందని చెప్పారు.

జీతాలు ఇవ్వట్లేదని సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ కిడ్నాప్

- యజమానిని బంధించిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు
- గంటల్లోనే విడిపించిన పోలీసులు
- ఎనిమిది మంది అరెస్టు


రవిచంద్రారెడ్డి

బంజారాహిల్స్(హైదరాబాద్): తమకు జీతాలు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఆగ్రహించిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ సంస్థ సీఈఓను కిడ్నాప్ చేసి బంధించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు కొన్ని గంటల్లోనే కిడ్నాప్ మిస్టరీని ఛేదించి బాధితుడిని క్షేమంగా తల్లికి అప్పగించారు. వాకాటి రవిచంద్రారెడ్డి (28) గత ఏడాది నవంబర్‌లో గచ్చిబౌలిలోని ఆర్బిట్‌లో గిగ్ లెజ్ సాఫ్ట్‌వేర్ సంస్థను ఏర్పాటు చేశారు. ఆయనే ఈ సంస్థకు సీఈఓగా ఉన్నారు. ఓ ప్రాజెక్టు ఉందని చెప్పి జనవరిలో బ్యాక్‌డోర్‌లో పద్ధతిలో కొంతమంది యువతీ యువకుల నుంచి రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకు తీసుకుని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా సంస్థలో ఉద్యోగాలు ఇచ్చారు. మొత్తం 1,200 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో సంస్థ కొనసాగుతుండగా ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో జీతాలు బాగానే చెల్లించారు. అయితే ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల పాటు జీతాలు చెల్లించలేదు. దీంతో చాలాసార్లు జీతాలు అడిగి విసిగిపోయిన కొందరు ఇంజనీర్లు ఆగ్రహంతో.. జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్ హుడా ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న సీఈఓ రవిచంద్రారెడ్డి ఇంటికి బుధవారం రాత్రి 2 గంటలకు వచ్చారు. జీతాల విషయం మాట్లాడుకుందామని తమతో పాటు తెచ్చుకున్న కారులో ఎక్కించారు. ఇంట్లో ఉన్న 82 ల్యాప్‌ట్యాప్‌లు, ఆరు సెల్‌ఫోన్లు కూడా తీసుకుని కారు డిక్కీలో వేసుకున్నారు. రవిచంద్రారెడ్డిని కారులో ఎక్కించుకున్న ఎనిమిది మంది ఆ సంస్థ ఉద్యోగులు.. నాగర్‌కర్నూల్ సమీపంలోని ఒంగూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ హోటల్‌కు తీసుకువెళ్లి బంధించారు. గురువారం మధ్యాహ్నం రవిచంద్రారెడ్డి తన తల్లి మాధవికి ఫోన్ చేసి తనను ఉద్యోగులు కిడ్నాప్ చేశారని, చంపాలని చూస్తున్నారని చెప్పారు. దీంతో మాధవి సాయంత్రం 5 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో తన కొడుకును ఎనిమిది మంది ఉద్యోగులు కిడ్నాప్ చేశారంటూ ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కిడ్నాపర్లు రవిచంద్రారెడ్డిని బంధించిన చోటుకు అర్ధరాత్రి 2 గంటలకు చేరుకుని ఆయనను విడిపించారు. రవిచంద్రారెడ్డిని కిడ్నాప్ చేసిన వారిలో జగదీశ్, గౌతమ్, శివ, సుజిత్, ఆజాద్, మల్లేశ్, ప్రవీణ్, కమల్ తదితరులపై బీఎన్ఎస్ సెక్షన్ 333, 140 (3), 119 (1), 310 కింద కేసులు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

హైకోర్టుకు కొత్తగా 19 మంది జీపీలు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టుకు కొత్తగా 19 మంది ప్రభుత్వ న్యాయవాదులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న 11 మంది ప్రభుత్వ న్యాయవాదులతో కలిపి మొత్తం సంఖ్య 30కి చేరింది. వీరికి అదనంగా ఐదుగురు స్పెషల్ జీపీలు నియామకమయ్యారు. వీరంతా మూడేళ్లు లేదా ప్రభుత్వం తొలగించే వరకు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. జీపీల నియామకంలో సామాజిక న్యాయం పాటించడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా నియామకమైన వారు వీరే..

ఈ.పూర్ణచందర్‌రావు, డీవీ.చలపతిరావు, ఎం.శాలిని, మహమ్మద్ హుస్సేన్, బి.కృష్ణ, ఎస్.సుమన్, జి.తిరుపతిరెడ్డి, అనంతుల రవీందర్, ఏ.అనంతసేన్‌రెడ్డి, ఎం.విఘ్నేశ్వర్‌రెడ్డి, టి.వెంకట్‌రాజు, పి.శ్రవణ్‌కుమార్‌గౌడ్, జి.భాస్కర్, హెచ్.రాజేశ్‌కుమార్, గడ్డం కిరణ్‌కుమార్, ఈ.వెంకటరెడ్డి, కె.మణిదీపిక, ప్రదీప్ కుమార్ శ్రీరాంబట్ల, సుజాత కూరపాటి. వీరంతా అడ్వొకేట్ జనరల్(ఏజీ) ఆధ్వర్యంలో పనిచేస్తారు. ఒకట్రెండు రోజుల్లో వీరికి శాఖలు కేటాయించే అవకాశముంది.

ప్రభుత్వ డాక్టర్లు, సిబ్బంది బదిలీలు షురూ

16 నుంచి 20 తేదీల మధ్య ప్రజారోగ్య సిబ్బందికి కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో పనిచేసే డాక్టర్లు, నర్సులు, పారామెడికల్, ఇతర పరిపాలన ఉద్యోగుల బదిలీ ప్రక్రియకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీల మధ్య కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేపట్టనున్నారు. ప్రజారోగ్య విభాగంలో మొత్తం 1180 మందిని బదిలీ చేస్తారు. అందులో మినిస్ట్రీరియల్ స్టాఫ్ 60 మంది, పారామెడికల్ స్టాఫ్ 125 మంది, నర్సింగ్ 546, డాక్టర్లు 449 మంది వివిధ చోట్లకు బదిలీ అవుతారు. ఈ మేరకు ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. మినిస్ట్రీరియల్, పారామెడికల్ స్టాఫ్‌కు ఈ నెల 16వ తేదీన బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. డాక్టర్లకు 17, 18 తేదీల్లో, నర్సింగ్ సిబ్బందికి 19, 20వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ మేరకు ఆయా సిబ్బందికి సమాచారం అందించారు. కాగా, బోధనాస్పత్రుల్లో నాలుగేళ్లుగా ఒకేచోట 276 మంది ఆచార్యులు పనిజేస్తుండగా, అందులో 198 మందిని బదిలీ చేయాల్సి ఉంది.

వ్యవసాయ శాఖలో వెయ్యి మందికి స్థాన చలనం

ఈనెల 19, 20 తేదీల్లో బదిలీల ప్రక్రియ పూర్తి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ శాఖలో వెయ్యి మందికి స్థాన చలనం కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు. జేడీఏ, డీడీ, ఏడీఏ, ఏఓ, ఏఈఓ మొదలు ఇతర పరిపాలనా పరమైన ఉద్యోగుల్లో 40 శాతం మందికి బదిలీలు జరుగుతాయని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. వ్యవసాయ శాఖలో మొత్తం 3,622 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో జేడీఏలు 8, డీడీలు 25, ఏడీఏలు 211, ఏఓలు 745, ఏఈఓలు 2,414 మంది ఉన్నారు. మిగిలిన వారంతా అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. అందులో దాదాపు వెయ్యి మంది వరకు నాలుగేళ్లు దాటినవారు తప్పనిసరిగా బదిలీ కానున్నారు. నాలుగేళ్లు దాటినవారి జాబితా ప్రకారం అభ్యర్థులు ఆప్షన్లు ఇస్తూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. డిప్యుటేషన్‌లో ఉన్నవారిని కూడా బదిలీలకు పరిగణనలోకి తీసుకుంటామని చెబుతున్నారు. బదిలీలకు దరఖాస్తు చేసుకోవడం.. ఆప్షన్లు ఎంచుకోవడం కోసం వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్‌కు రూపకల్పన చేసింది. ఎవరికి వారు లాగిన్ చేసుకునేలా దీన్ని తయారు చేశారు. ఈ నెల 19, 20వ తేదీల్లో బదిలీల ప్రక్రియ చేపడతామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టాలా? లేక ఎలాగనేది ఇంకా నిర్ణయం జరగలేదని అంటున్నారు.

15న కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం



సాక్షి, హైదరాబాద్: నాగార్జున సాగర్ నుంచి కుడి ప్రధాన కాల్వ ద్వారా 5 టీఎంసీల నీళ్లను విడుదల చేసుకోవడానికి అనుమతించాలని ఏపీ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి ఈనెల 15న కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి సంబంధించిన త్రిసభ్య కమిటీ సమావేశం కానుంది. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయిపూరే నేతృత్వంలో జరగనున్న ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) అనిల్‌కుమార్, ఏపీ జల వనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి పాల్గొననున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాల కోసం ఈనెల 15 నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 11 రోజుల పాటు నీళ్లను కుడి ప్రధాన కాల్వ రెగ్యులేటర్ ద్వారా విడుదల చేసుకోవడానికి ఏపీ అనుమతి కోరింది. నాగార్జునసాగర్‌లో నిల్వలు అడుగంటిపోయిన నేపథ్యంలో ఏపీ విజ్ఞప్తికి వ్యతిరేకంగా కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ రాయనుందని అధికారవర్గాలు తెలిపాయి. సాగర్‌లో నిల్వ ఉన్న జలాలు తమవేనని, హైదరాబాద్ నగర తాగునీటి అవసరాల కోసం వాటిని పరిరక్షించాలని గతంలో తెలంగాణ కోరింది.

‘దానం’ అనర్హతపై మరో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ మరో పిటిషన్ దాఖలైంది. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి దానం విజయం సాధించారని, ఆ తర్వాత శాసనసభకు రాజీనామా చేయకుండా కాంగ్రెస్ పార్టీలో చేరారని ఏలేటి పేర్కొన్నారు. అన్ని ఆధారాలతో దానంపై ఫిర్యాదు చేసేందుకు స్పీకర్ కార్యాలయానికి ఈ నెల 1వ తేదీన వెళ్లినా ఆయన లేరని, ఫిర్యాదు తీసుకునేందుకు అక్కడి సిబ్బంది నిరాకరించారన్నారు. దీంతో మరో మార్గం లేక హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ వేసినట్టు చెప్పారు. అయితే ఇప్పటికే దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిపై దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ కొనసాగుతోంది. దీంతో ఏలేటి పిటిషన్‌ను కూడా ఆ పిటిషన్లతో కలిపి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టనున్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపించే అవకాశముంది.

కలెక్టర్లూ.. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లండి

- సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే కలెక్టర్ల పాత్ర కీలకమని, వారంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. ఈ నెల 2న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ ప్రాథమ్యాలను వివరించడంతోపాటు వాటి అమలులో కలెక్టర్లు ప్రధానపాత్ర పోషించాలని, వారు జిల్లా కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించాలని చేసిన సూచనను కలెక్టర్లకు పంపించిన ఉత్తర్వులో పేర్కొన్నారు. పథకాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఉద్దేశించి అమలు చేస్తున్నదని అవి సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న అంశాన్ని కలెక్టర్లు తమ పర్యటనల్లో పరిశీలించాలని సీఎస్ పేర్కొన్నారు. కలెక్టర్లు ప్రతీనెలా ఐదో తేదీ వరకు తమ పర్యటన డైరీని సీఎస్ కార్యాలయానికి పంపించాలని సీఎస్ తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రతి గురుకులంలో టెలిఫోన్!

- పాఠశాల స్థితిపై విద్యార్థి నేరుగా కార్యదర్శితో మాట్లాడొచ్చు
- వారంలోగా ప్రయోగాత్మకంగా పది గురుకులాల్లో అమలు
- మెరిట్ ఆధారంగానే అడ్మిషన్లు...
- సాక్షితో గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి వర్షిణి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని ప్రతి పాఠశాలలో ప్రత్యేకంగా టెలిఫోన్ ఏర్పాటు చేయనున్నట్లు ఆ సొసైటీ కార్యదర్శి వీ.ఎస్.అలగు వర్షిణి తెలిపారు. ఈ ఫోన్ ద్వారా నేరుగా సొసైటీ కార్యదర్శి అపాయింట్‌మెంట్ తీసుకుని నేరుగా మాట్లాడే అవకాశం ఉంటుందని వివరించారు. వారంలోగా పది పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమల్లోకి తేనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత అన్ని పాఠశాలల్లోనూ టెలిఫోన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ విధానంతో పాఠశాల స్థాయిలో సమస్యలు మొదలు ఇతర అంశాలన్నీ నేరుగా సొసైటీ కార్యదర్శి కార్యాలయానికి చేరుతాయని, ఇలా వచ్చిన అంశాలపై యుద్ధ ప్రాతిపదికన స్పందించి చర్యలు తీసుకునే వీలుంటుందన్నారు. టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపడుతున్న కార్యక్రమాలను వర్షిణి బుధవారం ‘సాక్షి’కి వివరించారు. అవి ఆమె మాటల్లోనే..

మెరిట్ ఆధారంగానే అడ్మిషన్లు...

గురుకులాల్లో అడ్మిషన్ల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకే ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నాం. ఇప్పటికే అర్హత పరీక్ష రాసిన వారిలో మెరిట్ ఆధారంగా అవకాశం కల్పిస్తున్నాం. పరీక్షకు దరఖాస్తు చేసుకోలేని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. రీజినల్ కోఆర్డినేటర్, ప్రిన్స్‌పల్ స్థాయిలో అడ్మిషన్లను ఎట్టి పరిస్థితిలోనూ చేపట్టవద్దని ఆదేశించాం. కొందరు మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం అందుతోంది. అలాంటి వారిని ఏమాత్రం సహించం. అలాంటి వారిపైన తల్లిదండ్రులు సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

19, 20 తేదీల్లో కొత్త టీచర్లకు పోస్టింగ్‌లు

ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో దాదాపు 1200 మందికి పదోన్నతులు ఇచ్చాం. ప్రస్తుతం టీచర్ల బదిలీ ప్రక్రియ సాగుతోంది. ఈనెల 18 తేదీ కల్లా బదిలీలను పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఈనెల 19, 20 తేదీల్లో కొత్తగా ఉద్యోగాలు సాధించిన టీచర్లకు పోస్టింగ్ ఇస్తాం. అన్ని కేటగిరీల్లో కలిపి 1452 మంది టీచర్లు కొత్తగా సొసైటీలో ఉద్యోగాల్లో చేరనున్నారు.

క్రమం తప్పకుండా కాస్మోటిక్ చార్జీలిచ్చేలా..

ప్రతి గురుకుల పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేలా కార్యాచరణ రూపొందించాం. పాఠశాలల్లో తరగతి గదులు, టాయిలెట్స్, డార్మిటరీ, కిచెన్‌లను పరిశుభ్రంగా నిర్వహించేలా ప్రత్యేకంగా శానిటేషన్ టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నాం, జిల్లా స్థాయిలో వీటిని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసేలా ఆదేశాలిస్తాం. మహిళా సంఘాలకు పాఠశాల స్థాయిలో కుకింగ్, శానిటేషన్ కాంట్రాక్టు ఇచ్చే ఆలోచన చేస్తున్నాం. విద్యార్థులకు క్రమం తప్పకుండా కాస్మోటిక్ చార్జీలు అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటాం.

సాక్షి రియల్టీ
శనివారం
13-7-2024

ప్రాపర్టీ షోల పండుగ!



- ఒకే నెలలో మూడు స్థిరాస్తి ప్రదర్శనలు
- క్రెడాయ్ హైదరాబాద్ చరిత్రలోనే తొలిసారి
- ఆగస్టు నెలలో వేర్వేరు ప్రాంతాల్లో షోలు
- ప్రదర్శనలో 200 సంస్థలు; 700 ప్రాజెక్ట్‌లు

సాక్షి, హైదరాబాద్: కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ (క్రెడాయ్) హైదరాబాద్ చరిత్రలోనే తొలిసారిగా ఒకే నెలలో మూడు ప్రాపర్టీ షోలను నిర్వహించనుంది. క్రెడాయబిలిటీ నేపథ్యంలో ఆగస్టు నెలలో వేర్వేరు తేదీల్లో, వేర్వేరు ప్రాంతాల్లో స్థిరాస్తి ప్రదర్శనలు జరగనున్నాయి. హైదరాబాద్ అభివృద్ధి, అవకాశాలను గృహ కొనుగోలుదారులకు వివరించడంతో పాటు వారి నిర్దిష్ట అవసరాలు, ప్రాంతాల ప్రాధాన్యతలు, బడ్జెట్‌కు అనుగుణంగా ప్రాపర్టీల ఎంపికకు వీలుంటుంది. క్రెడాయ్ సభ్యులు, రెరాలో నమోదైన ప్రాజెక్ట్‌లు మాత్రమే ప్రదర్శనలో ఉంటాయి కాబట్టి పారదర్శకత, విశ్వసనీయత ఉంటుంది. మూడు ప్రాపర్టీ షోలలో కలిపి సుమారు 200 నిర్మాణ సంస్థలు, 600–700 ప్రాజెక్ట్‌లు ప్రదర్శించనున్నాయి. ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, వ్యక్తిగత గృహాలు అన్ని రకాల నివాస సముదాయాలు షోలో ఉంటాయి. ఈమేరకు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ వి. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మెరుగైన మౌలిక సదుపాయాలు, అనుకూలమైన వ్యాపార వాతావరణం, పెట్టుబడులను ఆకర్షించడంపై దృష్టి సారించిన స్థిరమైన పాలన, ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రతిభావంతులైన శ్రామికశక్తిని కలిగిన ప్రపంచ నగరంగా హైదరాబాద్ నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పెట్టుబడిదారులు, కొనుగోలుదారులకు అపార వ్యాపార అవకాశాలున్నాయని తెలిపారు. జనరల్ సెక్రటరీ బీ జగన్నాథరావు మాట్లాడుతూ.. స్థిరాస్తి పెట్టుబడులకు మాత్రమే కాకుండా హైదరాబాద్ సురక్షితమైన పని వాతావరణం, కాస్మోపాలిటన్ సిటీగా గుర్తింపు పొందిందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ ఉన్నాయని గుర్తు చేశారు.

ప్రాపర్టీ షోలు ఎప్పుడంటే?

- ఆగస్టు 2 - 4న మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో
- ఆగస్టు 9 - 11న కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్‌లో
- ఆగస్టు 23 - 25న నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఖాళీ స్థలంలో ఎగ్జిబిషన్ సెంటర్‌లో

నూతన అధ్యక్షుడిగా ఎన్ జైదీప్ రెడ్డి..

క్రెడాయ్ హైదరాబాద్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్ జైదీప్ రెడ్డి మాట్లాడుతూ.. క్రమబద్ధమైన, స్థిరమైన వృద్ధిని కలిగిన హైదరాబాద్ మెరుగైన జీవన నాణ్యతను, ఆర్థిక స్థిరత్వాన్ని, సస్టైయినబులిటీతో ఉందని తెలిపారు. ప్రస్తుతం నగరంలో 884 ఐజీబీసీ గుర్తింపు పొందిన ప్రాజెక్ట్‌లు ఉండగా.. వీటిలో ఎక్కువ భాగం క్రెడాయ్ సభ్యుల ప్రాజెక్టులేనని గుర్తు చేశారు. ప్రాపర్టీ షోలో ప్రదర్శించే అన్ని ప్రాజెక్ట్‌లు గ్రీన్ లివింగ్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్మితమైనవేని చెప్పారు.

మూడు షోలు ఎందుకంటే...



- ప్రస్తుతం గృహ కొనుగోలుదారులు వేచి చూసే ధోరణిలో ఉండటంతో హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్ స్తబ్దుగా ఉంది. ఇలాంటి తరుణంలో నగర రియల్టీ మార్కెట్ అభివృద్ధి. అవకాశాలను నగరవాసులకు తెలియజేయాలి.
- హైదరాబాద్‌లో 70 శాతం అఫర్డబుల్ హౌసింగ్ మార్కెట్టే. అయా ప్రాపర్టీల వివరాలతో పాటు ఏ ఏ ప్రాంతాల్లో ఎంత రేటు ఉందో తెలిసిపోతుంది. ఎప్పటిలాగే ఒకే ప్రాంతంలో ప్రాపర్టీ షో నిర్వహిస్తే కేవలం లగ్జరీ, ఎగువ మధ్యతరగతి ప్రాపర్టీలే ప్రదర్శనలో ఉంటాయి. అందుకే ప్రాంతాల వారీగా ప్రాపర్టీ షో నిర్వహిస్తే ఆయా ప్రాంతాల్లోని అన్ని తరగతుల గృహాలు ప్రదర్శనలో ఉంటాయి.
- క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోకు విశ్వసనీయత ఉంది. ఇలాంటి వేదిక మీదుగా స్థిరాస్తి రంగం, నగరాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, ప్రతిపాదనలను ప్రజలకు చేరవేసే వీలుంటుంది.

డేటా సెంటర్ల జోరు!



అందుబాటులో 47 మెగావాట్ల సామర్థ్యం

- ప్రణాళిక దశలో మరో 58 మెగావాట్లు
- మేకగూడ, షాద్‌నగర్, చందన్‌వ్యాలీలో ఏర్పాటు
- 5జీ, ఐఓటీలతో మరింత డిమాండ్
- కొల్లియర్స్ ఇండియా నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది నగరాల్లో డేటా సెంటర్ల జోరు కొనసాగుతోంది. గ్లోబల్ డేటా సెంటర్లకు చిరునామాగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, వ్యూహాత్మక మౌలిక సదుపాయాల పెట్టుబడులు, డిజిటల్ సేవలకు పెరుగుతున్న డిమాండ్ డేటా సెంటర్ల వృద్ధికి ప్రధాన కారణాలు. ప్రస్తుతం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో 47 లక్షల చ.అ.ల్లో 213 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. మరో 27 లక్షల చ.అ.ల్లో 186 మెగావాట్లు నిర్మాణ దశలో, 24 లక్షల చ.అ.ల్లో 168 మెగావాట్లు ప్రణాళిక దశలో ఉన్నాయని కొల్లియర్స్ ఇండియా నివేదిక వెల్లడించింది.

- ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా సెంటర్ల సామర్థ్యంలో 35 ఆక్యుపెన్సీ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) విభాగానిదే. ఆ తర్వాత 30 శాతం ఐటీ రంగం, 20% క్లౌడ్ సర్వీస్ విభాగం, ఇతరుల వాటా 15 శాతంగా ఉంది. డేటా సెంటర్ల నెలవారీ చార్జీలు కిలోవాట్‌కు రూ.6,650 నుంచి 8,500లుగా ఉన్నాయి.

చెన్నై, బెంగళూరులో..

- జలాంతర్గామి కేబుల్ కనెక్టివిటీని అందించే వ్యూహాత్మక తీర ప్రాంతం కారణంగా చెన్నై ప్రధాన డేటా సెంటర్ హబ్‌గా మారింది. ప్రస్తుతం చెన్నైలో 17 లక్షల చ.అ.ల్లో 87 మెగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లు ఉన్నాయి. మరో 23 లక్షల చ.అ.ల్లో 156 మెగావాట్లు నిర్మాణంలో ఉండగా.. 16 లక్షల చ.అ.ల్లో 104 మెగావాట్లు ప్రణాళికలో ఉంది. అనుకూల వాతావరణం, మెరుగైన విద్యుత్ మౌలిక సదుపాయాలు వంటివి చెన్నైని డేటా సెంటర్ల పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మార్చాయి.
- సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరులో ప్రస్తుతం 20 లక్షల చ.అ.ల్లో 79 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లున్నాయి. మరో లక్ష చ.అ.ల్లో 10 మెగావాట్లు నిర్మాణంలో, 3 లక్షల చ.అ.ల్లో 26 మెగావాట్లు పైప్‌లైన్‌లో ఉన్నాయి. బలమైన సాంకేతిక నైపుణ్యం, నిపుణుల లభ్యత బెంగళూరు డేటా సెంటర్ల మార్కెట్‌కు చోదకశక్తిగా నిలుస్తున్నాయి.

5జీ, ఐఓటీతో డిమాండ్..

5జీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), క్లౌడ్ సర్వీస్‌లు, ఎంటర్‌ప్రైజ్‌ల డిజిటలైజేషన్ పెరుగుదల కారణంగా డేటా సెంటర్ల డిమాండ్ మరింత పెరుగుతుందని కొల్లియర్స్ ఇండియా అడ్వైజరీ సర్వీసెస్ హెడ్ స్వాప్నిల్ అనిల్ అభిప్రాయపడ్డారు. 2030 నాటికి దక్షిణాది నగరాల్లో డేటా సెంటర్ల సామర్థ్యంలో 80 శాతం వృద్ధి నమోదవుతుందని అంచనా వేశారు.

హైదరాబాద్‌లో 47 మెగావాట్లు..

ప్రభుత్వ విధానాలు, మెరుగైన మౌలిక వసతులు, కనెక్టివిటీ కారణంగా హైదరాబాద్‌లో డేటా సెంటర్ల జోరు కొనసాగుతోంది. అత్యంత వేగంగా నగరం డేటా సెంటర్ల హాట్‌స్పాట్‌గా అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం భాగ్యనగరంలో 10 లక్షల చ.అ.ల్లో 47 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు అందుబాటులో ఉండగా.. మరో 3 లక్షల చ.అ.ల్లో 20 మెగావాట్లు నిర్మాణంలో, 5 లక్షల చ.అ.ల్లో 38 మెగావాట్లు ప్రణాళిక దశలో ఉన్నాయి. ప్రస్తుతం నగరంలో మైక్రోసాఫ్ట్, సీటీఆర్ఎల్ఎస్ వంటి పలు సంస్థలు డేటా సెంటర్లున్నాయి. గచ్చిబౌలి, మేకగూడ, షాద్‌నగర్, చందన్‌వ్యాలీ వంటి పలు ప్రాంతాల్లో మరిన్ని డేటా సెంటర్లు రానున్నాయి.

రాయితీలు, పన్ను ప్రోత్సాహకాలు..


- ప్రత్యేకమైన డేటా సెంటర్ పాలసీలు పెట్టుబడిదారులకు స్పష్టమైన, నిర్మాణాత్మక కార్యాచరణకు దోహదపడతాయి. దీంతో ఆయా నగరాల్లో పెట్టుబడుల ఆకర్షణ ఎక్కువగా ఉంటుంది.
- డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణలో గణనీయమైన రాయితీలు, విద్యుత్ టారీఫ్‌లలో తగ్గుదల, గణనీయమైన పన్ను మినహాయింపులు దక్షిణ భారతదేశంలో డేటా సెంటర్ల పెట్టుబడుల ఆకర్షణకు ప్రధాన కారణాలని చెప్పొచ్చు.
- విద్యుత్, టెలికమ్యూనికేషన్స్ మౌలిక వసతుల్లో పెట్టుబడులు అధిక వేగం, విశ్వసనీయతను నిర్ధారిస్తుంది. ఇది డేటా సెంటర్ల కార్యకలాపాలకు కీలక అంశం.
- సరళీకృత విధానాలు, వేగవంతమైన అనుమతి ప్రక్రియలు, బ్యూరోక్రాట్స్ నియంత్రణల తగ్గింపులు వంటివి డేటా సెంటర్లను ప్రోత్సహిస్తున్నాయి.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం॥ 13-7-2024


● కుటుంబ సభ్యులతో ముఖేష్ అంబానీ, నీతా అంబానీ


● అనంత్ అంబానీ – రాధికా మర్చంట్


● రాధికా పరిణయం


● తండ్రి మురిపెం.. తనయుడి దరహాసం


● రజనీకాంత్



● అమితాబ్, జయ


● సల్మాన్ ఖాన్


● టోనీ బ్లెయిర్, చెర్రీ బ్లెయిర్


● ధోనీ ఫ్యామిలీ


● ఉపాసన, రామ్‌చరణ్


● రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్

ఆకాశ పందిరి తారలు తలంబ్రాలు


● షారుక్ ఖాన్, గౌరి


● సైరా బాను, ఏఆర్ రెహమాన్


● మిహిక, రానా


● అట్లీ, ప్రియ




● ప్రియాంకా చోప్రా


● వెంకటేశ్


● మహేశ్‌బాబు

కుబేరులు వియ్యంకులైతే ఒక కల్యాణం ఎంత ఘనంగా జరగాలో అంత ఘనంగా జరుగుతుంది. దేవతల వంటి అతిథులు, పుష్పక విమానాలు, పారిజాతాలు, శతభక్ష్య పరమాణ్ణాలు, సువర్ణ తోరణాలు, వెండి ద్వారాలు, స్త్రీల మెడల్లో పచ్చలు, కెంపులు, వజ్రవైఢూర్యాలు, కళ్లు చెదిరే పట్టు పీతాంబరాలు...

ముఖేష్ అంబానీ–నీతా అంబానీ తమ కుమారుడు అనంత్ అంబానీ వివాహాన్ని విరెన్ మర్చంట్–శైలా మర్చంట్‌ల కుమార్తె రాధికా మర్చంట్‌తో జూలై 12 రాత్రి జరప నిశ్చయించడంతో ముంబై లోని జియో వరల్డ్ కన్వెన్షన్ అందుకు భారీ వేదికైంది. దేశ, విదేశాల అతిథులను విమానాలు మోసుకొచ్చాయి. శనివారం 'శుభ్ ఆశీర్వాద్' పేరుతో వేడుక, ఆదివారం రోజు 'మంగళ్ ఉత్సవ్' పేరున భారీ రిసెప్షన్ జరుగనున్నాయి.

తరలి వచ్చిన అతిథులు

ఒకవైపు తేలికపాటి చినుకులు పడుతూ ఉంటే అనంత్–రాధికల పెళ్లి కోసం అంబానీ గృహధామం ఎంటిలియాతో పాటు వివాహవేదిక జియో వరల్డ్ కన్వెన్షన్‌లో అతిథుల తాకిడి మొదలైంది. 'దుల్హేరాజా' అనంత్ బారాత్‌ను సర్వాంగ సుందరంగా తయారు చేసిన కారులో కొనసాగింది. సాయంత్రం నుంచే అతిథుల రాక మొదలైంది. బ్రిటన్ మాజీ ప్రధాని టోని బ్లెయర్ మొదలు అమెరికా మీడియా పర్సనాలిటీ కిమ్ కర్దాషియన్ వరకు హాలీవుడ్ నటుడు జాన్ సీనా నుంచి తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ వరకూ ఎందరో అరుదెంచారు. బాలీవుడ్ నుంచి షారూక్ ఖాన్, సల్మాన్ ఖాన్, రణబీర్ కపూర్, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా– నిక్ జోన్స్, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్ తదితరులు హాజరయ్యారు. క్రికెటర్లలో మహేంద్ర సింగ్ ధోని, నాటి మేటి ఆటగాడు శ్రీకాంత్, బుమ్రా, కేఎల్ రాహుల్, సూర్యకుమార్ యాదవ్ హాజరయ్యారు.

దక్షిణాది తారాతోరణం

అనంత్– రాధికల వివాహంలో దక్షిణాది తారలు తళుకులీనారు, మహేష్‌బాబు తన భార్య నమ్రత, కుమార్తె సితారతో హాజరవగా, రామ్‌చరణ్–ఉపాసన జోడీగా వచ్చారు. వెంకటేష్, రాణ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. సంగీత దిగ్గజం ఏ.ఆర్. రెహమాన్ సతీసమేతంగా హాజరయ్యారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ కుటుంబ సమేతంగా వచ్చారు. నయనతార–విగ్నేష్ శివన్, సూర్య –జ్యోతిక వేడుకకు తళుకులు అద్దారు.


● సూర్య, జ్యోతిక


● విఘ్నేష్ శివన్, నయనతార

హెల్దీ డైట్

రాగి-బనానా పాన్ కేక్



కావలసినవి: అరటి పండు– 1; రాగి పిండి – కప్పు; బెల్లం పొడి– అర కప్పు; పాలు – కప్పు; నెయ్యి– 2 టేబుల్ స్పూన్లు ; పండ్ల ముక్కలు – డెకరేషన్ కోసం కొన్ని.

తయారీ: ● ఒక పాత్రలో బెల్లం పొడి వేయాలి. అందులో అరటి పండు గుజ్జు, రాగి పిండి వేసి మూడు సమంగా కలిసేటట్లు వేళ్లతో బాగా చిదుముతూ కలపాలి. కలిపేటప్పుడు పాలు కొద్ది కొద్దిగా వేసుకుంటూ ఉండాలి. ఇలా కలిపితే మిశ్రమం బాగా మృదువుగా వస్తుంది ● నాన్ స్టిక్ పెనం వేడి చేసి కొద్దిగా నెయ్యి రాసి పైన కలిపి సిద్ధంగా ఉంచుకున్న మిశ్రమాన్ని ఒక గరిటె వేసి అంతా ఒకే మందంలో ఉండేటట్లు సర్దాలి ● చిన్న మంట మీద కాలనివ్వాలి. పెనం వైపు దోరగా కాలేకొద్దీ పై వైపు బుడగలు మొదలవుతాయి. అప్పుడు కేకును తిరగేసి రెండవ వైపు కూడా దోరగా కాలనివ్వాలి ● రెండు వైపులా కాలిన కేక్‌ను ప్లేట్‌లోకి తీసుకుని తాజా పండ్ల ముక్కలతో గార్నిష్ చేయాలి.

ఇది గ్లూటెన్ ఫ్రీ ఫుడ్. ఐరన్, క్యాల్షియం పొటాషియం సమృద్ధిగా ఉండి మంచి శక్తినిచ్చే ఆహారం. ఇందులో దాదాపుగా 200 కిలోకేలరీల శక్తి, 40 గ్రాముల కార్బోహైడ్రేట్‌లు, 6 గ్రాముల ప్రొటీన్‌లు, ఆరు గ్రాముల ఫ్యాట్, 4 గ్రాముల ఫైబర్, 15 గ్రాముల చక్కెరలు ఉంటాయి.



– డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ & వెల్‌నెస్ కోచ్

ఆర్వోతో వడపోత మేలేనా?

● అవసరమైన లవణాలు కోల్పోతామా?

దేహంలోని అన్ని జీవక్రియలకు కావాల్సింది నీరు. అది కలుషితమైతే వెంటనే జబ్బు పడతాం. అందుకే వీలైనంత శుభ్రమైన నీళ్లే తాగాలి. ఇప్పుడు లభ్యమవుతున్న నీటిలో ఎన్నో కాలుష్యాలు! అందుకే వడపోత తప్పనిసరి. ఈ ప్రక్రియలో అత్యాధునికమైనది ఆర్‌వో అని పిలిచే రివర్స్ ఆస్మాసిస్. అయితే ఈ పద్ధతిలో దేహానికి అవసరమైన మరి కొన్ని ఖనిజ లవణాలూ కోల్పోయే ప్రమాదముందనేది చాలా మంది అభిప్రాయం. దాన్లో కొంత నిజమున్నా... ఈ వడపోతకు ఆర్‌వో ఎందుకు సురక్షితం, కోల్పోయే ఖనిజలవణాల కోసం ఏం చేయాలి?... తెలుసుకుందాం రండి.

వడపోతకు పలుచటి వస్త్రాన్ని వాడటం, అంతకంటే కాచి చల్లార్చాక నీటిని పల్చటి బట్టతో వడపోయడం మరింత రక్షణ, కొన్ని పరిస్థితుల్లో గుల =కరాళ్లు, ఇసుక, చార్‌కోల్ (బొగ్గులు) ముక్కలు వాడటం... ఇవన్నీ చేయవచ్చు. కానీ ఇవేవీ నీళ్లలోని బ్యాక్టీరియాను పూర్తిగా నశింపజేయలేవు. కానీ రివర్స్ ఆస్మాసిస్ అన్నింటికంటే సురక్షితం.

లవణాల సాంద్రతను కొలిచేదిలా...

ఏ నీళ్లలోనైనా అనివార్యంగా కొన్ని లవణాలు ఉంటాయి. వీటిని టోటల్ డిజాల్వబుల్ సాల్ట్స్ (టీడీఎస్) అంటారు. ఈ 'టీడీఎస్'ను పార్ట్స్ పర్ మిల్లీ (పీపీఎమ్)లో కొలుస్తారు.



నీళ్లలోని టీడీఎస్ (పీపీఎమ్‌లలో)	తాగడానికి ఏ మేరకు మంచిది
50 - 150 మధ్యన	అద్భుతం (ఎక్సలెంట్)
150 - 250 వరకు	మంచివే (గుడ్)
250 - 300 వరకు	పర్లేదు (ఫెయిర్)
300 - 500 వరకు	అంత మంచిది కాదు (పూర్)

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రకారం మన దేశంలోని తాగు నీటి టీడీఎస్ 500 లోపు ఉండాలి. కానీ డబ్ల్యూహెచ్ఓ మాత్రం 300లోపు ఉంటేనే మంచిదంటోంది.

కోల్పోయిన మినరల్స్, నీటి స్వాభావిక రుచి పొందేందుకు...

● **మినరల్ క్యాట్రిడ్జ్‌లను ఉపయోగించడం ద్వారా** కొన్ని ప్యూరిఫైయర్లలో మినరల్ క్యాట్రిడ్జ్‌లను ఉపయోగించడం ద్వారా నీటిలోకి మినరల్స్ తిరిగి చేర్చవచ్చు.

● **మినరల్ డ్రాప్స్ / టాబ్లెట్స్ ద్వారా:** మార్కెట్లో తేలికగా, చవగ్గా దొరికే మినరల్ డ్రాప్‌లు లేదా టాబ్లెట్స్‌తో కోల్పోయిన మినరల్స్ పొందవచ్చు.

● **ఫిల్టర్లను మార్చడం ద్వారా:** కొన్ని ప్యూరిఫైయర్స్‌లో మినరల్స్ కోల్పోకుండా చేయడానికి ప్రత్యేకమైన ఫిల్టర్స్ ఉంటాయి.

● **తరచూ ప్యూరిఫైయర్‌లు మారుస్తూ ఉండడం ద్వారా:** నీటి రుచి, ఫ్లేవర్‌ను మెరుగు పరచవచ్చు.

● **ప్రకృతిలోని స్వాభావిక పదార్థాలతో:** తాగే నీటిలో కాస్త తేనె, నిమ్మరసం, లవంగాలు వంటివి కలుపుకోవడం ద్వారా రుచికరమైన, ఆరోగ్యకరమైన నీటిని పొందవచ్చు.

ఆర్‌వో తో అవసరమైన లవణాలు కోల్పోవడం జరగదా?

అవును... జరుగుతుంది. అయితే ఆర్‌వో ఇప్పుడు అందుబాటులో ఉన్న అత్యాధునిక వడపోత ప్రక్రియ. దీంట్లో మనకు అవసరమైన ఖనిజాలూ, లవణాలూ చాలావరకు కోల్పోతాం. అయితే కాలుష్యాలూ, హెవీ మెటల్స్ ఉన్న నీటిని తాగడం కంటే... కొంతమేరకు క్యాల్షియమ్, మెగ్నీషియమ్, జింక్ లాంటి ఎసెన్షియల్ సాల్ట్స్ కోల్పోయినా, వాటిని ఇతర మార్గాల్లో భర్తీ చేసుకోవడం మేలు.

మరి లవణాల భర్తీ ఎలా?

రోజువారీ ఆహారంలో తాజా ఆకుకూరలు, పండ్లు, నట్స్ వంటివి తగినంతగా తీసుకుంటూ ఉంటే ఆర్‌వోలో కోల్పోయిన ఖనిజాలూ, లవణాలను భర్తీ చేసుకోవచ్చు.



డాక్టర్ ఆరతి బెల్లారి
కన్సల్టెంట్,
ఇంటర్నల్ మెడిసిన్

రివర్స్ ఆస్మాసిస్ అంటే...

ఆస్మాసిస్‌లో తక్కువ గాఢత ఉన్న ద్రవం వడపోతకు గురై ఎక్కువ గాఢత ఉన్న వైపునకు వెళ్తుంది. దీనికి భిన్నంగా బాగా గాఢంగా ఉన్న కలుషితమైన నీరు వడపోతకు గురయ్యాక తక్కువ గాఢత వైపునకు రావడాన్ని 'రివర్స్ ఆస్మాసిస్' అంటారు. ఇందులో కలుషిత పదార్థాలు, ఖనిజాలూ, లవణాలు మొదలైనవి ఉన్న నీటిని యంత్రసహాయంతో ఒత్తిడికి గురి చేస్తూ ఒక ఫిల్టరేషన్ పొర (సెమీ పర్మియబుల్ మెంబ్రేన్) ద్వారా వడపోస్తారు.

ఆర్‌వో ప్రక్రియ ఎందుకంటే...

మన నీటి వనరుల్లోకి అనేక కలుషితమైన పదార్థాలే కాకుండా పారిశ్రామిక వ్యర్థాల కారణంగా హెవీ మెటల్స్ కూడా ఉంటాయి. ఈ నీళ్లు తాగితే కొంతకాలానికి కిడ్నీలు, కాలేయం దెబ్బతినడం ఖాయం. అయితే ఆర్‌వో ప్రక్రియ ద్వారా వడపోయడం వల్ల ఆ నీటి నుంచి కాలుష్యాలన్నీ అన్నివిధాలా పూర్తి స్థాయిలో తొలగిపోయి... పరిశుభ్రమవుతాయి.

బ్యూటిప్స్

అందమైన చేతులు, నాజూకైన పాదాల కోసం

- టేబుల్ స్పూన్ శనగపిండిలో చిటికెడు పసుపు వేసి అందులో తగిన మోతాదులో పాలు లేదా పెరుగు వేసి మరీ గట్టిగా కాకుండా జారుడుగా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ని చేతులకు, పాదాలకు పట్టించి పదిహేను – ఇరవై నిమిషాల పాటు ఉంచాలి. ఆ తరవాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ చర్మం నుంచి శనగపిండి ప్యాక్‌ను వదిలించిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే చేతులు, పాదాల చర్మం మృదువుగా మారుతుంది.



- చేతులు, పాదాల చర్మం గరుకుగా మారినప్పుడు... టీ స్పూన్ నిమ్మరసంలో టీ స్పూన్ చక్కెర కలిపి (చక్కెర పూర్తిగా కరగాల్సిన అవసరం లేదు. గరుకుగానే ఉండాలి), ఆ మిశ్రమాన్ని చేతులకు, పాదాలకూ పట్టించి పది నిమిషాల తర్వాత వేళ్లతో నెమ్మదిగా మర్దన చేయాలి. ఇలా చేస్తే మృత కణాలు తొలగిపోతాయి, చేతులు, పాదాల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. పొడి చర్మం ఉన్న వాళ్లు ఈ ప్యాక్‌లో నాలుగు చుక్కల కొబ్బరి నూనె లేదా బాదం నూనె కలుపుకోవాలి.
- చేతి వేళ్లు, పాదాలు ఆకర్షణీయంగా కనిపించాలంటే... అలోవెరా జెల్‌లో రెండు చుక్కల బాదం నూనె లేదా గ్లిజరిన్ కలిపి రాత్రి పడుకునే ముందు చేతులకు, పాదాలకు రాసుకోవాలి. అలాగే టీ స్పూన్ టొమాటో రసం, అదే మోతాదులో గ్లిజరిన్, నిమ్మరసం కలిపి రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.

సాక్షి బిజినెస్

శనివారం
13-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
622	186
80,519	24,502

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,518	▲ 235
డోజోన్స్	40,188	▲ 434
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,253	▲ 30
డాక్స్	18,748	▲ 214
షాంఘై	2,971	▲ 1
నికాయ్	41,191	▲ 1,003

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	71,930
బంగారం (22 క్యారట్)	68,500
వెండి (కిలో)	99,990

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.14	84.07
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.69	108.26
€	యూరో	ఒకటి	89.29	91.65
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	51.47	52.60
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.42	57.36
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.50	64.16
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.85	23.63
¥	చైనా యువాన్	ఒకటి	10.36	12.44

సూచీలు సరికొత్త శిఖరాలకు..



- ఐటీ షేర్ల ర్యాలీ
- ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాల ఎఫెక్ట్
- 622 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: ఐటీ షేర్ల భారీ ర్యాలీ, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో స్టాక్ సూచీలు శుక్రవారం కొత్త గరిష్టాలకు చేరాయి. టీసీఎస్ అంచనాలకు మించి క్యూ1 ఆర్థిక ఫలితాలను వెల్లడించి దేశీయ కార్పొరేట్ ఫలితాల సీజన్‌ను షురూ చేయడంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహం పెరిగింది. అలాగే అమెరికా ద్రవ్యోల్బణం ఏడాది దిగిరావడంతో యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలూ ఐటీ రంగ షేర్లకు భారీ డిమాండ్ పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 622 పాయింట్లు పెరిగి 80,519 వద్ద ముగిసింది. నిఫ్టీ 186 పాయింట్ల లాభంతో 24,502 వద్ద స్థిరపడింది. ముగింపు స్థాయిలు ఇరు సూచీలకు సరికొత్త రికార్డులు. అంచనాలకు మించి క్యూ1 ఫలితాలతో టీసీఎస్ సంస్థ షేరు 7% లాభపడి రూ.4185 వద్ద ముగిసింది. విప్రో 5%, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా షేర్లు 3 శాతం పెరిగాయి. రంగాల వారీగా అత్యధికంగా బీఎస్ఈ ఐటీ ఇండెక్స్ 4.32% పెరిగింది.

■ సూచీల కొత్త రికార్డులతో ఇన్వెస్టర్ల సంపద సైతం జీవితకాల గరిష్టానికి చేరుకుంది. శుక్రవారం ఒక్కరోజే రూ.1.17 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ. 452.38 లక్షల కోట్లకు చేరింది.

పారిశ్రామిక రంగం పరుగు



న్యూఢిల్లీ: భారత్ మొత్తం స్థూల దేశీయో త్పత్తి (జీడీపీ)లో దాదాపు 25 శాతం వాటా ఉన్న పారిశ్రామిక రంగం 2024 మేలో సానుకూల ఫలితాన్ని నమోదుచేసుకుంది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి రేటు 5.9 శాతంగా నమోదైంది. గడచిన ఏడు నెలల్లో ఈ స్థాయిలో పారిశ్రామిక రంగం పురోగతి ఇదే తొలిసారి. విద్యుత్, కన్జూమర్ డ్యూరబుల్స్, మైనింగ్ రంగాలు మంచి పనితనాన్ని ప్రదర్శించినట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఇక ఆర్థిక సంవత్సరం 2024 ఏప్రిల్, మే నెలల్లో ఐఐపీ 5.4 శాతంగా నమోదైంది. 2023 ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు 5.1 శాతం.

'సాక్షి ఫ్లస్' ఈ-పేపర్‌లో ..

జీసీసీలో హైరింగ్ జోరు	కొత్త మైలురాయికి పీవీ విక్రయాలు

రూ.10,000 లోపు హ్యాండ్‌సెట్లపై కంపెనీల దృష్టి

- ఈ పండుగ సీజన్‌లోనే వెల్లువలా మార్కెట్లోకి...
- 5జీ చిప్‌సెట్ రేట్లు దిగిరావడంతో ఫోన్ల ధరలు తగ్గుముఖం
- చైనా చిప్‌సెట్ బ్రాండ్ యూనిసాక్ బాటలో క్వాల్‌కామ్, మీడియాటెక్

చౌక 5జీ ఫోన్ల మోత!

మనం ఇప్పటికే 5జీ యుగంలోకి అడుగుపెట్టేశాం. ఒకపక్క టెలికం కంపెనీలు 5జీ నెట్‌వర్క్ విస్తరణకు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. మరోపక్క మొబైల్ ఫోన్ తయారీ సంస్థలు కూడా 5జీ హ్యాండ్‌సెట్లను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి. దీంతో ఫోన్ కొనుగోలుదారులకు ఇక 'పండుగే'! ప్రస్తుతం దేశంలో 5జీ స్మార్ట్ ఫోన్ల ధర రూ. 11,000–13,000 మధ్య ప్రారంభమవుతోంది. కొన్ని ఫోన్ బ్రాండ్లు అప్పుడప్పుడు ప్రమోషనల్ ఆఫర్లను అందిస్తుండటంతో ధర కొంచెం తగ్గుతోంది. అయితే, చిప్ తయారీ సంస్థలు చౌక 5జీ చిప్‌సెట్లను అందుబాటులోకి తెస్తుండటంతో ఫోన్ రేట్లు భారీగా దిగిరానున్నాయి.

చిప్.. చిప్.. హుర్రే!


తాజాగా భారత్ కోసం చైనా చిప్‌సెట్ బ్రాండ్ యూనిసాక్ 'టీ760' చిప్‌సెట్‌ను విడుదల చేసింది. ప్రధాన మొబైల్ ఫోన్ తయారీ సంస్థలు అందుబాటు ధరల్లో 5జీ ఫోన్ల విడుదలకు చర్చలు జరుపుతున్నట్లు ప్రకటించింది. దీంతో రూ. 10,000 లోపు ధరల్లో 5జీ ఫోన్లకు మార్గం సుగమం కానుంది. యూనిసాక్ బాటలోనే మొబైల్ చిప్‌సెట్లలో దిగ్గజ బ్రాండ్లైన క్వాల్‌కామ్, మీడియాటెక్ కూడా చౌక 5జీ చిప్‌సెట్లను అందించనున్నాయి. 'అతి త్వరలోనే' బడ్జెట్, ఎంట్రీలెవెల్ 5జీ హ్యాండ్‌సెట్ల కోసం చిప్‌సెట్లను తీసుకొస్తామని క్వాల్‌కామ్ కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు. మీడియాటెక్ 'డైమెన్సిటీ 6000 సిరీస్' ఎంట్రీలెవెల్ చిప్‌సెట్ చౌకగా స్మార్ట్ ఫోన్లను అందించేందుకు వీలుకల్పిస్తుందని ఆ కంపెనీ డిప్యూటీ డైరెక్టర్ అనూజ్ సిద్ధార్థ్ చెప్పారు. '2జీ, 4జీ విభాగాల్లో యూనిసాక్ చిప్‌సెట్ల వాటా పటిష్టంగా ఉంది. టీ760తో భారత్‌లో అందరికీ చౌక 5జీ ఫోన్లను అందించడమే మా లక్ష్యం. దీనికోసం కీలక ఫోన్ తయారీదారులతో జట్టు కడుతున్నాం. టీ760 చిప్‌సెట్ మెరుగైన పనితీరుతో భారత్ 5జీ స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లో సంచలనం సృష్టిస్తాం' అని యూనిసాక్ కంపెనీ పేర్కొంది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

> 5జీ ఫోన్ కొనే ప్లాన్‌లో ఉన్నారా? పండుగ సీజన్ వరకు కాస్త ఓపిక పట్టండి! ఎందుకంటారా? భారీగా ఆదా చేసే చాన్స్ రాబోతోంది. రాబోయే పండుగల్లో చౌక 5జీ ఫోన్లు మార్కెట్‌ను ముంచెత్తనున్నాయి. ప్రధానంగా హ్యాండ్‌సెట్ల తయారీలో కీలకమైన 5జీ చిప్‌సెట్లను చిప్ తయారీ బ్రాండ్లు తక్కువ ధరల్లో విడుదల చేస్తుండటంతో ఫోన్ రేట్లు దిగొచ్చేందుకు వీలవుతోంది. దీంతో ఈ ఏడాది చివరికల్లా దేశంలో 5జీ హ్యాండ్‌సెట్ల మార్కెట్ భారీగా ఎగబాకుతుందనేది పరిశ్రమ వర్గాల అంచనా.

ఇక 5జీ మార్కెట్ జోరు...

చిప్‌సెట్ల రేట్లు దిగిరావడం, చౌక ఫోన్ల లభ్యతతో ఈ ఏడాది చివరికల్లా 5జీ ఫోన్ల మార్కెట్ వాటా రెండంకెల స్థాయికి చేరుకోవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 'రూ. 10,000 విభాగంలో 5జీ ఫోన్ల వాటా ఈ ఏడాది మే నాటికి కేవలం 1.4 శాతం మాత్రమే ఉంది. చౌక చిప్‌సెట్ల ప్రభావంతో డిసెంబర్ నాటికి ఈ వాటా 10 శాతానికి చేరుకోనుంది' అని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ పేర్కొన్నారు. ట్రాన్సియన్ హోల్డింగ్స్ (టెక్నో, ఇన్ఫినిక్స్, ఐటెల్ తదితర మొబైల్ బ్రాండ్స్), హెచ్ఎండీ గ్లోబల్ (నోకియా బ్రాండ్), రియల్‌మీ, రెడ్‌మీ వంటి కంపెనీలు దసరా, దీపావళి పండుగ సీజన్‌లో చౌక 5జీ హ్యాండ్‌సెట్లను ప్రవేశపెట్టే సన్నాహాల్లో ఉన్నాయి. 'ట్రాన్సియన్ వంటి కీలక తయారీదారు భారీ ప్రణాళికల్లో ఉండటంతో రూ.10,000 లోపు 5జీ హ్యాండ్‌సెట్ల మార్కెట్ దూసుకుపోనుంది. 5జీ ఫోన్ల విడుదలకు సంబంధించి మార్కెట్‌ను అధ్యయనం చేస్తున్నాం' అని ట్రాన్సియన్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అరిజీత్ తలపాత్ర పేర్కొన్నారు.



హెచ్‌సీఎల్ టెక్ లాభం జూమ్

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఈ ఏడాది (2024–25) తొలి త్రైమాసికం (క్యూ1)లో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1లో నికర లాభం 20% పైగా ఎగసి రూ. 4,257 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం 6.6% వార్షిక వృద్ధితో రూ. 28,057 కోట్లకు చేరింది. త్రైమాసికవారీగా అంటే క్యూ4 (జనవరి–మార్చి)తో పోలిస్తే నికర లాభం 6.8% పుంజుకోగా.. ఆదాయం స్వల్పంగా 1.6% నీరసించింది.

గైడెన్స్ ఓకే..: ఈ ఏడాది ఆదాయంలో 3–5 శాతం స్థాయిలో వృద్ధి సాధించే వీలున్నట్లు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ తాజా అంచనాలు(గైడెన్స్) ప్రకటించింది. భవిష్యత్‌కు తగిన పోర్ట్‌ఫోలియో కలిగిన తాము జెన్ఏఐ ప్రభావంతో కొత్తగా పుట్టుకొస్తున్న అవకాశాలను అందుకోగలమని కంపెనీ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా పేర్కొన్నారు. 'రానున్న త్రైమాసికాలలో మరింత పురోగతి సాధించగలమని విశ్వసిస్తున్నాం. వెరసి పూర్తి ఏడాదికి అంచనాలను అందుకునే పనితీరును చూపగలమని భావిస్తున్నాం' అని కంపెనీ సీఈఓ సి.విజయ్‌కుమార్ చెప్పారు.

- క్యూ1లో రూ. 4,257 కోట్లు
- షేరుకి రూ. 12 డివిడెండ్
- ఈ ఏడాది 3–5 శాతం వృద్ధి!
- 10,000 మందికి కొత్తగా ఉపాధి



ఇతర విశేషాలు...

- క్యూ1లో కొత్తగా 2 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను కుదుర్చుకుంది.
- ఉద్యోగుల సంఖ్య 7,000కు పైగా తగ్గింది. జూన్ నాటికి మొత్తం సిబ్బంది 2,19,401 మందికి చేరింది. ఉద్యోగ వలసల (అట్రిషన్) రేటు 12.8 శాతంగా నమోదైంది.
- వాటాదారులకు రూ. 2 ముఖ విలువగల ప్రతీ షేరుకీ రూ. 12 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.
- ఈ ఏడాది కొత్తగా 10,000 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలను కల్పించనుంది.

హెచ్‌సీఎల్ టెక్ షేరు 3.2 శాతం జంప్‌చేసి రూ.1,560 వద్ద ముగిసింది.

కూరగాయలు భగ్గు

న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 'యూ'టర్న్ తీసుకుంది. పదకొండు నెలలుగా మెట్లు దిగివస్తూ, 2024 మేలో 4.8 శాతానికి చేరిన రిటైల్ ద్రవ్యోల్బణం, జూన్‌లో 28 బేసిస్ పాయింట్లు పెరిగి (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) 5.08 శాతానికి (2023 జూన్‌తో పోల్చి) చేరింది. అంతక్రితం గడిచిన నాలుగు నెలల్లో ఇంత తీవ్ర స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం నెలకొనడం ఇదే తొలి సారి. ఆహారం ప్రత్యేకించి కూరగాయల ధరల తీవ్రత దీనికి ప్రధాన కారణం. రిటైల్ ద్రవ్యోల్బణంలో కీలక విభాగమైన ఆహార విభాగంలో ద్రవ్యోల్బణం 9.36%గా ఉంది. మేలో ఈ రేటు 8.69%. కూరగాయల ధరలు భారీగా 29.32% పెరిగాయి. పప్పు దినుసుల ధరలు 16.07 శాతంగా నమోదయ్యాయి. ధరల పెరుగుదల నేపథ్యంలో ఆర్‌బీఐ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు సన్నగిల్లాయి.

- జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.08%
- 4 నెలల గరిష్ట స్థాయి



అమెజాన్ 'ప్రైమ్ డే' 20 నుంచి..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ జూలై 20, 21న ప్రైమ్ డే సేల్స్ నిర్వహించనుంది. ఈసారి సేమ్ డే డెలివరీ కింద 10 లక్షల ఉత్పత్తులు, నెక్స్ట్ డే డెలివరీ కింద 40 లక్షల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని అమెజాన్ డైరెక్టర్ (షాపింగ్ ఎక్స్‌పీరియన్స్) కిషోర్ తోట తెలిపారు. 450 బ్రాండ్లు 1,000కి పైగా ఉత్పత్తులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. వీటిలో మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు మొదలైనవి ఉంటాయన్నారు. ప్రస్తుతం 14 లక్షల మంది విక్రేతలు తమ ప్లాట్‌ఫాంలో ఉండగా వీరిలో 50,000 మంది తెలంగాణలో ఉన్నట్లు కిషోర్ చెప్పారు. వేగవంతమైన డెలివరీల కోసం తెలంగాణలో రెండు ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, 3 సార్టింగ్ సెంటర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఉత్పత్తులు, ఆఫర్లపై ప్రచారానికి 50,000 మంది పైచిలుకు కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో జట్టు కట్టామని, వీరిలో 10 శాతం మంది తెలంగాణ నుంచి ఉన్నారని చెప్పారు.



సాక్షి స్పోర్ట్స్



క్రెచికోవా X జాస్మిన్... నేడు వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్

ఈ ఏడాది వింబుల్డన్ మహిళల సింగిల్స్ విభాగంలో కొత్త విజేత అవతరించనుంది. లండన్‌లో ఈరోజు జరిగే ఫైనల్లో ప్రపంచ ఏడో ర్యాంకర్ జాస్మిన్ పావోలిని (ఇటలీ)తో ప్రపంచ 32వ ర్యాంకర్ క్రెచికోవా (చెక్ రిపబ్లిక్) తలపడుతుంది. వీరిద్దరు తొలిసారి వింబుల్డన్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకున్నారు. 28 ఏళ్ల క్రెచికోవా 2021లో ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గగా... 28 ఏళ్ల జాస్మిన్ గత నెలలో ఫ్రెంచ్ ఓపెన్ లో రన్నరప్‌గా నిలిచింది. ఈ ఏడాది వింబుల్డన్ సింగిల్స్ చాంపియన్‌కు 27 లక్షల పౌండ్లు (రూ. 29 కోట్ల 23 లక్షలు)... రన్నరప్‌కు 14 లక్షల పౌండ్లు (రూ. 15 కోట్ల 15 లక్షలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి. సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే ఫైనల్ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.





'704'తో ముగించిన అండర్సన్

- అంతర్జాతీయ క్రికెట్‌కు అండర్సన్ వీడ్కోలు
- తొలి టెస్టులో విండీస్‌పై ఇంగ్లండ్ ఘనవిజయం

లండన్: 21 సంవత్సరాల టెస్టు కెరీర్... 188 మ్యాచ్‌లు...40,007 బంతులు...704 వికెట్లు...26.45 సగటు...ఘనమైన ఆటకు ముగింపు లభించింది. టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ అండర్సన్ కెరీర్‌కు తెర పడింది. శుక్రవారం వెస్టిండీస్‌తో ముగిసిన తొలి టెస్టుతో అతను ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2003 మే 22–24 మధ్య ఇదే లార్డ్స్ మైదానంలో తొలి టెస్టు ఆడిన అండర్సన్ అక్కడే ఆటకు వీడ్కోలు పలికాడు. విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో తన 12వ ఓవర్లో జోషువా డి సిల్వాను కీపర్ క్యాచ్ ద్వారా అవుట్ చేయడంతో అండర్సన్ ఖాతాలో చివరిదైన 704వ వికెట్ చేరింది. టెస్టుల్లో మురళీధరన్ (800 వికెట్లు), షేన్ వార్న్ (708 వికెట్లు) తర్వాత అత్యధిక వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా... సచిన్ టెండూల్కర్ (200) తర్వాత అత్యధిక టెస్టులు ఆడిన రెండో ఆటగాడిగా ఈ దిగ్గజం సొంత అభిమానుల సమక్షంలో మైదానం వీడాడు. మూడో రోజే ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్, 114 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 79/6తో ఆట కొనసాగించిన విండీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 136 పరుగులకే కుప్పకూలింది. 12.1 ఓవర్లలో ఆ జట్టు మిగిలిన 4 వికెట్లు కోల్పోయింది. గుడకేశ్ మోతీ (31 నాటౌట్) మాత్రమే కొద్దిగా పోరాడగలిగాడు. రెండో ఇన్నింగ్స్‌లో అట్కిన్సన్ (5/61) విండీస్‌ను దెబ్బ తీశాడు. రెండో టెస్టు గురువారం నుంచి నాటింగ్‌హామ్‌లో జరుగుతుంది.

పదోసారి ఫైనల్లో జొకోవిచ్

వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్ కోసం అల్‌కరాజ్‌తో అమీతుమీ

లండన్: రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ కోసం సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ విజయం దూరంలో నిలిచాడు. ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో రెండో సీడ్ జొకోవిచ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో జొకోవిచ్ 2 గంటల 48 నిమిషాల్లో 6–4, 7–6 (7/2), 6–4తో 25వ సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై గెలుపొందాడు. ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ ఆరు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, మూడో సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో జొకోవిచ్ తలపడతాడు. గత ఏడాది కూడా వీరిద్దరి మధ్యే ఫైనల్ జరగ్గా... అల్‌కరాజ్ చాంపియన్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా వింబుల్డన్ టోర్నీలో జొకోవిచ్ ఫైనల్ చేరడం ఇది పదోసారి కావడం విశేషం. ఈ టోర్నీలో జొకోవిచ్ 2011, 2014, 2015, 2018, 2019, 2021, 2022లలో విజేతగా నిలిచి... 2013, 2023లలో రన్నరప్‌గా నిలిచాడు. అంతకుముందు జరిగిన తొలి సెమీఫైనల్లో అల్‌కరాజ్ 6–7 (1/7), 6–3, 6–4, 6–4తో ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా)పై గెలిచాడు. 2 గంటల 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఆరు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయిన అల్‌కరాజ్... మెద్వెదెవ్ సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. నెట్ వద్దకు 53 సార్లు దూసుకొచ్చిన ఈ స్పెయిన్ స్టార్ 38 సార్లు పాయింట్లు గెలిచాడు. అల్‌కరాజ్, మెద్వెదెవ్ సెమీఫైనల్ మ్యాచ్‌ను భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ప్రత్యక్షంగా తిలకించాడు.


జొకోవిచ్

సిరీస్ విజయమే లక్ష్యంగా...

నేడు జింబాబ్వేతో భారత్ నాలుగో టి20

మ్యాచ్ గెలిస్తే సిరీస్ సొంతం ● జోరు మీదున్న టీమిండియా
సాయంత్రం గం. 4:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

హరారే: జింబాబ్వే పర్యటనలో భారత యువ జట్టు అంచనాలకు అనుగుణంగానే రాణిస్తోంది. తక్కువ స్కోర్ల తొలి టి20లో తడబడి అనూహ్యంగా ఓటమి పాలైనా... తర్వాతి రెండు మ్యాచ్‌లలో జట్టు సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. భారీ స్కోర్లు చేసిన అనంతరం వాటిని నిలబెట్టుకుంది. ఇదే జోరులో మరో మ్యాచ్‌లో నెగ్గి సిరీస్ సొంతం చేసుకోవాలని శుబ్‌మన్ గిల్ బృందం పట్టుదలగా ఉంది. జట్టు సభ్యులంతా ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం. రుతురాజ్ నిలకడగా ఆడుతుండగా... అభిషేక్ శర్మ రెండో మ్యాచ్‌లో సెంచరీతో తన ధాటిని చూపించాడు. కెప్టెన్ గిల్ కూడా అర్ధ సెంచరీతో ఫామ్‌లోకి రాగా... వరల్డ్ కప్ నుంచి తిరిగొచ్చిన తర్వాత యశస్వి జైస్వాల్ కూడా చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. రింకూ సింగ్ కూడా రెండో టి20లో సిక్సర్ల మోత మోగించగా, గత మ్యాచ్‌లో ఎక్కువ బంతులు ఆడే అవకాశం రాని సంజూ సామ్సన్ కూడా చెలరేగిపోగలడు. శివమ్ దూబే కూడా తన దూకుడును ప్రదర్శిస్తే ఇక ఈ లైనప్‌ను నిలువరించడం జింబాబ్వే బౌలర్లకు అంత సులువు కాదు. బౌలింగ్‌లో వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్ స్పిన్‌ను ప్రత్యర్థి బ్యాటర్లు తడబడుతున్నారు. తొలి మూడు మ్యాచ్‌లు ఆడిన అవేశ్ స్థానంలో ముకేశ్‌కు మళ్లీ తుది జట్టులో చోటు దక్కవచ్చు. ఈ మార్పు మినహా అదే జట్టు కొనసాగనుంది. మరోవైపు సిరీస్‌ను కోల్పోకుండా ఉండేందుకు జింబాబ్వే రెట్టింపు శ్రమించాల్సి ఉంటుంది. గత రెండు మ్యాచ్‌లలో ఆ జట్టు పేలవ ఫీల్డింగ్‌తో 7 క్యాచ్‌లు వదిలేయడంతో పాటు అదనపు పరుగులూ ఇచ్చింది. దీనిని నివారించగలిగితే టీమ్ పోటీనివ్వగలదు. మరోసారి కెప్టెన్ సికందర్ రజానే కీలకం కానుండగా... బెన్నెట్, మైర్స్, క్యాంప్‌బెల్‌లపై బ్యాటింగ్ భారం ఉంది. బౌలింగ్‌లో పేసర్ ముజరబాని, చటారా నిలకడగా ఆడుతున్నారు. సొంతగడ్డపై జింబాబ్వే తమ స్థాయికి తగినట్లు ఆడితే పోరు ఆసక్తికరంగా సాగవచ్చు.


గిల్, యశస్వి జైస్వాల్



సింధు సత్తాకు సవాల్!

గ్రూప్ దశలో సునాయాస 'డ్రా' ● నాకౌట్ దశ నుంచి మేటి ప్రత్యర్థులు సిద్ధం
ప్రణయ్, లక్ష్య సేన్‌లలో ఒక్కరే ముందుకు ● పారిస్ ఒలింపిక్స్ 'డ్రా' విడుదల

కౌలాలంపూర్: ఒలింపిక్స్ చరిత్రలో గతంలో ఏ భారతీయ ప్లేయర్‌కు సాధ్యంకాని ఘనతను సొంతం చేసుకోవాలంటే... భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. పారిస్ ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ ఈవెంట్ 'డ్రా' వివరాలను శుక్రవారం ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) విడుదల చేసింది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన సింధు 'పారిస్'లోనూ పతకం గెలిస్తే... భారత్ నుంచి ఒలింపిక్స్ చరిత్రలో మూడు వ్యక్తిగత పతకాలు నెగ్గిన ఏకైక ప్లేయర్‌గా రికార్డు సృష్టిస్తుంది. 'డ్రా' ప్రకారం సింధుకు గ్రూప్ దశలో సునాయాస ప్రత్యర్థులు ఎదురుకానున్నారు. గ్రూప్ 'ఎం'లో ఉన్న సింధు ప్రపంచ 75వ ర్యాంకర్ క్రిస్టిన్ కుబా (ఎస్టోనియా)తో, ప్రపంచ 111వ ర్యాంకర్ ఫాతిమత్ నభా (మాల్దీవులు)తో ఆడుతుంది. గ్రూప్ విజేత హోదాలో సింధు ప్రిక్వార్టర్ చేరితే ఆరో సీడ్ హి బింగ్‌జియావో (చైనా)తో తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 9–11తో వెనుకంజలో ఉంది. హి బింగ్‌జియావోపై నెగ్గితే సింధుకు క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ చెన్ యు ఫె (చైనా) ఎదురవుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 6–6తో సమంగా ఉంది. చెన్ యు ఫెను కూడా ఓడిస్తే సింధుకు సెమీఫైనల్లో రియో ఒలింపిక్స్ విజేత, మూడుసార్లు వరల్డ్ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) సిద్ధంగా ఉండే అవకాశముంది. ముఖాముఖి రికార్డులో సింధు 5–12తో వెనుకంజలో ఉంది. ఒకవేళ మారిన్‌పై ఈసారి సింధు గెలిస్తే పతకం ఖరారవుతుంది. మారిన్ చేతిలో సింధు ఓడిపోతే కాంస్య పతకం కోసం రేసులో నిలుస్తుంది. కాంస్య పతకం కోసం మరో పార్శ్వంలో ఉన్న వరల్డ్ నంబర్‌వన్ అన్ సె యంగ్ (దక్షిణ కొరియా), ప్రపంచ మూడో ర్యాంకర్ తై జు యింగ్ (చైనీస్ తైపీ), ప్రపంచ ఐదో ర్యాంకర్ అకానె యామగుచి (జపాన్)లలో ఒకరితో సింధు ఆడే చాన్స్ ఉంటుంది.

పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి ప్రణయ్, లక్ష్య సేన్ బరిలో ఉన్నారు. గ్రూప్ 'కె'లో ప్రణయ్... గ్రూప్ 'ఎల్'లో లక్ష్య సేన్ ఉన్నారు. లక్ష్య సేన్ గ్రూప్‌లోనే ఈ ఏడాది ఆసియా చాంపియన్, ఆల్ ఇంగ్లండ్ చాంపియన్, ప్రపంచ 3వ ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) ఉన్నాడు. ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాలంటే లక్ష్య సేన్ తప్పనిసరిగా క్రిస్టీపై గెలవాల్సి ఉంటుంది. స్థాయికి తగ్గట్టు ఆడితే గ్రూప్ 'కె' నుంచి ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంటాడు. 'డ్రా' ప్రకారం ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్, లక్ష్య సేన్ ముఖాముఖిగా తలపడే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఇద్దరు భారత ఆటగాళ్లలో ఒకరికి మాత్రమే పతకం నెగ్గే అవకాశం ఉంటుంది. మహిళల డబుల్స్‌లో నాలుగు జోడీలు ఉన్న గ్రూప్ 'సి'లో అశ్విని పొన్నప్ప–తనీషాలకు చోటు లభించింది. క్వార్టర్ ఫైనల్ చేరాలంటే భారత జోడీ రెండు మ్యాచ్‌ల్లో గెలవాలి. మరోవైపు పురుషుల డబుల్స్ 'డ్రా'లో ఎన్ని జోడీలు ఉండాలనే విషయంపై కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో కేసు నడుస్తున్న నేపథ్యంలో ఈ విభాగం 'డ్రా'ను ప్రకటించలేదు. ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో భారత స్టార్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ –చిరాగ్ శెట్టిపై భారీ అంచనాలు ఉన్నాయి. పారిస్ ఒలింపిక్స్ ఈనెల 26 నుంచి జరగనుండగా... బ్యాడ్మింటన్ ఈవెంట్ 27న మొదలవుతుంది.


ప్రణయ్


లక్ష్య సేన్



ఆకట్టుకున్న ఆలయ ప్రతిబింబం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపై శుక్రవారం చిన్నపాటి వర్షం కురిసింది. దీంతో శ్రీస్వామి వారి ఆలయ ఉత్తర మాఢవీధిలోని స్టోన్ ఫ్లోరింగ్‌పై వర్షపునీరు అక్కడక్కడ నిలిచింది. వర్షం నీటిలో ఉత్తర మహా రాజగోపురం ప్రతిబింబం అద్భుతంగా కనిపించింది. భక్తులు ఈ దృశ్యాన్ని చూసి పులకరించిపోయారు.

- యాదగిరిగుట్ట

'మౌంట్ వెంటౌక్స్' పై మనోడు



మెట్‌పల్లి రూరల్ (కోరుట్ల): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్లకు చెందిన మరిపెల్లి ప్రవీణ్ దక్షిణ ఫ్రాన్స్ ప్రావిన్స్ ప్రాంతంలోని 'మౌంట్ వెంటౌక్స్'పర్వతాన్ని అధిరోహించాడు. 1,910 మీటర్ల ఎత్తైన ఈ పర్వతంపై 22 నిమిషాల 53 సెకన్లలో 108 సూర్య నమస్కారాలు చేశాడు. అక్కడి ప్రాంతంలో ఇది ఎత్తైన పర్వతమని, టూర్ డీ ఫ్రాన్స్ సైక్లింగ్ రేసులో ప్రసిద్ధి చెందిందని ప్రవీణ్ తెలిపాడు.

57వ ఏట పీజీ పట్టా



కనకయ్యకు సర్టిఫికెట్లను ఇస్తున్న సత్యనారాయణ

మహబూబాబాద్ అర్బన్: చదువుకోవాలని కోరిక ఉంటే వయసు అడ్డుకాదని నిరూపించాడు కోల కనకయ్య. మహబూబాబాద్‌కు చెందిన కనకయ్య నలంద డిగ్రీ కళాశాలలో కాకతీయ యూనివర్సిటీ పీజీ దూర విద్యలో ఎంఏ తెలుగు కోర్సు పూర్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ కనకయ్యకు పట్టా అందజేశారు. కనకయ్య 57వ ఏట పీజీ చదవడం, అందులో ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని సత్యనారాయణ అన్నారు.



టైమ్స్ స్క్వేర్ తరహాలో టీ-స్క్వేర్

సాక్షి, హైదరాబాద్: న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ తరహాలో హైదరాబాద్‌లోనూ టీ-స్క్వేర్‌ను నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ టీ-స్క్వేర్‌తో రాకతో రాయదుర్గం ప్రాంతంలోని ఐటీ హబ్ ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదాల్చే అవకాశం ఉంది. ఈ టీ-స్క్వేర్‌ను అభివృద్ధి చేసే బాధ్యతను రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు ప్రభుత్వం అప్పగించింది. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే టీ - స్క్వేర్ హైదరాబాద్‌లో ఓ ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారనుంది. ఇదే లక్ష్యంతో టీజీఐఐసీ ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టబోతోంది.

రాయదుర్గం వద్ద ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు

- అభివృద్ధి బాధ్యతల్ని టీజీఐఐసీకి అప్పగించిన ప్రభుత్వం
- హైదరాబాద్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న టీ-స్క్వేర్
- వచ్చే నెల 9వ తేదీ బిడ్‌ల సమర్పణకు తుదిగడువు

ఇప్పటికే బిడ్స్‌కు ఆహ్వానం

దీనికి సంబంధించిన ఆర్కిటెక్చర్‌తోపాటు సలహాలు, సర్వీసులు అందించేందుకుగాను అర్హత గల సంస్థలను ఆహ్వానిస్తూ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్ పీ) పిలిచింది. ఆగస్టు 9వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలలోగా ఈ బిడ్స్‌ను సమర్పించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ టీ-స్క్వేర్ నమూనాలు రూపొందించడం, అంచనా కన్సల్టెన్సీ సేవలకు ఫిక్స్‌డ్ రెమ్యూనరేషన్ టీజీఐఐసీ ఇవ్వనుంది. ఈ ప్రాజెక్టు ఓకే అయి నిర్మాణం జరిగితే..నిర్మాణ వ్యయంలో 0.30% సక్సెషన్ ఫీజు చెల్లించనున్నట్లు వివరించింది. ప్రతిపాదిత ప్రాజెక్ట్‌తో హైదరాబాద్‌లో ఇదొక ప్రత్యేక ఆకర్షణగా మారటం ఖాయమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

మహారత్న కంపెనీగా ఎన్‌ఎండీసీ!

కేంద్రమంత్రి కుమారస్వామి ఆశాభావం



సాక్షి, హైదరాబాద్ : జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎండీసీ) భవిష్యత్‌లో మహారత్న కంపెనీగా ఎదుగుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ.కుమారస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. పీఎం మోదీ ఆశిస్తున్న వికసిత్ భారత్‌లో భాగంగా 2030 నాటికి ఎన్‌ఎండీసీ వంద మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం చేరేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి గురువారం హైదరాబాద్‌లోని ఎన్‌ఎండీసీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. సంస్థ సీఎండీ అమితవ ముఖర్జీ, డైరెక్టర్లతో భేటీ అయ్యారు. ఎన్‌ఎండీసీ, ఎన్‌ఎండీసీ స్టీల్ లిమిటెడ్ (ఎన్‌ఎస్‌ఎల్) ఎదుర్కొంటున్న సవాళ్లపై కేంద్ర మంత్రులు సమీక్షించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.